భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

జూన్ 1957

సంపుటము 34 : : సంచిక 6

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

జూన్ 1957

మహోపదానము

శ్రీ హారీత శివశర్మ

1

తన జీవితమ్ము వృథాయైన దన్నట్లు
నిలువెల్ల నిస్సార నీరవముగ
విరిగి కొమ్మలు రాలి విడివడి యాకులు
తనువెల్ల ముండితార్థ్రపదముగ
విరవిరలాడి ఉర్వీరుహా మ్మఖిల తే
జఃక్రాంతి విక్రాంతి జర్జరముగ
ఉబ్బి వేళ్ళు మొదళ్ళు నుదయించు రుజచేత
కాండమ్ము సర్వమ్ము కార్శ్యముగను
పిట్టగూడ గూడుకట్టుకో ననువును
లేని బ్రతుకు బ్రతుకలేనిదయ్యు
నగము చచ్చిమరియుం జావంగం జాలని
శీర్ణ జీర్ణమైన చెట్టొకండు.

తలనిక్కించి, ధరాపరాగపటలీ
స్తంభంబునా నూర్ధ్వ ది
గ్వలభిన్ చూడ్కి విగుడ్చి, యుస్సురనుకో
గాలిన్ విసారించు శ
క్తి లయింపన్ గనుగొన్నదై, విధుర పం
కేజాత సంక్లిష్ట శై
వలి నిన్ బోలిన దండమై, నిలుచు, దూ
ర్వా జీర్ణభూశృంగమై.

మరి గోత్ర మేమి సామాన్యమా? యనరాదు;
ఋక్ప్రసిద్ధమ్ము చరిత్ర తనది
తనవంశ మేమి నిత్యధ్వాంతసీమమా?
కాదు; విజ్ఞానమ్ము గల్గు విడిది

తనయునికి నిష్ప్రయోజనమ? కానేకాదు;
ప్రతియొక్క కృషికి కావలెను తాను
తనశీల మేమి వ్యర్థమయినట్టిది కాదు
ప్రాజ్ఞవాగ్నికి నాటపట్టు తనువు
తనమహాజాతియొక్క ప్రాక్తనవిభవము
పట్టి సామాన్యమైనదా? పట్టి పేరు
నూరు లేనిదా? కాదు; మహోచ్చవైభ
వప్రశస్తప్రశస్తి—అన్వయముకలది.

ఈ యపదాన మేమిటికి?
యీకథ లేటికి? పూర్వగాథ లే
లే యని వెక్కిరింతువు స
రే మరి యీ ధరణీరుహాంబులో
లో అనుకొన్న మాట లెటు
లో, విననేర్తువయేని, సర్వమున్
నీయదిగాని దాని దన
నేరవు; నట్టి వహా కథావిధుల్.

2

జడమునుగాదు జీవితము;
జంగమతాస్థితిలేదు; పూన్కియున్
సడలుటగాని నిల్చుటకు
జాలదు; స్థావరమన్న యర్థ మీ
మొడను రహిల్లదే; ఇదియు
నెంతయు చిత్రము; తానుగా మరిన్
జడమును గాకపోవుటయు
స్థావరమై నిలుపోపకుండుటల్.

చిరచిరలాడి వేంచేయునో మొండ; యి
దేల నురక మండించు నన్ను
జలజల గర్భిణీజలదమ్ము వర్షించు
నా కేల నురకను నానవెట్టు

మందమారుతము రమ్యమైన నాకేమి-
కారుకొమ్మల ఘులంఘులలు లేవు
ఈభూమి యీగంధ మేల నిర్వాసించు
బడుగైన దేహావిప్లవము కెడదు
వంధ్యజీవితమ్ము వంధ్యమ్ము బ్రతుకును
అగును వీనివల్ల నైన దేమి?
ఎండి తడిసి వాడి యిపమేది నిత్యమ్ము
దుఃఖతాత్మకగుడు ద్రోవగాక.

కాపురమ్ము చెడిన కళ్యాణి బ్రతుకును
కాంత వంతగూరు కాంతు బ్రతుకు
తల్లిలేని చిన్నపిల్లల బ్రతుకును
నేను బ్రతుకు బ్రతుకులెల్ల ఒకటి.

బ్రతుకునందున దుఃములున్నదే
వరములోపల శాపము లున్నటుల్;
బ్రతుకు కృత్స్నము దుఃఖమె యైనచో
బ్రతుకులీల మరేలను జీవముల్.

పరగలోపల నాత్ముడై యున్నచో
నెరుగడేల నతండును దుఃఖమున్;
మరి శరీరము సర్వము నష్టమై
విరిగి వాడిన కాన డిదేమిటో.

అగు శరీరము నష్టమునైనచో
తెగునె యాత్ముడు? నంగము లూడినన్
తెగునె యంగియు? చిత్రము లూహముల్;
జగరు వంతలు పట్టునె? ఆత్మకున్.

తనకు బట్టనియట్లు తటస్థుడై
తనరుచుండెడివాని; మహోన్నతున్;
కనవిచారము చేయగనేల నీ
వని విచారము చేయని ధూర్తునిన్.

మొదలు లేదే, తుదయు లేదే,
ఉదరుమధ్యముగూడ లేదే,
అట్టిదెట్టులు నాదు దుఃఖపు
గుట్టులను నెరుగున్.

ఆదిమధ్యము నోలియంతము
పాడుగాగల జీవలోకము
నాదుకొనగా నట్టిదెట్టులు
నూదికొనివచ్చున్.

ఎవరోవత్తురు; నేమొ చెప్పెదరు; నే
    మే జేతుమం చుందురున్;
ప్రవచింతుర్ బహువర్ష యోజనలు; రం
    ధ్రాన్వేషకస్వాంతు లా
ర్జవదూరుల్ గత మేమి యంతయు భవి
    ష్యత్కాలభోగ్యంబు కా
వివదింతుర్; తత వర్తమాన విధుర
    ప్రీడాభృశత్రస్తులై.

నాకున్ నేనె, మరెవ్వరాదరు ధరన్,
    నాకోసమై నేను నే
నా కోర్కెల్ బలిపించుకో, నుదిత భా
    వ్యోత్కర్ష స్ఫూర్తి ప్రభా
దీకమై శ్రీ వెలిగించు జీవితము నం
    తే గాని యూపిమ్మటన్
ఆకున్ పోకయు లేని సత్య మొకడై
    యుబ్బున్ శ్లథభ్రాంతినై.

3

తన జని యిట్టులైనదని
    తాల్చిన దుఃఖముగూడలోనసే
కసలిన నిప్పుగా, నివురు
    గప్పని నిప్పునుగా, శరీరమం

డు నరనరంబులన్ సిలుగు
దోగిన నివ్వనుగా చెలంగివన్
తన నిలువెల్ల వేదన వి
ధంబయి నిల్చినచెట్టు, చెట్టనై.

అగుపడనో యేమో దీ
ప్రగరుద్రేఖగను వచ్చి వ్రాలవు పక్షుల్
అగుపించదు ఋతు వొక్కటి
ప్రగాఢ మధురమ్మృదు బంభర ప్రణవమ్మై.

నిత్యశిశిరమ్మె బ్రతుకుగా నెగడినెగడి
జీవితమ్మున నాస్థ బశితువైన
వృక్షమును రూక్షముగ మదివెట్టి జూచి
ధిక్ అననివాడు లేడు వక్షీణ్ణువెవడు.

గ్రామమధ్యమునందు వృక్షము
కష్టమై మరి నష్టమై
క్షేమమేది నిలంబడన్ మది
కీడు నెంచిన వారునై
భీమవహా జమదగ్ని రాముని
బిట్టు గొడ్డలివోని బ్రో
ద్దామఘాతల శెట్టుగొట్టిరి;
దాపురించిన మృత్యువుల్.

కట్టెలుంగా గొట్టి గారియువెట్టి
కాల్చి బొగ్గులుజేసి కలగుంపుజేసి
మసిజేసి విడిచిరి మ్రానును నిల్వ;
ఏమి నిల్చెను చెట్టు; నేమిదై మిగిలె;
చెట్టు తా బుట్టెను; చెట్టు తా పెరిగె;
చెట్టును మృత్యువు చెట్టగాగొట్టె.
చెట్టటన్నది లేదు; చేష్టలు లేవు;
చెట్టమియయ్యెను, చేష్ట లేమయ్యె;

నక్కడ మార్గమ్ము నంత ధరిత్రి
చిలుప వర్షపుజల్లుచే నింత తడిసి
మొలిచెను నొక నాల్గుమూడు దర్భలును.]

చెట్టునంగలి మరి పట్ట దెవరికిని;
పుట్టుట నిత్యమ్ము గిట్టుటగాగ
సాగ నాపూరును సాగ నాజనము
దేహంబుపోయిన దేహియుగూడ
పోవునో పోవదో పొందు కుదిర్చి
మొరుకచే చేయరు నెట్టితర్కంబు;
పుట్టుట పెరుగుట గిట్టుటగాక
యేమున్నదని చింత నోమరుబుద్ధి;
తాము నిత్యమ్మని దర్పించి మొదను
శీర్ణవృక్షము గూర్చి చేయరు చింత.

ఈ యపదానమిట్టిద; య
        హీనమహీతల జీవజాల దీ
ప్రాయత దుఃఖవారినిధి
        వంటిది; శీర్ణవసుంధరారుహ
ధ్యాయిత నిట్టులై వివశ
        మై తనుదాన వెలార్చుకొన్నదో
నాయెడ సర్వమున్ గదలి
        నందున దా నివమూరుకొన్నదో.



యోధత్రయం



చెన్ననగర సత్యాగ్రహసమరతలాన ఆంధ్రుల కీర్తిపతాకలనెత్తిన యోధత్రయం:
దేశోద్ధారకుడు, ఆంధ్రకేసరి, సర్దార్ గద్దెరంగయ్యనాయుడు
[1930-31 ఉప్పుసత్యాగ్రహం]
గత మే 20 వ తేదీన ఆంధ్రకేసరి అస్తమయంతో
ఈ యోధత్రయం చారిత్రక వీరమూర్తులై నిలిచారు.
వీరయోధులకు జోహారులు !!

రష్యా యువ మేధావులు

కేథరిన్ షోర్

నా రష్యా పర్యటనంలో లెనిన్‌గ్రాడ్ నగరం చేరుకునేసరికి అక్కడ అమెరికానించి వచ్చిన ఒక స్నేహితుణ్ణి కలుసుకోవడం తటస్థించింది. మేమిద్దరము ఒకే అమెరికా విశ్వవిద్యాలయంలో ఒకే కళాశాలలో చదువుకున్నాము. ఒకే తరగతిలో కూర్చుని రష్యా చరిత్ర, భాష మొదలైనవన్నీ అభ్యసించాము. రష్యాలో మా ఇద్దరి పర్యటనము ఒక మాసంరోజులపాటు సాగింది. మా యాత్రకూడా ఒకే ధోరణిలో సాగిపోయింది. అయితే మేము పరిశీలించిన విషయాలలో — ఏఒక్కదానిమీద — మా ఇద్దరికీ ఏకాభిప్రాయం కుదరలేదు!

నిన్న వర్షం కురిసిందా? లేదా? లెనిన్‌గ్రాడ్ నగరం జనాభా డాబుసరిగా దుస్తులు వేసుకున్నారా? లేక కీవ్ నగరం జనాభా డాబుసరిగా దుస్తులు వేసుకున్నారా?

ఇలాంటి సామాన్య విషయాలలో కూడా మా ఇద్దరికీ ఏకాభిప్రాయం కుదరలేదు! చివరికి మేమిద్దరను ఒకరొకరిమీద చిరాకుపడుతూ మాట, మంతి లేకుండా ఒకచోట చతికిలబడ్డాము. అదంతా తలుచుకుంటే చాలా దుర్భరంగా కనిపించింది. నా కళ్ళ ఎదురుగా ఒక భయంకరదృశ్యం ప్రత్యక్షమయింది. మాతోపాటు రష్యాలో ఒక నెలరోజులపాటు పర్యటిస్తున్న వారు—ప్రత్యేక నిపుణులు, పరిశీలకులు, కాబోయే ప్రత్యేక నిపుణులు, వేలకొద్దీ ఉన్నారు. మేమంతా త్వరలోనే మళ్లీ అమెరికా వెళ్ళిపోతాము. మాలో కొంతమంది ఉపన్యాసా లుపక్రమిస్తారు. మరి కొంతమంది పర్యటనానుభవాలన్నీ గుదిగుచ్చి ఒకచోట వ్రాయడం మొదలుపెడతారు. వారివారి వ్రాతల్లో వారివారి ప్రత్యక్షానుభవాలు, వ్యాఖ్యలు, విమర్శలు విఖ్యాతవ్యక్తుల అభిప్రాయాలు, ఊహాగానాలు, జోస్యాలు వేర్వేరు ధోరణుల్లో రకరకాలుగా చిత్రవిచిత్రంగా సాగిపోతాయి. నాకదంతా ఒక మహాభయంకరమైన విషాద సన్నివేశంలా కనిపించింది. అవన్నీ చదివే పాఠకులను తలుచుకుని నేను చాలా జాలిపడ్డాను. యథార్థం ఆ విధంగా భిన్నాభిన్నమై పోగలదంటే నా కెంతో విస్మయం కలిగింది.

నిజంగా ఇది అందరికీ ఒక గొప్ప కనువిప్పు! నే నిప్పుడు కీవ్ నగరంలో నాకు, ఇంకొక రసాయన శాస్త్రజ్ఞునికీ మధ్య నడిచిన ప్రసంగాలు కొన్ని ఉదాహరిస్తున్నాను. వీటితో సరిపోలిస్తే మాస్కోలో నాకు, శిల్ప చరిత్ర వేత్తకు, మధ్య నడిచిన సంభాషణ చాలా సరళంగా కనిపిస్తుంది. నిజానికి ఉన్నది ఉన్నట్టు కుండ బద్దలుగొట్టినట్టు మాట్లాడి వారు చెప్పినవి వ్రాయడమే న్యాయం. కొందరు సంపాదకులతో జరిపిన సంప్రతింపులు వ్రాసేటప్పుడు వారి అసలు పేర్లే పేర్కొనాలి. అయితే ఆ పేర్లు బయటపెట్టడం ధర్మంకాదు. ఈ క్రింద వ్రాసినవన్నీ ఇంచుమించుగా రెండు డజన్ల మేధావులతో జరిపిన సంప్రతింపుల సారాంశాలన్నమాట పాఠకులు జ్ఞాపకం పెట్టుకోవాలి. మొట్టమొదట వీరికీ, నాకు తెలవని తలంపుగానే పరిచయం కలిగింది. తరవాత తరవాత వీరితో కొంచెం సన్నిహిత పరిచయం ఏర్పడింది. మొత్తంమీద నేను చూచిన రష్యా పౌరులందరిలోను వీరి సంఖ్య చాలా స్వల్పం. నేను చూచినవారందరికన్నా వీరెక్కువ మేధావంతులు. సామాన్యు లందరికన్నా వీరిది కొంచెం పెద్దమాపు. రష్యాలో సామాన్యపౌరులకుగాని, చదువుకొన్నవారికిగాని వీరు ప్రతినిధులుకారు. బహుశః వారు వ్యక్తీకరించినవి వారి ప్రత్యేకాభిప్రాయాలే అయివుంటాయి.

సోవియట్ యూనియన్‌లో 'బుద్ధిజీవులు' అనే మాట చాలాచోట్ల వినబడుతుంది. బుద్ధిజీవులంటే కాయకష్టం అక్కరలేకుండా బ్రతికే జనాభా

అన్నమాట. వీరి కా దేశంలో గౌరవాదరాలెక్కువ. వీరి జీవితం సుఖంగా, హాయిగా గడిచిపోతుంది. ఒక అడివిమనిషి ఎవడైనా కాగితము, కలము చేత్తో పట్టుకున్నాడంటే అతిడాంబికవిధంగా బుద్ధిజీవులవర్గం కిందకి వస్తాడు. మన 'మేధావి'కి పరిసమానమైన పదం అక్కడ ఉన్నట్టు కనబడదు. అయితే భాష ఎన్నడూ సాంఘిక వాస్తవికత ఉన్నది ఉన్నట్టుగా ప్రతిఫలించదు. మన 'మేధావి'వంటి పదం రష్యాలో వినబడక పోయినా అక్కడ నిజమైన 'మేధావు' లున్నారు. (నేనీ వాక్యం రష్యాదేశం వీపు తట్టడంకోసం వ్రాయడం లేదు! రష్యాలో ప్రతి పాతిక సంవత్సరాలలోను, ఒక నిర్దిష్టమైన మిథ్యా సంస్కృతి సృష్టించడంకోసం బ్రహ్మాండమైన ప్రయత్నం కొనసాగింది. అందుచేత అక్కడ మేధావివర్గం బయలుదేరిందంటే ఎంతైనా సంతోషించాలి. ఒక్కొక్కప్పుడు వీరు తిలవనితలంపుగా చిత్రకళా ప్రదర్శనాలలోను, విశ్వవిద్యాలయాలలోను, ప్రత్యక్ష మౌతూంటారు. కొందరు ప్రభుత్వం స్థాపించిన సాహిత్య ప్రదర్శనాలలో తటస్థపడతారు. వీరంతా టాల్‌స్టాయి, మొదలయిన సుప్రసిద్ధ సాహిత్యవేత్తలమీద అధికారికంగా ఇవ్వవలసిన ఉపన్యాసాలిస్తూ మధ్యమధ్యన తమ ఆఫీసు గదుల్లో కూర్చుని ఏవేవో సాహిత్య విమర్శనలు, రచనలు సాగిస్తూంటారు. అవి అచ్చుపడే అవకాశమే లేదని వారికి ముందుగానే తెలిసిఉంటుంది. లెనిన్‌గ్రాడ్‌లో అరోరా పురావస్తు ప్రదర్శనశాలలో ఒకచోట పాత కాలంనాటి ఫిల్ములు ప్రదర్శిస్తారు. అక్కడ నేనిటువంటివారిని చాలామందిని కలుసుకున్నాను. ఆ ప్రదర్శనశాలలో కొన్ని అత్యాధునిక సంప్రదాయాలకు సంబంధించిన త్రిపర్ణ చిత్రాలుకూడా ప్రదర్శించారు. న్యూయార్కు నగరంలోని ఆధునిక చిత్రకళా ప్రదర్శనశాలలలో పనిచేసేవారు ఆయా చిత్రాలను గురించి ఇదమిత్థంగా నిర్ణయించి చెప్పడానికి కొంచెం తికమక పడతారు. లెనిన్‌గ్రాడ్ చిత్ర ప్రదర్శనశాలలో కూడా సరిగా నాకిలాంటి పరిస్థితే ప్రత్యక్షమయింది. అయితే ఆ చిత్రాలలో ఒక విధమైన నిజాయితీ, సత్యాన్వేషణ దృష్టీ ఉన్నాయని అక్కడివారికి తెలియక పోలేదు.

అక్కడికి వచ్చేవారంతా అక్కడి గ్రంథాలయానికి బాగా అలవాటుపడిన మేధావులే! మాస్కోలో లెనిన్ లైబ్రరీ సందర్శించగానే న్యూయార్కు పబ్లిక్ లైబ్రరీ, బ్రిటిష్ మ్యూజియము చటుక్కున జ్ఞాపకం వస్తాయి. లెనిన్ లైబ్రరీ పరిసరాలు, పాఠకులు అచ్చంగా అలాంటి వారే.

ఒకనాటి సాయంకాలం నేను లెనిన్ లైబ్రరీకి వెళ్ళాను. అప్పటికి బాగా చీకటిపడింది. దానికి తోడు కొంత వర్షంకూడా ప్రారంభం అయింది. పొగ తాగడాని కలవాటుపడిన కొంతమంది, నేను లైబ్రరీ గది కివతల మెట్లమీద గుమిగూడాము. కొందరు ఇంజనీరింగ్ విద్యార్థు లక్కడ గుమిగూడి తమలో తామేదో చర్చించుకుంటున్నారు. లైబ్రరీలో వారందరికీ ఒక ప్రత్యేక పఠనాలయంకూడా ఏర్పాటుచేశారు. వారి చర్చావిషయం నాకేమీ బోధపడలేదు. వారది అంతా ఇంగ్లీషులో చర్చించుకొన్నా అంతే జరిగేది. నన్ను చూడగానే వారందరు కంఠస్వరాలు కొంచెం తగ్గించి గుసగుసలాడుకోవడం ప్రారంభించారు. నేనది గ్రహించి వారందరితోను కొంచెం కలిసికట్టుగా మాట్లాడాలని నిశ్చయించాను. వారిలో ఒక విద్యార్థి చాలా చురుకైనవాడు. మొదటినుంచీ మిగిలిన వారందరికన్నా బాగా విరగబడి నవ్వుతున్నాడు. నెమ్మదిగా నా దగ్గిరకివచ్చి కొంచెం మర్యాద మేళవించి వ్యంగ్యంగా అడిగాడు:

"మీ కిక్కడ వేసవి బాగుందా?"

అతని వ్యంగ్యానికి కారణం లేకపోలేదు. ఆకాశం అంతా బూడిదరంగు పులిమినట్టుంది. బాగా వర్షం పడుతూంది. చలిగాలి రోడ్లమీద నడిచిపోయేవారందరికీ బాకుపోటులా గుచ్చుకుంటూంది. అందుచేతే అతడలా అడిగాడు.

"లెనిన్‌గ్రాడ్ పరిసరాల కీవాతావరణం చాలా బాగా నచ్చింది."

అని నేను కొంచెం మర్యాదగానే సమాధానం చెప్పాను. అతడు మళ్ళీ అడిగాడు:

"మీరు టూరిస్టులా ఉన్నారే! ఎక్కడనించి వచ్చారు?"

"అమెరికా నించి"

దీనితో మాచుట్టూ ఉన్నవా రందరికీ కొంచెం ఆసక్తి బయలుదేరింది. నాతో మాట్లాడుతున్న వ్యక్తి పేరు ఆండ్రే. అతడు మరింత ఆశ్చర్యపడ్డాడు. తరవాత కొంచెం యాదాలాభంగా అడిగాడు:

"ఈ మధ్యన ఇసాక్ స్టెర్న్ ఫిడల్ వాద్యం విని మేమంతా చాలా సంతోషించాము. అతడు మీ అమెరికా వాయులీన విద్వాంసులందరిలోను గొప్పవా డనుకుంటాను."

నేనామాటకు సమాధానంగా రష్యానించి వచ్చిన ఓయ్ స్ట్రాక్ వాయులీనవాద్యం విని అమెరికా వారంతా ఆనందించారని అన్నాను. అంతలోనే అతని సంభాషణ ఇంకొకదాని మీదికి పరిగెత్తింది:

"ఐన్‌స్టీన్ పోవడం నిజంగా చాలా గొప్ప దురదృష్టం! అతడొక మహాప్రతిభాశాలి. మీ రాయన నెరుగుదురా?

నా కాయన పరిచయ భాగ్యం కలగలేదని అన్నానుగాని అంతటితో విడచిపెట్టలేదు:

"రష్యాలో ఐన్‌స్టీన్ సాపేక్షసిద్ధాంతం అంతా చాలాకాలం కిందటే బూర్జువా ఆదర్శవాదం అని కొట్టి పారేశారని విన్నాను. అందుచేత మీ ప్రశంస విని నేను చాలా సంతోషించాను."

"ఐన్‌స్టీన్ అంటే మాకెంతో గౌరవం!"

అన్నాడు ఆండ్రే. అతని వెనకాల నిలబడిన విద్యార్థులంతా ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు కనిపించారు. అతడు వారికేసి చూశాడు:

"మీరంతా ఐన్‌స్టీన్ పేరు విన్నారు గదూ?"

వారంతా కొంచెం బిడియపడి అవునన్నట్లు తలలూచారు.

"వీళ్ళందరు నిన్నే మా ఇన్‌స్టిట్యూట్‌లో మొదటి సంవత్సరం పూర్తిచేశారు. ఈవేళ రెండో రోజు. అందుకని వీళ్ళంతా తమ ముందు చదువుల కోసం తాపత్రయ పడుతున్నారు."

ఆండ్రే తన చేతిలోఉన్న సిగరెట్‌పెట్టె నా కందించాడు. ఆ అదను కనిపెట్టి విద్యార్థులంతా చల్ల చల్లగా లైబ్రరీలోకి జారుకున్నారు.

నేనడిగాను:

"మీరు కూడా రెండోసంవత్సరం చదువు తున్నారా?"

ఆండ్రే సైన్స్ ఎకాడమీలో భౌతికశాస్త్రవేత్త! కాని ఆసంగతి నాకు తెలియనే తెలియదు! ఆండ్రే సమాధానం చెప్పాడు:

"ఆ విద్యార్థులలో ఒకతను నా సోదరుడు. కాని అంతగా తెలివైన వాడుకాడు."

ఆండ్రే లైబ్రరీకి రావడానికి కారణం వేరు. ఫ్రెంచికవిత్వం చదువుకోవాలనే అతడక్కడికి వచ్చాడు. నే నమెరికానించి వచ్చాననగానే అతని కెంతో ఉత్సాహం కలిగింది. అమెరికాలో ఇచ్చే జీతాలను గురించీ, ఆయా వస్తువుల ధరలను గురించీ, పన్నులనుగురించీ అతడు నామీద శరపరంపరగా ప్రశ్నల వర్షం కురిపించాడు. తరవాత అతడు, నేను కలిసి లైబ్రరీ పక్కనున్న పార్కులో పచార్లు మొదలు పెట్టాము. మాసంభాషణ మళ్లీ ఐన్‌స్టీన్‌మీదికి తిరిగింది. విద్యార్థులసంగతి, ఆండ్రే సోదరుని సంగతీ మళ్ళీ వచ్చింది. ఆండ్రే చెప్పకుపోయాడు:

"వాళ్లందరికీ ఐన్‌స్టీన్ సంగతి బాగా తెలుసును. ఐన్‌స్టీన్ విశ్వశాంతి దూతగదా!"

నాకతని మాటల్లో సోవియట్ మేళవించిన వ్యంగ్యం గోచరించింది. మళ్ళీ అంతలో కొట్టొచ్చినట్టడిగాడు:

"అందుచేత నేగదా! ఆయన్ని అమెరికాలో అన్నివిధాల బాధించారు!"

అమెరికాలో ఐన్‌స్టీన్ పట్ల గౌరవాదరాలు, కొంత యుక్తియుక్తమైన విమర్శకదృష్టి, మేధావంతుల యెడల చూపించే నిరాదరణ, ఎవరో మహావ్యక్తి అనే భయభక్తులు—మొదలైనవి అన్నీ ఏర్పడ్డాయి. నే నవ్వన్నీ ఆండ్రేకి వివరించి చెప్పాను. కాని అవ్వన్నీ అతడంతగా పట్టించుకోలేదు:

"ఆయనది అత్యద్భుతమైన మేధాశక్తి!"

అని అదే ధోరణిలో ఐన్‌స్టీన్ ప్రశంస ప్రారంభించాడు. నేను రష్యాలో చాలాకాలం నించీ అమలులో ఉన్న ఐన్‌స్టీన్ సాపేక్షవాద నిరసన సంగతి మళ్ళీ ఉటంకించాను.

రష్యాలో భౌతికశాస్త్రజ్ఞులు చాలామంది ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన సాపేక్ష సిద్ధాంతం చాలావరకు పరోక్షంగా అంగీకరించారని ఆండ్రే అన్నాడు:

"అయితే మీకు మల్లే మేము కూడా ఆయన ప్రతిపాదించిన 'యూనిఫైడ్ ఫీల్డ్' సిద్ధాంతం విని చాలా ఆశ్చర్యపోయాము."

అని ఆ విషయంమీద తన అభిప్రాయభేదం వ్యక్తీకరించాడు. అతడు చెప్పేదంతా స్పష్టంగా బోధపరుచుకోవడానికి నా కింకా కొంతసేపు పట్టింది. నేను నాకు వచ్చీరాని రష్యాభాషలో నాకు కలిగిన అనుమానాలు, సందేహాలు అతనికి తెలియజేశాను. ఆంద్రే కొంచెం ఓపికపట్టి నా అనుమానాలు సందేహాలు, అన్నీ తొలగించాడు. చిట్టచివరి కిలా అన్నాడు :

"మా దేశంలో కొంత మంది భౌతిక శాస్త్రజ్ఞులు సాపేక్ష సిద్ధాంతం సరియైనది కాదని కొట్టి పారేశారు."

నేనది విని తల పంకించాను. ఆంద్రే మళ్ళీ అందుకున్నాడు :

"ఆ కొట్టి పారెయ్యడంలో నిజాయితీ లేక పోలేదు! అయితే—పనిలో పని, కొంచెం పరిస్థితులు గమనించడం కూడా జరిగిందని తోచింది!"

నాకతని సంభాషణలో అంతటా కొంచెం వ్యంగ్యము, కొంచెం పరిహాసము స్పష్టంగా గోచరించాయి.

తరవాత ఆంద్రే అమెరికాలో సుప్రసిద్ధులయిన భౌతికశాస్త్రజ్ఞుల్ని గురించీ, గణిత శాస్త్రజ్ఞుల్ని గురించి కొన్ని ప్రశ్నలడిగాడు. అతని ప్రశ్నలకు వేటికీ సమాధానా లివ్వలేకపోయినందుకు నేను కొంచెం చిన్నబుచ్చుకున్నాను. అమెరికా గణిత శాస్త్రజ్ఞులలో ఒక్క టామ్‌లెహరర్ పేరే నే నెరుగుదును. ఆతరవాత నేను వినిపించిన లెబాచవిస్కీ పాట అతనికి బాగా నచ్చింది.

"అక్కడినించీ, ఇక్కడినించీ సంగ్రహించినది పరిశోధన పేరుతో చలామణీ చేసేయ్!"

ఇది ఆ పాటలో ఒక చరణం! నే నేదో వచ్చీరాని రష్యా భాషలో ఆ చరణం అనువదించి చెప్పాను. పై నించి కొంచెం జల్లులు పడుతున్నా లక్ష్యపెట్టక ఆంద్రే నా అనువాదం జాగ్రత్తగా ఒక నోటు బుక్కులో రాసుకున్నాడు.

తరవాత నే నాంద్రే ఆతిథ్యం స్వీకరించడానికతని ఇంటికి వెళ్ళాను. రష్యా పరిస్థితులతో పోలిస్తే అతని ఇల్లు పరిసరాలు, అతని జీవితము బాగా మెరుగుగానే ఉన్నాయి. అతని ఇంట్లో నాలుగు పెద్ద పెద్ద గదులున్నాయి. ఆంద్రే తల్లిదండ్రు లక్కడే ఉన్నారు. నేను వారితో పరిచయం కలిగించుకోలేదు. అతని కొక పనిమనిషి కూడా ఉంది. నా కామెతో కలిగించిన పరిచయం చాలా ముక్తసరిగా ముఖావంగా జరిగిపోయింది. తరవాత ఆంద్రే నాకు తాను వివాహమాడ బోయే నూతన వధువుతో పరిచయంకలిగించాడు. ఆమె పేరు గాల్యా. చక్కనిది. నే నామెను "మీరు రష్యనులా!" అని అడిగాను. కాకసస్ ప్రాంతంనించి వచ్చిన యుక్రేనియన్ వనితనని ఆమె సమాధానం ఇచ్చింది. నా దుస్తులకేసి ఎంతో వింతగా చూడడం మొదలు పెట్టింది. నా రష్యాభాష విని వెకిలిగా నవ్వడం మొదలు పెట్టింది. నేను రష్యాభాషలో లేనిపదం ఏదయినా వాడగానే 'మైకో విస్కి' అని వేళాకోళం చేసేది. ఆంద్రే కొంచెం మర్యాదగా "అపప్రయోగం కొంచెం విచిత్రంగా ఉంది!" అని మాత్రం సమాధానం చెప్పి నెమ్మదిగా సర్ది వేసేవాడు.

అమెరికాలో ఇచ్చే జీతాలనుగురించీ, ఆయా వస్తువుల ధరవరలను గురించీ ఆంద్రే లెక్కలు కడుతున్నాడు. ముఖ్యముఖ్యవ నేను చెప్పిన ధరవరలు, తను వేసిన ధరవరలు సరిగా ఉన్నాయో లేవో అని సరిచూసుకునేవాడు. అతడవ్వన్నీ లెక్కలు కడితే ఒక్క విషయం స్పష్టంగా తేలింది. అమెరికాలో ఒక పనివాడు కష్టపడి పనిచేస్తే—భార్య మరి మిగిలిన బాదరబందీ ఏమీ లేకుండా తనకాలం అంతా పిల్లల కోసము, ఇంటిపనికోసము వినియోగించ వచ్చును! ఇది అతనికి బాగా నచ్చింది. కాని గాల్యాకు వీధిలోకి వెళ్ళి ఏదో పనిచేయకుండా ఇంటిపట్టున కూర్చునే ఆడవాళ్ళంటే బొత్తిగా నచ్చలేదు. ఆమె అలాంటివాళ్ళనందరినీ తీసివేసినట్లు మాట్లాడింది. ఆ రోజులలో రష్యాలో అలాంటి ఆడవాళ్లనందరినీ వేళాకోళం చేసి వెక్కిరించేవారు. దానిమీద నేను అమెరికాలో ఏదో ఉద్యోగంచేస్తూ జీవించే స్త్రీలుకూడా ఉన్నారనీ, సామాన్యంగా గృహిణులంతా చాలా కష్టపడి పనిపాటలు చేసుకుంటారనీ, చాలామందికి పనిమనుషుల్ని పెట్టుకునే తాహతుకూడా ఉండదనీ సమాధానం చెప్పాను. గాల్యా సోషలిస్టు. రష్యాలో సోషలిస్టులంటే చాలా గౌరవిస్తారు. అమెరికాలోకంటె రష్యా

లోనే చాలామందికి పనిమనుషులున్నారని నేనంటే ఆమాట ఆమెకు రుచించలేదు. ఆమె చెప్పే మాటలు వింటూంటే ఆంద్రేకి చిరాకెత్తుకొచ్చింది:

"నీవే కనక ధనస్వామ్యవాదం ప్రచారానికి పూనుకొంటే కార్మికులందరికీ నౌకర్లున్నారని బుకాయించడానికి కూడా జంకవు!"

చివరికతనికి ఆ జీవనప్రమాణం లెక్కలంటే బాగా విసుగుపుట్టింది. తరవాత మా సంభాషణ రోజన్‌బర్గు కేసుమీదికి తిరిగింది.

రోజన్‌బర్గు దంపతుల కేసునుగురించి నా అభిప్రాయాలన్నీ ఆంద్రేకి తెలియజేశాను. ఆ దంపతులిద్దరు గూఢచారి చర్యలలో పాల్గొన్నారు. వారిద్దరికీ విధించిన శిక్ష చాలా క్రూరంగా ఉన్న మాట నిజమే! అయితే నిందితుల తరఫున వ్యవహరించిన న్యాయవాదులు వారిద్దరు వారి జీవితలక్ష్యాలు కమ్యూనిస్టుపార్టీకే అంకితం చేసినట్లు వాదించారు. ఆంద్రే కమ్యూనిస్టుపార్టీ మాట వినగానే ఆ విషయంలో బాగా ఆసక్తి చూపించాడు. అయితే నా కాఆసక్తిలోకూడా 'అన్ని పక్షాల రాజకీయాల ధోరణి ఒకలాంటిదేలే!' అనే ఈసడింపు, నిర్లిప్తత స్పష్టంగా కనిపించాయి. ఆంద్రే ఇంకా అలాగే చెప్పుకుపోతాడు:

"మా దేశం పత్రికలలో రోజన్‌బర్గ్ దంపతుల కేసు వ్యవహారాలు పడ్డాయి. అంతేకాదు. వారి శిక్షల మీద అమెరికాలో వచ్చిన అధిక్షేపణలుకూడా ప్రచురించారు. అయితే ఆ కేసు వ్యవహారాలన్నీ ఇక్కడ ఆమూలాగ్రంగా ప్రకటించకపోవడంవల్ల నేనొక నిశ్చయానికి రాలేకపోయాను. కాని మీది చాలా విచిత్రమైన దేశం! అక్కడ శాస్త్రజ్ఞులందరికీ తమ అధిక్షేపణలు తెలియజెయ్యడానికి సంపూర్ణ స్వాతంత్ర్యం ఉంది! అయితే, ఓపెన్‌హీమర్ ఇంకా అమెరికా శాస్త్రీయపరిషత్తులో సభ్యుడుగానే ఉన్నాడా?"

ఇదంతా వినగానే గాల్యా మరి ఉండబట్టలేకపోయింది:

"నిజంగా అమెరికా చాలా విచిత్రమైనదేశం! ఏ పాపం ఎరగనివాళ్ళనిట్టే ఉరిస్తంభంమీద కెక్కిస్తారు!"

ఆంద్రే అలాగ మాట్లాడ్డం మర్యాద కాదన్నట్టుగా కొంచెం చురుగ్గా గాల్యా కేసిచూశాడు. మళ్ళీ అందుకున్నాడు:

"మీరంతా మేమీ శాస్త్రీయ విషయాలన్నీ పాశ్చాత్యదేశాల దగ్గిరనించి కొట్టేశామని అనుకుంటున్నారు! అది చాలా పెద్ద పొరబాటు! మా దేశీయులకీ విషయాలన్నీ క్షుణ్ణంగా తెలుసును! మేమెలాంటి సాంకేతిక సమస్య అయినా సాధించగలం! గూఢచారి చర్యలద్వారా పైవారి రహస్యాలపహరించడమెంకంటే పరిశోధించి తెలుసుకోవడమే తేలిక! మా శాస్త్రీయ సమస్యలన్నీ మేము తేలిగ్గా పరిష్కరించుకోగలం".

అని ఆంద్రే ఆమాటే మళ్ళీ గట్టిగా రెట్టించాడు:

"అయితే ఎన్నడు కని విని ఎరగని కొత్త కొత్త సమస్య లూహించి అవ్వన్నీ జాగ్రత్తగా పరిశీలించడం అంటే అది మా వల్లగాదు. నేను నవనవోన్మేష దృష్టి కోసం కవిత్వం చదువుతూంటాను. మా దేశంలో గొప్ప సిద్ధాంత వేత్తగా ప్రసిద్ధిపొందిన ఒక వ్యక్తి సంగీతంలో కూడా బాగా పేరు సంపాదించుకున్నాడు... అయితే మా ఆలోచన ధోరణి అంతా ఒకే మూసలో కరిగించి పోసినట్లు నడిచిపోతూంటుంది."

వెంటనే ఆంద్రే గాల్యాకేసి చూసి అన్నాడు: "ఏదో నా ఆలోచన ధోరణిలో ఉన్న లోటుపాట్లేసంగా చెప్పుకుపోతున్నాను."

ఆంద్రే నెమ్మదిగా టీ కలపడం మొదలుపెట్టాడు. అంతలో గాల్యా అందుకుంది:

"ఆంద్రే నిలుచున్నపాటిగా న్యూటన్ అంతవాణ్ణి కావాలని ఆలోచిస్తున్నాడు. 30 ఏళ్ళు పైబడినా సైన్సులో ఇంకా గొప్ప విషయమేదీ కనిపెట్టలేదే అనీ, అది తనకొక పెద్ద తలవంపనీ అనుకుంటున్నాడు."

నేను కలుసుకున్న శాస్త్రజ్ఞులందరిలోను ఆంద్రే ఒక్కడే స్వేచ్ఛగా మాట్లాడాడు. అంతేకాదు! అతను శాస్త్ర పరిశోధనచేసి ఏదోఒక గొప్ప విషయం కనిపెట్టాలని తహతహలాడుతున్న మేధావి. నేను కలుసుకున్నవాళ్ళలో ఇలాంటి బాపతు చాలా తక్కువ. నాకు పరిచితులయిన శాస్త్రజ్ఞులలో చాలామంది అంతగా పెద్ద ఆదర్శాలేవీ పెట్టుకున్నట్టు కన

బడలేదు. రష్యా చలనచిత్రాలలోను, నవలలలోను, కథలలోను, బ్రహ్మాండమైన ఆశావాదం కనిపిస్తూంటుంది. నేనంతటి ఆశావాదంకోసం ఎదురు చూడలేదు గాని మొత్తంమీద రష్యాలో అందరు భవిష్యత్తు తలుచుకొని కలకలలాడుతూ ఉంటారని అనుకున్నాను. కాని అప్పుడే విశ్వవిద్యాలయాలు విడిచిపెట్టి ఇవతలికివచ్చిన పట్టభద్రుల్ని కొందరిని పలకరించగానే నాకు చాలా ఆశ్చర్యంవేసింది. నిజానికి పెద్దపెద్ద చదువులు చదువుకున్న వారికి రష్యాలో చాలా మంచి అవకాశాలున్నాయి. ఇంకా పెద్ద పెద్ద డిగ్రీలు చేత్తో పట్టుకున్న వారిమాట చెప్పనే అక్కరలేదు! నేను పలకరించిన పట్టభద్రులలో చాలామంది, తమ భవిష్యత్తునుగురించి నిరుత్సాహంగా మాట్లాడటం మొదలుపెట్టేసరికి నాకు చాలా ఆశ్చర్యంవేసింది. విశ్వవిద్యాలయాలనించీ ఆయా సాంకేతిక సంస్థలనించీ ఇటీవలే పట్టభద్రులై ఇవతలికివచ్చిన యువతీ యువకులెందరెందరినో కలుసుకుని మాట్లాడాను. వారిలో చాలామంది వేసంకాలం సెలవులహుషారులో పడ్డారు. మరికొందరు విదేశాలనించి వచ్చిన యాత్రికులకు సాయం చేస్తున్నారు. మళ్లీ ఆగస్టు వచ్చేసరికి తమ భవిష్యత్తేమవుతుందో వారెవరికీ తెలియదు!

ఒక పట్టభద్రుడు నాతో మాట్లాడుతూ ఇలాగన్నాడు:

"నా జీవితంలో సుఖమైనరోజులన్నీ వెళ్ళిపోయాయి. ఇక ఇప్పటినించీ కష్టపడి పనిచెయ్యాలి."

ఇతగాడు అంతర్జాతీయ వ్యవహారాలలో ప్రత్యేక కృషిచేశాడు. అందులోను అమెరికాకు సంబంధించిన వ్యవహారాలన్నీ క్షుణ్ణంగా చదువుకున్నానని సగర్వంగా రొమ్మువిరిచి మాట్లాడాడు. డెమొక్రెట్ పార్టీనిగురించీ, రిపబ్లికన్ పార్టీనిగురించీ నవాలక్ష ప్రశ్నలడిగాడు. రాబోయే ఎన్నికలలో ఆ పార్టీల భవిష్యత్తును గురించి మరికొన్ని ప్రశ్నలడిగాడు. నేనతని ప్రశ్నలకేవో నాకు తెలిసిన సమాధానాలు చెప్పాను. చివరికతనిలా గన్నాడు:

"మీరు చెప్పినదానినిబట్టి నాకీవేళ కొత్త విశేషాలు కొన్ని తెలిశాయి. నేను విశ్వవిద్యాలయానికిచ్చిన నా ప్రత్యేక నివేదికలో ఈ రెండు పార్టీలకు యదార్థమైన భేదము లేదని ఋజువుపరిచి సిద్ధాంతీకరించాను."

నేను తిరిగివచ్చివేసే సమయంలో ఇతడు అమెరికాచరిత్ర పుస్తకం ఒకటి పంపించవలసిందని అడిగాడు:

"నేనమెరికాను దుయ్యబట్టడంలో ప్రత్యేక కృషి చేశాను."

అని దురుసుగానే మాట్లాడాడు. నేను కొంచెం వ్యంగ్యంగానే అన్నాను:

"నేను పంపించే పుస్తకం మీకీ విషయంలో బాగా ఉపయోగిస్తుంది."

అతడొక చిరునవ్వునవ్వి మెల్లిగా తలపంకిస్తూ వెళ్లిపోయాడు.

ఇంకొక విద్యార్థిని ప్రపంచ శిల్పచరిత్రలో ప్రత్యేకకృషి చేసింది. స్వతః ప్రతిభావంతురాలు. ఆమె తన ఉద్యోగ భవిష్యత్తును గురించి ప్రసంగిస్తూ ఇలాగ చెప్పింది:

"నాకంతటి సుఖమైన ఉద్యోగం దొరకుతుందనే నమ్మకమేమీ లేదు. బహుశః ఇంకా రెండు మూడు సంవత్సరాలు నేనేదో చదువుకుంటూనే కాలక్షేపం చెయ్యాలని అనుకుంటున్నాను."

ఆ అమ్మాయి అంతగా ఉత్సాహవంతురాలు కాదు. ఎప్పుడూ ఎందుకో దిగులుపడుతూన్నట్టుంటుంది. కాని ఫ్రాన్సుదేశం ప్రసంగంవచ్చేసరికి ఆమెకెక్కడలేని ఉత్సాహము పుట్టుకొచ్చింది. ఆ అమ్మాయికి ఫ్రెంచిభాష తెలుసును. పైగా ఫ్రాన్సునించి వచ్చిన కొందరు యాత్రికులతో కలిసిమెలిసి తిరిగింది. పుష్కిన్, టాల్‌స్టాయిలకన్న ఫ్లాబర్టు, బాల్జాక్‌లంటేనే ఎక్కువ అభిమానం ఉన్నట్టు కనబడింది. రష్యాలో చాలామందికి తమకు విదేశ సంచారం చేసే అదృష్టమే పట్టదన్నట్టు మాట్లాడతారు. ఆమె కూడా అలాగే కొంచెం నిస్పృహగా, వ్యంగ్యంగా మాట్లాడింది:

"నేనే కనక ఎప్పటికయినా ఫ్రాన్సుదేశం వెళ్ళడం అంటూ జరిగితే మాదేశం అసలుచరిత్ర అక్కడే తెలుస్తుంది."

అన్నాడింకొక అర్థశాస్త్రవేత్త. అతని అర్థశాస్త్రవిజ్ఞానం — లెనిన్, బుఖరిన్, రాడెక్, ట్రాట్స్కీ — మొదలైన వారి పంథాలో నడిచింది.

ఈ నిరాశ, నిరుత్సాహము నిరుద్యోగ సమస్యవల్ల ఏర్పడుతున్నాయని అనుకోవడం పొరబాటే. నిరుద్యోగులయిన మేధావులు లాటిన్ దేశాలలో విప్లవశక్తులకు దోహదం ఇచ్చారు. రష్యాలో అటువంటి నిరుద్యోగి మేధావివర్గం ఏర్పడే అవకాశమేమీ లేదు. పెద్దపెద్ద చదువులు చదివినవారికి అంతగా అభిరుచిలేని చిన్నచిన్న ఉద్యోగాలు సిద్ధమయ్యే పరిస్థితులవల్ల ఇటువంటి నిరుత్సాహం ఏర్పడి ఉండవచ్చును. ఒకనాడు నేనొక ఉపాధ్యాయుణ్ణి కలుసుకున్నాను. అతను మంచి శక్తిసామర్థ్యాలున్న వ్యక్తి. ఒక విశ్వవిద్యాలయంలో పని చేస్తున్నాడు. ముందేదో ఉన్నతపదవి అందుకోవచ్చునని ఉవ్విళ్లూరుతున్నాడు. అతనికలాంటి అవకాశాలు కూడా ఉన్నాయి. అటువంటి వ్యక్తి నాతో ఇలాగన్నాడు:

"చిన్నప్పటినించీ నేనొక ఉపాధ్యాయపదవి సంపాదించాలని కలలుకన్నాను. నాకా ఉద్యోగం దొరికింది. చెప్పవలసిందంతా ముందే, జాగ్రత్తగా ఇంటి దగ్గరే చదువుకుని వెళ్ళాను. తీరా పాఠం చెప్పి ఇవతలికి వచ్చేసరికి నాఅజ్ఞానంఅంతా నా కళ్ళముందు ప్రత్యక్షమయింది. నాకెదురుగాకూర్చుని నాపాఠంవిన్న విద్యార్థుల పరిస్థితికూడా అలాగే ఉంది!"

రష్యాలో ఉన్నవాళ్ళంతా ఏదో ఖైదులో ఉన్నట్టుంటారు! అయితే చాలామంది తమ జీవితాలన్నీ కుంచించుకుపోతున్నట్టుంటారు. మరికొందరు యూరోపు అమెరికాలు సందర్శించాలని తహతహలాడుతూంటారు. అంతేగాని రష్యాలో ఏవో బాధలనుభవిస్తూండడంవల్ల బయటికి పారిపోవాలనుకునే సూచనలేవీ కనిపించవు. ఇంతకుపూర్వం రష్యానుంచిపారిపోయి వచ్చిన వారందరిలోను ఇలాంటి సూచనలు కనిపించాయి. వారందరు సాంస్కృతికంగా కొంచెం వెనకపడ్డవారు. కాని ప్రస్తుతం నేను కలుసుకుని మాట్లాడినవారిలో ఆధోరణి కనబడలేదు.

ఇంతేకాదు. నాతో మాట్లాడినవారంతా వారి దేశం కష్టసుఖాలను గురించి ఆలోచిస్తున్నట్లే కనిపించారు. రష్యాలో పరిస్థితులను గురించి తీవ్రంగా విమర్శించేవారుకూడా తమదేశాన్ని గురించి గర్వంగానే మాట్లాడారు. స్టాలిన్ కాలంలో రష్యావారిని విదేశాలు పంపించకుండా గట్టి కట్టుదిట్టాలు చేశారు. బహుశః ఈవిషయంలో స్టాలిన్ అవలంబించిన పద్ధతే మంచిదేమో! కృశ్చేవ్ ప్రత్యేకంగా కొంతమంది విదేశాలు వెళ్ళడాని కంగీకరించాడు. దానివల్ల వారి తహతహ మరింత ఎక్కువవుతుందిగాని తగ్గదు. రష్యానించి పైదేశాలకు వెళ్లేవారిని జాగ్రత్తగా కనిపెట్టి చూస్తూంటారు. అదీగాక ఆ ప్రయాణాలకు బోలెడుసొమ్ము ఖర్చవుతుంది. అయినా రష్యాలో అలాంటి విదేశయాత్రానుమతి దొరికిందంటే అది గొప్ప అదృష్టమన్నమాట! పెద్దపెద్ద పరీక్షల్లో బాగా ఉత్తీర్ణులయిన పట్టభద్రులకే అలాంటి అదృష్టంపడుతుంది. ఇక మిగిలినవారిలో చాలామంది తమకలాంటి అదృష్టంపట్టే అవకాశమే లేదని భావిస్తారు.

స్టాలిన్ చనిపోయిన తరవాత, ప్రత్యేకంగా కృశ్చేవ్ ఇచ్చిన ఉపన్యాసం చదివినవారందరికీ రష్యాలో సాంస్కృతిక రాజకీయరంగాలలో కొంత సడలింపు జరిగిందని స్ఫురించడం సహజం. నామట్టుకు నేనిలాగే ఊహించాను. ఎవరిని అడిగినా మొత్తంమీద పరిస్థితులు పూర్వంకన్నా బాగానే ఉన్నాయని అన్నారు. అంతేగాని పూర్వానికీ ఇప్పటికీ పెద్దతేడా ఏమీ లేదని చెప్పారు. కాని సాహిత్యవేత్తలుమాత్రం చాలా ఉత్సాహంగా కనిపించారు. వారందరు ఏదో ఒక నూతన సాహిత్యయుగం గడపడంలో అడుగుపెడుతున్నట్టు, ఏవేవో సరికొత్తవిషయాలమీద తమ సాహిత్య వ్యవసాయం సాగించబోతున్నట్టు మాట్లాడారు. ప్రస్తుతం అందరికీ ఎర్నెస్టు హెమింగ్వే అంటే మోజెక్కువయింది. అందుచేత సమష్టిక్షేత్రాలనుగురించి వ్రాసే రష్యానవలలో ఇకనించీ చిన్నచిన్న యుద్ధాలు, కొట్లాటలు ఎక్కువ కావచ్చును! ఓ లేషా, ఇసాయేక్ బేబిల్—ఈ ఇద్దరి నవలలు నిషేధించి చాలాకాలమయింది. ఇటీవల ఆ నిషేధాలు తొలిగించారు. ఇప్పుడు వీరి పుస్తకాల గిరాకీ బాగా పెరిగింది.

నేనొకసారి పెర్జీ అనే అర్థశాస్త్రవేత్తను కలుసుకున్నాను. మేమిద్దరం ఒకచోట కలుసుకోవాలని అనుకున్నాము. అతను రావడం కొంచెం ఆలస్యం అయింది. బోరిస్ పిల్నియాక్ పుస్తకం చదువుతూ కూర్చుని వేళ దాటిపోయినమాటే మరిచిపోయానని క్షమాపణ చెప్పుకున్నాడు. నే నాశ్చర్యపోయాను. బోరిస్ పిల్నియాక్ పుస్తకాలు కొంతకాలంనించి రష్యాలో నిషేధించారు: నే నడిగాను :

"మళ్ళీ అతగాడ్జిగాని తవ్వి బయటికి తీశారా?"

నిషేధమేమో తొలగించనే లేదట! సెర్జీకి తండ్రి కాలంనాటి పుస్తకాలలో పిల్నియాక్ రాసిన 'మాయా మిర్' హఠాత్తుగా కనిపించిందట! అది చదువుతూ కూర్చున్నానని అతను సమాధానం చెప్పాడు. సెర్జీ రష్యాలో ప్రస్తుత పరిస్థితుల్ని గురించి కొంచెం బిగుసుగానే మాట్లాడాడుగాని త్వరలోనే పిల్నియాక్ మీద నిషేధం తీసి వెయ్యవచ్చునని అన్నాడు. అంతేకాదు జమియాటిన్ రాసిన 'ఉయ్' అనే పుస్తకం కూడా మళ్లీ ప్రజలముఖం చూడవచ్చునని అన్నాడు. అది 1920 తరవాత అచ్చుపడిన తీవ్ర వ్యంగ్యరచన. రష్యాలో చిన్నతరం వారెవరికీ ఆ పుస్తకం సంగతి తెలియనే తెలియదు. జార్జ్ ఆర్వెల్ '1984' దాని ఆశయచ్ఛాయల్లోనే నడిచింది. 'ఉయ్' పునరుద్ధరణ సంగతి విని నేను మరింత ఆశ్చర్యపోయాను. సెర్జీ చిరునవ్వునవ్వి వ్యంగ్యంగా అన్నాడు:

"ఇందులో కూడా మేము పాశ్చాత్యదేశాల వారిని తలదన్నుతున్నాము! మీకందరికీ పునర్జన్మ ఒక్కసారే! కాని మా దుగకుక్కి పునర్జన్మలే!"

అయితే అతడీ 'పునర్జన్మ'లకంతగా ప్రాముఖ్యం ఉన్నట్టు మాట్లాడలేదు:

"19వ శతాబ్దంలోకూడా సరీగా ఇలాగే జరిగింది. మావాళ్ళు సాహిత్యం సాహిత్యంలా చదవరు. అదంతా రాజకీయాల్లా చదువుతారు. ఈమధ్యన బైబిల్ పుస్తకాలుకూడా మళ్ళీ అచ్చు వేయించి ప్రజల కందిస్తారని విన్నాను. దీనిలోమాత్రం రాజకీయా లేవీ లేవు!"

"పూర్వకంటె ఇప్పుడు కొంచెం మెరుగేగాని పరిస్థితు లంతగా మారలేదు. పూర్వం ముగ్గురొకచోట కూర్చుంటే అందులో ఒక ఆసామీ తప్పకుండా గూఢచారిఅయి ఉంటాడని నిశ్చయించేవాళ్లం! ఇప్పుడెంతమందిలో ఎందరు గూఢచారులో తిన్నగా తెలియడంలేదు."

అని ఒక లేడీ డాక్టరు నాతో చెప్పింది. మేమిద్దరం ఒక విమానంలో ప్రయాణం చేశాము. ఆపైన కొంచెం దోస్తీకూడా కలిసింది. ఆమె రష్యన్ జ్యూ. పేరు టాన్యా. రష్యాలో ఈ విషయానికి పెద్ద ప్రాముఖ్యమేమీ లేదు. పాస్‌పోర్టుల్లో మాత్రం వారికి రష్యన్‌అనో, పోలండ్ దేశీయుడనో, రష్యన్ జ్యూ అనో లట్వియా దేశస్థుడనో ఉదహరిస్తారు. అంతే. రష్యాలో ఒకప్పుడు సర్వజాతి సామరస్య సిద్ధాంతానికి వ్యతిరేకంగా ఒక పెద్ద ఉద్యమం లేవదీశారు. ఆ సమయంలో టాన్యా ఒక వైద్య పాఠశాలలో చదువుకుంటూంది. ఆమె ఆరోజుల్ని గురించి మాటాడుతూ—"అవన్నీ చాలా చెడ్డరోజులు." అని ముక్తసరిగా మూడుమాటలు చెప్పి మాట్లాడ కూరుకుంది. తనసంగతి పూర్తిగా మరిచిపోయి సమాధానా లిచ్చింది. తనకున్న ఉద్యోగం కాస్తా ఊడిపోనందుకే సంతోషించింది! కాని ఆమె తల్లిదండ్రులిద్దరికీ అంతటి అదృష్టంపట్టలేదు. వారిలో ఒకరికి విశ్వవిద్యాలయంలో ఉన్న ఉద్యోగం కాస్తా ఊడిపోయింది. ఇంకొకరికి ఏదో ఇంకో ఇన్‌స్టిట్యూట్‌లో ఉన్న ఉద్యోగం పోయింది. పరిస్థితులు 'బాగు' పడడంవల్ల ఇద్దరు మళ్ళీ ఉద్యోగాల్లో కుదురుకున్నారు. దానిమీద నేనడిగాను:

"మళ్లీ పాత ఉద్యోగాల్లో నే చేరారా?"

"లేదు! లేదు! వారిద్దరు పార్టీ సభ్యులు కారు. అందుచేత బహుశః అది జరగ నేరదు."

తరవాత మా సంభాషణ ఇల్యా ఎహ్రెన్‌బర్గ్ నవలలమీదికి తిరిగింది. అతని నవలలంటే టాన్యా చెవి కోసుకుంటుంది. ఆ నవలలో యూదు జాతీయుల అంతర్జాతీయ తత్త్వంమీద దుమ్మెత్తిపోసే ఘట్టాలు చాలా వున్నాయి. అవి నాకు బొత్తిగా సరిపడలేదు. నేనామాటే ఆమెతో అన్నాను. టాన్యా కొంచెం సేపాలోచించి మొట్టమొదట "అవును! నిజమే." అని సమాధానం చెప్పింది.

తరవాత కొంచెంసేపూరుకొని మళ్లీ అంతలోనే రుసరుసలాడింది:

"మీరీవిధంగా మాట్లాడడం తేలికే! మీ విశ్వవిద్యాలయాలలో యూదు లున్నారని విన్నాను. మీ కాంగ్రెస్‌లోను యూదులున్నారు. మీ దేశం యూదుల్లో కొందరు కోటీశ్వరులుకూడా ఉన్నారు. అయితే మా పరిస్థితులు మీకెలా తెలుస్తాయి? అందుచేత ఇల్యాఎహ్రెన్‌బర్గ్‌నుగాని మమ్మల్నిగాని మీ రెలాగ విమర్శించగలరు? మీకటువంటి అధికారం లేదు."

ఇంకొకసారి నేనొక చరిత్రవేత్తతో మాట్లాడాను. అతని అభిప్రాయాలు బాగా నమ్మడానికి వీలుగా ఉన్నాయి. అతిడప్పటికే ఒక పెద్ద ఉద్యోగంలో కుదురుకున్నాడు. పైగా కృశ్చేవ్ పేరు చెబితే చెవి కోసుకుంటాడు. పూర్వం ఒకప్పుడు రష్యాలో కొంత స్వాతంత్ర్య వాతావరణం ఏర్పడిన రోజు లతనికి బాగా గుర్తున్నాయి. అందుచేత అతకు ఉన్న పరిస్థితులు మారిపోవాలని కోరడం సహజం. అతడు ప్రతిదీ మార్క్సిస్టు దృక్పథంతోనే పరిశీలిస్తాడు. చివరికి ఛలోక్తులలో కూడా రాజకీయాల గోలే! కొంచెంసేపు వాదోపవాదాల్లో పడి మేమిద్దరము కృశ్చేవ్ ఉపన్యాసాన్నిగురించి చర్చించడం మొదలు పెట్టాము. న్యూయార్కు టైమ్స్‌లో పడిన కృశ్చేవ్ ఉపన్యాసము, రష్యా పత్రికలలో పడిన ఉపన్యాసము ఒకటేనా అని నాకు కొంచెం సందేహం కలిగింది. నే నది తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నాను. నేను కృశ్చేవ్ ఉపన్యాసం అంతా తిన్నగా చదివానా? లేదా? లేక భోగట్టా రాబట్టడానికి ఊరికే దబాయిస్తున్నానా? అని అతని కనుమానం కలిగింది. అతినది కనుక్కోవాలని ప్రయత్నిస్తున్నాడు. చిట్టచివరి కిలా గన్నాడు:

"కృశ్చేవ్ చెప్పింది తిన్నగా అర్థంచేసుకోవడం చాలా కష్టం. పైగా అతడు అతి తెలివైనవాడు. అయితే స్టాలిన్‌కి పక్కతాళం వేసే మాలటోవ్ వర్గం వాళ్లు ఆసభలో చాలామంది ఉన్నారు. అందుకనే కృశ్చేవ్ ఉపన్యాసంలో చివరి భాగంలో స్టాలిన్ పొగడ్త కనబడుతుంది."

దాని కుదాహరణగా అతడా ఉపన్యాసంలో ఆఖరిభాగం అంతా మళ్ళీచదివి వినిపించాడు. దానిలో ట్రాట్స్కీపక్షం వారిని నిర్దాక్షిణ్యంగా అణగదొక్కివేసిన సందర్భంలో స్టాలిన్ ప్రశంస ఉన్నమాట నిజమే. ఇది వ్రాసిచదివిన కృశ్చేవ్ ఉపన్యాసంలో లేదనీ, సభలో బయలుదేరిన అధిక్షేపణ శాంతింప జెయ్యడానికి కృశ్చేవ్ ఆ భాగంఅంతా నోటిమాటలతో ఉపన్యసించాడనీ అతిడూహించాడు. పైగా ఇలాగన్నాడు:

"నేను మార్క్సిజం బాగా చదువుకున్నాను. సిద్ధాంతాలు, ఆచరణలు, బాగా మారితేతప్ప పైపైన కూర్చున్నవారెవరో ఒకరిద్దరు మారినంతమాత్రాన చెయ్యగలిగిందేమీ లేదు!"

ఇతడు స్టాలిన్ పేరు చెబితేనే మండిపోయేవాడు. మాటిమాటికీ "లెనిన్ కనక ఇప్పుడు బతికి ఉంటేనా?" అని అంటూండడం అతనికొక పరిపాటి అయింది. అప్పైన నేనడిగాను:

"కృశ్చేవ్ ఎంతటివాడయినా ఒక్కడు చెయ్యగలిగిందేమీ లేదని మీరన్నారు. అలాగే ఎంత చెడ్డవాడయితేమాత్రం స్టాలిన్ ఒక్కడు చెయ్యగలిగిం దేముంది? మార్క్సిజం మీరింతగా ఆకాశానికెత్తి వేస్తున్నారుగాని ఇదంతా మళ్లీ పునర్విమర్శన చెయ్యడం అవసరమేమో?"

అతడది నిజమే అని అంగీకరించాడుగాని, ఆ సంగతి మళ్లీ పట్టించుకోవడమే మానేశాడు.

తరవాత నడిచిన సంభాషణలో నేను, నా భర్త తత్త్వశాస్త్రవేత్త అనీ, మార్క్సిజంలో ఆయనకు శ్రద్ధాభక్తులున్నాయనీ చెప్పాను. కాని ఆయనకు రష్యాభాష బాగారాదని చెప్పాను.

"అయితే మార్క్సిజం అర్థంచేసుకోవడానికది బాగా ఉపకరిస్తుంది! అసలు మాకిప్పుడు మార్క్సిజం మీద స్టాలిన్ రాసిన గొప్ప గొప్ప వ్యాఖ్యానాల వంటివేవీ అక్కరలేదు. మేమంతా ఇప్పుడు విప్లవానికి సంబంధించిన వాస్తవిక చరిత్ర జాగ్రత్తగా పరిశీలించాలి."

అతడింకా అలాగే చెప్పుకుపోయాడు: "ఈ దేశంలో చరిత్రవేత్త అంటే అర్థమేమిటో తెలుసునా? ఊరికే వాస్తవిక విషయాలన్నీ జాగ్రత్తచేసి వాటిమీద పరిశోధనసాగిస్తే చాలదు! ప్రతీది చారిత్రికలక్ష్యాల దృష్టితో పరిశీలించాలి. మార్క్సిజం—లెనినిజం దృష్టిలో అసలు చారిత్రిక లక్ష్యాలేవో జాగ్రత్తగా పరిశీలించాలి. ఆపైన శాంతిసాధనలో చరిత్ర లక్ష్యాలేవో తెలుసుకోవాలి. ఇంకా ఇరవయ్యో కాంగ్రెసు తరవాత చరిత్ర లక్ష్యాలేవో తెలుసుకోవాలి. తెలిసిందా?"

నేనతడు చెప్పినదంతా జాగ్రత్తగా విన్నాను. ఎంతైనా ఆశ్చర్యపడ్డాను:

"ఇంతేనా? ఇంతకంటె నిజమయిన చరిత్ర రచన చెయ్యడానికి వీలే లేదా?"

"అలాంటి అవకాశాలేవీ లేవు. అసలు సంగతులేవీ ఉన్నవి ఉన్నట్టుగా దొరకడంలేదు. ఒకవేళ దొరికినా అవి ఉన్నవి ఉన్నట్టుగా ప్రకటించడానికి వీలుపడదు. ఈవిషయంలో ఒకవేళ ఏదైనా మంచిపని జరిగిందంటే అది ఏదో తెలవని తలంపుగా జరిగిపోయిందన్నమాట!"

నేటి రష్యా మేధావులలో స్టాలిన్ తరవాత వచ్చిన నాయకులమీద అంతపెద్ద ఆశ ఏమీ కనిపించదు. అంతమాత్రంచేత స్టాలిన్ తరవాత పెద్ద మార్పులేవీ రాలేదని అనుకోకూడదు. ఇలాంటి మార్పులకంత గొప్ప దాఖలా లేవీ కనుపించవు. లేక వీటినిగురించి మాట్లాడుతున్నవారెవరైనా పొరబడుతున్నారేమోనని అనుకోవాలి. లేకపోతే వీరంతా ఇంతకుపూర్వం ఇలాంటి "మార్పులు" చాలా చూసిన బాపతేనా అయిఉండాలి. అందుచేతనే వీరంతా కొంత ముందు జాగ్రత్తతో మాట్లాడి ఉండవచ్చును.

ఇలాగ మాటలాడినవారిలో చాలామందికి రష్యాలో రాజకీయవాదుల పేరు చెపితేనే అరికాలి మంట నెత్తికెక్కేది. "రాజకీయవాదులు వాళ్ళ గోడుతప్ప ఇంకొకళ్ళ గోడు పట్టించుకోరు. ఎవడి మట్టుకు వాడికి తన తలకాచుకోవడమే పరమలక్ష్యం!"

ఈ బాపతు మాటలధోరణి నేను చాలామంది నోట విన్నాను. విదేశీ యాత్రికుల దృక్పథాలనుబట్టి కూడా వారివారి మాటల కర్థాలు తీయడం జరుగుతూ ఉంటుంది. టి. యస్. ఇలియట్ వ్రాసిన 'వేస్ట్ లాండ్' చదివినవాళ్ళు మన పాశ్చాత్యదేశాలలో శక్తిసామర్థ్యాలు, ఆరోగ్యభాగ్యాలు చూచి గుండె బాదుకుని ఆశ్చర్యపడవచ్చును! అలాగే కోస్లర్, ఆర్వెల్ మొదలైనవారి వ్యంగ్య రచనలు చదివి రష్యా సందర్శించిన వారి కందరికీ రష్యా పౌరుల మేధాశక్తి, జిజ్ఞాస, ప్రత్యేక వ్యక్తిత్వము పరిశీలిస్తే ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది.

ఏ కొలతప్రకారం చూసినా రష్యా మేధావుల అంతస్తు గొప్పదే! ఇక వారిచుట్టూ నిలిచిన సామాన్య విద్యావంతుల దృష్టితో చూస్తే వారి ప్రతిభ మరింత గొప్పగా కనిపిస్తుంది. ఈ మేధావులలో చాలామంది గొప్ప గొప్ప నిపుణులు. పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారు. కాని వీరంతా రష్యాలో జరిగే రాజకీయ ప్రచారం యావత్తు కిమ్మనకుండా అక్షరాలా యథార్థమని నమ్మేస్తారు. నాకొకసారి రష్యాలో విదేశీ యాత్రికులకుసాయపడే పట్టభద్రుడొకడు తటస్థపడ్డాడు. ఇతగాడొకసారి నాతో మాట్లాడుతూ వార్తాపత్రికలు తమ ఇష్టంవచ్చినట్లు పరస్పర వ్యతిరేకవార్తలు ప్రచురించే దేశంలో అడుగుపెట్టడానికి కూడా అసహ్యం వేస్తుందని అన్నాడు! పరస్పర విరుద్ధమైన వార్తలు ప్రకటిస్తే వాటిలో ఏది నిజమో నిర్ణయించడం చాలా కష్టమట!

ఇంకొకసారి ఒక జీవశాస్త్రవేత్త రష్యా వార్తాపత్రికలలో కేవలం యథార్థ సత్యాలు మాత్రమే ప్రకటిస్తారని రొమ్ముగుద్ది మాట్లాడాడు. ఆ శాస్త్రవేత్త రష్యాశాస్త్ర పరిషత్తులో ఒక ప్రముఖోద్యోగి! అడుగడుక్కూ ఛలోక్తులు విసరుతూ పాశ్చాత్యదేశాలమీది తన పైత్యం అంతా నామీద వెళ్ళగక్కడం మొదలుపెట్టాడు. పాశ్చాత్యదేశాలలో కార్మికులంతా ధనస్వాముల పాదాలకిందపడి నలిగి ఛిన్నాభిన్నమై పోతున్నారని జాలిపడ్డాడు. మందుగుండు సామగ్రి, ఆయుధాలు, తయారుచేసే ధనస్వాములు, సత్తిపెత్తనగారులు ఏకమై అమెరికాను యుద్ధంకోసం తహతహలాడుతున్నారనీ, ఇక కమ్యూనిస్టులు, ప్రభుత్వ వ్యతిరేకులు మొదలైనవారినందరినీ పాశ్చాత్యదేశాల వారనేకవిధాల హింసిస్తున్నారనీ దుమ్మెత్తిపోశాడు. ఇవన్నీ పాశ్చాత్యదేశాలకు వ్యతిరేకంగా సాగించే అబద్ధప్రచారాల జాబితాలలోవే! వీటికన్నింటికీ వ్యతిరేకంగా తగినన్ని ఆధారాలు చూపించి ప్రత్యుత్తరమిచ్చినా అతడు నా మాటలు చెవికెక్కనీయలేదు. ఎంతసేపూ ఒకటే సమాధానం!

"మీకు మీ దేశంమీద అభిమానం ఎక్కువ. మాకు మా దేశంమీద గౌరవాభిమానా లుండడం సహజమే!" ఇదే వరస!

నేనాపైన రష్యాలో ఉన్న లోపాలు కొన్ని పైకెత్తి చూపించాను. రష్యాలో సామాన్యకార్మికుల జీవనస్థాయికీ, వీరిమీద అధికారం చలాయించే, కార్మికాధికారుల జీవనస్థాయికీ మధ్య ఉండే పెద్ద తేడా అంతా వివరించి చెప్పాను. దక్షిణకొరియామీద జరిగిన దండయాత్ర రష్యా ప్రేరేపించినదే అని నిరూపించాను. రష్యాలోనే వేలకొలది సామ్యవాదుల్ని ఖైదుల్లో పెట్టి హింసించిన వైనాలన్నీ వరసగా ఏకరువుపెట్టాను. అతడవేవీ వినిపించుకోలేదు. పైగా మధ్య

మధ్యన కొంచెం కంగారు పడుతూ తనమాట లెవరైనా వింటున్నారేమోనని అటు, ఇటు చూడడం మొదలు పెట్టాడు. అతని ధోరణి అంతా నేనతి జాగ్రత్తగా పరిశీలించాను. అతనికి రష్యా మార్క్సు సోషలిజం మీదకంటె తనపై 'అధికారి' వర్గంమీదే ఎక్కువ భక్తి తాత్పర్యాలు ఉన్నట్టు కనిపించాయి!

తరువాత అమెరికా కమ్యూనిస్టుపార్టీని గురించి చర్చ జరిగింది. ఆపార్టీలో సభ్యుల సంఖ్య అమెరికా జనాభాతో పోలిస్తే చాలా తక్కువే అనీ, ఆ పార్టీ అభిప్రాయాలు చాలా స్వల్ప సంఖ్యాకుల అభిప్రాయాలనీ అన్నాను.

"అయితే అది ఎందుకు పనికిరాని పార్టీ అన్న మాట?" అని హేళనగా నవ్వాడు.

తరవాత "వచ్చే ఎన్నికలలో మీ రేపార్టీకి ఓటు వేస్తారు?" అన్నాడు. డెమోక్రటిక్ పార్టీ ప్రతినిధి స్టీవెన్‌సన్‌కే నా ఓటిస్తానని సమాధానం చెప్పాను.

అత డలాగే నిర్ఘాంతపోయాడు: "డెమోక్రటిక్ పార్టీకా?" అని మళ్ళీ రెట్టించి రెట్టించి అడిగాడు. అమెరికాలో చాలామంది ఓటర్లు తాము సోషలిస్టుల మని అనుకుంటారు; కాని తమ పేరు లిబరల్ పార్టీలో నమోదు చేయించుకుంటారు; దేశంలో ఎన్నికల సమయంలో డెమోక్రటిక్ పార్టీ ప్రతినిధులకు ఓట్లిస్తారు. అదంతా అతనికి వివరించి చెబితే తికమక అవుతుందని ఆలోచించి "అవును! డెమోక్రటిక్ పార్టీకే!" అని సమాధానం ఇచ్చాను. ఇందాకటినించీ నాకు వ్యతిరేకంగా మాట్లాడిన అత నొక్కసారిగా మారిపోయాడు. నామీద అతని కెక్కడలేని గౌరవము కలిగింది!

"మీరు డెమోక్రటిక్ పార్టీలో సభ్యులా? ఇంత చిన్న వయస్సులో నే?!"

అని హఠాత్తుగా లేచి నిలుచున్నాడు. దానితో అతడు కూర్చున్న కుర్చీకూడా కిర్రుమని ఒక్క గావుకేక పెట్టింది. మళ్ళీ అదేమాట రెండు మూడు మారులు రెట్టించి ఎంతో ఉత్సాహంగా నాతో కరచాలనం చేశాడు.

నేను నెమ్మదిగా అమెరికాలో ఎవరయినా డెమొక్రాటిక్ పార్టీ సభ్యులు కావచ్చుననీ ప్రస్తుతం ఆ పార్టీలో లక్షలాది సభ్యులున్నారనీ ఇందులో అంత ఎగిరి గంతెయ్యవలసినంత గొప్పదనమేమీ లేదనీ చెప్పాను. నేను మాట్లాడుతూంటే మధ్యమధ్యన అతను "ఎంత గొప్ప పార్టీ! ఎంత గొప్ప పార్టీ! మీరిలాగ తగ్గించి మాట్లాడుతున్నా రేమిటి?"

అని ఆశ్చర్యపోయాడు. నేను చెప్పినదంతా విని మళ్ళీ కరచాలనం చేశాడు. అతనప్పుడే అరవై పడిలో అడుగుపెట్టాడు. అందుచేత రష్యాలో వెనక తరానికి సంబంధించిన స్వాతంత్ర్య సంప్రదాయాలన్నీ అతనికి బాగా తెలిసిఉండాలి. విప్లవానికి వెనకటి సంప్రదాయాలు తెలియకపోయినా అధమం స్టాలిన్ యుగానికి పూర్వపు స్వాతంత్ర్య సంప్రదాయా లయినా బాగా తెలిసి ఉండాలి. ఆ తరాలకు చెందిన కొందరు ప్రస్తుత పరిస్థితులపై విప్లవాలు సాగించారని విన్నానుగాని అలాంటివారు నాకెవరు తటస్థపడలేదు.

ఒకసారి నేనా తరానికి చెందిన ఒక గ్రంథకర్తను కలుసుకున్నాను. అతడెంతసేపు ఒకటే ధోరణి:

"రష్యా జీవితస్థాయి శరవేగంతో ముందుకు సాగిపోతూంటే రష్యా సారస్వతం మాత్రం దానికి బాగా వెనకబడి పోయింది."

"మా దేశంలో ప్రతీదీ అభ్యుదయ పరంపరాభివృద్ధిగా ముమ్ముందుకు సాగిపోతూంటే మా రచయితలు జీవితం నిస్పృహగా, దిగులుగా ఎందుకు చిత్రించాలి?"

అతని సంభాషణ ఎంతసేపు ఇదే ధోరణిలో సాగిపోయింది. అలాంటి ప్రగల్భాలు అడపా తడపా అందరినోట వినబడుతూనే ఉంటాయి. ఆ గ్రంథకర్తకూడా మళ్ళీ అవే ఏకరువుపెట్టాడు. అయితే చిన్నతరం రచయిత లెవరూ ఈధోరణిలో మాట్లాడరు. నేను పేర్కొన్న వెనకతరం రచయితవచనరచనలో బాగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకొన్నాడు.

ఒక్కొక్కప్పుడు పాతతరం మనుషులు కొందరు చాలా సామాన్యపరిస్థితుల్లో తటస్థపడుతూంటారు. ఆ పరిస్థితులవల్ల వారి సంభాషణ కూడా అదే ధోరణిలో సాగిపోతూంటుంది. నేనొకసారి పాతతరానికి చెందిన ఒక స్త్రీతో కలిసి రెండున్నర రోజులపాటు ప్రయాణం సాగించాను. ఆమె అంత ఉత్సాహంగా మాట్లాడినట్లు కనపడలేదు. చాలా కాలం ఉపాధ్యాయురాలుగా పనిచేసింది. ప్రస్తుతం ఆ ఉద్యోగంనించి

విరమించింది. ఆమె భర్త చాలాకాలంపాటు ఒక విశ్వవిద్యాలయంలో ప్రొఫెసరుగా పనిచేసి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆమె జీవితంలో సగానికి పైభాగం రష్యా విప్లవానికి పూర్వమే గడిచిపోయింది. చిన్నతనంలో ఆమెకు, భర్తకు మధ్య నడిచిన ప్రేమగాథ ఏదో 19వ శతాబ్దం నవలలో ఒక అనురాగఘట్టంలా వినిపించింది. వారిద్దరు ఒక్క స్కూల్లోనే చదువుకొన్నారట! మొట్టమొదట వారిద్దరు ఒక నిరసన సభలో కలుసుకున్నారట! ఆరోజుల్లో జార్ ప్రభుత్వం 'షెవ్ చెంకో' అనే విప్లవ కవిని నిర్బంధించింది. దానికి నిరసన తెలియజెయ్యడానికొక సభ ఏర్పాటుచేశారు. షెవ్ చెంకో ఒక గొప్ప యుక్రేనియన్ కవి. అప్పటి జార్ ప్రభుత్వం ఆ కవివల్ల ఏదో గొప్ప ప్రమాదం రాగలదని భయపడింది. ఇప్పుడామెకు డెబ్బైఏళ్లు పైబడ్డాయి. ఆ రోజుల పరిస్థితుల్ని గురించి ఆమె కొంచెం వివరించి చెప్పింది:

"ఆ రోజుల్లో మా కెవరికీ మతవిషయాలంటే నమ్మకం లేదు. రాజకీయ నిరసన సూచకంగానైనా చర్చికి వెళ్ళడం మంచిదా? కాదా? అని ఆదేపనిగా చర్చించుకునే వాళ్ళం!"

అది ఇంకా కొన్ని సంగతులు లేకరువుపెట్టింది. ఒకసారి ఆమె నిద్రపోయేముందు ప్రార్థనచేసింది. నేనది గమనించాను:

"అయితే మీరు ప్రస్తుతం చర్చికివెళుతున్నారా?"

ఆమె నిర్ఘాంత పోయింది. అలాంటి దేమీ లేదని సమాధానం చెప్పింది:

"నా భర్త రష్యా శాస్త్రపరిషత్తులో సభ్యులుగా ఉన్నారని మీకు చెప్పాను గదా! మీకది జ్ఞాపకం లేదా?"

కాని చర్చికి వెళ్లకూడదనే నిషేధమేమీ లేదని ఆమె చెప్పింది:

"అయితే నా పరిస్థితుల్లో నేను చర్చికి వెళ్లి ప్రార్థన చెయ్యడం బాగుండదు. మరి అమెరికాలో అందరు తప్పకుండా చర్చికి వెళ్లితీరాలటే! నా కదేమీ బాగుండలేదు!"

ఆమె బుర్రలో అమెరికాలో బాగా లేని వింకా ఎన్నెన్నో పోసుపడ్డాయి:

"అమెరికాలో చిన్న పిల్లలసలు పుస్తకాలే చదవరు! చదివితే కామిక్స్ చదువుతారు. వాటిల్లో ఎంతసేపు బందిపోటు దొంగలు, తాగుడు, కార్మికుల్ని హింసించడం—ఇవే సంగతులు!"

"నేనమెరికా వారి జీవితాన్ని గురించి చాలా పుస్తకాలు చదివాను. హొవర్డ్ ఫాస్ట్, ఫెనిమోర్ కూపర్, జాక్ లండన్ మొదలైన వారి పుస్తకాలెన్నో చదివాను. అమెరికా వారంతా వట్టి అడవి మృగాల్లా కనిపిస్తారు. నాకమెరికాలో జీవితం అంటే భోత్తిగా నచ్చలేదు! ఇక సామాన్య సంసారులు, తమ సంసారా లెలాగ సాగిస్తారో నాకు తెలియడం లేదు!"

ఆమె మాటలధోరణి అంతా అలాగసాగిపోయింది. నేనామెకు అమెరికాలో సామాన్యసంసారుల పరిస్థితులు ఉన్నవి ఉన్నట్టుగా చిత్రించి చెప్పడానికి ప్రయత్నించాను.

రష్యాలోలాగే అమెరికాలోకూడా సంసారులు చాలా మంది సౌమ్యంగానే తమ జీవిత యాత్రలు సాగిస్తారనీ వారి కాలం అంతా ఉద్యోగాలలోను, కుటుంబ సంరక్షణంలోను, గృహ పరిసరాలలోను సాగిపోతుందనీ చెప్పాను. కాని ఆమె భావనా శక్తి అంతా రష్యా ప్రభుత్వ ప్రచార ధోరణిలోనే సాగిపోయింది. అదే ఆమెకెక్కువ విశ్వసనీయంగా కనిపించింది. అందుచేత అదే ధోరణిలో కమ్యూనిస్టు చైనాను పొగడడం మొదలు పెట్టింది:

"చైనా జాతి నిజంగా చాలా గొప్పజాతి. 10 ఏళ్ళకు పూర్వం చైనా వారంతా వట్టి కూలీలు, భోత్తిగా విద్యాగంధం సోకని జనాభా! ఇప్పుడు చైనా అంతా ఎలాగ మారిపోయిందో! కిందటి నెలలో ఒక ప్రఖ్యాత చైనా శాస్త్ర వేత్త మా శాస్త్రపరిషత్తు చూడడానికి వచ్చాడట. మా ఆయన నాకీ సంగతిచెప్పారు. అతను రష్యా భాష ఎక్కడా పొల్లు పోకుండా అతి స్వచ్ఛంగా మాట్లాడాడట! ఎంత త్వరగా వారంతా విద్యావంతులయ్యారో! ఈ మధ్యన ఈజిప్టు వారు కూడా బాగా ముందడుగు వేస్తున్నారు. ఆ దేశంలో ఎక్కడ చూచినా స్కూళ్లే! ఎక్కడికి వెళ్లినా చిత్రకళే! ఎక్కడికి వెళ్ళినా బృందగానాలే!"

ఆమె చాలా మంచిది. ప్రయాణంలో నాకెన్నెన్నో సదుపాయాలు చేసింది. గడిచిన 70 ఏళ్ల

జీవితంలోను ఎన్నెన్నో యుద్ధాలు, కరువులు చూసింది. ఎన్నెన్నో ఇబ్బందులు పడింది. ఆమె కుటుంబంలో వారు, మిత్రులు అందరు పెద్దపెద్ద చదువులు చదువుకున్నారు. ఆ విషయం ఆమె ఎంతో గొప్పగా చెప్తుంది. అయితే రష్యాలో అడపా తడపా జరిగిన రాజకీయ నిందితుల 'బహిష్కరణలలో' వారిలో చాలామంది అంతరించిపోయి ఉంటారని నేననుమానించాను. నిర్మొహమాటంగా అమాటే అడిగాను. దానికామె అంటీ అంటనట్టుగా సమాధానం చెప్పింది :

"ఇదిగో! మాది అసలే విప్లవ ప్రభుత్వం! అది మా నిరక్షరాస్యతపూర్తిగా నిర్మూలించింది. ఇప్పుడు పల్లెటూరి జనం అంతా పుస్తకాలు చదువుకుంటున్నారు. ఎప్పుడూ లేనిది వారందరికీ ఇప్పుడు విద్యుచ్ఛక్తి సౌకర్యంకూడా ఏర్పడింది."

ఆమె మాటలు విని నేనిక ఉండబట్టలేకపోయాను. చిట్టచివరికి అడగవలసింది కాస్తా అడిగేశాను: "మీది సోషలిస్టుపంథా? మీరు సోషలిస్టులు! అయితే విప్లవం వచ్చినప్పటినించీ జరిగినవన్నీ నిజంగా మీకు నచ్చాయా?"

"లేని మాట నిజమే! నాజీలంతటి ఘాతుకకృత్యాలు చేస్తారని ఎవరు కలగన్నారు! ఘూషాప్వను లావిఃంగా క్రూరంగా ప్రవర్తిస్తారని ఎవరనుకున్నారు!"

అయినా నేనంతటితో విడిచిపెట్టలేదు. ఆమె దగ్గరనించి ఇంకా రాబట్టాలని అలాగే గుచ్చిగుచ్చి అడిగాను:

"ఇలాంటి అవాంతరాలదారి వేరు! అయితే మరి మిగిలిన విషయాల మాటేమిటి?"

ఆమె నెంతో బాధపెట్టిన దింకొక విషయం ఉంది. చివరి కామె అది చెప్పివేసింది. ఆమెకు, ఆమె భర్తకు ప్రాచీన పాశ్చాత్య సాహిత్యంమీద భక్తి ప్రపత్తు లెక్కువ. నేటి ప్రపంచంలో రష్యా సాంస్కృతికంగా బాగా ముందడుగు వేసింది. ఆమాట ఎవరు కాదనలేరు! కాని రష్యాలో గ్రీక్, లాటిన్ భాషాసాహిత్యపఠనం బాగా సన్నగిలింది; ఈ సాహిత్యాలు రెండు నిర్లక్ష్యంచేసినదేశం నిజంగా సాంస్కృతికంగా ముందంజ వేసిందని అనగలమా?

—సశేషం

['ఎన్‌కౌంటర్' పత్రిక సౌజన్యంతో]

తిరుగులేని న్యాయం

శ్రీ బలివాడ కాంతారావు

శ్రీకాకుళానికి దక్షిణపు చివరన ఒక పాడుపడిన గృహం యెవరో కొనుక్కున్నారని చుట్టుపట్ల వున్నవారు విని "ఆ దేవుడో మట్టిలో కలిసిపోడానికే కొన్నాడని" వ్యాఖ్యానించారు. కొనిన రెండు నెలల్లో ఆ పాతగోడలమీదనే పెంకుటిల్లు లేచింది. చుట్టూ తీగలతో కంచె వేసి, ఆ భాగాల్లో రకరకాల పూలమొక్కలు నాటుతూ ఒక ముసలాయన త్రోవ పోయేవాళ్లకు పంచెకట్టు, ఖద్దరుబనియను లేదా అంటే చవకరకం కమీజుతో కనిపించేవాడు. ఇంట్లో యెవరూ ఆడవాళ్లుగానీ నౌకర్లుగానీ అనుపించలేదు. వంట, వండిన గిన్నెలు తనే తోముకునేవాడు. ఎదురుగావున్న నాగావళీ నదినుంచి నీరు ఒక బాల్చీతో మోసుకొనేవాడు. ఇదంతా ఆ వీధిలోనివారు చూసి "దిక్కెవరూ లేనట్లు వుంది. ఏదో చవకగా దొరికిందని యీ యిల్లు కొనుక్కున్నాడని" అనుకున్నారు.

అతను ఆ యింటిలో దిగిన నెలరోజులకు ఆ చుట్టుపట్లవాళ్ళకి అతని విషయం కొంత తెలిసింది. ఆఫీసరుగా పనిచేసి ఈ మధ్యనే యితను రిటయిరయ్యాడని, నెలకు అయిదువందలవరకు పింఛను వస్తుందని తెలుసుకున్నాక యీయనగురించి యింకా తెలుసుకుందామని ఉబలాటం ఆ వీధి ప్రజల్లోనే కాదు, ఆ పట్నంలోనే చాలమందికి కలిగింది. మరో నెలరోజుల్లోనే యేవీధిలో చూసినా యీయనమాటలే అనుకోవటం మొదలుపెట్టారు. "ఒక్కపూటే వండుకొని భోజనం చేస్తాడట! ఎవరు వెళ్లినా అట్టే మాటాడడు. ఆడంబరం కొద్దిగైనా లేదు. పోనీ పిసినారి అంటే కానే కాదు. వచ్చిన పింఛను అంతా పేదవాళ్ళకే పోస్తున్నాడు. చెయ్యిచాపినవాళ్ళకే కాకుండా చాపనివాళ్ళ కష్టాలూ తెలుసుకొని మరీ సహాయంచేస్తున్నాడు. పాదాలకు చెప్పులైనా లేవు. బాధపడే రోగులవద్దకు పరుగెత్తుతాడు. తన చల్లని మాటలతో వాళ్ళలో ధైర్యాన్నీ, స్థైర్యాన్నీ చేకూరుస్తాడు. ఆ పాడుపడిన మట్టి యెంత అదృష్టం చేసుకొని యీ పుణ్యాత్ముణ్ణి తెచ్చుకుందో!..." అని, తలోలా పేదారోదా మొదలు భాగ్యవంతులదాకా యీయనగురించి అనుకున్నారు.

స్వలాభాపేక్ష లేని రమణయ్య ఆ పట్నంలో అందరిచేత గౌరవింపబడటానికి కొన్ని నెలలైనా అవసరం లేకపోయింది. అతనిదగ్గరకు ఆ పూటకు యెలా జరుగుతుందని బాధపడే కటికపేదనుంచి భోగవిలాసాలలో సుఖపడే శ్రీమంతులవరకూ వచ్చి గౌరవిస్తున్నారు. అతని స్వగ్రామం, జీవితంగురించి యెన్నెన్నో ఊహాగానాలు జరుగుతున్నాయి. ఒకనాడు ఒక ముసలాడు మాటల్లోనే నలుగురిమధ్య "తమదేవూరు! మీ తండ్రిగారెవరు? మీ కెవరూ లేరా?" యిలా యేవేవో అడుగుతుంటే నవ్వి "ఈ లోకమే నా వూరు, ఆ భగవంతుడే నా తండ్రి— నాకెవరూలేకేమి? మీరంతా నావాళ్ళుకారా?" అని సమాధానం చెప్పాడు.

ఒకనాటి సాయంత్రం వాకిట చాప వేసుకొని కూర్చున్నాడు. వయసుమళ్ళిన ఒక వితంతువు భక్తితో తన్మయయై గానంచేస్తోంది. చుట్టూ మూగిన ప్రజ కూడా ఆ పాటలో పరవశులైపోతున్నారు. ఇంతలో వచ్చిన టెలిగ్రాం రమణయ్య విప్పాడు. అది చూస్తూనే అలా చేతినుంచి జారిపోయింది. కళ్ళనించి నీరు బొటబొటా కారజొచ్చాయి. అటువంటి స్థితిలో ఆయనను యిదివరకు చూడని ప్రజానీకం ఆతృతతో చుట్టుముట్టేశారు. గోడకు చారబడి పెల్లుబికిపోయిన దుఃఖాన్ని అపుకోడానికి ప్రయత్నించలేదు. పంచ చివర కళ్లకు ఒత్తుకుంటూ వెక్కి వెక్కి యేడుస్తున్నాడు.

"సీతమ్మ...యెవరీమె?" అనే సందేహం అందరిలోనూ పొడసూపకముందే రమణయ్యగారు దుఃఖంలో "అమ్మా—నా బంగారుతల్లీ—నువ్వే మిగిలావను

కున్నాను..." అని యేడుపువిని అందరికళ్లూ తడిసి పోయాయి.

ఓ క్షణంపోయాక కట్టలు తెంచుకొని పొర్లే దుఃఖాన్ని ఆపుకోడానికి ప్రయత్నిస్తూ "నా ఒకే ఒక తల్లి గంపెడు పిల్లలను వదలిపోయింది. ఆ అమ్మలేని పిల్లలకు అష్టకష్టాలే!"

ఈ వార్త క్షణంలో పట్నం అంతా ప్రాకి పోయింది. ప్రజ తండోపతండాలుగా పరుగెత్తి వచ్చారు. మంచివాళ్ళకే దేముడు కష్టాలు తెచ్చిపెట్టాడని, వాడికే కళ్లుంటే న్యాయం అడివిలోకి పారిపోదని తలోలా రమణయ్యకి యెదరగా పరోక్షంగాకూడా దేముణ్ణి దూషిస్తున్నారు.

ఆవేళ రాత్రే కర్నూలుకు బయలుదేరాడు. తనతో యెవరినైనా తోడుగా పంపిస్తామంటే పనీ మిరా ఒప్పుకోలేదు. వేగంగా తమరు తిరిగిరావాలని కొందరు ఆముదాలవలస స్టేషనువరకు వచ్చికూడా చెప్పారు.

పదిహేనురోజుల్లోనే తిరిగివచ్చాడు. ఈ దెబ్బ నుంచి తెములుకున్నట్టులేదు. మనిషి చిక్కిపోయాడు. పరధ్యానంగా కూడా వుంటున్నాడు. ఉండీవుండీ కూతుర్ని తలచుకొని కళ్లతడుపుకోవటం కొందరు గమనిస్తునేవున్నారు. చాలామంది వస్తున్నారు— పోతున్నారు. ఒక ధనికుడు ఆ దగ్గరగావున్న విశాలమైన తనతోటలో ఆశ్రమంకట్టించి అంతా తనపేర వ్రాస్తానని యీ పాడుజాగాను విడిచిపెట్టమని ప్రాధేయపడ్డాడు. మొదట కాదని వారంరోజులు పోయాక "నాయనా! ఎంచి యెంచి యీ స్థలం నిర్ణయించుకున్నాను. నా కోరికలకి అనువైన జాగా యిదే! నీతోటలో కుష్టురోగులకి ఆశ్రయంచూపించు. వాళ్ల సేవచేసి తరిస్తావ"న్నాడు.

ఊళ్లోనూ పొరుగుకోర్లలోవున్న కుష్టురోగులు రానురాను ఆతోటలో చేరారు. వాళ్లతో కలిసిమెలిసి సేవచేస్తుంటే చాలామంది అది అంటువ్యాధని జాగ్రత్తగావుండమని బ్రతిమాలారు. మీరు చూపిస్తున్న అభిమానాన్ని స్వీకరిస్తూ అన్నాడు. "ఆ జబ్బే నాకు అంకురిస్తే నాకంటే సంతోషి అయిన మనిషి యీలోకంలో యింకెవరూ వుండరు."

ఈ మాటలు విన్నవాళ్లల్లో సంచలనం బయలుదేరింది. కూతురుపోయాక రమణయ్యకు మతికొస్త చలించిందేమోనని కొందరు అనుమానపడసాగారు. ఇప్పుడు తనను ఒంటిగా పడుకోనివ్వరు. ఎవరో కొందరు తనయింటి వరండాలోనే కాపలా వుంటుంటారు.

చవితి చంద్రుడు అప్పుడే క్రుంగిపోతున్నాడు. ఉండి వుండి మనసుకు ఆహ్లాదాన్నిచ్చే గాలివీస్తోంది. గంగమ్మతల్లి గలగలారవముతో వంపుతూ వాలుతూ దిసవకు దిగజారిపోతోంది. ఆకాశాన నక్షత్రాలు మిణుకు మిణుకుమంటున్నాయ్. వాకిట కూర్చున్న నలుగురు మనుషులూ మాటల్లో మాటగా దేవునిమీద దూషణలు చేస్తున్నారు. ఇందులో ఒక వయసుమళ్లిన వ్యక్తి, ఒక నడివయసులోనున్న ధనికుడు, యింకో ఉన్నతవిద్యనభ్యసించుతున్న విద్యార్థి కూడా ఉన్నారు. వీళ్లమాటలు వింటున్న రమణయ్య గది నుంచి బయటకురాగానే అంతా లేచి నులుచున్నారు. వాళ్లని కూర్చోబెట్టి తనుకూడా వాళ్లదగ్గరగా కూర్చొని యేదోనిశ్చయానికివచ్చి తొణకని గొంతుకతో మొదలుపెట్టాడు.

"నేను ఈ పట్నం వచ్చినదగ్గరనుంచీ ప్రజల్లో నాగురించి యెన్నో కట్టుకథలు అల్లుకున్నాయని నాకు తెలుసు. ఏ కట్టుకథలు అల్లుకున్నా అవన్నీ నాకు చెడుగు అపాదించినవిగా లేవు. నాలో యేదో మంచి వుందని యీపట్నంప్రజలంతా నన్నింతగా గౌరవిస్తున్నారు. అంతేకాదు, కొందరు "కోవెలకెందుకు వెళ్తారు ఆ బాబుముఖంచూసి మొక్కండి" అని అన్నమాటలుకూడా నాచెవినిపడ్డాయి. ఈ అనంతమైన విశ్వంలో నేనొక నీటిబిందువును. అది కాలమనే యెండకు ఆహుతి అవక యెంతకాలం వుండిపోతుంది? నేను చచ్చిపోయాక మీరంతా మీబిడ్డలకు, వాళ్లు వాళ్లబిడ్డలకు యిలా తరతరాలు నాగురించి "ఇక్కడ ఈ పాడుపడినస్థలంలో ఒక మనిషివుండేవాడు. సాధుపుంగవుడు. కాని క్రుద్ధిదేముడు వాడిని అష్టకష్టాలు పాలుచేశాడని" దేముడిని దూషిస్తూ నన్ను పొగడుతూ చిత్రిస్తారు. ఈ కొద్దిరోజుల్లోనే దేవుని మీద, నామీదనున్న భక్తితో మీలో చాలమంది దూషణలు కురిపిస్తుంటే నేను వినలేకపోతున్నాను. అంచేత నావిధి యేమంటే ఆదేవదేవుని గొప్పతనాన్ని,

తిరుగులేని న్యాయాన్ని మీకు విన్నవించాలని నిర్ణయానికి వచ్చాను.

నేను నెల్లూరులో ఒక సంపన్న గృహస్థుల యింట్లో పుట్టాను. ఆ సంపదకుతోడు మా కుటుంబం విద్యకు కూడా పేరుపడింది. మా తాత కవులను పోషించడమే కాకుండా తను ఆసుకవిత్వం చెప్పేవారు. మాతండ్రి మేజిస్ట్రేట్ గా పనిచేసేవారు. నేను వారి యేకైకపుత్రుణ్ణి. నాకు చిన్నప్పటినుంచీ ముద్దు యెంత చేసేవారో చదువువిషయంలో మా నాన్నగారు అంత శ్రద్ధవహించేవారు. ఆరోజుల్లో పేరుపడ్డ ఉపాధ్యాయులు యింటికివచ్చి చదువుచెప్తుండేవారు. ఉదయం మా నాన్నగారితోపాటు నేను స్నానంచేసి పూజచేసేవాణ్ణి. తరవాత జోడుగుర్రాల బగ్గీయెక్కి బడికివెళ్లేవాణ్ణి. మా నాన్నగారు ఇంగ్లీషు భాషలోనే కాకుండా, సంస్కృతాంధ్రాలలోనూ దిట్ట! నేను చిన్నవయసులోనే సంస్కృతం నేర్చుకున్నాను. పదిహేనేళ్ల ప్రాయంవచ్చేసరికి మా నాన్నగారి పరిజ్ఞానం కొంచం కొంచం అర్థంచేసుకొనేవాణ్ణి. పాశ్చాత్య విజ్ఞాన సంపర్కమున్నా యీ దేశంలోనే వేళ్లుపాతుకున్నారు. మా అమ్మ నా పెళ్లి విషయం యెత్తితే, నాన్నచేసిన వాదన నాకెంతో సమంజసమనిపించేది. మన పురాణాల్లో స్వయంవరాల విషయం చెప్తూ బాల్యవివాహాలు సంఘం శుష్కించి పతనమైపోయే సమయంలో వచ్చాయని చెప్పారు. నేను పెళ్లిచేసుకోకుండానే ఉన్నతవిద్యకు మద్రాసు వెళ్లటం జరిగింది.

నావిద్య పూర్తయింది. నేను మొదటితరగతిలో ఉత్తీర్ణుడనయ్యాను. ఇంగ్లాండు బారెట్లా చదువుకోసం పంపిస్తామని మా నాన్న అనుకుంటుంటే అనుకోకుండా ఉద్యోగం నా కాళ్ళదగ్గరకు వచ్చింది. మా అమ్మ నన్ను పైదేశాలు పనేమిరా పంపించడానికి వప్పుకోపోవటంవల్ల ఆఫీసరు ఉద్యోగం దొరకటంవల్ల నేను యిక స్వతంత్ర జీవితంలో పడ్డాను. అప్పటివరకు ఒక మచ్చ, మాయ, యెరుగని జీవితం. చదువు తప్పించి యింకో ధ్యాసవుండేదికాదు. చెడుగురించి తలచటమే భయం. అలాంటివాళ్లను అసహ్యించుకొని దూరదూరంగా వుండేవాణ్ణి. అమ్మ నాన్నను విడిచిపెట్టి రావటంకాదు. కాబట్టి ఒంటిగా వుండవలసి వచ్చేది. ఏ పట్నం బదిలీ అయినా ఊరుబయట పెద్ద బంగాళా ఒకటి వుండేది. ఉద్యోగంలో నా ప్రతిభ చూపిద్దామనే ధ్యాసతప్పించి పెద్ద పెద్ద ఆశలు కోరికలూ యేమీ వుండేవికావు. నా మంచితనాన్ని గౌరవించేవారు.

అప్పుడప్పుడు నా పెళ్లివిషయం ప్రస్తావన వచ్చేది. సంబంధం విషయంలో మా అమ్మ, నాన్నకూ అభిప్రాయాలు యెప్పుడూ యేకీభవించేవికావు. నాక్కూడా పెళ్లి అంత వేగిరంగా చేసుకోవాలని మనసుండేదికాదు.

ఇలాంటి పరిస్థితులలో యీవూరే బదిలీమీద వచ్చాను. పట్నం శివారులలో నా బంగాళా! మామూలుగానే కోరినట్లు, ఒక వయసుమళ్లిన స్త్రీని వంటపుట్టిగా బంట్రోతు కుదిర్చిపెట్టాడు. ఆమె యిదివరకువచ్చిన ఆఫీసర్లకు కొందరికి వంటపుట్టిగా వుండేది. పెద్దతోటవుండేది. నౌకర్లకోసం ఆ తోటలో ఒక మూల రెండు చిన్నగదులు వుండేవి. వంటమనిషి, తల్లి స్వంతబిడ్డని చూసినట్లుగా చూసేది. ఆమె యిల్లు బంగళాకు రెండు ఫర్లాంగులదూరంలో వున్న పట్నంలో చివరివీధిలో తాటాకుల గుడిసె. ఆ గుడిసెల్లో వున్నవాళ్ళు చాలా దరిద్రమైన జీవితంగడిపేవారు. వాళ్లంతా ఒకే కులస్థులు—కులపెద్ద—ఆ పెద్ద వేసే ఆంక్షలు—శిక్షవేసే అధికారం ఒక్కడి చేతిలోనే—వాడు అన్యాయానికిపోతే వాళ్ళకింకొక దారిలేదు.

మండువేసవి. ఒకనాటి మధ్యాహ్నం ఆవీధిలో ఒక కొంపకు నిప్పంటుకొని వీధంతా వూడ్చేసింది. వాళ్ళకు ప్రభుత్వం యేదో సహాయం చెయ్యటం కోసం నేను పలుకుబడి వినియోగించాను. ఈలోగా వంటమనిషి వుండటానికి నా బంగళాలో ఖాళీగావున్న నౌకర్లగదులు వుపయోగించుకోమని చెప్పాను. ఈ యిల్లు కాలిపోగానే ఆమె నెత్తీ నోరు కొట్టుకుంది. "ఈ పెద్దలందరికీ తాగడానికి పోస్తేగానీ నాకూతురికి పెళ్ళవదు. దానిపెళ్లి కోసం సొమ్ముకూడ్చి దాచినదంతా ఆ అగ్గిదేముడు పొట్టన పెట్టుకున్నాడు. ఇంక నా యీ తనువుండగా నా కూతురికి చెంబుడినీరు పొయ్యగలనా?" అని ఆమె యేడ్చింది. నేనేదో సహాయంచేస్తానని ఓదార్చాను. నామాటలు ఆమెకేమీ సంతోషం యివ్వలేదు. ఎంచేతంటే కష్టించి గడించినదానితో చేసిన పెళ్ళికి,

ఒకరు వూరికే యిచ్చినదానితో చేసినపెళ్ళికి యెంతో లేదావుందని ఆమెనమ్మకం. ఆ యిల్లు కాలిపోవటం కాదుగాని ఆమె బెంగతో అదో పరధ్యానంగా వుండేది.

ఒకనాడు నిద్రనుంచిలేచి అలామంచంమీద నుంచే కిటికీగుండా చూశాను. తూరుపున ఉషః కాంతులు అలుముకుంటున్నాయ్. రానురాను లేత పడుతున్న కాంతిలో నూతిదగ్గర స్నానంచేస్తున్న వంటమనిషి, కూర్చుని చూశాను. నా దృష్టియెంత మరలించుదామని ప్రయత్నిస్తున్నా లాభంలేక నాకోరికకు దాసుడయ్యాను. ఆమె నాకగపడేది కాదు—నావేపు చూడనూ లేదు. కిటికీనుంచి దొంగ తనంగా తొంగిచూసి తొలిసారి నా యౌవ్వనంలో వర్ణించలేని వ్యగ్రానుభూతిని పొందాను. ఆవేళ కేంపుకు వెళ్లవలసింది. వెళ్ళక యింటిలో నేవుండి దృష్టి ఆయింటివేపే సారించేవాడిని. ఆరోజంతా ఆమె కనపడలేదు. ఇక కనపడుతుందన్న ఆశకూడా లేదు. ఆ మరుసటిరోజు ఉదయం వేగంగా మేల్కొని యెదురుచూశాను, కానీ ఆమె ఆవేళ రానేరాలేదు.

ఆ వారంరోజుల్లో ఒకరోజున కేంపునుంచి తిరిగి వచ్చేసరికి భోజనాలగదిలో అన్నీ అమర్చివున్నయ్. మామూలుగా వంటమామ్మ భోజనందగ్గర లేక పోవటంతో గ్రహించి నాలోవున్న ఉబలాటంతో క్రీగంటితో వంటయింటివేపు చూస్తూ "ఏంఅమ్మ ఒంట్లో బాగులేదా?"

జవాబు వెంటనేరాలేదు. గ్లాసులో మంచినీరు గడగడా త్రాగివేసి "మంచినీరు"న్నాను. ఆమె విధి లేక వస్తుంటే కళ్లప్పచెప్పి చూశాను. ఆమె తిరిగి వెళ్లిపోతుంటే చప్పునలేచి వెంబడిద్దామని ఉబలాట పడ్డానుకాని ఆమె యింతలో మెల్లగావణుక్కుంటూ వచ్చి దగ్గరగా కూర్చుంది.

"జ్వరంతో యెందుకొచ్చావమ్మా" అన్నాను.

"అడపోతుంది బాబూ......"

ఆ రాత్రి చాలసేపటివరకు నాకు నిద్రపట్టలేదు. మర్నాడు ఈమె రాక పోతే అథవా మెల్లగా మాటలు కలిపే వరకైనా వచ్చే వాడిననుకున్నాను.

వాళ్లి వీధిలో మళ్ళీ యిల్లు తయారవుతోంది. నాలుగు రోజుల్లో వెళ్లిపోతారనగా నేను అనుకో కుండా కేంపు నుంచి ఒక రోజు ముందుగా నే వచ్చేశాను. నేను వచ్చే సరికి వంటమామ్మ జ్వరంతో మూలుగుతోందని గబగబ వెళ్లాను. నన్నుచూడగానే లేని బలం తెచ్చుకొని కూర్చొని వెళ్లి వంటచెయ్యమని గట్టిగా ఆజ్ఞాపించింది. కూతురు వెళ్లటానికి సంకో యిస్తుంటే "బాబు దేముడి లాంటోడు - అలాంటి బాబును ఆకలితో వుస్తావా? నివ్వువెళ్లక పోతే నేనే వెళ్తాను" అని లేవబోతుంటే విధిలేక వంట చెయ్య టానికి బయలుదేరింది. నేను చాలా సేపు మామ్మదగ్గర కూర్చున్నా మనసు అక్కడనే వుంది. "వేడి నీరు కాగివుంటుంది స్నానం చేసి బాబూ! అలసి పోయి వచ్చావు—అమ్మదగ్గర సంకోచం పడకండి. మీలాంటి మారాజులదగ్గర బతికింది మీ బిడ్డ అవుతాదిగానీ..."

వచ్చాను. బంగాళా వేపు అడుగులు వేస్తుంటే నాలో యౌవనం వుబ్బి తబ్బిబ్బయిపోతోంది. నాలోని మంచీచెడ్డా విచక్షణజ్ఞానాన్ని పసుబలంతో కూడిన కోరిక చంపివేసింది. స్నానాల గదిలో నీరు దించి ఆమె వస్తుండగా యెదురుపడ్డాను. వసారాలో దీపం లేదు. ఆమె ప్రక్కకు తప్పుకొని రాబోతోంది. మెల్లగా పిలిచాను. ఆమె ఆగింది. ఎదురుగా నిల్చొని నోటి నిండుగా యేదో అందా మనుకున్నానుగాని అనలేక పోయాను. నా శరీరం అంతా నా అధీనంలో లేకుండా పోయింది.

* * *

ఆ దెబ్బ తిన్న లేడిని, మెల్లగా వెక్కి వెక్కి యేడుస్తున్న అబలను...విడిచిపెట్టి స్నానానికి వెళ్లాను. నేను తిరిగి వచ్చే సరికి ఆమె వంట యింటిలో ఒక మూలకూర్చొని యింకా కళ్లల్లోనుంచి మౌనంగా నీరు కారుస్తూనే వుంది. నాలాంటి అందమైన యువకుని తొలివలపును పొందే అదృష్టం యీ దిగువ అంతస్తులో నున్న ఆమె పొందినందుకు సంతోష పడకుండా యెందుకు కేడవా లనిపించింది—అక్షణంతో ఆ స్త్రీ సర్వస్వాన్ని నేను అపహరించానని అందువలన ఆమె నైతికంగా శక్తి విహీనఅయ్యిందనీ ఆమెను పూర్తిగా భరించే బాధ్యత నాకుందని ఆలోచించ లేకపోయాను. ఒక పువ్వు పూసింది. ఒక తుమ్మెద వ్రాలి మధువును గ్రోలి వెళ్ళిపోతుందనే వుద్దేశంతో నే వున్నాను.

రెండునెలలు గడిచిపోయాయి. నా కేదో సంబంధం చూశారంటే నెల్లూరు వెళ్ళవలసి వచ్చింది. అమ్మకు లక్షణాలు-నాన్నకు పిల్ల అభ్యసించిన సరి

రైన విద్య, ఆవిద్య యిచ్చిన వినయ సంస్కారాలు నాకు ఆమె వర్ణించలేని పసని అందం నచ్చటంవల్ల సంబంధం స్థిరమై పోయింది. ఆ వాలు కళ్ళు, పసిమి ఛాయతో మెరుస్తున్న మృదువైన శరీరము, కదులు తుంటే జారుతున్నట్లుండే ఆవడక ముత్యాలు రాల్చే ఆ దరహాసం—అక్షణం నుంచీ నా కింకో ధ్యాసలేదు!

నేను తిరిగి వచ్చాక మారిన మనిషి నవటంలో వంటమనిషి "ఏవయసుకు తగ్గసొంపు అవయసులో లేకపోతే బతుకు పెడదారులుపట్టాయంటారు ఇంటికి పెళ్ళాన్ని-నే చెప్పింది అమ్మకీ అయ్యకీ చెప్తావా బాబూ" అని అడిగింది. సంబంధం స్థిరమైనదని చెప్ప డానికి నా నోరు పెగల్లేదు. ఆ నెలరోజుల్లో వేలమెకు, వాళ్ళ వీధిలో వాళ్ళకీ యేవో వాదోపవాదాలు జరుగు తున్నాయని విన్నాను. అసలు విషయం బయట పడితే ఆకారకుడైన వాడి ప్రాణాలు నిలువునా తీస్తా రనికూడ విన్నాను. నాకింకో గత్యంతరం లేకపోయింది. నాకు మదరాసులో వుండే పలుకుబడిని వినియో గించి పెళ్ళి గ్రాములమీద బదలీ తెప్పించుకున్నాను.

ఇంకా ఒకగంటలో యిల్లు కదుల్తాననగా వంటమనిషి వీధిలోని పదిమంది నా బంగళా చుట్టు ముట్టారు. నాకు హోదావల్ల వచ్చే ధైర్యంతో "ఒకడిని కొట్టడానికి యింతమంది రావాలా? ఒక ఆఫీ సరు మీద లేనిపోని అనుమానాలతో మీరు యిలా పరుగెత్తుకొచ్చారు. నాకుతగ్గబలం నాకూవుంది. ఇక్కడనుంచి కేక వేశానంటే పోలీసులు తయారు. మీ అందరి చేతులకూ బేడీలు పడ్తాయి-జాగ్రత్త," అని హెచ్చరించినా అందులో పెద్దమీసాలు తిప్పు కుంటూ ఒకడు ముందుకొచ్చి "నివ్వు పెద్దోడివైతే పెద్దోడిలాగవుండు. అఫీసరు వైతే నీతిగావుండు. అన్యాయం సేసావు-నీకు సిక్షయేస్తాం!"

వాళ్ళు చేతులు సర్దుకుంటున్నారు. వంటమనిషి చప్పున ముందుకొచ్చి గట్టిగా "ఈ బాబు నేనుడి లాంటోడు. యీ బాబునేరం అంటే నేను నమ్మను. ఇలాంటి మంచిబాబు మీద మీరు సెయ్యేస్తే మీకు దేముడు బాగా సూడడు-వెళ్ళిపోండి-నామాట వినండి" అనగానే అందులో ఒక మొరటుమనిషి.

"నీ కూతురు గడ్డికొరికింది గానీ నివ్వు కాదే... అదీ కాదని సెప్పనీ...సల్లగ యెళిపోతాం!"

అంతలోనే వంటమనిషి కూతురును పిలిచి పంచ డానికి ఒకడు వెళ్ళాడు. ఈలోగా "అదివీడే అంటే ముక్కచెక్కలుగా కోసి యిక్కడే పాతిపెడ్దాం. పారిపోదామని చూశాడు..."—యిలా వ్యాఖ్యాని స్తున్న వాళ్ళమాటలువిని నా ప్రాణాలు సగంపోయాయ్.

మామ్మకూతురు వచ్చింది. ఒకసారి మెల్లగా తలెత్తి నా వేపుచూసింది. బహుశః నాముఖాన్న రక్తంలేకపోవటం గమనించిందేమో ఓక్షణంపోయాక :

"ఈ బాబుకేమీ తెలీదు"

ఈ జవాబువిని, ఆమెను నానాదుర్భాషలాడు కుంటూ వచ్చిన వాళ్ళు వెళ్ళిపోయారు.

ఇక స్వంత పట్నంలోపని. ఐశ్వర్యంతో పాటు అధికారం—ఊఁ అంటే సేవకులు ఆఁ అంటే సేవకులు. అమ్మ పట్ల కని వినియెరగనంత బ్రహ్మాండంగా నా పెళ్ళి జరిగింది. ఈ పెళ్ళితో రెండు పెద్ద సంపన్న గృహాలు ఒకటయ్యాయి. నా భార్య యింట్లో అడుగు పెట్టినతోడనే ఉద్యోగరీత్యా ఒకమెట్టు పైకి లేచాను. ఇంట్లో క్రొత్తకోడలు కొద్దిరోజుల్లోనే పాతబడి యింటి మహాలక్ష్మి అయిపోయింది. అన్ని శుభ లక్షణాలు కలిగి తనమంచితో అందరిచేతా జేజేలు అందుకోవటం మొదలుపెట్టింది. నేను పూర్తిగా ఆమెలో యేకమైపోయాను. ఆమెను విడిచిపెట్టి ఒక రోజు వుండటం కష్టమనిపించేది. ఈలోకంలో ఆమె కంటే ప్రియాతి ప్రియమైన దింకొకటిలేదు. జీవితం ఆనందం వెన్నెలలా గడిచిపోతోంది. ప్రజలచే ధర్మ ప్రభువని నేను, మహాలక్ష్మి అని మా ఆవిడ కొనియాడ బడుతున్నాం!

నాభార్య కాపరానికి వచ్చిన మూడోయేట బాబుపుట్టాడు. మా సంతోషానికి మేరలేదు. ఆబాబు అందచందాలు యెన్నోసార్లు నే పె తలమునా నేవాడిని. సరిగ్గా నెలరోజులనాటికి పోయాడు. ఆదుఃఖంనుంచి నాభార్య మళ్ళీ కడుపుపండేవరకూ తేరుకోలేదు. బాబుపుట్టిన నక్షత్రం మంచిదికాదని బాబే బ్రతికుంటే దంపతులలో యెవరికైనా గండం వుండేదని సిద్ధాంతులు చెప్పటంవల్ల నేను బాబుపోయినందుకు విచారించలేదు. బాబుపోయిన యేడాదికి నా సీతమ్మతల్లి పుట్టింది. నాతల్లిది నారూపే. అందరూ చాలా అదృష్టవంతురా లౌతుందనేవారు. నా సీతమ్మను యెంతో గారా

బంగారంగా పెంచాం. ఇందరు సేవకులున్నా రోజూ యెలాగో తీరుబడిచేసుకొని పిల్లను ఆడించేవాడిని; ఎదిగినకొద్దీ అది నాన్నపిల్ల అయ్యిందిగానీ అమ్మపిల్ల కాలేదు. నాన్నను విడిచిపెట్టి వుండలేకపోయేది.

సీతమ్మ పుట్టిన తరవాత నా భార్య ఆరోగ్యం కొంతవరకు దెబ్బతిన్నది. పెద్ద వైద్యులను పెట్టాను. తేరుకుంది. కానీ మరి సంతానం లేదు. సీతమ్మకు యెనిమిదేళ్ళ ప్రాయం వచ్చేసరికి నా భార్యకు పెద్ద జబ్బుచేసింది. శెలవుపెట్టి మరీ ఆమెకు సేవచేశాను. నాకు ఒకక్షణం విశ్రాంతి వుండేదికాదు. ఏమాత్రం దనో అతృత. ఏ కొద్ది తీరుబడిలోనూ ఆ ప్రతిబింబం నాతలలో తిరిగి ఆలోచనలను హద్దూ అదుపూ లేకండా తీసుకపోయేది—

ఆ రాత్రి... సరిగ్గా పంద్రెండుకు కొట్టింది. ఐనా నిద్దర రాలేదు. నా భార్య మంచంమీద తలదగ్గర ప్రక్కనే కూర్చున్నాను. ఆమె యేవో తెలివిలేని మాటలు అంటోంది. నా చేతిని తీసుకొని ఆమె నుదిటి మీద పెట్టుకుంది. డాక్టరు ప్రక్కగదిలో పడుకున్నాడు. చీకటి రాత్రి. బంగాళా చుట్టూ హోరుమంటూ ఫీంకారం వినిపిస్తోంది. ఒకోసారి యేదో భయంకరమైన అరుపు, మనసు ప్రళయం వచ్చి పడినట్లుగా భయంతో బితుకు బితుకు మంటోంది. గుండె జోరుగా కొట్టుకుంటోంది. అయినా నేను ఆక్షణంలో యీ లోకంలో నాకు ప్రియాతి ప్రియమైనది చెయ్యి జారిపోతుందని అనుకోలేదు.

ఒక గంట పోయాక తుఫాను తరవాత అలముకున్న ప్రశాంతతలా నిర్మలమైన నిశ్శబ్దం—నా భార్య కళ్లు తెరచింది—ఆమె కళ్లల్లోకి చూశాను. ఆ పెదవులపై చిన్న నవ్వు... మెల్లగా ఆ పెదవులు కదల నారంభించాయ్... "లోకంలో అవసరం లేకండా... ఏపనీ జరగదు! ఇప్పట్లో—నాకళ్లు మూయటానికీ—అవసరం కలిగిందేమో! మీరు లోకంకోసం బ్రతికే అవసరంకూడా వుందని... మరచిపోకండి!"

ఆమె ముఖం చూస్తుండగానే నా కళ్ళల్లో నీరు నిండుకున్నాయ్. ఆమె కళ్ళు క్రుంగిపోతూ క్రుంగిపోతూ మిగిలిన నీటిని బయటకు రాల్చాయ్. ఆ పెదవులు, ఆ చిరునగవుతోనే ఉండిపోయాయ్."

ఇంతవరకూ రమణయ్య చెప్పాక ఆ దృశ్యం యిప్పుడు కళ్లకు కట్టడంవలన కాబోలు దుఃఖం ముంచుకొచ్చి మాటాడలేకపోయాడు. కళ్లల్లో నీరు గిర్రున తిరిగిపోయాయి. కాస్సేపు పోయాక గద్గదస్వరంతో "నేను చాలా బలహీనుణ్ణి. నాభార్య ఆ రూపుతో నా దగ్గరనుంచి మాయమైపోగానే జీవితంమీద విరక్తి కలిగి అన్నపానాలమీద, వుద్యోగంమీద ఆసక్తి పోయింది. ఈ జీవితం అంతా మాయ అని యేదీ శాశ్వతంకాదని గ్రహించాను. ఏ అడవుల్లోకో, హిమాలయాలకో పోయి తపస్సు చేసుకుందామని అనుకున్నాను. రోజంతా యెడతెగని ఆ వేదన, దుఃఖంతో క్రుంగిపోయాను. నడుస్తున్న బస్సుమీదనుంచి గెంతాలని, పరుగెత్తుతున్న రైలు క్రింద తల దూర్చాలనిపించేది. నా కాళ్ళక్రింద వుండే నేల బీటలువేరి నేను కూలిపోయినట్లు; నేనో వెన్నముద్దలా అయి మీద కత్తిపడటానికి సిద్ధంగా వున్నట్లు—బాసుచేసిన దూదిలా యెగిరిపోతున్నట్లు-ఇలా యెన్నో విధాలుగా అయిపోయాను.

శీతాకాలం యింకా సరిగ్గా చొచ్చుకోలేదు. సాయంత్రం గాలివిసురులతో పెద్ద వర్షం కురుస్తోంది. బంగాళా కిటికీగుండా వీధిలోకి చూశాను. రోడ్డుమీద గేదెలు, దున్నపోతులు వర్షంలో తడుస్తున్నయ్. ఆ కదలని గేదెలు, పోతులవేపుచూసి బయటకు వచ్చాను. చలివేస్తోంది. నేను వర్షంలోనికి చొచ్చుకొని ఆ గేదెల దగ్గరగా వెళ్లి కూర్చోవటం అనుకోకుండానే జరిగింది.

ఇన్నాళ్ళూ పేరుకున్న దుఃఖాన్ని వెలుపలికి గట్టిగా యేడవటానికి వుపక్రమించాను. ఆ కొద్ది సేపట్లో ఒక పోతు అరచింది. నేనొక నరకంలో వున్నట్లు యీ యమధర్మరాజు నన్ను ప్రశ్నిస్తున్నట్లనిపించింది. ఆ అరుపు విన్నవెంటనే నాలో "ఇలా యేడుస్తున్నావు నువ్వు నీ భార్యతో నిజాన్ని కప్పకుండా మెసలావా?"

ఈ ప్రశ్న నన్నెంతో కలవరపెట్టసాగింది. ఈ కలవరం నా యేడుపును తగ్గించి "నువ్వే అలా మెసిలి వుంటే వంటమనిషి కూతురితో నీ సంబంధం చెప్పకుండా యెలా వుంచేవాడివి? నువ్వు నీ భార్యను మనసారా ప్రేమించావంటే యెలా నమ్ముమంటావ్?"

"అందులో యేముంది? తక్కువతరగతి మనిషి-నేను కాకపోతే యింకెవరయ్యేవారో?" అన్న నా సమాధానానికి పోతు నవ్వింది.

"యేముందంటావా? తక్కువ తరగతి మనిషా? డబ్బును చూశావు మనిషి విలువకట్టావు! యింతగా యెవరి కోసం విలపిస్తున్నావో ఆ భార్యను పెళ్ళాడటానికి తన జీవితం కొల్పుకొని ఆమె నీ ప్రాణాలు దక్కించిందని నీవు కొద్దిగానైనా కృతజ్ఞత చూపించావా? ఇందులో యేముందంటావు? నిద్రలోనుంచి మేలుకో—నిజం వేపు కళ్ళు త్రిప్పకు—నీ భార్యకే యీ విషయం తెలిసుంటే యేంచేసేది?"

"ఏంచేసేది...? జీవితం అంతా అనుమానాలతో నిండిపోయేది."

"అర్థం చేసుకోలేని భర్తవై యెందుకిలా కుమిలి పోతావు. ఆమె వంటమనిషి కూతురే మొదలని ఆమెను తీసుకవచ్చి మంచి చెష్టలు చూసేవరకు నీకు నిద్దర పట్టనిచ్చేదా?"

క్షణంలో నాకు వణుకు పట్టుకుంది. ఇంటికి పరుగెత్తాను. ఆ రాత్రంతా నాకు నిద్దరపట్టలేదు. ఆలోచనమీద ఆలోచనలు సవారీ చేస్తున్నాయి. నాలో యే అన్యాయం లేకపోతే నేనీ కష్టాల్లో చిక్కుకొనిపోవాలి? తెలతెలవారుతున్న కొద్దీ నేను పెనునిద్ర నుంచి మేల్కొన్నట్లయింది. ఏం చేద్దామన్నా నాలో యేదో పెనుగులాటతో శక్తి లేకుండా వుంది. అడుగువేస్తే నేను కూలిపోతున్నట్లున్నాను. ప్రకృతంతా నా కళ్ళయెదుట గిరగిర తిరుగుతూ తల తిరిగిపోతోంది-పగిలిపోతోం దనుకున్నాను.

ఆబాధ భరించలేకపోయాను. నన్ను ప్రతి క్షణం భార్యే ప్రశ్నిస్తున్నట్లనిపించేది. ఆమె చని పోతూ అన్నమాటలో నిజం నాకిప్పుడు స్ఫురించింది. నేను బ్రతికి నా పాపానికి బాధపడే అవసరం వుండ బట్టే ఆమె చిరంజీవి కాలేదు.

బయలుదేరాను. ఈ వేషంతో మళ్ళీ ఆమె యెదుటపడటం నాకిష్టం లేదు. ఆమె యెవరితోనో లేచిపోయి వుంటుంది. పిల్లలతోనూ పాపలతోనూ వున్నా దరిద్రంతో బాధపడుతూ వుంటుంది. ఆమె రక్షణకోసం యిదివరకే డబ్బు ముట్టచెప్పి వుంటే ఆర్థికంగా పునాది వేసేవాడిని. యిప్పుడు ఆమెకు నే నెవరికీ తెలియకుండా సహాయం చెయ్యాలి.

సాధువేషం వేసుకున్నాను. 'భిక్షాందేహి' అని ఆ పాకదగ్గరకు రాత్రి యెనిమిది దాటాక వెళ్ళాను. పాకలోపల చిన్న బుడ్డీదీపం వెలుగుతోంది. పిల్లలు పండుకున్నారు. లోనుంచే ఒక స్త్రీ "మేమే పస్తులున్నాంబాబూ...యెళ్ళండి" అన్నది. ఆ గొంతుక లానే వుంది. కానీ మనిషిని చూడాలి. మీ యింటి వెనక సరిగ్గా యీ రోజు సరుకు చెట్టు మొదట త్రవ్వితే లక్ష్మి ప్రసన్నమౌతుందని జోస్యం చెబుదామనుకున్నాను. ఆమె బయటకు రాలేదు. పోనీ కాసిన్ని మంచినీరు పోయమ్మా అని అడిగాను. ఆమె బయటకు రాగా నే వెన్నెల్లో చూశాను. ఆమె పోలిక లేమీ లేవు. వెంటనే "పదియేళ్ళ క్రితం కాశీ పోతూ యిలా వచ్చాం తల్లీ! ఈ యింటిలో ఒక తల్లీ కూతురూ వుండేవారు..."

"అయ్యో పాపం!..." అనగానే నేను అక్కడ కూర్చుండిపోయి "మా మంచి తల్లమ్మా... ఏమైంది?"

అయిల్లాలు గడపలో కూర్చొని చెప్పడానికి ఉపక్రమించింది. "ఆకూతురు యెక్కడో గడ్డితిన్నాదని అతల్లి యాతనపడిపోయి మందంపట్టింది. జాతోళ్ళు వెలివేశారు. మనమరాల్ని చూడకుండానే సచ్చిపోయింది. మనుమరాలంటే మనుమరాలు కాదు. మా రాజులయింట్లో పుట్టవలసిందిగానీ ఇలాంటి పాకల్లో మెసలాలిసింది కాదు. విధి విసంతా యీపిల్లని సూసాక ఆపాపం పాపిష్టి పెద్దింటోడే సేసాడని అనుకున్నారు. ఆడు దీని బతుకు నాశనం సేసి దూరదేశాలు యెల్లిపోయి పెళ్లి సేసికోని పిల్లా జెల్లాతోని హాయిగా బతుకుతున్నాడట! ఆపక్కని పిల్ల ఆడి రక్తానికి పుట్టిందికదా ఆడి కూతురౌతాదా, దాని కూతురౌతాదా? అయ్యో! సేసినాపాపం సేసినాను—దాన్ని సేరదీయకపోయినా నాకూతురని అభిమాన మేనా ఆడికి లేకపోనాది? ఆడు మనిషేనా? అడవిలో సింహంలాంటిదానికి పిల్లలని అభిమానం వుంటాది! దాన్ని యేలుకోమని అవలేదు. పిల్లబతికి ఒకింటి దవడానికేనా ఆదరువు చూపించాడు కాదు. ఇల్లు అమ్మేసింది—ఆపిల్లకి పాలుపాలకే—చెట్టుమీద పక్షిలాగ ఆ కూనని నీగడప నాగడపా తిప్పి తిప్పి యేడాదిపిల్లను సేసింది. తిండికి లేదు. ఒళ్ళు కప్పుకోడానికైనా బట్టలేదు. ఎందుకు మా రాజు మాయల్లో పడిపోనాది? కూడుబట్టా లేక కుమిలిపోనాది. నలుగుర్లోను అపకీర్తి తెచ్చుకుంది—ఎవరూ కనికరించలేదు. ఆ పుట్టించిన దేముడు కూడా కనికరించ

లేదు. పిల్ల బతకాలని మానం అమ్ముకున్నాది. వ్యాపారంలోకి దిగిపోయింది. అందులోకి దిగాక మనిషెంత కాలం దిట్టంగా వుంటాది? అందరూ దాని తల్లి మంచికీ దీనిచెడ్డకీ పోల్చి తిటారు. ఏ గడపా రొక్క నివ్వారు కాదు. జబ్బులతో వికారంగా తయారయిపోయి—రెండేళ్ళక్రిందటే చచ్చిపోయింది."

నేను ఆమె మాటలువిని అలా కూలబడిపోయాను. ఆమె మానం దాల్చిందని కొంతసేపటికి తెలుసుకొని "అకూతురేమైంది — ఎక్కడుంది చెప్పమ్మా" అని అడిగాను.

ఆమె నా ఆత్రుత గమనించి "అంత చక్కని పిల్ల—ఎవరైనా దగ్గరుంచుకో గలరు. కానీ ఆ తల్లి సంగతి తెలిసిన వాళ్లు యీ వూర్లో ఆ పిల్లను యెవరు సేరదీస్తారు? ఏదో పెద్దపట్నమట—పెద్దయితే ఆ పడుపు వృత్తిలో పెట్టుకుందామని ఒక షోకు కత్తె తీసుకుపోయింది! నూడు బాబూ? దానిగతి — ఆ పెద్దోడి కూతురు పడుపువృత్తిలో వయసు వచ్చాక దిగేటప్పుడు - వాడి భాగ్యభోగాలు వుండి యెందుకు? ఏదో జాతోణ్ణి కట్టుకుంటే అది నలుగురూ యేలెత్తి చూపించినట్లు హీనంగా చచ్చిపోవా?..."

అక్కడనుంచి బయలు దేరుతూ త్రోవలోనే మూర్ఛ పడిపోయినట్లయిపోయాను. ఉద్రేకోద్రేకాలు మనిషిని న్యాయాన్యాయ విచక్షణలేకుండా చేసేస్తాయి. నా చదువు నాకు బలమైన వ్యక్తిత్వాన్ని యివ్వలేదు. అంచేత నాలో ఆ రోజుల్లో దృఢమైన మనస్సు, స్వంతం మరచిపోయి అందరినీ ప్రేమించే స్థోమత లేకపోయింది. ఇంత జరిగాక నేను యిక జీవితం మీద ఆశపెట్టుకోవడ మెందుకని ఆత్మహత్య చేసుకోడానికి ప్రయత్నించాను. ఎన్ని సార్లు ప్రయత్నించినా నా భార్య చనిపోతూ అన్నమాటలే జ్ఞప్తికి వస్తున్నయ్. నేను బ్రతికే అవసరం యెందుకు కలిగిందీ కొన్నాళ్లు పోయాక గానీ నాకు అర్థంకాలేదు.

నా కూతురుకోసం వెతకడానికి ప్రారంభించాను. నాకు ఆమె జాడ తెలియలేదు. నా జీవితం నా కష్టం మీద వచ్చే ఫలంతోనూ మా నవసేవకు అంకితం చేస్తేగానీ నాకు ముందుగతి లేదు. ఆ ముఖ్య తీర్థయాత్రలు సేవిస్తూ కలకత్తా, బొంబాయి నగరాల్లోని పడుపువృత్తి పెట్టుకొనే వారుండే వీధుల్లోనికి వెళ్లాను. ఎక్కడైనా నాకూతురు అగుపడుతుందేమోనన్న భ్రాంతితో! వాళ్ల హీనపరిస్థితులు చూశాను, వాళ్ల చిరునవ్వు వెనక అగాధంలా వున్న బాధను చూడగలిగాను. వాళ్లందరిలోనూ నాకూతుర్ని చూశాను. అంతా నాబిడ్డలే! నాలో యీ పరివర్తన యెప్పుడు వచ్చిందో అప్పుడే అనుకున్నాను. నేను అసలైన విద్య లోకంలో మెసలి అనుభవించి అభ్యసించ గలుగుతున్నానని!

మీరంతా అడగొచ్చు — ఈ పాడుకొంపలో యెందుకున్నారని? కుష్ఠురోగం రావాలని యెందుకు కోరుకుంటున్నారని! నేను యెప్పుడైతే వాటిన్నను తెలుసుకున్నానో అప్పటినుంచీ నాకు వీలైనంత హెచ్చుగా హీనంగా బాధపడాలనేవుంది. నేను చేసిన పాపానికి ఫలితం అనుభవించకుండా వుండటానికి ప్రయత్నిస్తే యీ పాపాన్ని నేను మళ్లీ జన్మకు తీసుకపోయి అప్పుడు అనుభవించవలసివస్తుంది. మనకున్న అధికారాలని స్వలాభంకోసం దుర్వినియోగం చేసేవచ్చు. మనకున్నబలం దీనులమీద చూపించవచ్చు. చాటుగా మన ఆశలు, అబద్ధాలు అన్యాయాలతో ఫలింపచేసుకోవచ్చు! ఇవన్నీ యెవరూ వినరు, చూడరనుకోవటం పొరపాటు! దేవుడను లోకంయొక్క కళ్లూ చెవులూనూ! మనుషుల అంతరంగంలో యేంజరుగుతుందో కూడా ఆ కళ్లు చూస్తాయి, ఆ చెవులువింటాయ్!

కీ. శే. నండూరి సుబ్బారావు

తెన్నేటి సూరి

స్వైరవిహారుడు కవి; తన ఊహాశక్తితో జగత్తులో లేని ఏదో ఒక మహాసౌందర్యాన్ని ఎక్కడి నుంచో అంది పుచ్చుకుంటాడు. దాని సౌందర్య సౌరభాలను ముందు తాను అనుభవించి ఆనంద పారవశ్యంతో చిందులు త్రొక్కుతాడు. స్వైరవిహారుడు కావటంచేత ఆ అందాలమొలకను నలుగురికీ చూపించి, తన ఆనందాన్ని తనజాతికంతకూ పంచి పెట్టడానికి ముచ్చటపడి అంగలారుస్తాడు. ఈ ఆవేశాన్ని అవగతం చేసుకోలేని వారు కొందరు దీన్నంతా బాలిశ చాపల్యంక్రింద జమకట్టి పరిహాసమాడి, పరమ మూర్ఖంగా, చేతికందిన అలాంటి మధుపాత్రను బోర్లదోసుకుని విముఖులవటంకూడా కద్దు. అందుచేతనే, హేతువాదం సర్వాధికారం చెలాయిస్తున్న ఈ నాడు కూడా, 'ఎట్టి అనుభూతికైనా పూర్వజన్మ సుకృతం కొంత వుండాలి' అనే ప్రాచీనుల అభిప్రాయాన్ని కొట్టి పారేయటానికి వీలుకాకుండావుంది. అట్టి ఆనందానుభూతిని అనుభవించగలవారిని "సహృదయు"లంటున్నారు. ఆనందించలేనివారికి......మరో పేరేదీ వున్నట్టులేదు.

కావ్యరచనావేశం ఒకవిధంగా బాలిశచాపల్యం లాంటిదే ననిపించుకుంది. దొడ్లో వున్న ఊకబంతిచెట్టు ఎర్రనిపూవు పూస్తుంది. లౌకికజ్ఞానం ముదిరిన యింట్లో వున్న పెద్దలు దాని జననాన్ని లక్ష్యించరు. కాని అమాయకుడైన ఆ యింట్లోని కుర్రవాడుమాత్రం దాన్ని చూచి ఆనందంతో చిందులు త్రొక్కుతాడు. చప్పట్లు కొట్టి అక్కచెల్లెళ్లనూ, అన్నదమ్ములనూ, స్నేహితులనూ కేకవేసి దాన్ని వాళ్లకు చూపించి తన ఆనందంలో వాళ్లందరికీ భాగం పంచుతాడు. ఈ బ్రహ్మానందంలో, ఒకొక్కప్పుడు, విసుగులో వున్న పెద్దవాళ్లను పిల్చి మొట్టికాయలుకూడా తినటం కద్దు. కవికూడా, కావ్యరచనకు సంబంధించినంతవరకు, ఇదేవిధంగా సంచరించుతాడు. నిజానికి బాలిశచాపల్య సదృశమైనదే, ఐనా, ఇలాంటి ఆనందాన్ని ఊహించగల వ్యక్తి భగవంతునకూ, ప్రకృతికీ సన్నిహితుడుగా వుంటాడు. ప్రకృతి నుంచి సౌందర్యాన్నీ, భగవంతునినుంచి మహోన్నత గుణ సంపత్తినీ అందిపుచ్చుకుంటాడు. వీటితో తన జీవితాన్ని తేజోమయం చేసుకుని మానవ జీవితాలను తేజోమయం చేస్తాడు. అలాంటి పునీతజీవిని కవి అంటాం.

కీ. శే. నండూరి సుబ్బారావుగారు అలాంటిపునీత జీవి. తనభావనా పథాన, ప్రణయ సమ్మోహితమూ, సుఖస్వరూపమూ అయిన ఒక మనోజ్ఞ మిథునాన్ని దర్శించాడు. ఆ మిథునానికి ఆయన 'యెంకి-నాయుడుబావ'లని నామకరణం చేశాడు. ఇది—జీవితమంటే యేమిటో గుర్తెరిగి సుఖించే మిథునం; నిరాడంబరశీలము కలది. అమాయికమైనది. భగవంతుని యందు విశ్వాసము కలిగి తత్సాన్నిధ్య పవిత్ర వాతావరణమున వర్తించునది.

శ్రీ సుబ్బారావుగారు ఈ మిథునాన్ని కావ్యరూపంలో ద్యోతమానం చేయటానికి ఉపక్రమించినప్పుడు వారి వారి సంస్కృతులనుబట్టీ, వారి వారి ఊహాపోహలనుబట్టీ పలువురు పలువిధాలుగా వ్యాఖ్యానించారు. ఆయన గ్రామీణ ప్రణయాన్ని అభివర్ణించటానికి ప్రయత్నించుతున్నాడనీ తదనుయుక్తమైన గ్రామ్యభాషను వాడుతున్నారని అన్నారు. మాణిక్యంలాంటి కవితా ప్రపంచాన్ని మాదిగమంచంగా మార్చుతున్నాడని మరికొందరు దుమ్మెత్తిపోశారు.

నిజానికి యెంకి-నాయుడుబావల పాత్రలు గ్రామీణ పాత్రలా?—అంటే మెరటుమొద్దులా?—వాళ్లు మాట్లాడింది కటువైన గ్రామ్యమా? ఇలా అని విమర్శించేవారికి గ్రామీణ దంపతులలో ఎట్టి పరిచయమూ లేదనీ, వారు వ్యవహరించే భాషను వారెప్పుడూ విన లేదనీ ఖండితంగా చెప్పవలసివుంటుంది. గ్రామీణ దాంపత్యాలలో వుండే సంక్షోభం, నిష్ఠురత, వారిలో వుండే వాక్పారుష్యం ఏ అవధిని

వుంటుందో ప్రత్యక్షంగా గమనించినవా రెవరూ అలా అనరు.

శ్రీ సుబ్బారావుగారు ఊహించినది గ్రామీణ దాంపత్యమూ కాదు. ఆయన వాడింది గ్రామ్యభాషా కాదు. వ్యగ్రతాదూషితంకాని చల్లని దాంపత్యం; ఆ దాంపత్యాన్ని వ్యక్తం చెయ్యటానికి శ్రీ సుబ్బారావుగారు నిష్ఠురపదదూషితంకాని చల్లని ప్రసాద గుణంకల భాషను సృష్టించుకున్నారు; లేదా ఆ పాత్రలే వాటి భాష నవి సృష్టించుకున్నాయి.

'మాము కేతిరిమేక జగుపు గిరుపూ మాని
సెట్టుపుట్టా దాటి సేనులో సేనుంటె
మెల్లంగ వస్తాది నా యెంకి
సల్లంగ వస్తాది నా యెంకి'.

నాయుడుబావ హృదయంలో ప్రవేశించినట్టే ఇల్లా మెల్లగా చల్లగా రసికహృదయా లన్నిటిలోకీ ప్రవేశించింది 'వొయ్యార మొలికించుకూ'—యెంకి.

ఇట్టి అలౌకికమిథునాన్ని ఊహించటానికి సుబ్బారావుగారిని ప్రేరేచిన కారణాలేమై వుంటాయి అని ఆలోచించితే మనకు కొన్ని విషయాలు బోధపడ వచ్చు. శ్రీ సుబ్బారావుగారు మధ్యమ తరగతి పట్నవాసపు కుటుంబాలకు చెందినవారు. ఈ కుటుంబాలలో పెచ్చుపెరిగిన వ్యర్థాటోపమూ, కృత్రిమ జీవితము, తద్వారా సంక్షుభితములై ఛిద్రిత్నమైపోయిన దాంపత్య జీవితములూ—వీటిని చూచి శ్రీ సుబ్బారావుగారి అంతరంగంలో చికాకు జనించి ఉండవచ్చు. ఇట్టి ఛిద్రాలులేని దాంపత్య జీవితాన్ని ఊహించటానికి ఆయన హృదయం ఉవ్విళ్లూరి ఉండవచ్చు.

ఏది యేమైనా, ఆయన ఊహించిన ఈ మిథునం, జ్యోతిర్మిథునమై, వ్యర్థాటోప మహాంధకారకూపంలో క్షుభితములైపోతున్న ఆ క్షుద్రదాంపత్యాలను తేజోమయంచేసి సముద్ధరించటానికి సమర్థమైవుంది.

యెంకీ, నాయుడుబావా పరస్పరం ఒకర్నించి ఒకరు వాంఛించేవి—కట్నాలూ, కానుకలూ, నగలూ నాణాలూ, మేడలూ, మిద్దెలూ, రేడియోలూ, కార్లూ గుర్రపందేలకి డబ్బూ, కాటన్‌మార్కెట్టుకు పైసాలూ—ఇవ్వికాదు. వాళ్ళకు పరస్పరం కావలసినవి చల్లని హృదయాలు.

'సరుకులేమి కావాలె సంతన పిల్లా?'
"నువ్వు మరమమిడిసి మనసియ్యి నాయుడుబావా?"
"సక్కదనము కేమిత్తు సంతన పిల్లా?"
"నువ్వు
సల్లగుండు పొద్దాక నాయుడుబావా!"
"యేడనే నీ కాపురమూ రొల్లుతది పిల్లా?"
"నీ
నీడలోనె మేడ కడతా నాయుడుబావా!"

శ్రీ సుబ్బారావు, విద్యార్థిదశలో తాము న్యాయశాస్త్ర కళాశాలనుంచి ట్రాములో తమ మకాముకు తిరిగి వస్తూవుండగా ఈ యెంకిపాటలలోని తొలి గేయం, 'సండే గొంతుకలోన' అన్నది, దానంతటది గొంతులో హఠాత్తుగా మెదిలిందనీ దానిని మననంచేస్తూ ఇంటికి చేరేలోగా సంపూర్ణ గేయంగా రూపొందిందనీ, తొలిసంపుటి పీఠికలో వ్రాశారు. ఆనాడు హఠాత్తుగా ఆ గేయానికి రూపకల్పన జరిగినా, ఈ నూతన గేయకల్పనల వెనకనున్న విస్తృత వాతావరణాన్ని మనం విస్మరించటానికి వీల్లేదు.

ఆనాడు సాహిత్యరంగంలో ఆంధ్రదేశం నలుమూలల ఒక మహావేశం బయలుదేరింది. సాహిత్యరంగాన్ని ఒక నూత్నవిధానంలో చైతన్యవంతం చెయ్యాలనే తహతహ యువ విజ్ఞానవేత్తలందరిలోనూ బయలుదేరింది. ఆంగ్ల సారస్వత పరిచయమూ జాతీయోద్యమ ప్రభావమూ ఈ నూతనావేశం ప్రభవించటానికి కారణాలైనై. ఎవరికితోచిన విధంగా వారు స్వతంత్రించి క్రొత్తకోవలు త్రొక్కటానికి ప్రయత్నించారు. అట్టి ఆవేశమే ఈ యెంకిపాటలు ఆవిర్భవించటానికి గూడా కారణం. శ్రీ సుబ్బారావుగారు అంతవరకూ ఎట్టి రచనలూ చేయకపోయినా, ఆవేశపరులైన అట్టి రచయితల వాతావరణంలో మెసులుతున్నారు. బసవరాజు అప్పారావువంటి తద్యుగకర్తల సమావేశాల తర్జనభర్జనలలో పాల్గొంటున్నారు. ఈ వాతావరణంలో ఎంకి పాటలు ప్రభవిల్లినాయి.

కావ్యనిర్మాణవిషయమూ, శబ్దప్రయోగ విషయమూ, తెలిసినవా డెవడూ, గొల్లవాడు కాళిదాసై పోయినట్టు, సాహిత్య పరిచయమేమీ లేని సుబ్బారావు ట్రామ్‌బండిలో వస్తూ హఠాత్తుగా కవి అయిపోయాడనే మాటను ఎన్నడూ అంగీకరించడు. శ్రీ సుబ్బారావుగారి భావనావిధానం వెనుక,

ప్రాచ్య పాశ్చాత్య సాహిత్యరీతుల పరిచయం అనంతంగా కనుపించుతుంది. 'సహజ కవి' అనే పదానికి ఇటీవల కొందరు ఒక విచిత్రమైన నిర్వచనం చెప్పటం మొదలెట్టారు. కవిగావటానికి పాండిత్యం అక్కర లేదనీ, అమాంతం పుట్టుకతోనే కవిఅయి పుట్టేస్తాడనీ చెబుతున్నారు. ఈ చెత్త అభిప్రాయం కారణంగా ఈ వేళ అక్షరం ముక్క లేని ప్రతిబోడ్డూ తనని నవ్యకంతీ కవినంటూ బయలుదేరటానికి ఆస్కారం కలిగింది. శాస్త్రజ్ఞానంచేత ఆత్మవికాసం కలుగుతుంది. అట్టి ఆత్మవికాసంతో సమస్త జగత్తునూ తేలికగా అవగతం చేసుకో గల మహత్తరమైన శక్తి కలుగుతుంది, అట్టి శక్తివంతుడైన మహాపురుషుణ్ణి 'సహజకవి' అంటారు. మనలో ఒక్క మహాకవి పోతనామాత్యుని మాత్రమే 'సహజకవి' అంటున్నాం. పోతనకు అక్షరంముక్కలు రావనటం ఎంత అపచారంగా వుంటుంది. ఇంతకూ చెప్ప వచ్చిందేమంటే, మహాపండితుడైనా కవిగా ప్రతిభావంతుడు కాలేకపోవచ్చు; కాని కవిగా ప్రతిభావంతుడు కావటానికి విశేషమైన పాండిత్యం అవసరం.

'ఎంకి వస్తాదాని యెదురూగ నేపోయి
గట్టుమీదా దాని కంటె కాపడగానె
కాలు కదిపాలేరు నా యెంకి
కరిగి నీరౌతాది నా యెంకి'

* * *

యెన్నెలంతా మేసి యేరు నెమరేసింది

* * *

ఈ భావచిత్రాలను నిర్మించిన కవికి, భావుకులైన యెంతమంది మహాకవుల బలం వెనుక వున్నదో ఎవరు గమనించలేరు!

'ముత్యాలపేరు' అన్న ఈ కావ్యంలో విభ్రమం గొలిపే ఈ భావనను తిలకించండి! ఇది గ్రామీణ శృంగారమనీ, వ్యుత్పత్తిహీనుడైన కవి వ్రాశాడనీ అంటే ఎంత హాస్యాస్పదంగా వుంటుంది.

—ముత్యాల పేరు—

అద్దములో నా రాజ అంత నీరూపు!
ఇంతిముత్తెములోన ఇరికె నేలాగు?—

ఇన్ని పొంకాలున్న యెంకివే నీవు!
ఇంత నా గుండెలో ఇమిడిపోలేదా?

నోమూపె, నోరూపె, నోవన్నెరాజా
ఇన్నింట నోపాలె యెటు చెదిరినాదో?

మాటలో, మనసులో, మంచిలో—యెంకి!
సాగను నీవోపాలె అగపడవ నాకూ?

అటుతిరగ విటుమసల
వానరము మేలో!
అణిముత్తెములోన
ఆడిపోతావే!

కనుకల్లె, సిమకల్లె కూకుండె యెంకి
కనబడక మనసులో గంతు లేయవటే.

ప్రియునికోసం, ఎంకి అన్వేషణ పరమాత్మునికోసం జీవుని అన్వేషణవలె ఎంతో ఉదాత్తమైన స్థాయిలో మధురవిహ్వల హృదయాన్ని ద్యోతమానం చేస్తోంది. 'మధుర భక్తి మధుర భక్తి' అని డప్పులు చరిచే ఏ పదకర్త ఇట్టి ఉదాత్త భావనాస్థితిని అందుకో గలిగాడు? పోతన తరువాత మరొకరికెవరికీ ఇట్టి భావావేశం కైవసం కాలేదంటే ఇందులో అతిశయోక్తి లేదు.

I

'ఈ రేతి రొక్కతెవు యే మిచ్చినావే?'
'ఆకు నే నిక్కడే అడిసానమ్మా!'
'యేటి సురగలకేసి యేటి సూశేవే?'
'మావోడి మనసట్టె మరుగతాదమ్మా!'
'సెంద్రవొంకలో యేమి సిత్రమున్నాదే?'
'వొంకపోగానె మావోడి స్తెనమ్మా!'

II

ఉత్తమా ఇల్లాల నోయీ!
నన్ను సుగుపెడితే లోపబోయీ!
నిదురలో నినుసూసి సెదరెసేపో మనసు!
పొరుగువారంత నా సరస కురికారంట!
ఉత్తమా యిల్లాల నోయీ!...
'ఏలనే నవ్వ'ంట! 'ఏకు పేలో' యంట!
పదిమంది—అయింత పగలబడినారంట!
ఉత్తమా యిల్లాలనోయీ!...
గాలెంటవోయమ్మ! దూరెంటవోయమ్మ!
ఇరుగు పొరుగోరంత యిరగబడినారంట!
ఉత్తమా యిల్లాలనోయీ!...
యీ పూది వొకతెట్టె! ఈ పింకొకటితెట్టె!
నీలుపిలికేవొకతె! నిలిసి సూసేవొకతె!
ఉత్తమా యిల్లాలనోయీ...
పాటునుండే యెంకి పబకు రాకేశావ?
పదిమంది నోళ్ళలో పడమంట రాశావ?
ఉత్తమాయిల్లాల నోయి!...

III

సుక్కాక్క డున్నాదొ సూడవే చెల్లీ!
బారెడైనా కొండపైకి పాగిందేమి!
సుక్కాక్కడున్నాదొ సూడవే చెల్లీ!...
తామునిలిపిన గడువు
దాటిపోనే లేదు—

కాలుసేతులు పక్క
కంటుకొని పోనాయి!
సుక్కెక్కడున్నాదో సూడవే చెల్లీ...
సుక్కతో నే కొంచ
లెక్కెట్టుతున్నాను—
మబ్బో, మనిసో కొండ
మలుపు పరకాయించి!
సుక్కెక్కడున్నాదో సూడవే చెల్లీ...

నోకటొకటిగా మెట్లు
నోడిగి దిగిరావాలి—
తోట రొమలపల గలగ
లేటో యినసీవమ్మ!
సుక్కెక్కడున్నాదో...

నా సొగసు వన్నెన
సూసుకో నీడమ్మ—
ఆవు మెళ్ళో మువ్వ
లట్టమోగిన వేడె!
సుక్కెక్కడున్నాదో...

ఈ మధుర గీతికలను ఇలా ఉదాహరించుకొంటూ పోతే తీయనీటికి చేప యెక్కినట్టు గ్రంథం ఆదినుంచి చివరిదాకా దర్పణం చెయ్యాలనే పిస్తుంది.

శ్రీ సుబ్బారావుగారు యీ పాటలు ఆషామాషీగా వ్రాసినవి కావు. మనస జలధిని మథించి ఈ అమూల్య మణిజాలాన్ని వెలికి దెచ్చారు. అమూల్య పద జాలంలో పొదిగి వాటికి వన్నె తెచ్చారు.

శబ్ద స్వభావాన్ని గుర్తెరుగ లేనివాడు ఎంతటి పండితుడైనా కవిగా రాణించడు. శబ్దానుభవం విశేష గ్రంథ పరిచయంవల్ల గాని యేర్పడదు. శబ్దశక్తిని అవగతం చేసుకున్న వ్యక్తికి రసానందం కరతలామలకం. శబ్దానుభూతిలేని మానవుడు నిజంగా దురదృష్టవంతుడు.

శబ్ద ప్రయోగంలో శ్రీ సుబ్బారావుగారికి గల ప్రతిభ అజేయమైనది. అందుచేతనే ఆయనకు వ్యతిరేకంగా అంతదుమారం చెలరేగినా దాన్ని అధిగమించి రసిక ప్రపంచాన్ని యావత్తూ తనవైపు మొగ్గించుకో గలిగారు.

'నన్ను తలుసుకు యెంకి కన్ను మూయాలి!
కనుబొమ్మ సూడాలి!
కరిగి పోవాలి'

* * *

మెళ్లో పూసలపేరు,
తల్లో పూవులసేరు,
కళ్లెత్తితే నాలు
కనకాబిసేకాలు!—

* * *

పచ్చన్ని సేలోకి పండు యెన్నెల్లోన
నీలి సీరాగట్టి నీటుగొస్తావుంటె
నోయెయ్యర మెలికించు నా యెంకి!
నోవలచ్చి మనిపించు నా యెంకి!

పై పదజాలాన్ని పరిశీలించితే శ్రీ సుబ్బారావుగారు పద పదాన్నీ ఎలా సానదీర్చిన వజ్రంగా, ఎంత పాకంగా తయారుచేసి అందించుతారో మనకు బోధపడుతుంది. ఇదంతా గ్రామ్యమని కొట్టిపారేయ జూచే అరసికుల మాటకేమిగాని—శబ్ద ప్రయోగంలో యిలాంటి జాగ్రత్త యీనాడు ఎందరు కవులలో వుంది!

శ్రీ సుబ్బారావుగారు ఈ నూత్నపథాన కావ్య నిర్మాణానికి ఉపక్రమించిన తొలిరోజులలో ఆయన మీద అనంతమైన దుమారం లేచింది. ఆయనతో పాటు ఈ పాటలను తొలిగా ఆవిష్కరించి ఆంధ్ర రసికులకు అందజేయడానికి పూనుకున్న 'భారతి' కూడా కొంతకొంత పండితుల ఈ సడింపులు తినవలసి వచ్చింది. అయినా సుబ్బారావుగారు వెనుకాడలేదు. గభీరమైన అభినివేశంతో ముందుకు సాగారు:

'సాటేలా? నీకు మాటేలా?
సిన్నతన మేలా? సిగ్గేలా?
ఆ సీమ యీ సీమ అంద రందాలు
తిన్నంగ నిను సూసి దిద్దుకొంటారు!
సాటేలా?...

ముందు మన పాపట్లో
కింద దిగనీరు!
యెంకితో వంటారు
యెత్తుకుంటారు! సాటేలా?...
యెంకొక్క దేవతై
యెలిసె వంటారు —
యింటింట పెడతారు
యెంకి నీ పేరు'

అని సాహసోపేతుడై ముందుకుసాగి విజయాన్ని చేపట్టారు. లతాపుష్ప పరిశోభితమైన ఆంధ్ర సాహిత్యపు తామరకొలను సోపానాలమీద ప్రణయ సమ్మోహితులై సరసాలాడుకుంటూ కూర్చున్న ఎంకి-నాయుడుబావలు మనకు సర్వదా కనుపించుతూ వుంటారు. 'యెంకి సరసాలాడ జంకుతావుంటె, మాటీ మాడక కన్ను మూసి తెరుస్తా' గోవుమాలచ్చిమి కూడా ప్రక్కనే దర్శనమిస్తుంది.—

కాని...ఇంత చేసి సుబ్బారావుగారు మనం దర్ని విడిచిపెట్టేసి, ఈ లోకం నుంచి వెళ్లిపోయారనే మాట గుప్పున జ్ఞాపకం రాగానే కనుపులో కొండంత దుఃఖం ముంచుకొస్తుంది.

ఛాందసులు

శ్రీ పమిడిముక్కల లక్ష్మణరావు

పాత్రలు: డాక్టరు, శకుంతల, తండ్రి, దాసు, పంకజం.

* * ప్రక్కగదిలో రేడియో మెల్లగా పాడుతూవుంటుంది..."గృహమేకదా స్వర్గసీమా! చిన్నారి పొన్నారి..." అని; భార్య పేముకుర్చీలో కూర్చుని భర్తకు స్వెటర్ అల్లుతూ వుంటుంది. భర్త బిస్కట్లు నంజుకుంటూ కాఫీ తాగుతూవుంటాడు.

భార్య : ఈపాట విన్నప్పుడల్లా నాకు చెడ్డ చిరాకేసుకొస్తుంది.

భర్త : ఎందుకో?

భా : పిల్లలుంటేనేనా ఇల్లు స్వర్గసీమ? పిల్లలు లేకుండా మనం హాయిగా బ్రతకటంలేదూ?

భ : నిన్న ఇంటికిరావటం కొస్త ఆలస్యమైతే ఏమన్నావ్?

భా : ఏమన్నానేమిటి?

భ : "మీరు రావటం ఒక్క నిమిషం ఆలస్యమైతే గడియారంవైపు చూడలేక కళ్ళు కాయలు కాచిపోతున్నాయ్" అన్నావు. యేం అన్నావా?

భా : ఊఁ అంటే?

భ : పిల్లలుంటే అలా అనేదానివా?

భా : ఎలా అనేదాన్నో అదికూడా మీరే సెలవీయండి.

భ : "అప్పుడే ఐదు అయిందిటండీ? అబ్బ! పెద్దవాడు మీ రెళ్ళినదగ్గిరనుంచీ ఒకటే అల్లరి. చిన్నవాడు షరే షరి, పోయి వడివీధిలో కూర్చుంటాడు. వచ్చే కార్లూ, పోయేబస్లూ పట్టుకోలేక నా ప్రాణం విసిగిపోతోంది. ఇక మూడోవాడు...

భా : ఇకచాలు ఆపండి. అలు లేదు చూలు లేదు కొడుకుపేరు సోమలింగంట ... అన్నట్టు జ్ఞాపకంచేశారు. నిన్న సాయంత్రం ఇంటికి రావటం ఆలస్యం ఎందుకైందంటే చెప్పనే లేదు.

భ : అప్పుడే చెప్పావనుకొంటాను.

భా : నిజం చెప్పకుండా ఏదో మాటల్లో పెట్టి మరిపించారు.

భ : ఆ ఏముందీ—మామూలుగా ఆస్పత్రుల్లో జరిగే సంగతులే—ఒకళ్ళు పోతారు. మరొకరు వస్తారు.

భా : రోగులా?

భ : అబ్బే—డాక్టర్లే.

భా : పోయినవా రెవరు?

భ : మిస్ ఛార్లెట్ అని ఒక లేడీడాక్టరు లేదూ? ఆవిడకు బదిలీ అయింది.

భా : మరి వచ్చిందెవరు?

భ : క్రొత్తగా యమ్. బి. ప్యాసయి వచ్చింది ఇంకో మిస్సు; పార్టీ జరిగింది. అందువల్లనే ఇంటికిరావటం కొస్త ఆలస్యమయింది. ఇదీ వడ్లగింజలో బియ్యపుగింజ.

భా : ఈ కాస్తా అప్పుడే చెబితే మళ్ళీ అడిగే దాన్నికాదుగా.

---

* ఆంధ్ర విశ్వకళాపరిష దాంధ్రభాషాసమితి నిర్వహించిన ఏకాంకికల పోటీలో ప్రథమ బహుమతి నందుకొన్న నాటిక. (1956—57)

భ : మధ్యాహ్నంపూట ఊరికే కూర్చుని యిదే ఆలోచిస్తూవుంటావ్ కాబోలు.

భా : ఈమధ్య పగలు అసలు మరీతోచక చచ్చిపోతున్నాను.

భ : ఏవైనా పత్రికలు చదువుకో.

భా : ఎంతసేపని చదవను?

భ : మరి శాతాఖానీకి దాసుగారిభార్య రావటం లేదూ?

భా : నెలరోజులనుంచీ ఆవిడ వూళ్ళోలేదు.

భ : ఏం? తీర్థయాత్రకు వెళ్ళిందా?

భా : పుట్టింటికి వెళ్ళింది.

భ : మరి ఆయన భోజనం?

భా : హోటలునుంచి కారియరు తెప్పించుకుంటూన్నారు.

భ : ఆడవాళ్లలో ఇదేచిక్కు. ఏడాది కాపురం చేస్తారో లేదో, దొరలు వేసవికాలం ఊటీకి వెళ్ళినట్టు పుట్టింట్లో రెండునెల్లు మకాం చేసిరావాలి.

భా : రెణ్ణెల్లుకాదు, ఆవిడింకా నాలుగునెలలన్నా వుండాలి.

భ : అదేం? ఓ ... సరే. చెప్పబోకు ... అర్థమైంది—"అర్థమైంది—పూః ఇదింకోటి.

భా : అబ్బ వూరుకోండి! మీకు హాస్యంగానే వుంటుంది మా అవస్థ చూస్తుంటే.

భ : అవస్తేం?

భా : కాదుమరి? ఒక్కటి చెప్తాను మీకు కోపం రాదంటే.

భ : వచ్చేదైతే నువ్వు చెప్పవని నాకు తెలుసుగా.

భా : మీ మగాళ్లు భార్యలు కష్టాలు పడుతూంటే నవ్వుతారు. ఆవిడ రేపు బిడ్డను కనలేక పుట్టింట్లో అవస్థపడుతూందనుకోండి. ఇక్కడ ఆదాసుగారు తను ఇవాళ్ళో రేపో తండ్రిని కాబోతున్నానని నలుగురికీ చెప్పుకొని టీ పార్టీలు చేసుకొంటారు.

భ : ఏం తప్పా?

భా : ఆ దాసుగారే ఆవిడ కాస్త సింగారించుకొని ఆయన ఆఫీసునుండి ఎప్పుడొస్తారా అని అలా వీధిలో కాసేపు నిల్చుని చూస్తుంటే...

భ : ఊః ఆగావేం?

భా : "వీధి క్కాపలా వేశావే. తప్పించుకుపోతాననుకున్నావా?" అని పైకినవ్వుతూనే సందు నాలుగుమూల్లా చూస్తారు.

భ : బాగుబాగు! నువ్వసలు బి. ఎ. దాకా చదవాల్సింది, మీ నాన్నగారు ఇంటరుతోనే ఆపేశారుగాని...

భా : పోనీ ఆ బి. ఎ. మీరు చెప్పించరాదూ?

భ : నువ్వు చదువుకొంటానంటే రేపీపాటికి తీసికెళ్ళి కాలేజీలో పడేస్తాను.

భా : ఇక్కడుంటే చదువుసాగదు. హాస్టల్లోవుండి రెండేళ్లూ చదువుతాను.

భ : రెండేళ్లే!...కానిని మంచినీళ్లందుకో.

భా : రెండేళ్లేగా ... ఆరేళ్లుమీరు డాక్టరుకోర్సు చదవలేదూ?

భ : రెండేళ్లంటే ఇరువయినాలుగు నెలలు, అంటే

భా : 720 రోజులు. సరేనా. మరి నేను అంత ఆలస్యంగా వచ్చారేమని అడిగినందుకే ఇన్ని శాస్త్రాలుచెప్పారే. ఏదన్నా తనదాకా వస్తేగాని తెలిసిరాదుట.

[రేడియోలో ఒకామె త్యాగరాయకీర్తన పాడుతూవుంటుంది. దాసు ప్రవేశిస్తాడు]

దాసు : హల్లో. గుడీవినింగ్ డాక్టర్!

[శకుంతల లోపలికి వెళ్తుంది]

డాక్టరు : రండి దాసుగారూ! చాలారోజులయింది మనం కలుసుకొని. ఇరుగుపొరుగు వారమైనా మనం పొరుగూరి వాళ్ల క్రిందే లెఖ్క.

దాసు : ఏదండీ ఈమధ్య బొత్తిగా తీరికవుండటం లేదు. పగలు భోజనంకూడా రేడియోస్టేషనుకే తెప్పించుకుంటున్నాను. రాత్రి ఏ పన్నెండింటికో ఇంటికివచ్చి మళ్లీ ప్రొద్దునే వెళ్ళిపోతున్నాను.

[శకుంతల లోపలినుండి కాఫీ తెస్తుంది. వస్తూ రేడియో ఆపివస్తుంది.]

దాసు : నమస్కారమండీ.

శ : నమస్కారమండీ. కాఫీ పుచ్చుకోండి.

దా : (తీసుకొంటూ) థాంక్స్.

శ : అక్కయ్యగారు ఖులాసాగా వున్నట్లు ఉత్తరం వచ్చిందా?

దా : మొన్ననే వచ్చింది. ఖులాసాయేనట. మిమ్మల్ని అడిగానని చెప్పమంది.

శ : ఆవిడ వూరెళ్లినదగ్గర్నుంచి నాకు పొద్దు పోవటంలేదు. ఆవిడుంటే ఏదో ఆడుతూ పాడుతూ కాలక్షేపం చేసేవాళ్లము.

దా : ఆడుతూ పాడుతూ అంటే గుర్తొచ్చింది. ఇప్పుడు నేను ఇంట్లోకివస్తూ రేడియోపాట విని మీరేపాడుతున్నారనుకొన్నాను.

శ : ఎలా అనుకున్నారు?

దా : మీకు సంగీతమంటే చాలాఇష్టమనీ, చక్కగా పాడతారనీ మా శ్రీమతి అంటూ వుండేది. కాపురంచేసుకొంటూ ఇంకా సంగీతం సాధకం చేస్తున్న మీలాంటివారు చాలాఅరుదు. అందుకు ముఖ్యంగా డాక్టరు గారిని అభినందించాలి.

శ : కాపురానికొచ్చాక నేర్చుకొన్నది కాదు లెండి. మానాన్నగారు నా తొమ్మిదో ఏటినుంచే నాకు సంగీతం చెప్పించారు.

దా : అలానా. చాలా సంతోషమైన విషయం. ఆ అభ్యాసం ఒక్క అరవవాళ్లల్లోనే చూశాను. ఆడపిల్లకు ఆరోసంవత్సరం రావటంతోనే శాస్త్రీయమైన సంగీతమో, నృత్యమో నేర్పిస్తారు. ఆశ్రద్ధ మన తెలుగు వాళ్లల్లో మీ నాన్నగారిలాంటివారికి ఏకొద్ది మందికోతప్ప అందరికీలేదు.

శ : లేదండీ. ఇప్పుడిప్పుడు మనవాళ్లల్లోకూడ సంగీతం అదీ చక్కగానే చెప్పిస్తున్నారు.

డాక్టరు : అవీ పెళ్లి సంగీతాలులెండి దాసుగారూ. పిల్లకు అమూడుముళ్లూ పడేవరకూ నాలుగు జంటస్వరాలూ, ఒకటోరెండో త్యాగరాయ కీర్తనలు నేర్పించి తాంబూలాలు పుచ్చుకొన్న మర్నాడే మానిపిస్తారు.

శ : ఎలాగోకష్టపడి సంగీతం నేర్చుకుంటేమాత్రం దానివల్ల ప్రయోజన మేముంటుంది దాసు గారూ? ఎన్నివిద్యలు నేర్చినా ఆడదానికి వంటచెయ్యటం తప్పదుగదా?

దా : అలాఅనకండి. విద్య నేర్చుకొన్నంతమాత్రాన అది సార్థకంగాదు. దానిని ఉపయోగంలోకి తీసుకొనిరావటంవల్లనే అది రాణిస్తుంది. ఉదాహరణకు మీసంగతే చెప్తాను. అంత చిన్నవయస్సునుంచీ సంగీతం నేర్చుకొని దానివల్ల ఏమి సాధించారు చెప్పండి.

శ : అందుకని సంసారాలు చేసుకొంటున్న వాళ్లము ఊరూరా తిరిగి కచేరీలు చెయ్యటానికి వీలుంటుందా దాసుగారూ?

దా : ఊరూరా తిరగఖ్ఖర్లేదు. ఒక్క చిన్న ప్రశ్న అడుగుతాను మీకు కోపంరాదంటే— ఈ పట్టణంలో ఇన్ని సంగీతసభలు జరిగాయి. ఎంతోమంది విద్వాంసులొచ్చి పాల్గొన్నారు—ఒక్కసభలో వచ్చి మీపాండిత్యం చూపారా? పోనీ పదుగుర్లో పాడటము సిగ్గయితే కనీసం మా రేడియోలో ఒక్క కార్యక్రమంలోనైనా పాల్గొన్నారా చెప్పండి? మొన్నీ మధ్యనే శ్రోతలకోసం రేడియో వారము జరిపాము. ఎన్ని కార్యక్రమాలు! ఎంతమంది పాల్గొన్నారు—అది కేవలము మీ తప్పే కాదనుకోండి—డాక్టరుగారి కేమన్నా అభ్యంతరము వుండవచ్చు.

డాక్టరు : ఉరుము ఉరిమి మంగలంమీద పడ్డట్టు మధ్య నన్ను దోషిగా చేశారే. ఆవిడ విశ్వాసంటే నేను కాదంటానా? సంగీతం అంటే ఆవిడ కంత సరదా అనే—దానివల్ల ప్రతిసారీ నాకు డబ్బు దురద వదిలినా—ప్రతి గాన సభకూ హాజరై, ముందుసీట్లలో కూర్చుంటాము. పైగా మా శకూ కాలక్షేపం కోసం కొత్తగా రేడియోకూడ కొన్నాము. చూశారా దాసుగారూ! శకూ! వెళ్ళి రేడియో ట్యూను చేసిరా. దాసుగారు కాసేపు వింటారు.

[శకుంతల రేడియో ట్యూనుచేసి వస్తుంది. రేడియోలో...]

ఒకకంఠం: ఆడది ఇల్లుకదిలి బయటకు అడుగు పెట్టటమే చాలామంది మొగాళ్లకు యిష్టముండదండీ. అలాంటప్పుడు కచేరీలు చెయ్యటమంటే వాళ్లదృష్టిలో అదేదో నీచమైన పని.

రెండో కంఠం: మీ శ్రీమతి చెప్పినదానితో మీరు ఏకీభ విస్తారా రావుగారూ?

రావు : అది గిట్టకపోవడం కాదనుకోండి. నాకు మటుకు నాకాపని ఇష్టమే. కానీ...మా అమ్మా, నాన్న మాత్రం కాస్త ఛాందసు ల్లెండి. వాళ్లకిది తెలిస్తే...

రెండో కంఠం: తెలిస్తే ఏం చేస్తారండీ? ఇదేం కాని పనా?

రావు : కాదనుకోండి. వాళ్లు కాస్త పూర్వకాలపు వాళ్లు...

శకుంతల: ఏదో నాటికలా వుందే, అచ్చం మనం మాట్లాడుకున్నట్లే వుంది.

దాసు : "ఛాందసులు" అని విజయవాడనుండి ఈ నాటిక ప్రసారమౌతోంది.

డాక్టరు : చాలా తమాషాగా వుంది. వాళ్ళూ మనం మాట్లాడుకొంటూంటే మాట్లాడుకోవడము ఆశ్చర్యం కాదూ?

దాసు : దీన్నే 'కోయిన్సిడెన్స్' అంటారు. గాంధి గారిలాంటి మనిషి ఐర్లండులో వున్నాట్ట.

డాక్టరు: పదండి దాసుగారూ. రేడియో రూములో కూర్చుని కాసేపు ఆనాటిక విందాము రండి. ఇవాళ మనిద్దరికీ సెలవేగా.

[ముగ్గురూ లోపలి గదిలోకి వెళ్తారు. రేడియోలో కలవరం వినిపిస్తుంది. తెర పడి పోతుంది.]

2

* * తెర లేచేసరికి పుష్‌బటన్ నొక్కినట్లు బైటనుండి వినిపిస్తుంది. శకుంతల స్టేజిమీదుగా బైటికి వెళ్ళి తలుపు తీస్తుంది.

శకుంతల: (తలుపు తీస్తూ) ఎవరూ?

స్త్రీకంఠం: (బైటనుంచే) డాక్టరు రాఘవేంద్ర రావు గారు వుండేది ఇక్కడే కదండీ?

శకుంతల: అవును. లోపలికి రండి.

[హైహీల్డు షూస్ తొడుక్కొని అందంగా నాజూగ్గా అతిఆధునికంగా వున్న ఓయువతి చేతిలో హేండ్‌బ్యాగ్ విలాసంగా తిప్పుతూ ప్రవేశిస్తుంది.]

ఆమె : డాక్టరుగారు లోపల వున్నారా అండీ?

శకుంతల: ఆ! వున్నారు. కూర్చోండి. మీ పేరు...

[డాక్టరు రావు, రామదాసు లోపలినుండి బైటికి వస్తారు.]

రావు : హల్లో మిస్ పంకజ! ఏమిటిలా వచ్చారు. (రామదాసు వంక, శకుంతలవంక చూస్తూ) ఈమె మిస్ పంకజ. క్రొత్తగా హాస్పిటల్ లో డాక్టరుగా పోస్ట్ అయ్యారు. (దాసు వంక చూపిస్తూ) ఈయన మా నైబర్ రామదాసుగారు-రేడియో స్టేషనులో పనిచేస్తారు.

రామ : నమస్కారం.

పంకజ : నమస్కారం.

రావు : ఈమె నా భార్య—శకుంతల.

పంకజ : నమస్కారం శకుంతలా దేవిగారూ.

శకు : నమస్కారమండి. కూర్చోండి.

[అందరూ సోఫాలమీద కూర్చుంటారు.]

రామ : మీ రెన్నాళ్లయింది ఈ వూరు వచ్చి.

పంకజ : మొన్ననే చార్జీ పుచ్చుకొన్నాను. నాకీ వూరు చాలా క్రొత్తగా వుంది. తెలిసినవాళ్లెవరూ లేరు. కాలం గడవక చచ్చిపోతున్నాను.

శకు : మొన్న వచ్చారో లేదో అప్పుడే అలా అనుకొంటున్నారు.

రామ : ఏదన్నా క్లబ్బుకి వెళ్ళకపోయారా?

పంకజ : నాకీ క్లబ్బులంటే ఇష్టంలేదండి. ఏవో పుస్తకాలూ, సినిమాలూ తప్ప మరే వ్యాసంగాలూ లేవు.

శకు : మీకు నవలలు చదవడమంటే చాలా సరదాలా వుంది.

పంకజ : అవును. మీకు?

శకు : నాకు సంగీతమంటే చాలా మక్కువ.

రామ : శకుంతలాదేవి చాలా బాగా పాడుతారు.

పంకజ : ఓ! అలాగా! అయితే డాక్టరుగారికి మంచి కాలక్షేపమే.

రావు : (నవ్వుతూ) అందుకనే రేడియో కొన్నాను.

పంకజ : మీ దగ్గరేమున్నా కొనన్ డైల్ పుస్తకా లుంటే పంపండి డాక్టర్. చదివిస్తాను.

రావు : ఓ తప్పకుండా - వుండాలి. చూసి పంపుతాను.

పంకజ : అయితే మా బోయ్‌ని పంపుతాను. ఇక్కడి గాలి చాలా బావుంది. మంచి వాతావరణం. వస్తాను డాక్టర్. ఏవన్నా పిక్చరుకు వెళ్తాను. (కొంచం ముందు కెళ్ళి మళ్ళీ వెనక్కి తిరిగి) అన్నట్టు మరిచాను. మంచి పిక్చర్సు ఏం వున్నాయండీ?

రామ : "షి స్టూప్స్ టు కాంకర్" వుంది.

పంకజ : బి. సి. నాటిది.

రావు : "డిసైర్" ఆడు తున్నట్లుంది.

పంకజ : క్రైమ్ పిక్చర్సు ఏమీ లేవూ? సరే లెండి నేను కనుక్కుంటాను. వస్తా.

[వెళ్లిపోతుంది]

రామ : ఈవిడ కొంచం తమాషా మనిషిలా వుందే.

రావు : ఏం అలా అన్నారు?

రామ : క్లబ్బులంటే పడదు. ఎవరూ స్నేహితుల్లేరట' పుస్తకాలంటే కాలం గడుస్తుంది-అందులో షెర్లాక్ హోమ్స్.

శకు : ఒకసారి నిద్రపట్టక "హౌండ్ ఆఫ్ బాస్కర్ విల్లీ" (Hound of Baskerbille) చదివాను. సగం చదివే సరికి ముచ్చెమటలు పోశాయి నాకు.

రామ : నిజం—మగవాళ్లకు మాకే అది రాత్రివేళ చదువుతూంటే గుండె పీచుపీచు మంటుంది... ఇంతకీ రేడియో స్టేషను కెప్పుడు వెళ్దాం.

రావు : చూద్దాం లెండి.

రామ : చూద్దాం అంటేకాదు. తప్పకుండా తీసుకు రండి...పోనీ మీ కభ్యంతర మైతే వద్దులెండి.

రావు : అబ్బే. నాకేమీ లేదండీ. సరే, ఎప్పుడు వెళ్దా మంటారు.

రామ : రేపు ఉదయం నేను వస్తాను. మనం ముగ్గురం కలిసి రేడియోస్టేషనుకు వెళ్లి (ఆడిషన్) చేయిద్దాము.

రావు : మంచి దండీ.

రామ : కొంచం తొందర పనుంది. శెలవు పుచ్చుకొంటాను...డాక్టరుగారు మర్చిపోతారేమో మీరన్నా జ్ఞాపకం చెయ్యండి శకుంతలా దేవి గారూ.

శకు : అలాగే నండి.

[రామదాసు వెళ్లిపోతాడు]

పాపం ఆయన పనిగట్టుకొని ఇది చెప్పటానికి వచ్చారు.

రావు : ఇక రేపట్నుండీ,శకుంతలా దేవి గానం గాల్లో —అంటే గగన పథంలో తేలిపోతుందన్న మాట.

శకు : ఇంకానయం. నేనే తేలిపోతా నన్నారు కాదు.

[ఇద్దరూ నవ్వుతారు]

శకు : నలుగుర్లో పాడటమంటే నాకు భయంగా వుందండీ.

రావు : మన దాసుగా రుంటారుగా.

శకు : (ఆశ్చర్యంగా) అయితే మీరు రారన్న మాట! అయితే నేనూ వెళ్లను.

రావు : అరెరె! నా కోసం నువ్వు మానుకోవట మెందుకు? సరే చూద్దాం. వీలుంటే నేనూ వస్తాలే. అదీగాక దాసుగారు పరాయి వారేమీ కాదుగా.

శకు : ఇక రండి. భోజనం చేద్దాం. కబుర్లతో కడుపు నిండి పోయినట్టుంది మీకు.

రావు : నాకా! ఎలికలు ఎప్పుడో జొరబడితే.

[ఇద్దరు నవ్వుకొంటూ లోపలికి వెళ్తారు. తెర పడుతుంది.]

3

** తెర లేచేసరికి రేడియోలో డిస్టర్‌బెన్స్, నేపథ్య సంగీతం వినబడుతూ వుంటాయి

తండ్రి : (ప్రవేశిస్తూ) అబ్బాయి రాఘవా!

రావు : (లోపలినుండి వస్తూ) ఎవరూ? (చూసి) నువ్వా నాన్నా! ఎప్పుడొచ్చావ్?

తండ్రి : ఈ బండికేరా

రావు : ఉత్తరం పత్రం వ్రాయకుండా వచ్చావేం నాన్నా. స్టేషను కొచ్చే వాణ్ణిగా.

తండ్రి : ఆ-ఎందుకురా నే రాలేనా? ఏదో చూసి పోదామని బుద్ధి పుట్టింది. ఆ పళంగా సైకిలు చేరి సైకిలెక్కాను.

రావు : బాగుంది. ఇంటి దగ్గిర ఇలా వెళ్తున్నాననైనా చెప్పివచ్చావా? అమ్మ కంగారుపడుతుందేమో?

తండ్రి : లేదురా. ఇక్కడున్నట్లు వైరిద్దామనే. కోడలేది?

రావు : అలా బైటికి వెళ్ళింది.

తండ్రి : ఎక్కడికి?

రావు : ఇప్పుడే వస్తుంది.

తండ్రి : ఆడేదీ, ఆ రేడియో స్టేషనుకేగా.

రావు : అవున్నాన్నా. నీ కెవరు చెప్పారు!

తండ్రి : కుప్పిల్లి మూస్తావు గాని లోకం నోళ్లు మూయగలవుట్రా? ఇదసలు మన ఇంటా వంటా వుందిరా రాఘవా! ఆడది ఆకుల్లో పిందలాగ అణగి మణగి వుండాలి గాని ఇలా వీధి కెక్కితే నలుగురూ ఏమంటార్రా?

రావు : ఇప్పుడది వీధి కేమెక్కింది నాన్నా?

తండ్రి : వీధి కెక్కకపోతే ఏమిట్రా నలుగుర్లో యాగీ అయినాక. ఒక రాత్రనీ, పగలనీ లేకుండా రేడియో స్టేషన్లో తిరుగుతోందట-ఇలా చేస్తే, ఇంకా నలుగురుకూతుళ్లకు పెళ్లిళ్లు చెయ్యాలి నేను—ఆదేమన్నా గ్రహించారా మీరు—కొమ్మకు చీడ పడితే అది చెట్టుకు చేటు కాదుట్రా. (శకుంతల మెల్లిగా వస్తుంది) ఏవమ్మా...ఎక్కణ్ణుంచీ రావడం?

శకు : నేనా...అలా వెళ్ళాను మామయ్యా.

తండ్రి : అలా అంటే ఎలా? ఇలా అని చెప్పు. వెళ్ళగా లేనిది చేస్తే తప్పా.

శకు : తప్పనికాదు మామయ్యా—రేడియోస్టేషనుకి వెళ్ళాను.

తండ్రి : ఒక్కదానివేనా?...

శకు : వారిని రమ్మన్నా మామయ్యా. పనుంది రానన్నారు.

తండ్రి : ప్రపంచజ్ఞానం తెలిసినదానివి, సంసార బాధ్యతలు ఎఱిగున్నదానివి నువ్వే ఇలా ప్రవర్తించటము తప్పుకాదుటమ్మా. భర్త వెంటలేకుండా పరాయివాళ్ళవెంట తిరగటము.

శకు : వారు వెళ్లమంటేనే వెళ్ళాను మామయ్యా. దాసుగారు కార్లోతీసుకెళ్లి కార్లో దిగబెడ్తారు.

తండ్రి : సర్లేవమ్మా — చెప్పొచ్చావ్ పైగా. మా రోజుల్లో యీ రేడియోలూ, టూడియోలూ లేకపోయినా అక్కడేం జరుగుతుంటాయో అన్నీ మాకు తెలుస్తూనేవుంటాయి.

శకు : సరీగ్గా తెలియనివాళ్లు అనేక కథలు పుట్టిస్తారు మామయ్యా. ఒక్కసారిచూస్తే మీకే తెలుస్తుంది అదెలాంటిచోటో.

రావు : నిజమే నాన్నా. రాత్రికి మళ్ళీ ప్రోగ్రామ్ వుంది. అప్పుడు నువ్వుకూడా వెళ్లు. నీకు నచ్చలేదంటే మానేస్తుంది. సరేనా.

శకు : మీ పరువుప్రతిష్టకు భంగం కలుగుతోందంటే అది మాకు కలిగినట్టుకాదా మామయ్యా? — లోపలికిరండి. వేడినీళ్లున్నాయి. స్నానంచేద్దురుగాని.

రావు : ముందు స్నానంచేసిరా నాన్నా.

తండ్రి : (ఆలోచిస్తూ లోపలికి వెళ్తాడు.)

[మిస్ పంకజ వస్తుంది.]

పంకజ : హల్లో గుడ్‌మార్నింగ్ డాక్టర్.

రావు : వెరీగుడ్‌మార్నింగ్. ఏం ఇలావచ్చారు?

పంకజ : ఆ! ఏం లేదు. రిక్షావాడు రాలేదు. మీరు లిఫ్ట్ ఇస్తారేమోనని వచ్చాను.

రావు : 'శూర్' ఇప్పుడే డ్రెస్సుమార్చుకొని వస్తా తప్పకుండా — వుండండి, శకూ డాక్టరు గారికి కాఫీ పట్టుకురా.

పంకజ : నేను కాఫీ తాగను డాక్టర్.

రావు : ఏం తాగుతారు?

పంకజ : మిలో గానీ, ఓవల్టీనుగాని.

రావు : శకూ డాక్టరుగారికి ఓవల్టీను కలుపు. వస్తాను కూర్చోండి. వన్‌మినిట్.

పంకజ : ఆ—చూడండి. సాయంత్రం మీకేదన్నా ఎంగేజిమెంటువుందా?

రావు : లేదు. ఎందుకు?

పంకజ : 'డిసైర్'కి రెండు టిక్కెట్లు తెప్పించాను. వస్తారా? (శకుంతల కప్పు పట్టుకొస్తుంది.)

పంకజ : ఏమంటారు?

రావు : దోవలో మాట్లాడుదాం. ఓవల్టీను తీసుకోండి. (లోపలికి వెళ్తాడు.)

శకు : నమస్తే డాక్టర్.

పంకజ : నమస్తే. ఇవాళ మీ రేడియో ప్రోగ్రామ్ వుందనుకొంటాను.

శకు : అవును. ఇప్పుడేవచ్చాను. మళ్ళీ సాయంత్రం వెళ్లాలి.

పంకజ : (త్రాగుతూ) క్రిందటిసారి విన్నాను రేడియోలో మీ పాట......శాస్త్రీయ సంగీతం చాలాబాగా పాడుతారు మీరు.

శకు : 'థాంక్స్' [తండ్రి వస్తాడు స్నానంచేసి.]

తండ్రి : (వస్తూ) ఈమెగారెవరు?

శకు : వారి లేడీడాక్టరు మామయ్యా — వీరు మా మామగారు.

పంకజ : ఓ-ఐ-సీ-నైస్-పెర్లీగేడ్ టు సీ యు. (షేక్ హ్యాండు చెయ్యబోతుంది.)

తండ్రి : నాకు చెయ్యిచూపటం రాదమ్మాయీ!

శకు : (నవ్వుతుంది.) అదికాదు మామయ్యా. చెయ్యి చూడమనికాదు అడిగేది, చెయ్యి కలపమని. అదీ దొరల పద్ధతి.

తండ్రి : ఇప్పుడు చూపిందో లేదో అప్పుడే చేతులు కలపటందాకా వచ్చిందా? వద్దుతల్లీ. ఆ దొరల పద్ధతులు మనకెందుకు?

పంకజ : (చిన్నబుచ్చుకొని) ఐ యామ్ సారీ. (రావు వస్తాడు.)

రావు : (వస్తూ) దేనికి?

శకు : అబ్బె ఏమీ లేదు. ఆవిడ షేక్‌హ్యాండు చెయ్యబోతే మామగారికి అర్థంకాలేదు...

రావు : కాకపోతే నువ్వు చెప్పక్కర్లా?

శకు : అదే చెబుతున్నాను. ఇంతలో మీరొచ్చారు.

రావు : ఆల్ రైట్ - పదండి డాక్టర్—సాయంత్రం ఆలస్యంగా వస్తానేమో అర్జెంటు కేసులున్నాయి—నాన్నకూడా రేడియోస్టేషనుకు తీసుకొనివెళ్ళు—వస్తానాన్నా.

తండ్రి : భోజనంచేసి పోవట్రా?

రావు : టైములేదు.

శకు : క్యారేజిలో పెట్టి పంపుతాలే మామయ్యా.

[రావు, పంకజ వెళ్ళిపోతారు.]

తండ్రి : బాగానేవుంది సాంగత్యం—

శకు : మీకు మడిబట్ట ఆరేశాను. పూజచేసుకోండి మామయ్యా.

తండ్రి : ఆ పంచిలో భగవద్గీత పుస్తకం వుంది. అందుకో తల్లీ.

[లోపలికి వెళ్తారు: తెర]

4

* * తెరలేచేసరికి రేడియో డిస్టర్బెన్సస్ ......సంగీతం ..... కిలకిలా నవ్వులు వినిపిస్తాయి. డాక్టర్ రావు, పంకజ వస్తారు. వచ్చి లైట్లు వేస్తారు.

రావు : తలకాయ నొప్పిగావుందని ఇంటర్‌వెల్‌లోనే బైటికి లాక్కొచ్చావ్. నిజమే ననుకొన్నాను.

పంకజ : డాక్టర్ల దగ్గిఱ జబ్బు దాగుతుందా?

రావు : జబ్బు అంటే జ్ఞాపకం వచ్చింది. నేను ప్రైవేటు ప్రాక్టీసు చేస్తున్నప్పుడు ఒక పేషెంటు వచ్చాడు. బాగా డబ్బున్నవాడు. పరీక్షచేసి రోగం ఏమీ లేదయ్యా అని చెప్పాను. అంటే వినడే—ఒకవారంరోజులు ఏదో మందిచ్చి 150 రూపాయలు బిల్లు చేశాను. ఆబిల్లు తీసుకొని "డాక్టర్! రేపట్నుంచీ మందవసరంలేదు. రోగం పూర్తిగా నయమైంది" అన్నాడు. "మందు బాగా పనిచేసిందన్నమాట" అన్నాను. "మందు కన్నా ఈ బిల్లు బాగా పనిచేసింద"న్నాడు.

[ఇద్దరూ నవ్వుతారు.]

పంకజ : అలా వుందంటారా నారోగం? అయితే బిల్లురాయండి.

రావు : కాగితంలేదు. చేతిమీద వ్రాస్తాను. (చెయ్యి గిల్లుతాడు) (ఇద్దరూ నవ్వుతారు.)

[గడియారం తొమ్మిది కొట్టుంది.]

పంకజ : మీ మిసెస్ వాళ్ళింకా రాలేదు?

రావు : వస్తారు. స్టేషనునుంచి ఇక్కడకు రావటానికి అరగంటన్నా పడుతుంది.

పంకజ : శకుంతలాదేవికి చాలా ప్రోగ్రాములు వస్తున్నాయి కదూ డాక్టర్ !

రావు : దాదాపు ప్రతివారం ఏదో ఒకటివుంటోంది.

పంకజ : నేనొకటి విన్నాను డాక్టర్. మీరు ఇంకో విధంగా అనుకోకుండా వుంటే...

రావు : చెప్పు...

పంకజ : అభిమానులకు తప్ప ఇతరులకు ఎక్కువ ప్రోగ్రాములు ఇవ్వరట అసలు.

రావు : ....

పంకజ : దాసుగారు మీ మిసెస్ విషయంలో చాలా ప్రత్యేకశ్రద్ధ చూపిస్తారని కూడ చాలా మంది చెప్పారు.

రావు : (మౌనం)

పంకజ : నెల్లాళ్ళయినా కాకుండా 'ఏ' క్లాస్ ఆర్టిస్ట్సులో చేర్చారట ఆమె పేరు.

రావు : నేనే వెళ్ళమన్నాను.

పంకజ : ఆయన స్వంతకార్లో ఆమెను తీసుకెళ్ళి మళ్ళీ ఇంటి దగ్గఱ దిగబెట్టారట. ఇదంతా అభిమానం కాదంటారా డాక్టర్ ?

రావు : నిన్ను ఇంటిదగ్గఱ దిగబెడ్తాను పద.

పంకజ : ఇవాళ మీ భోజనం నా క్వార్టర్సులో ఎరేంజి చేశాను డాక్టర్.

రావు : ఎందుకు?

పంకజ : ఇవాళ నా బర్త్ డే డాక్టర్.

రావు : మరి ప్రొద్దుటినుంచీ ఎందుకు చెప్పలేదు? మానాన్న కూడ వున్నాడు. ప్రొద్దునా భోంచేయలేదు ఇంట్లో.

పంకజ : (చెయ్యిపట్టుకొని) చెప్పటం మర్చిపోయాను ఇవాళ కాదనకండి. అసలీ ఏడు నా పుట్టిన రోజు పండగ గ్రాండ్‌గా ఏర్పాటు చేద్దామనుకున్నాను. కాని...

[బైట కారు హారను వినిపిస్తుంది.]

[నవ్వుతూ రామదాసు, శకుంతల, తండ్రి వస్తారు.]

తండ్రి : ఏవో అర్జెంటు కేసు లున్నాయ్. ఆలస్యంగా వస్తానని చెబితివి కదోయ్.

రావు : తొందరగా పూర్తిచేశా నాన్నా.

రామ : నమస్తే రావుగారూ. గుడీవినింగ్ పంకజం గారు.

రావు : నమస్తే.

రామ : ఇవాళ శకుంతలాదేవి అద్భుతంగా పాడారు.

తండ్రి : కోడలింత చక్కగా పాడుతుందని నేనెప్పుడూ అనుకోలేదురా రాఘవా. పెళ్ళిలో పాడించాముగాని మరి నేను పరధ్యానంగా విన్నానో ఏమో ఇంత బాగా లేదు.

రామ : మీకోడల్లా చక్కగా పాడేవాళ్లు ఇంకా ఎందరో వున్నారు బాబూ. తిరగల్లోపడ్డ గింజల్లాగా వాళ్లు సంసారాల్లో నలిగిపోయి బైటికి రావటంలేదు.

తండ్రి : దానికి కారణం ఏమంటారు?

రామ : కారణం పెద్దలు మీకు తెలియందికాదు— అసలు పదిమందిలోనూ పాడటం కానిపని అనీ, అప్రతిష్ఠ అనీ, ఆడది వేన్నీళ్లకు చన్నీళ్ళుగా డబ్బు సంపాయించడం మగవాడికి అవమానం అనీ—ఇలాంటివే అనేకమైన మూఢ నమ్మకాలుంటాయి వాళ్లకు.

తండ్రి : ఇప్పుడు యథార్థం తెలుసుకున్నాను. ప్రొద్దున్నవరకూ నాకీరేడియోలు అంటే అదో అభిప్రాయముండేది. ఇప్పుడుమాత్రం నాకు చాలా సంతోషంగావుంది. అందులో ఫలానావారి కోడలు అంత చక్కగా పాడుతోంది అంటే అది మాకు మాత్రం గొప్ప కదండీ?

శకు : కబుర్లతోనే తెల్లవారేట్టుంది. వడ్డిస్తాను— పదండి. మామయ్యా కాళ్ళు కడుక్కోండి. మీరుకూడా ఈ పూట ఇక్కడే భోంచేయాలి దాసుగారూ.

రామ : అబ్బే ఎందుకండీ మీకా శ్రమ. నా క్యారేజి వచ్చేవుంటుంది.

తండ్రి : మీరలా అంటే నేనొప్పుకోను. పదండి సరదాగా కూర్చుందాము. ముందు కాళ్ళు కడుక్కొని వద్దాం రండి.

[ఇద్దరూ లోపలికి వెళ్తారు.]

శశి : (భర్తతో) మీరుకూడా లేవండి భోజనానికి.

రావు : నాకీ పూట ఆకల్లేదు. పైగా అర్జెంటుకేసొకటి చూసి రావాలి.

శశి : అదేమండి! ఇప్పుడేగా మామగారితో పని పూర్తయిందన్నారు?

రావు : అంటే అబద్ధమాడుతున్నానంటావా?— చాలాదాక వచ్చింది. మాటలు నేర్పిన కుక్కను వేటకు పంపితే ఇవ్వాక అంటే ఇవ్వాక అందిట.

శశి : తప్పేమున్నాను. వడ్డిస్తాను భోజనము చేసి వెళ్ళండి.

రావు : నేను భోజనం చెయ్యనని చెప్పాను.

శశి : దాసుగార్ని కూడా వుండమన్నాము. మీరు వెళ్ళిపోతే బాగుంటుందా?

రావు : నే లేకుండా ఆయనతో వస్తే బాగుండ టంలా?

శశి : మీ రివాళ వింతగా మాట్లాడుతున్నారు.

రావు : నువ్వూ వింతగా ప్రవర్తిస్తున్నావ్.

శశి : ఇప్పటిదాకా కూర్చుని ఆస్పత్రికని వంక పెట్టుకొని భోజనం చెయ్యకుండా వస్తే వాళ్ళేమనుకొంటారు. నా మాట వినండి. మామగారు కూడా వున్నారు.

రావు : పంకజ నన్ను ఇవాళ డిన్నరుకి పిల్చింది. వెళ్తున్నాను.

శశి : ఓ! అందుకా ఇప్పటిదాకా కాపలా వేసు క్కూర్చున్నారు.

పంకజ : కాపలా వేసేందుకు నేను మీ ఇంటి పాకర్నేమీ కాను.

శశి : కాకపోతే ఇంతరాత్రివరకూ ఇక్కడెందు కున్నారు? మీ కిక్కడేం పని?

పంకజ : నన్ను సంజాయిషీ అడగటానికి మీ రెవరు?

శశి : ఈ ఇల్లు నాది. మీ రీఇంట్లో వున్నంత సేపూ అడగటానికి నా కధికారం వుంది.

పంకజ : డాక్టర్! ఇంటికి పిల్చింది మీ రిలా నన్ను అవమానం చేయించటానికేనా?

రావు : నీ కసలు బుద్ధుందా? ఇంటికి వచ్చినవాళ్లను సంజాయిషీ అడుగుతావా?

శశి : నేను లేనప్పుడు రాత్రిపూట నా ఇంటికి వచ్చి నా భర్తతో కిలకిల్లాడుతూ కూర్చో టానికి ఆవిడకేం అధికారం వుందని అడి గాను. తప్పా?

పంకజ : మీరు రేడియో ప్రోగ్రామ్ అని వంక పెట్టు కొని ఆ దాసు గారివెంట తిరగటం, తప్పు పని కాదూ?

[దాసు, తండ్రి వస్తారు]

రా. దా : మిస్ పంకజ నోటికొచ్చినట్లు వాగటం పద్ధతి కాదు. ఇది ఆస్పత్రి కాదు.

పంకజ : షటప్. మీ రనవసరంగా కల్పించుకో నక్కర్లేదు. నే వెళ్తున్నా డాక్టర్. నలుగురూ చేరి వంటరిదాన్ని అవమానం చేస్తారా?

రావు : మిస్టర్ దాసూ! మీరు ముందు నా ఇంట్లోంచి బైటికి నడవండి.

తండ్రి : అదేమిట్రా! పెద్దమనిషిని......

రావు : నువ్వూరుకోవయ్యా—నీకు తెలీదు—నల్లని వన్నీ నీళ్ళు తెల్లనివన్నీ పాలు అనుకొంటావ్ మిస్టర్ దాసూ మీరు తక్షణం బైటికి వెళ్లండి.

శశి : (డగ్గుత్తికతో) ఏమండీ విస్తరిముందు కూర్చో బోయే మనిషిని అట్లా అనకూడదు.

రా. దా : వెళ్లటానికి నా కేమీ అభ్యంతరము లేదు. కాని తర్వాత మీరే పశ్చాత్తాప పడతారు.

రావు : మీరిక నా ఇంటికి రానవసరము లేదు, నా భార్యకు రేడియో ప్రోగ్రాములు ఇవ్వనవ సరమూ లేదు. మీ వంటి పరోపకుమునిష కుంభాన్ని దగ్గఱకు చేరనియ్యటము నాదే తప్పు.

రా. దా : (ఖిన్నుడై) మీరు అపోహపడుతున్నారు డాక్టర్. నన్ను చాలా తప్పుగా అర్థం చేసు కొంటున్నారు.

రావు : లేదు. ఇప్పుడు సరిగ్గానే అర్థం చేసి కొన్నాను. మొదట చేసికోలేదు కాబట్టే అనుభవిస్తున్నాను. "యు ఫన్ట్ గెట్ ఔట్ ఆఫ్ మై హౌస్"

[దాసు తలవంచుకొని వెళ్ళిపోతాడు]

శకు : (ఏడుస్తూ) ఏమండీ. మీ కాళ్ళు పట్టుకొంటాను. ఏవో అనుమానాలు పెట్టుకొని ఆయన్ను అవమానం చెయ్యటము మహా పాపం.

రావు : పాపం! ఛీ! వదులు-నన్ను ముట్టుకోకు. చెప్పేవన్నీ శ్రీరంగనీతులే. నేను కూడా వెళ్తున్నాలే. నీకు పీడ వదులుతుంది. పద పంకజం

[వెళ్లిపోతారు]

శకు : మీ రిప్పుడు వెళ్లటానికి వీల్లేదు. మీరు వెళ్తే విషం పుచ్చుకుంటాను. (చెయ్యి పట్టుకుంటే చెంపమీద కొడ్తాడు)

రావు : నీ ఇష్టమొచ్చింది చేసుకో ఫో.

[శకుంతల ఏడుస్తూ లోపలికి పోతుంది]

తండ్రి : నువ్వు మనిషివా? పశువ్వా? ఆడదానిమీద చెయ్యి చేసుకొంటావురా దౌర్భాగ్యుడా!

రావు : నా ఇష్టం;

తండ్రి : నీ ఇష్టం. — ఎందుకు చదువుకొన్నావ్. అఘోరించనా! అదేం కాని పని చేసిందని కొట్టి కొచ్చి నట్లంటావ్?

రావు : ఏం చేసిందో నాకు తెలుసు. లోకానికి తెలుసు.

తండ్రి : తెలుసు. కళ్లకు చీకటిపొరలు కప్పుకు పోయాక నీకు తెలిసేదేముంది. ఇదిగో ఈ అమ్మవారు పూనిందిగా అన్నీ తెలుస్తాయి.

[లోపలేదో పడ్డ చప్పుడవుతుంది. తండ్రి లోపలి కెళ్తాడు. చప్పున మళ్ళీ వచ్చి]

తండ్రి : (పెద్దగా) ఒరే రాఘవా. కోడలు సీసాలోది ఏదో మందు తాగి పడిపోయిందిరా. కళ్ళు తేలవేస్తోందిరా.

[తండ్రీ, కొడుకులు లోపలికి పరుగెత్తారు. రెండు నిమిషాలు కంగారు. ఇది చూసి పంకజం మెల్లిగా జారుకొంటుంది].

[రేడియోలో కలవరం. విచారాన్ని సూచిస్తూ వున్న మ్యూజిక్. తర్వాత ఆగిపోతుంది]

* * *

[లోపల్నుండి డాక్టరు, శకుంతల, దాసు బైటికి వస్తారు]

డాక్టరు : చాలా తమాషాగా వుంది నాటిక.

శకు : పాపం, ఆవిడ చచ్చిపోయిందా చివరకు.

దాసు : 'ఆసిడ్' త్రాగింది. బహుశా చచ్చిపోయే వుంటుంది.

శకు : నాకో సందేహం వచ్చింది. ఇందులో ఎవరు చాదస్తులు దాసుగారూ? చదువుకొన్న నాగరకుడైన అతర్తా?—చదువులేని మూఢాచారపరుడైన ఆ తండ్రా?

దాసు : మీరు చెప్పండి డాక్టరుగారూ.

డాక్టరు : నా ఉద్దేశం ఆ డాక్టరే చాదస్తుడు.

దాసు : బాగా చెప్పారు.

శకు : (నవ్వుతూ) ఈ డాక్టరుగారు కూడా అంతే దాసుగారూ.

డాక్టర్ : (చిరాగ్గా) ఏయ్... చిలిపి!

దాసు : (నవ్వుతూ) వస్తా డాక్టర్. రేపెప్పుడన్నా శకుంతలాదేవిగారిని తీసుకొని రేడియో స్టేషనుకి ఒక్కసారి రండి. ఆడిషన్ చేయించి ప్రోగ్రామ్ ఇప్పిస్తాను.

డాక్టరు : నాకు తీరిక లేదు. మీరు తీసుకొని వెళ్లండి.

శకు : వద్దు దాసుగారూ ... చాదస్తులు వెంట వుంటేనే మంచిది.

[ముగ్గురూ నవ్వుతారు. తెర]

వర్జ్యకాలము

శ్రీ రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు

విషనాడియనబడు నక్షత్రత్యాజ్యకాలమును (వర్జ్య కాలమును) గూర్చి కడచిన విజయసంవత్సరపు ఆషాఢ మాసపు భారతిలో నా ఊహలను చదువరులకు నివేదించియుంటిని. ఇప్పటి మన పంచాంగములలో ఈ విషనాడీ కాలము ఎంత అవ్యవస్థగా చూపబడు చున్నదో, వర్జ్యకాలమును పరిత్యజించి శుభ కార్య ములను జరుపుకొనగోరువారికి దీనివలన ఎన్ని చిక్కులు ఏర్పడుచున్నవో, సోదాహరణముగా ఆ వ్యాసములో చూపితిని. విషనాడీకాలము ఇండియన్ స్టాండర్డ్ కాలములో (I. S. T.) నిష్కర్షగా ఏనాడు ఎప్పటినుండి ఎంతవరకు వ్యాప్తిలోనుండునో, సులభముగా, నిర్దుష్టంగా, నిస్సంశయముగా సాధించుటకు వీలగురీతి సాయన విషనాడీ పథకము సయితము అచట చేర్చబడినది. మరియు, చంద్ర విషనాడి మాత్రమేకాక, నాల్గు నిమిషములు వ్యాపించియుండ గల మాహాత్మ్యమును లగ్న విషనాడి సయితము పరిత్యాజ్య మని సోపపత్తికముగా నిరూపించి, దానిని ఇండియన్ స్టాండర్డ్ కాలములో కనుగొనుటకు మార్గము సహా విన్నవించితిని.

కాని, విషనాడి (వర్జ్యకాలము) అంత దోష ముగా పరిగణింపవలయునా అని సందేహించువారు కొందరున్నారు. దాక్షిణాత్యులు ఈ త్యాజ్యకాల మును గమనించనే గమనించరు. అన్ని విషయములకు, పెండ్లికయినా, ప్రయాణమునకయినా, తప్పక వారు రాహుకాలమును మాత్రము చూచుట వాడుక. అందులో, ద్రావిడులలో పురుషులకంటె స్త్రీలకు సంప్రదాయముపైన అభిమానము హెచ్చు. రాహు కాలములో వారు సామాన్యముగా ఏ కార్యమూ చేయరు; ఇతరులను చేయనీయరుకూడా. రాహు కాలములో భర్తలకు కాని, పసిబాలురకు గాని, భోజ నము సయితము పెట్టని స్త్రీలు కొందరు కలరట! అరవవారి సహవాసదోషమున ఆంధ్రులలో అనేకు లకు ఇటీవల ఈ రాహుకాలపు అలవాటుతోపాటు వర్జ్యకాలమును గూర్చిన సంశయము వచ్చినది. వాస్త వమును విచారించినచో, విషనాడీకాలమును, ప్రయా ణాదులయందును, శుభకార్యావసరములయందును జాగరూకతతో పరిత్యజించుట ఆంధ్రజాతికి అనూ చానముగ వచ్చిన ఆచారము. కాని, ఇటీవల దాక్షి ణాత్యుల సహవాసమువలన వీరు దానిపై నిరాదరము చూపుట అందందు చూపట్టుచున్నది. ఇది అవిచార రమణీయము.

ముహూర్తశాస్త్రములో శుభకార్యములకు వర్జించదగిన మహాదోషములలో ఒకటిగా విషనాడి పరి గణింపబడినది. కాని ఆదోషములపట్టికలో రాహుకాల మును ప్రాచీనులు చూపియుండలేదు. మాసరాహువు, దినరాహువు, యామార్ధరాహువు, క్షణిక రాహువు, మున్నగు పేర్లతో రాహుకాలము అనేక విధములు. దీని ప్రశంస ముహూర్త గ్రంథములలో యాత్రా ప్రకరణములో మాత్రమే చూపట్టుచున్నది.

"యాత్రాదౌ, ఫణీ, యోగినీ,
దినకరాః పృష్ఠస్థితా స్సిద్ధిదాః"
—విద్యా మాధవీయము

ప్రశంసలోనున్న రాహుకాలమును సాధించు సూత్రమిది:—

"సూర్యా, ర జీవ, జ్ఞ, భృగు
మం, దేందు దివసేష్వపి।
ప్రాగాదితి ష్వవ్యగామీ।
తస్మాద్దక్షిణగోంతకః"

భానువారమున రవి, సోమవారమున శని, మంగళ వారమున చంద్రుడు, బుధవారమున బుధుడు, గురు వారమున కుజుడు, శుక్రవారమున గురువు, శనివార మున శుక్రుడు, పగలు ప్రథమ యామార్ధమునకు అధి పతిగా భావించి, ఆ అధిపతుల నుండి వారాధిక క్రమమున మిగిలిన యామార్ధములకు అధిపతులను

పంచగా శనికి ఏయామార్ధమువచ్చునో, దాని తరువాత యామార్ధము రాహుకాలమను నమట. దీనికి ఉపపత్తి ఏమో తెలియ లేదు.

ఏవారమునకు ఆవారాధిపతి నే మొదటి యామార్ధమునకు అధిపతిగా నిర్ణయించి, తరువాతి యామార్ధములకు వారాధిపత్య క్రమముగా ఆధిపత్యమును పంచినచో, శనికి ఏయామార్ధములో స్థానము వచ్చునో అదే కాలము గుళిక స్థానమనియు, జాతక ముహూర్తాదులలో దుష్టఫలము దానినుండి వచ్చుననియు, చెప్పు సూత్రములున్నవి. ఇట్లే ఒక్కొకవారములో ఒక యామార్ధము 'యమకంటక'మని వేరొకయామార్ధము 'అర్ధప్రహర'మని, నిర్ణయించి ఇవి దుష్టకాలములుగా ముహూర్త శాస్త్రము తీర్మానించినది.

ఇవి చాలక, వారత్యాజ్యమను మరియొక వర్జ్య కాలమును తెలుపు సూత్రము కలదు.

"నభొద్వయం, ద్వాదశ, దిక్ చ శైలా,
బాణాశ్చ, తత్త్వాని, యథాక్రమేణ,
సూర్యాది వారేషు పరం చతస్రో,
నాడ్యో విషం స్యాద్ధిలు వర్జనీయం"

(దైవజ్ఞ మనోహరము)

ఈ కాలము లన్నియు రాహుకాలముకంటే భిన్నములైనవే. ఈ అయిదు విధములయిన కాలములు ఏ ఏ వారమున ఎప్పుడు వ్యాప్తిలో నుండునో, అనుబంధము చూపగలదు. దానిని చూచినచో మానవులకు మంచికాల మనునదే లభించదేమో, అని భయమగుచున్నది. లోకహితైషులగు మన ప్రాచీన మహర్షులు దీనిని గమనించి, కొన్ని గ్రహయోగము లున్నచో ఈ వర్జ్యకాలములదోషము పరిహారమగునని అపవాద సూత్రములు వ్రాసి మనల నుద్ధరించినారు. ఈపద్ధతిలో రాహుకాలము చేర్చబడలేదు. యాత్రావిషయములో తప్ప, ఇతర శుభకార్యముల ముహూర్తములకు సంబంధించిన సామాన్య నియమములలో రాహుకాలము చెప్పబడలేదు. కనుకనే ఈ అపవాదములలో దీని ప్రశంస కానరాదని మనము ఊహించుట తప్పుకాదు.

ఎట్లయిననేమి ఆకాశరంగమున జరుగు ఏగ్రహచారముతోనైనా సంబంధములేక, ఏసంవత్సరములో ఏ నెలలోనైనాసరే, ఏకరూపాలిక ప్రయోగ మను రీతిగా 'ఈవారమున కింత' అని నిర్ణయించబడినవే ఈ కాలములన్నియు. నక్షత్ర విషనాడీకాలపు మార్గము వేరు. అది చంద్రుని చారమువలన ఏనాటికానాడు గణితముతో సాధించవలసియున్నది. ఒకనాడొక నక్షత్రములో విషనాడి ఏకాలమునకు వచ్చునో మరల ఆ నక్షత్రము వచ్చిన నాడు అదేకాలమునకు సాధారణముగా రానేరాదు. ఇదే దాని విశిష్టత అనుటచే, ఈ వారవర్జ్యకాలములకు ఎంత విలువయుండినా, అది గణితాగతమగు నక్షత్రత్యాజ్యముతో తులతూగజాలదనుట నిర్వివాదాంశము. ఈ తారతమ్యమును మనస్సులో నుంచుకొన్నవారు కావుననే, ప్రాచీనులు విషనాడికి నాల్గుగడియలు వర్జ్యమనియు, వారత్యాజ్యమునకు రెండుగడియలు మాత్రము వదలినచో చాలుననియు శాసించిరి. రాహుకాలము సామాన్య ముహూర్త నియమములలో చేరినదే కాదు. ఇట్టి పరిస్థితులలో రాహుకాలముకంటే విషనాడీకాలమునకు హెచ్చు దోషము కలదనుట యుక్తి సహమగును. ద్రావిడుల సంప్రదాయ మెట్టిదైనా కానిండు. దాని నాశ్రయించి తమ ప్రాచీన సంప్రదాయపు వర్జ్యకాలమును ఆంధ్రులు మరచుట మాత్రము శ్రేయస్కరము కాదు.

విషనాడీకాలమునకు గొప్పదోషమును ప్రాచీనులు సూచించిరి.

"విషనాడ్యాం విషాద్భీతిః
అపమృత్యు రథాపివా."

(జ్యోతిర్నిబంధము)

"వివాహవ్రత చూడాసు
గృహారంభ ప్రవేశయోః
యాత్రాది శుభకార్యేషు
విపదా, విషనాడికాః"

(జ్యోతిస్సారము)

"విషాఖ్యనాడీషు కృతం శుభంయత్,
వినాశ మాయా త్యచిరేణసర్వం."

(వశిష్ఠసంహిత)

ఇంతేకాదు. విషనాడీభాగలో రవిచంద్రసంయోగము (అమావాస్య) వచ్చినప్పుడు, అట్టి పర్వభాగ జన్మకాల చంద్రస్థానమైనచో, అట్టి జాతకుడు అచిరకాలములోనే జీవయాత్ర చాలించుకొనగలడని వశిష్ఠ మహర్షి చాటిచెప్పినాడు. కనుక, రాహుకాలమును

గమనించినా, మానినా, విషనాడీ (వర్జ్య) కాలమును మాత్రము పాటించక శుభకార్యాదులు జరుపుట క్షేమకారి కాదని నా విన్నపము.

చంద్ర విషనాడిని, లగ్న విషనాడిని, నిరాదరించి క్లేశములపాలయిన ఈ క్రింది నిదర్శనములు చిత్తగింపుడు.

చంద్ర విషనాడి

(1) మదరాసు నగరపు విమానాశ్రయములో 18.2.1952 నాడు 11-9 A. M. (I. S. T.) కాలమున గగన సంచార మారంభించిన విమాన మొక్కటి నాగపుర సమీపములో పడిపోయెనని విన్నాము కదా! ఆ క్షణమున చంద్రుడు వృశ్చికరాశిలో 28°-51' లో నుండినాడు. అనూరాధానక్షత్రమందలి విషనాడి వృశ్చికరాశిలో 28°-43' నుండి 29°-36' వరకు వ్యాపించి యున్నది. కనుక ప్రయాణారంభ కాలములో చంద్రుడు విషనాడిలో నుండినాడు. ఘోరమయిన నష్టము కల్గినది.

(2) ఢిల్లీనగరములో 21-11-1951 నాడు 7-48 A. M. (I. S. T.) లో ఒక విమానము పడిపోయినది. దానిలో ప్రాణములు కోలుపోయిన పదునార్గురిలో కొందరు ప్రముఖ వ్యక్తు లుండిరి. ఈ విమానము నాగపురములో అనాడే 3-31 A. M. (I.S.T.) లో బయలుదేరినదట. ఆ కాలములో చంద్రుడు సింహరాశిలో 17°-42' లో నుండెను. ఆశ్లేషానక్షత్రపు విషనాడి సింహరాశిలో 16°-57' మొదలు 17°-50' దాక కలదు. ప్రయాణారంభములో చంద్రునికి విషనాడి దోషము పట్టిన కారణమున ఘోరమయిన ప్రమాదము సంభవించెను.

(3) ఇన్‌డియన్ నేషనల్ ఎయిర్ వేస్ వారి డకోటా విమాన మొకటి ఢిల్లీలో 17-7-1950 నాడు 9-3 P. M. (I. S. T.) వేళలో ఆకాశ సంచార మారంభించి కొంతకాలములోపలనే పఠాన్ కోటవద్ద కూలిపోయినది. దానిలో నుండిన ఇరువదుగురిలో ఒకడైనా బ్రతుకలేదు. ప్రయాణారంభ కాలములో చంద్రుడు ఆశ్లేషానక్షత్రపు విషనాడిలో సింహరాశి 17°-21'లో నుండెను.

(4) మదరాసు విమానాశ్రయములో 6-5-1951 నాడు 2-20 AM (IST) లో ప్రయాణమారంభించిన సెంటిసెలు విమాన మొకటి కొన్ని నిమిషములలో ఒక నీరులేని చెరువులో కూలి నాశనమైనది. అందుండిన విమానచోదకుడు, అతని అనుచరుడు సహా, ప్రాణములు కోలుపోయిరి. భరణీ నక్షత్రపువిషనాడి వృషభరాశిలో 11°-50' మొదలు 12°-44' వరకు నుండినది. ప్రయాణకాలచంద్రుడు ఆ రాశిలో 12°-18' లో నుండినాడు కనుక విషనాడీ దోషము పట్టినది.

(5) భారతదేశమందలి ప్రాతకాలపు మహారాజ పుత్రులలో నొకరి వివాహము మహావైభవముతో జరిగినది. కన్యారాశిలో 23°-20' లో చంద్రుడుండగ ఈ వివాహ క్రియాకలాపము ఆరంభమైనది. ఉత్తరా ఫల్గునీనక్షత్రపు విషనాడి ఆరాశిలో 22°-31' నుండి 23°-24' వరకు వ్యాపించియుండిన దగుటచే, వివాహము విషనాడిలో జరిగినది. ఆ మహారాజ పుత్రుని వైవాహిక జీవితము ఒక విషాదాంత కథ.

(6) 9-9-1952 నాడు సాయంకాలము 6 గంటల ప్రాంతములో విజయవాడయొద్ద భయంకరమైన కృష్ణానదీ మహాప్రవాహములో ఆనకట్టను రక్షించుటకయి బోట్లలోపోయి ప్రమాదముపాలై మునిగిపోయి కీర్తిశేషులయిన నలుగురు ప్రఖ్యాతులయిన (ఆంధ్ర) ఇంజనీయర్ల విషాదగాథను చదువరులు మరచియుండరు. ఆనాడు సాయంకాలమున వారు జలయానము నారంభించినపుడు వృషభరాశిలో 27°-26' చంద్రు డుండెను. ఇది కృత్తికా నక్షత్రపు విషనాడి ప్రదేశమని చదువరులు గుర్తింపగలరు.

(7) 1953 మార్చినెల 7 వ తేదీన ఒక ధనికుని ఇంట వివాహ మొకటి జరిగినది. ముహూర్తము 1-30 PM (IST) గంటలకని పురోహితులు చెప్పియుండిరట. కాని, అరణద్రవ్యము సంపూర్తిగాముట్టని కారణమున నిర్ణీత కాలములో కన్యాదానము జరుగలేదు. పంచాయతీలు జరిగి ఆ సమస్య పరిష్కారమగునప్పటికి పుణ్యకాలముదాటి పోయినది. అప్పటికి చంద్రుడు వృశ్చికరాశిలో 29°-37'కు వచ్చియుండెను. అనూరాధా నక్షత్రపు విషనాడి వృశ్చికరాశిలో 28°-24' మొదలు 29°-38' వరకు ఉండినది. కనుక, ఆ విషనాడీకాలమందే కన్యాదానము. కాని, వెంటనే భార్యాభర్తలకు పొసగలేదు. కథ కోర్టులకు ఎక్కినది. కడకు కోరికి వివాహము కానే లేదనెడి తీర్మానముతో ముక్తాయము.

(8) పంచాంగముల అవకతవకలవలన విష నాడిలో చంద్రుడుండగా లగ్నము నేర్పరచుటచే, 25-8-1952 నాడు విషనాడీ దోషములోనే ఒక వివాహము జరిగినదని కడచిన వ్యాసములో విన్న వించియుండుట చదువరులు మరచి యుండరు. రత్నమువంటి ఆ వధువు మూడేండ్లలోగానే మృత్యువు పాలయినదను శోచనీయ వార్త వినుచున్నాము.

"కుర్యా దుద్వాహితాంకన్యాం
విధవాం వత్సరత్రయాత్,"

అను వశిష్ఠ సంహితా వాక్యము ఈ వివాహమున కన్వయించినదనవచ్చును కదా! కన్య విధవ కాలేదు. వరుడు విధురుడైనాడు. అంతే భేదము.

ఈ ఉదాహరణములు చాలునను కొందును. ఫలము ప్రత్యక్షముగా చూపట్టు చున్నది కదా? ఇక నూత్నముగ లగ్నవిషనాడికి సంబంధించిన కొన్ని ఉదాహరణములను పరిశీలింతము గాక.

లగ్నవిషనాడి

(1) ఒకానొక ప్రఖ్యాత సినిమా నటుడు తన కంపెనీవారు సృష్టిచేయుచున్న ఏదో సినిమా కథకు సంబంధించినరంగములో ఛాయాచిత్రగ్రహణముకొరకు నటించుపనికై 25-4-1951 నాడు 8-35Am.(I.S.T.) లో ఉత్తమాశ్వమునొకదాని నెక్కి స్వారి చేయ నారంభించెనట! అప్పటికి లగ్నము మిథునరాశిలో 12°-0' వ భాగలో నుండెను. రోహిణీ నక్షత్రపు విషనాడి ఆరాశిలో 12°-0' 12°-54' వరకు కలదని చదువరు లెరుంగుదురు. ఆకాలములోనే అశ్వారోహణము జరుగుట. విషమకాలములో అశ్వారోహణము చేయరాదని పెద్దలనిరి.

"సాహస, మకాలచర్యాం,
మృగయాం, హయవాహనం, త్యజే ద్భూపః"

కారణమేమో కాని, ఆకస్మికముగా ఆయశ్వము రౌతు ఆజ్ఞను ధిక్కరించి, మోడిచేసి, స్వైరవిహార మారంభించి, కొన్ని క్షణములలోనే, అతనిని దబ్బున క్రిందపడద్రోసి పోయినది. ప్రబలములగు గాయములతో వైద్యశాల చేర్చబడి త్వరలోనె అతడు కాలధర్మము నందెనట!

(2) మిథునరాశిలో 20 వ భాగ ఉదయించుచుండగా, ఒకానొక విద్యావతియగు కన్యకు 20-4-1942 నాడు 9-20 Am. (I. S. T.) లో వివాహ మహోత్సవము జరిగినది. మృగశిరా నక్షత్రపు విషనాడి(19°-25' నుండి 20°-22' వరకు)లగ్నములో నుండగా ఆ వివాహము ముడిపడెనట. వివాహానంతరము అచిరకాలమందే అతి స్వల్ప కారణముతో భార్యాభర్తలకు మనోవైషమ్యములు ఏర్పడి, అత్రకాదను భర్త వేరొక యువతిని వెంటనే పెండ్లియాడి, "నీగతి నీవు చూచుకొ"మ్మని ప్రథమభార్యను పరిత్యాగము చేసినాడు. "దేశోవిశాలః" అని యున్నదికదా ?

(3) మదరాసునగరపు విమానాశ్రయమునుండి 13-4-1952 నాడు 8-0 Am. (I. S. T.) లో ఆకాశయానము నారంభించిన డెక్కన్ ఎయిర్ వేస్ కంపెనీవారి విమాన మొక్కటి ఢిల్లీనగర ప్రాంతమున ఆనాడే 7-43 Pm. (I. S. T.) లో కూలిపోయినది. ఆ విమానమునందుండిన ఎనమండుగురు ఈ ప్రమాదమునకు ఆహుతి అయిరి. ఆ విమానము పైకిఎగిరిన క్షణములో మిథునరాశిలో 12°-40' పూర్వదిక్కున లగ్నములో ఉదయమగుచుండినది. రోహిణీనక్షత్రపు విషనాడి, మిథునరాశిలో 12°-3' నుండి 12°-56' వరకు ఉండుటచే, విషనాడీ కాలములోనే ప్రయాణారంభము. ఫలము తోడనే చూపట్టినది.

(4) విద్యావతియగు తరుణి యొకతె ఉత్తమ విద్యావంతుడు, అనురూపుడు నగు వరుని వరించి 16-5-1951 నాడు చేపట్టినది. ఆనాడు 11-50 Am (I S T)లో ఈ శుభకార్యము జరుగుట. ఆవేళలో సింహరాశిలో 17°వ భాగ లగ్నములో నుండినది. దుష్టమగు ఆశ్లేషానక్షత్రమందలి విషనాడీ ప్రదేశము సింహరాశిలో 16°-56'నుండి 17°-50'వరకు వ్యాప్తిలో నుండినది. అగుటచే, విషకాలములో వివాహము జరుగుట. కొన్నిదినములు కాపురము చేసీచేయక పూర్వమే, ఆ వధూవరులు పరస్పర ప్రవర్తనములను సందేహించి, ఒకరినొకరు విశ్వసించక విడిపోయినారు. అంతటితో వీరి వివాహమునకు స్వస్తి. వీరి జీవితము అడవిని కాచిన వెన్నెల అయినది.

(5) 1944 డిశెంబరునెల 28 వ తేదీనాడు 7-25 PM (IST) లో "అష్టావక్రుడు" అనదగిన ఒక శిశువు జనించినాడు. ప్రతి అంగమూ వికృతమే; మాటలురావు; నడువలేడు. ఇతడు పుట్టినపుడు సింహరాశి 0°-58'లో లగ్నముగా నుండినది. పుష్యమీనక్ష

త్రపు విషనాడి (0°-58' నుండి 1°-47' వరకు) లో చేరిన ప్రదేశమది.

ఈ శిశు జననమునకు ఆధానకాలమును గుణించినచో, ఆధానకాలములో చంద్రుడు ఆ విషనాడీ భాగములోనే యుండెనని ఏర్పడగలదు. ఆ శిశువు యొక్క సర్వాంగములు విషపూరితములై వక్రత్వము నొందినవేమో?

(6) బంగారు బొమ్మవంటి ఒకానొక ముగ్ధ విద్యావంతురాలై అభివృద్ధికి రాదగియున్న యువకు నొకని వివాహమైనది. 1951 ఫిబ్రవరి 14 వ తేదీనాడు రాత్రి 1-0Am(IST)-గో ఈశుభముహూర్తము జరిగెను. అనూరాధా నక్షత్రపు విషనాడీ ప్రదేశము (వృశ్చికరాశిలో 28°-43' నుండి 29°-37')నకు చెందిన 29° వ భాగ లగ్నములో నుండగా పడిన ముడి ఇది. వివాహమైన నెల దినములకే, నిష్కారణముగా, వంచకుల మోసమునకు లోనై, మూర్ఖుడగు భర్త అమాయకురాలగు ఆ చిన్నదాని శీలమును శంకించి, ఘోరాపవరములను విచారించక, ఆమెను పరిత్యజించెను. ఆశలడుగంటి, ఆముగ్ధ ఆత్మహత్య చేసుకొనుటకై ప్రయత్నించగా, సమయమునకు ఎవరో కనుగొని కాపాడినారు. నిరంతర దుఃఖముతో ఆ చిన్నది కుములుచుండుటే ఫలము. ముందు మాట దైవమెరుగును.

(7) లక్షాధీశ్వరుడైన వ్యాపారియొకడు తన కర్మాగారము నిర్మించబడుచుండిన స్థలము 'తనిఖీ' చేయు నిమిత్తమై మోటారుకారులో 3-8-1948 నాడు ఉదయమున సింహరాశి 30° వ భాగ లగ్నమగుచుండగా ప్రయాణ మారంభించినాడు. మఖా నక్షత్రపు విషనాడికి (సింహరాశి 29°-47' నుండి కన్యలో 0°-40' వరకు) సంబంధించినది ఆ లగ్న భాగ. మూడుగంటల కాలములోనే శత్రువు లతనిని పట్టి చిత్రవధ చేసిరి.

(8) విదుషీమణియగు నొకానొక సుందరి ఉన్నత విద్యావంతుడగు వరుని పెండ్లియాడినది. 19-2-1944 నాడు 8-25 A. M. (I.S.T.) లో ఈ వివాహమంగళము జరిగెను. లగ్నము నిరయన పుష్కరాంశలో నిర్ధరించినారు మౌహూర్తికులు. కాని, ఉత్తరాభాద్రా నక్షత్రపు విషనాడి మేషరాశిలో 1°-42' మొదలుకొని 2°-35' వరకు ఉండగా, దానిలోనే మేషము 2° వ భాగలో, లగ్నము. ఫలితమేమనగా, కొంతకాలము తరువాత, ఆ గృహిణి తన ఇల్లువాకిలి వదలి చల్లగా ఒకనాటిరాత్రి పొరుగిల్లు చేరుకొని ఆ యింటి యజమానుని ఆశ్రయభాగ్యమును సంపాదించుకొని, కంచంత కాపురమునకు నువ్వులు నీరు విడిచినది. అగతికుడై బ్రతిమాలుకొన్న అభాగ్యపు భర్తకు తిరస్కారము తప్ప వేరు ఫలము లభించలేదు. విషనాడి వాసన ఇట్లు పరిణమించెను.

(9) కీర్తిశేషుడగు సర్దార్ పటేల్ మహాశయుడు జయపూర్ లో జరుగనున్న ఏదో రాజకీయ సమారంభమునకై ఢిల్లీ నుండి ప్రత్యేక విమానములో 29-3-1949 నాడు 5-30 P.M. (IST)లో బయలుదేరెననియు, వెంటనే విమానమందలి యంత్రసామగ్రి ఏదో చెడిన కారణమున ప్రమాదమును తప్పించుటకొరకు అతికష్టముతో విమానచోదకుడు విమానమును విషమప్రదేశములో దింపవలసివచ్చెననియు, పత్రికలద్వారా వింటిమి. భగవత్కృపచే సర్దారు అప్పటికి ప్రమాదమును తప్పించుకోగలుగుట, ముఖ్యముగా, హైదరాబాదు హిందువుల అదృష్టము. విమానము ప్రయాణ మారంభించినప్పుడు కన్యలో 24° వ భాగ లగ్నములో నుండినదని చదువరులు కనుగొనగలరు. ఉత్తరాభాద్రా నక్షత్రపు విషనాడీ ప్రదేశమది. (23°-47' మొదలు 24°-40' వరకు).

(10) సింహరాశిలోని 17° వ భాగ లగ్నములో ఉదయమగుచుండగా, 1-6-1913 నాడు 10-27 A.M. (IST) లో ఒకానొక గొప్పయింట వారి కన్యావరులకు అతివైభవముగా పరిణయ మహోత్సవము నడిచినది. సింహరాశిలో 16°-27' మొదలుకొని 17°-20' వరకు దుష్టమగు ఆశ్లేషానక్షత్రపు విషనాడి యుండెనని మౌహూర్తిక మహాశయులు గమనించలేదు. దైవ దుర్విపాకము కారణముగా వివాహకాలమందలి లగ్నము ఆ విషనాడికే చిక్కినది. ఆ కన్యకకు కన్యాత్వముయినా తీరక మునుపే ఆ బాలవరుడు కీర్తిశేషుడైనాడు.

(11) ఇటీవల, 26-1-1957 నాడు, యమళశిశు జననమొకటి కలిగినది. ఆనాడు 10-45 AM (IST) ప్రాంతమున ఒక పురుష శిశువును ప్రసవించిన కుటుంబిని 1-5 P.M. (IST) లో మరల ఒక స్త్రీ శిశువును కనినది. రేవతీ నక్షత్రపు విషనాడికి చెందిన మేషరాశి

లోని 17° వ భాగలో పుట్టిన పురుష శిశువు కొన్ని దినములలో బాలారిష్టముల పాలయినాడు.

(12) ఎయిర్ ఇండియావారి డకోటా విమాన మొకటి 'పాలం' విమానాశ్రయము నుండి 8-5-1953 నాడు రాత్రి 1-13 A.M. (IST) లో ఆకాశ యానము నారంభించినది. అప్పుడు కుంభరాశిలోని 19° వ భాగ లగ్నములో ఉదయించుచుండెను. ఈ భాగ ధనిష్ఠానక్షత్రపు విషనాడీ ప్రదేశమునకు (18°-44' నుండి 19°-37' వరకు) చెందినది. కొన్ని నిమిషములలోనే, (1-25 A.M. లో) ఆ విమానము నేలకూలి నశించినదని విన్నాము. ఐయిదుగురు విమాన చోదకులతో కూడ అవిమానమందున్న దురదృష్టశాలు లందరు పరలోక ప్రయాణము సాగించారట!

(13) కుంభరాశిలో 6° వ భాగ లగ్నముండుండగా, 27-2-1950 నాడు 4-50 A.M. (IST) ఒక లావణ్యరాశియగు తరుణికి వివాహము జరిగినది. నిరయన మకర రాశిలో పుష్కరాంశలో ముహూర్తమట. అన్యోన్యానురూపులగు ఆ వధూవరులకు స్వయంవరరూపమయిన పరిణయమది. కాని, శ్రవణ నక్షత్రపు విషనాడి కుంభములో 5°-20' నుండి 6°-18' దాకా వ్యాపించియుండుటచే ఈ లగ్నభాగకు విషదోషము పట్టినది. వివాహము అయిన కొన్నివాళ్ళకే భర్త ఉత్సాహము చల్లబడి పోయినది. సాధుశీలయగు ఆ వధువు పతిను నిరాదరించి వదలిపెట్టి, మార్గాంతరములలో తన సౌఖ్యమును తాను చూచుకొనుచున్నాడు. ఆ తరుణి తన జీవనోపాయమును వెదకుకొనుటకై ఇపుడు పాటుపడుచున్నది.

(14) ముక్కుపచ్చలారని ఒకానొక బాలికకు 14-6-1947 లో 8-0 AM (IST) కాలమందు వివాహము జరిగెను. విద్యావంతుడై భీముని బోలి యుండిన, ఆ చిన్నదాని భర్త మూడునెలల్లో ఆకస్మాత్తుగ సన్నిపాతజ్వరముతో మృత్యువువాత బడెను. ఆబాలిక శోచనీయస్థితి వర్ణింపనలవికానిది. వివాహకాలములో లగ్నము కర్కాటక రాశిలోని 20½° భాగలో నుండినది. నిరయన మిథునరాశిలో వర్గోత్తమాంశ అని ఈ లగ్నము ఏర్పరచబడినది. కాని, పునర్వసూ నక్షత్రపు విషనాడి కటక రాశిలో 19°-46' మొదలు 20°-50' వరకు ఉండుననుట ముహూర్తికుల గమనమునకు రాలేదు. వారికేమి కాని, ఆ విషనాడీ ఫలమును అబాలిక అనుభవించినది.

(15) సాధుశీలయగు ఒక విద్యావంతురాలికి ఒకానొక ఉన్నతోద్యోగి తనహస్తమునిచ్చి 21-8-1942లో వైభవముతో వివాహముచేసినాడు. 8-0 AM (IST) ప్రాంతములో మేషరాశి 24½° భాగ లగ్నములోనుండగా కన్యాదానము కట్నములతో, కానుకలతో, చేయబడినది. ఉత్తరాభాద్రా నక్షత్రములోని విషనాడిలోనే ఈలగ్నముండెనని పాఠకమహాశయులు గుర్తించియుందురు. కాపురమునకు వచ్చిన శాస్త్రముచెసి, ఆ పెండ్లికూతురు ఉన్నతవిద్య శోధించునని చెప్పి, అమాయకుడగు భర్తను ఎట్లో సమ్మతిపరచి పుట్టిన ఇల్లు చేరుకొని వ్యాసంగధోరణిలో పడినది. కాని, నాలుగైదు సంవత్సరములు కళాశాలలో చదివి పట్టభద్రురాలై పరిరువాత, ఆమెకు ఈ ప్రాతిభర్త రుచించలేదు. అతనితో కాపురము సాగించుట కామె నిరాకరించి అచటనే నిలిచినది. కొన్నియేండ్లు కొండంత ఆశతో, "ఎను రక్షింపదలంచునో, తలపడో, నాభాగ్యమెట్లున్నదో?" అని, కాచికాచి, హతాశుడై భర్త వేరే వివాహము చేసుకొన్నాడు.

ఇంతచాలును. ముహూర్తికులు నిరాదరించిన లగ్నవిషనాడీకాలము మహోదుష్టమయినదేయని పై దృష్టాంతములు చూపుచున్నవనుట పాఠకమహాశయులు గుర్తించగలరు.

విషనాడీ పథకమును * గమనించినచో, ప్రతి రాశిలో రెండో, మూడో ప్రత్యేకభాగలు విషనాడికి సంబంధించినవని తేటపడగలదు. ఆభాగలలో లగ్నముండగా శుభకార్యములు జరుపుట అమంగళకరమని కనుగొంటిమి. ఇట్లుండగా, ఉదయము 10 గంటలనుండి 12 గంటలలోగా మిథునలగ్నమును పద్ధతిలో, పినక్షత్ర సూచకునితోనో, ముహూర్తము నిర్ధరించుకొనుటయు, ఆ రెండుగంటలకాలములో ఏక్షణమైనా శుభమైనదేఅని భావించి తీరికపుడు శుభకార్యములు జరుపుటయు, ఎంత ప్రమాదహేతువులో వేరుగా విన్నవించుట

---

* విజయ—ఆషాఢ—భారతిలో 76 వ పుట చూడుడు.

అనవసరము. మన అశ్రద్ధవలనకాని, అజాగరూకతవలన కాని, ఆరాశిలో విషనాడీభాగ విద్దైనా శుభకార్యము జరుపుకాలములో లగ్నములోనికి రావచ్చునుకదా? ఏకర్మము నెరుగని వధూవరులపట్ల ఇది ఘోరమయిన అన్యాయము.

లగ్నమనగా, ఒకక్షణకాలమే. అతిస్థూలముగా చెప్పినచో, భచక్రములో ఒకభాగ లగ్నమందుండగల రమారమి నాల్గునిమిషముల కాలమని భావించవచ్చునేమో! అంతేకాని, గంట, రెండుగంటల కాలమును లగ్నమనుట అసంగతము, అశాస్త్రీయము, అనర్థకరము. శుభముహూర్తము నిర్ణయించుకొను మహత్తర బాధ్యత పెండ్లిపెద్దలది. వారీవిషయము గమనించి, ముందుముందుగా తగిన మాహూర్తికుల నాశ్రయించి, నిర్దుష్టమగు శుభలగ్నమును వారు నిర్ణయించి ఇచ్చునట్లుగా, శ్రద్ధవహించవలసియున్నది. వేలకొలది ద్రవ్యమును వివాహాదులలో దంభమునకో, వైభవమునకో వ్యయపరచువారు శుభముహూర్త నిర్ణయమునకొరకు స్వల్ప వ్యయప్రయాసలకు ప్రాలుమాలుటలో అర్థములేదు. "కోసుకు లోగి కందురీగలతో కుట్టించుకొన్నట్లు" అను సామెత అన్వయించును.

ఒక్కమాట. అరవవారి సంప్రదాయమును కాని, రాహుకాలముపై శ్రద్ధను కాని, హేళనము చేయుటకై నేనిది వ్రాయలేదని మనవి. రాహుకాలముకంటె ఎన్నియో రెట్లు ప్రబలమై, మహాదోషముగా మహర్షులచే పరిగణింపబడిన విషనాడీవర్జ్యకాలమును నిరాదరించుట శ్రేయస్కరము కాదని ఆంధ్ర మహాజనులకు విన్నవించుటకొరకే నా యీ ప్రయత్నము. సహృదయులు మన్నింతురని ఆశ.

ఇన్ని గణితపు చిక్కులుగల వర్జ్యకాలముకంటే సర్వ సులభముగా ఆబాలగోపాలము జ్ఞప్తిలోనుంచుకొనుటకు వీలుగానున్న రాహుకాలము చూచుకొనుట ఉత్తమము కదా? అనువారుందురేమో? ఇది అవిచారకృతమగు అభిప్రాయము. ఏ నెలలోనయినా, ఏ దేశములో నుండినా, రాహుకాలపు గంటలు ఒకేరీతిగా నుండుననుట గొప్ప పొరబాటు. బొంబాయిలో నుండినా, బుద్ధగయలో నుండినా, భానువారమునాడు 4-30 PM నుండి 6-0 PM (IST) వరకు రాహుకాలముగా భావించుట దాక్షిణాత్యుల అలవాటు. ఇంతకంటే అభాసము వేరొకటియుండదు. ఏ గ్రామములోనున్నవారు ఆ గ్రామమునకు సూర్యోదయ సూర్యాస్తమయములను సాధించుకొని, అహః ప్రమాణమును 8 యామార్థములుగా విభజించి, తదనుగుణముగా రాహుకాలమును గణించవలసియుండును. సామాన్యముగా, ఈపని చేయువారు లేరు. కనుక, వాస్తవముగా ఉన్నప్పుడు లేదని, లేనప్పుడు ఉన్నదని భావించి, రాహుకాలములో పనులు జరుపుటలో, రాహుకాలము లేనప్పుడు పనులు మానుటలో సంభవించుచున్నది. ఇది అనర్థకరమైన అవ్యవస్థ.

ఈ క్రింది ఉదాహరణము చూడుడు: 29-12-1957 వ తేదీకి బొంబాయిలో, బుద్ధగయలో, రాహుకాలము ఎట్లుండునో, వాడుక పద్ధతి రాహుకాలముతో పోల్చి వ్యత్యాసమును గమనింతము: ఆనాడు భానువారము

	బొంబాయి.	బుద్ధగయ.
అక్షాంశ	18-54 ఉ.	25-54 ఉ.
రేఖాంశ కాలము	4-51-12	5-40-0
	పూర్వము	పూర్వము
స్థానిక సూర్యోదయ కాలము	6-32 Am	6-46 Am
,, అస్తమాన ,,	5-32 Pm	5-17 Pm
అహః ప్రమాణము	11-0	10-31
యామార్థము	1-22½	1-11
7 యామార్థములు	9-37½	9-13
రాహుకాలారంభము (L. m. T)	4-9½ Pm	3-59 Pm
రేఖాంశపోగా	4-51	5-40
గ్రీనిచ్ మధ్యమ కాలము	11-18½ Am	10-19 Am
స్టాండర్డు	5-30	5-30
రాహుకాలారంభము (I. S. T.)	4-48½ Pm	3-49 Pm
యామార్థము	1-22½	1-19
రాహుకాలాంతము (I. S. T.)	6-11 Pm	5-8 Pm

ఇంతకంటే సులభముగా విషనాడీ కాలమును సాధించవచ్చుగదా?

"గతానుగతికోలోకః"

అనుబంధము

వారములలో దుష్టకాలములు

[ఇవి పగటికాలములు]

వారము		'రాహు' కాలము	వార 'త్యాజ్య' కాలము	'గుళిక' కాలము	'యమ కంటక' కాలము	'అర్ధ ప్రహర' కాలము
		గం. ని.	గం. ని.	గం. ని.	గం. ని.	గం. ని.
భాను	మొదలు	4-30	2- 0	3- 0	12- 0	10-30
	వరకు	6- 0	3.36	4-30	1-30	12- 0
సోమ	మొదలు	7-30	6-48	1-30	10-30	3- 0
	వరకు	9- 0	8-24	3- 0	12- 0	9-30
మంగళ	మొదలు	3- 0	10-48	12- 0	9- 0	7-30
	వరకు	4-30	12-24	1-30	10-30	9- 0
బుధ	మొదలు	12- 0	10- 0	10-30	7-30	12- 0
	వరకు	1-30	11-36	12- 0	9- 0	1-30
గురు	మొదలు	1-30	8-40	9- 0	6- 0	4-30
	వరకు	3- 0	10-24	10-30	7-30	6- 0
శుక్ర	మొదలు	10-30	8- 0	7-30	3- 0	9- 0
	వరకు	12- 0	9-36	9- 0	4-30	10-30
శని	మొదలు	9- 0	12- 0	6- 0	1-30	1-30
	వరకు	10-30	1-36	7-30	3- 0	3- 0

సూచన:—(1) 'అర్ధప్రహరము'లో మొదటి 48 నిమిషములు, 'యమ కంటకము'లో నడుమ 48 నిమిషములు, 'గుళిక' కాలములో అంతమందు 48 నిమిషములు, మాత్రము వర్జ్యము.

(2) ఉదయము 6 గంటలకు సూర్యోదయము, సాయంకాలము 6 గంటలకు అస్తమానము, జరుగు నాటి వ్యవస్థ ఇది. ఇతర దినములకు సూర్యోదయకాలమును, అహస్సును, గమనించి త్రైరాశికముతో కాలములను సవరించుకోవలయును.

అడిగిరాని వరాలు

శ్రీ మధురాంతకం రాజారాం

స్త్రరం అరుగుమీద పడుకున్న రవణయ్య ఉలికిపడి లేచి కూచుంటూ "అరెరే, బాగా తెల్లవారిపోయి నట్టుందే" అనుకున్నాడు. పల్లెటూళ్ళలోనైతే అప్పటికి బాగా ఘల్లుమని తెల్లవారినట్టే లెక్క. పట్టణాల్లో దారి వేరు. ఇక్కడ వేకువ జామున నిద్రాదేవత చిద్విలాసం మరొక మోతాదు మితిమీరుతుందేమో ననిపిస్తుంది. నౌకరీ చేస్తూ ముప్ఫైయేళ్ళుగా రవణయ్య స్థిరపడిపోయిన రామాపురం స్వరూపంలోగూడా ఇప్పుడిప్పుడు సినిమా థియేటరు, రైసుమిల్లు, వేళకు సరిగ్గా 'భోజనం రెడీ' అంటూ బోర్డు తగిలించుకునే, హోటళ్లులాంటి,పట్టణం తాలూకు హంగులు, వేరూను కొనిపోయిన మాట నిజమే! కానీ అక్కడ యింకా ప్రాతస్సమయం కోడి కూతకూ, పక్షుల కలరవాలకు, పైరు పచ్చలపైనుంచి చల్లగా మెల్లగా సాగివచ్చే కమ్మ తెమ్మెరకూ నోచుకుంటూనే వుంది. కోడి కూతకుబదులు రెండునిమిషాలపాటు చెవుల్లో చేరి గీపెట్టిన సైరను మోతతో రవణయ్య కలతి నిద్ర, నిద్రలో కంటున్న కల, కలలో కలవరాలు అన్నీ ఒక్కసారిగా చెదిరిపోయాయి. అతను అరుగుపైన లేచి కూచునే సరికి ఎదురింటి గుమ్మంముందు రోడ్డులో సైకిలు నిలబెట్టి కుర్రాడొకడు 'పాల్ పాల్' అంటూ బెల్ మోగించేస్తున్నాడు. భుజాన పేడబుట్టతో ఆడమనిషి ఒకావిడ ప్రక్కయింటి గుమ్మంముందు "అమ్మో, ఆవెమ్మగ్, తలుపు తలుపు" అంటూ కవాటాన్ని దబదబ బాదేస్తున్నది.

'నా జీవిత మంతా ఏమిటి? సత్యంతో నేను చేసిన సాధన లేగదా' అంటాడు మహాత్ముడు. రవణయ్య బ్రతుకంతా ఏమిటి? అది నమ్మకాలనే మిట్టపల్లాల బాటలో క్రిందికి దొర్లి, పైకి ప్రాకుతూ నత్తిసల్లలా గమనం సాగిస్తున్న రెండెద్దులబండి. ఆ నమ్మకాల్లో ముప్పాతిక మువ్వీసం మూఢనమ్మకాలే కావచ్చు. కాని ఆశా నిరాశల పడుగుపేకే మానవ జీవితమని నిర్వచించుకుంటే, రవణయ్యకు ఆశల్నీ, నిరాశల్నీ సరఫరా చేసినవి ఈ మూఢనమ్మకాలే! రవణయ్య సామాన్య మానవుడు. అతడి ఆశలూ, నిరాశలూ, గొప్పగా అంచనా వేయదగ్గవి కావు. ఉదయం లేవగానే భార్య ముఖం కనిపిస్తుంది. అది రవణయ్యకు ఆనందహేతువు. ఆరోజు తన తలపైన సిరి నృత్యంచేస్తుందని అతడి నమ్మకం. లేదా చెవులకు అమృతసేచనంలా ఓ శుభ వార్త ఏవైపునుంచయినా రావచ్చు. కానీ రవణయ్యకు ఒళ్ళు విరచుకుని నిద్రలేచి నప్పుడల్లా భార్యముఖమే కన్పిస్తుందని గ్యారంటీ ఏముంది? పొయిలోనుంచి లేచి తోకాడించుకుంటూ నడవలోకి పారిపోతున్న గండు పిల్లి, పెరట్లో జామచెట్టు కొమ్మపైన కాఁ కాఁ అంటూ కొలువు దీరిన ఒంటరికాకి లాంటి క్షుద్ర ప్రాణులుగూడా తమ దర్శనంతో అడపాదడపా రవణయ్యను అనుగ్రహిస్తూ వచ్చాయి. నిర్భాగ్యుడు, రవణయ్య తన ఏభైనాలుగేళ్ళ జీవితం పొడుగునా దుశ్శకున బాధితుడు! అవి ఎదురైన రోజున అతను గుండెను కాస్తా అరిచేతిలోకి తీసుకుని గుప్పెట్లో గట్టిగా దాచుకునేవాడు! తన ప్రవర్తన సరిగ్గా లేదని డిస్ట్రిక్టుబోర్డు ఆఫీసునుంచి పోస్టింగు ఆర్డరు వచ్చేస్తుందేమో! ఉత్త పుణ్యానికి తనపైన ఆదినుంచీ పగబూనివున్న ఆచారి హెడ్మాస్టరు గారితో చేసే అయి లేని పోని నేరాలు మోపుతాడేమో! ఆఫీసురూము కెదురుగా నేరేడు కొమ్మకు వ్రేలాడుతున్న యినుపతుండు తను గంట కొడుతున్నప్పుడు తెగి తలపైన కూలిపోతుందేమో! ఏమో, ఎవరు చెప్పగలరు? ఈ లోకంలో అవాంతరాలకేనా కొదువ?

అప్పుడప్పుడే విచ్చిపోతున్న మసకచీకటిలో ప్రక్కయింటి తలుపును బాదేస్తున్న ఆడమనిషి ముఖం కనిపించగానే రవణయ్యగుండెల్లో రాయిపడి నట్టయింది. ఆవిడనుదుట కుంకుమ లేదు. కొంపదీసి వితంతువు కాదు గదా! కాదు. అయివుండదు. పనిమనిషి,

కదా, సైరన్ మ్రోగకముందే మెలుకువ కౌగిలి విడిపించుకుని ఆదరా బాదరా యిలా పరుగెత్తి వచ్చివుంటుంది. క్రితం రాత్రి పడుకోబోతూ నమిలిన తాంబూలంతో ఎరుపెక్కిన ఆ పెదవులు, ఆ చెదరిన ముంగురులు, అన్నింటికన్నా ముఖ్యం—కొప్పులోనుంచి తొంగి చూస్తున్న నాలుగైదు నలిగిన మల్లెపువ్వులు ఆవిషయాన్ని చెప్పకనే చెబుతున్నాయి. రవణయ్య చివుక్కున లేచి నిల్చుని రోడ్డు పైకినడిచాడు.

ఆక్షణంలో అతడికి ఏనుగంతబలమూ, ఏనుగెక్కినంత సంబరమూ కలిగాయి!

రోడ్డుపైన నడుస్తూ రవణయ్య తనకు రాత్రి ఎప్పుడు నిద్రపట్టిందా అన్న ఆలోచనలో పడ్డాడు. ఆరాత్రికిక నిద్రలేదనుకున్న తర్వాత, తాలూకాఫీసులో టాంగుటాంగున గంట రెండుసార్లు మ్రోగిన తర్వాత ఎప్పుడో, ఎలాగో వచ్చేసింది నిద్ర! అన్నట్టు ఆ నిద్రలో ఏవో కలలు గూడా వచ్చినట్టున్నాయి. ఓహో! అవి వేకువ జామున వచ్చిన కలలు!

వేకువజామున కన్నకలలు తప్పకుండా ఫలింపుకొస్తాయన్నది రవణయ్యకున్న వెయ్యి నమ్మకాల్లో ఒక్కటి!

రవణయ్య నిట్టూర్పు విడిచాడు. మనిషికి అరవై యేళ్ళు దగ్గిరిస్తే 'అరులో మరులో' అన్నారు. ఇటీవల తనకు మతి మరపు ఎక్కువై పోతోంది. లేకపోతే ఆ బంగారుకలల్లో మచ్చుకు ఒక్కటి జ్ఞప్తికి రాకూడదా! రవణయ్య మనోఫలకం మీద కలలకు సంబంధించిన స్మృతులన్నీ మటుమాయమై పోతున్నాయి. లేదంటే లీలగా నలుగురైదుగురు వ్యక్తులు తనకలల్లో తారట్లాడినట్టు మాత్రం అతిదూహించుకో గలిగాడు—ఆనలుగురైదుగురిలోనూ ముఖ్యుడు సూరిగాడు! తనకుమారుడి నింకా సూరిగాడుగానే భావిస్తున్నందుకు రవణయ్య కించపడ్డాడు. వాడు సూరిగాడు కాదు. సూర్యనారాయణ. ఈ సంగతి లోకానికి తెలిసి వచ్చేరోజు యిక ఎంతోదూరంలో లేదు!

రవణయ్య పెదవులపైన ఓనవ్వు—తూర్పుకొండ పైన విరిసిపోతున్న అరుణరాగం లాంటి లేనవ్వు పరవళ్ళు త్రొక్కుతూ అలా అలా గుంటలు పడ్డ దవడల మీదికి ప్రాకిపోయింది.

మరుక్షణాన రవణయ్య ఆలోచనలన్నీ వెంకటసుబ్బయ్యగారి వైపుకు ఉచ్చులు తెంచుకున్నాయి. రవణయ్య కలల్లో సంచారం సలిపిన నలుగురైదుగురిలో ఈ వెంకటసుబ్బయ్యగారు కూడా ఒకరు. కానీ రవణయ్యకు సూరిగాడెంత సన్నిహితుడో, ఎంత ఆత్మీయుడో వెంకటసుబ్బయ్య గారంత దూరస్థులు. కాని వెంకటసుబ్బయ్యగారితో తనకు చెప్పుకో తగ్గ పరిచయముందని రవణయ్య అనుకుంటాడు. అలా అనుకోడానికి గల కారణాలను నెమరు వేసుకోడమంటే రవణయ్యకు చాలాయిష్టం! నాలుగేళ్ళకు ముందు యిదే డిస్ట్రిక్టుబోర్డు ప్రెసిడెంటు హోదాలో వెంకటసుబ్బయ్యగారు రామాపురం విచ్చేసినప్పుడు తను లేతకొబ్బరికాయలు కొట్టి చెంబునిండా ఆయనకు ఎడనీరు సమర్పించుకున్నాడు. మండుటెండలో ఆ ముప్పైమైళ్ళ కారుప్రయాణము, ప్రయాణానంతరం హఠాత్తుగా వచ్చిన సుండెపోటు, అలాగ, అవన్నీ ఆయన మరచిపోనిపక్షంలో, అప్పుడు తనుచేసిన సపర్యలు సైతం ఆయనకు జ్ఞప్తిలోవుండక పోవు.

అప్పటికి రవణయ్య వెంకటసుబ్బయ్యగారి బంగళాదగ్గరికి వచ్చేశాడు. ఇనుపకమ్మీల గేటు, మూసింది మూసినట్టేవుంది. రవణయ్య గేటుకానుకుని మూడంతస్తుల మేడవైపు చూడసాగాడు. ఈ మేడలో వెంకటసుబ్బయ్యగారు ఎక్కడో, ఏ గదిలోనో పడుకుని నిద్రపోతుంటారు. మేడకు నాలుగు వైపులా చెట్లు, చెట్లచుట్టూ ప్రహరీగోడ, గోడప్రక్కన తారురోడ్డు రోడ్డుకటువైపున పట్టణం! ఎంతసేపు చూచినా మేడలూ మిల్లులూ, దుకాణాలు గిడ్డంగులూ, పార్కులు ఫ్యాక్టరీలు! ఈ పట్టణానికి దూరంగా ఎక్కడో సూర్యుడుదయిస్తాడు. అందుచేతనే కాబోలు పట్టణాల్లో ఆలస్యంగా తెల్లవారుతుంది. వెంకటసుబ్బయ్యగారు నిద్రలేవడానికి కూడా ఆలస్యం, కావచ్చు.

రవణయ్య పదిబారల్లోవున్న కొళాయి దగ్గరకు వెళ్ళి, క్రిందపడివున్న యిటుక ముక్కను తీసుకుని వ్రేళ్ళతో నలిపి ఆ పొడితో తన అలవాటు ప్రకారం దంతధావనం ముగించాడు. ఆతర్వాత మెల్లగా గేటు తెరుచుకుని లోపల ప్రవేశించి వెంకటసుబ్బయ్య గారెప్పుడు లేస్తారో-లేవనీ అనుకుంటూ భవనానికి దూరంగా ఓచెట్టుక్రింద కూర్చున్నాడు.

రవణయ్య చెట్టుక్రింద కూర్చున్నప్పుడు గంట ఆరున్నర. ఏడుగంటల తర్వాత, ఒక్కొక్కకన్నే

తెరుస్తున్న సహస్రాక్షుడికి మల్లే భవనంలో కిటికీలు ఒకదానివెంబడి ఒకటి తెరచుకోసాగాయి. రేడియో జోలికి ఎవరో పోయినట్టున్నారు. నిశ్చల తపోనిష్ఠలో వున్న మహర్షితో నా చెలగాటం! కోపంతో ఒళ్లు మరచిన మహర్షి శాపవాక్యంలా సంగీతం యిల్లంతటా మారుమ్రోగి పోతోంది. ఇటు ఈవైపున రోడ్డులో 'బోంయ్ బోంయ్' మని కుయ్యికుంటూ బస్సులూ, లారీలు గాలిని దూసుకుపోతున్నాయి. ప్రక్కవీధిలో ఫ్యాక్టరీ పొగగొట్టం తాలూకు వేడి నిట్టూర్పులు గూడా ప్రారంభమై పోయాయి. 'అబ్బ! వెంకటసుబ్బయ్య గారు నిద్రలేవడానికి యింత తతంగం జరగాలేమో' అనుకున్నాడు రవణయ్య!

గంట ఎనిమిదైంది. గేటు తెరుచుకుని కాకీ దుస్తుల్లో స్థూలకాయాన్ని బంధించుకున్న పొట్టిమనిషి ఒకడు రవణయ్యను చూచీ చూడనట్టు భవనంవైపు విసవిస నడచిపోయాడు. అతడు గేటుదగ్గర కనిపించగానే రవణయ్య చెట్టుకానుకున్నవాడు, లేచి నిటారుగా కూర్చున్నాడు. ఇతడు మేడలోకి వెళ్తున్నాడు. తిరిగి వచ్చినప్పుడు ఇతడ్ని అడిగితే వెంకట సుబ్బయ్యగారు నిద్రలేచారో లేదో తెలుస్తుంది. కానీ యితగాడు త్వరగా తిరిగి వస్తాడని నమ్మక మేమిటి?... కానీ రవణయ్య అనుకున్నట్టు ఆ కాకీ దుస్తుల హ్రస్వకాయుడు భవనంలో ప్రవేశించలేదు. వెనుకవైపుకు వెళ్లి రంయ్‌మని ఓ కారును తెచ్చి సౌధ ప్రాంగణంలో నిలబెట్టి, రెండుసార్లు హారన్ మ్రోగించి క్రిందికి దూకేశాడు.

రవణయ్య లేచి నిల్చున్నాడు. వెంకట సుబయ్య గారు నిద్రలేచేంతవరకూ తను ఈ చెట్టుక్రింద కూచుని కునికిపాట్లు పడ్డంకన్నా, ఈ డ్రయివరు నెందుకు మాట్లాడించ గూడదు! ఒక్కొక్కప్పుడు గొప్పవాళ్ల యిళ్లల్లో పనిచేసే వంట మనుషులు, కారు డ్రయివర్లలాంటి సామాన్యులవల్ల గూడా కార్యాలు సానుకూలమౌతాయి!

సమిసలాంటి పొగచుట్టను పళ్లమధ్య యిరికించి హోమకార్యతత్పరుడౌతున్న కారుడ్రయివరు రవణయ్యను పైకి క్రిందికీ ఓసారి పరీక్షించి రెండుసార్లు వెళ్లిపొమ్మనట్లు చేయివిసరి, చివరకు "ఏమిటి, ఎవరికోసం, ఏవూరు" అంటూ అతడిపైకి మూడు ప్రశ్నలను సంధించి వదిలిపెట్టాడు.

"మాది రామాపురం బాబూ!" వినయం ఉట్టిపడేలా ప్రత్యుత్తర మిచ్చాడు రవణయ్య. ముప్ఫయి నాలుగేళ్ల సర్వీసులో ఏడెనిమిది మంది హెడ్మాస్టర్ల క్రింద పనిచేసిన రవణయ్యకు వినయంగా గాక మరొక రకంగా మాట్లాడ్డం చేతగాదు.

"ఐతే, రామాపురం వాళ్లందరూ యిలా ప్రెసిడెంటుగారి యింటిచుట్టూ గిరికీలు కొట్టవచ్చునేమిటి?"

"అదికాదు బాబూ! ఉద్యోగంకోసం అప్లికేషను పెట్టుకున్నామూ..."

"అప్లికేషను పెట్టుకున్నావా! ఉద్యోగానికి! నువ్వు!—బలే బాగుంది, బాగుంది!" కారు డ్రయివరు నవ్వేశాడు. అది అచ్చంగా నవ్వు కాదు. రవణయ్య ముందరున్న ప్రాణి ఏనుగ కాదు. అయివుంటే దాన్ని సులభంగా ఘీంకారమని పేర్కొని వుండవచ్చు!

"ఉద్యోగం నాకుకాదు బాబూ! మాఅబ్బాయికి."

కానీ రవణయ్య తన కుమారుడికి సైతం ఉద్యోగాన్ని అర్థించడంలో కారుడ్రయివరకు సామంజస్యం గోచరించలేదు!

"ఎవరికైతే నేమయ్యా! ప్రెసిడెంటుగారు వుద్యోగాల నేమైనా పెప్పరమెంట్లలా జేబులో వేసుకుని తిరుగుతున్నారా, మారాం చేసినవాడికల్లా ఒకటిచ్చి, పొమ్మనడానికి! పో, పో ఆరునెలల తర్వాత ఓసారి కనబడు. జూన్‌లో కొత్తగా అటెండర్లూ, ప్యూనులూ కావలసివస్తారు"

రవణయ్యకు కారు డ్రయివరు పైన హఠాత్తుగా జాలి కలిగింది! "ఓయీ! కారు డ్రయివరూ! నీకెప్పుడూ క్రింది చూపేగదా! ఉన్నట్టుండి నీకీరోజున పైచూపు రమ్మంటే ఎక్కడినుంచి వస్తుంది? నీ బుద్ధికి నా కొడుకు ప్యూనుగా, అటెండరుగా కనిపిస్తున్నాడా?"— రవణయ్య అప్రయత్నంగా నవ్వేశాడు.

"ఏమిటది? వెళ్ళిపొమ్మన్నా" అంటూ కారు డ్రయివరు విసుగుతో ముందుకు కదిలి వరుసగా నాలుగుసార్లు హారన్ మ్రోగించేశాడు.

"ఇదిగో సింహాద్రి! ఏమిటాగోల? తీరా మారా కాఫీ నీళ్ళయినా నోట్లో పోసుకోవాలా పనిలేదా!

ప్రెసిడెంటు గారైతే మటుకూ, ఆయనకూ అన్ని హంగులు అవసరమే!"

రమణయ్యకు మొదటి మాటలు మాత్రం వినిపించాయి. ఆతరువాత మెట్లు దిగుతూదిగుతూవున్న వెంకటసుబ్బయ్యగారూ, ఆయన్ని వెంబడిస్తున్న గౌరవనీయమైన తాళికుడో కదూ కనిపించారు.

"ఏమిటో ఈ ప్రెసిడెంటు గిరీ! ఇదొక విశ్వామిత్ర సృష్టి లేవోయ్ రామనాథం! కలెక్టరీలు, గవర్నరీలు అలాటివన్నీ సాక్షాత్తు బ్రహ్మగారి సృష్టి. అవేమో మనకు రావు. ఇవేమో మనల్ని వదిలవు"

"అంటే జీతం బత్తెం లేని కొలువులన్నమాట" రామనాథం బిగ్గరగా నవ్వేశాడు. చిత్రమేమిటంటే రామనాథం మాట్లాడుతుంటే హేళనచేసినట్టే వుంటుంది. కానీ ఆ హేళనలో దబ్బకు లోపల యిమిడి ఖండంలా, అంకులో దాగివున్న తీయటి ద్రవంలా స్తోత్రపాఠం అంతర్గర్భితమై వుంటుంది.

"ఎక్కవోయ్ రామనాథం! దూరం లేదులే. ట్రావెలర్స్ బంగళా దాకా వెళ్లి వచ్చేద్దాం" అంటూ వెంకటసుబ్బయ్యగారు కారులో కూర్చున్నారు.

ఆయన చూపు కానేటట్టు భయభక్తులతో ఒదుగుళ్ళు పోతూ నిల్చుని వున్న రమణయ్య చేతులు జోడించి "దండాలు బాబూ!" అన్నాడు.

"ఎవరూ?" అన్నారు వెంకటసుబ్బయ్యగారు. ఆ అనడం మాత్రం కారు డ్రయివరుకన్నా సరళంగానే అన్నారు.

"నేనా బాబూ! రామాపురం మిడిల్ స్కూలు ప్యూన్ని."

"ఓహో నువ్వేకదూ! ఆరోజున..."

రమణయ్య ఆనందానికి పట్టపగ్గాల్లేకపోయాయి. ఆ ఆనందాతిరేకంలో అతడు "అవును బాబూ నేనే. మరచిపోయారు కారు" అన్నాడు.

"ఎలా మరచిపోగలను! జన్మకి మరచిపోలేను! ఇలా రావోయ్ రామనాథం! ఇతగాడి మూలంగా నేను రెండు నెలలు కాయలా పడిలేచాను" అన్నారు వెంకటసుబ్బయ్యగారు.

"అలాగా" అంటూ ప్రెసిడెంటు గారంతటి వారిని రెండు నెలలు మంచంపైన పడుకోబెట్టిన నేపాళ మాంత్రికుడు ఒక్కసారి చూడదగినవాడే అనుకున్నట్టు రామనాథం కారు కీవలగా చూచాడు.

"అయ్యో, నే నేం చేశాను బాబూ?" భయంతో వేళ్ళు నులుముకుంటూ అన్నాడు రమణయ్య.

"అదే చెబుతా విను రామనాథం! మండు ఎండ. ఎండుదుమ్ము. అప్పుడు సింహాద్రి లేడులే—రామదాసున్నాడు. అతగాడు స్టీరింగు చక్రం దగ్గర కూర్చుంటే యింకేముంది? ఋతుపర్ణుడికి నలుడు రథం తోలినట్టే! ఆ రామాపురం చేరేసరికి రోడ్డుమీద దుమ్మంతా నాపాలే అయిపోయింది. మంచినీళ్ళు చేదమని నాలుగు బిందెలు తలమీద పోసేసుకున్నాను. హెడ్మాస్టరు నాలుగు సార్లు దగ్గరికి వచ్చి 'వంట చేయిస్తున్నా నండీ' అన్నాడు. కానీ ఏదీ! ఎంతకూ అవంటేనో కళ్లబడదే! ఆవంటా, దేవతా వస్త్రాలు రెండూ ఒకటయిపోయాయి. కడుపులో కొక్కులు త్రవ్వేస్తున్నాయి. ఆఖరుకు శోషే తగిలిందనుకో"

"అయ్యయ్యో! అప్పుడేమైందేమైంది.?" సజీవంగా వున్న ప్రెసిడెంటుగారే తనకా కథ చెబుతున్నారని రామనాథానికి తెలియదేమో! లేకుంటే అంత ఉత్కంఠ బొత్తిగా అనవసరం.

"అప్పుడీ పుణ్యాత్ముడు కనిపించాడు" వెంకటసుబ్బయ్యగారు కథ చెప్పుకుంటూ పోతున్నారు. "బాబూ! ఎడనీరు కాయలు తెమ్మంటారా అన్నాడు. ప్రాణం లేచివచ్చింది. తెమ్మన్నాను. అప్పటికే వేడి తగిలివుండేమో, ఎడనీరు పుచ్చుకోడంతో ఒళ్ళంతా నిషా ఎక్కిపోయింది. సాయంత్రం అదేరోడ్డులో, అదే వాహనంలో పోయినంతదూరం మళ్లీ తిరిగిరావడం జరిగిందా, యింకేముంది? ఎంతకావాలో అంతా అయింది. సాయంత్రానికి జలుబు. అర్ధరాత్రికి చలిజ్వరం, మరునాడు తెల్లవారేసరికి డాక్టరు మందులు, సూదులు, పత్యాలు..."

"ఇదంతా ఏలా వుందంటే..." వెంకటసుబ్బయ్యగారి గీతకు రామనాథం తన భాష్యాన్ని ప్రారంభించేశాడు. "నాకు భక్తులుగా నూరుజన్మలు కావాలా, శత్రువులుగా మూడుజన్మలు కావాలా అన్నాడట విష్ణుదేవుడు! అలా మీకో అపకారంచేయనైనా చేశాడుగానీ, అందుమూలంగా యితగాడు మీకింకా జ్ఞాపకముండిపోయాడు!"

"ఇది మరీబాగుంది! మానవుడు తల్లడిల్లిపోతున్నాడుగదా అని అతడేదో తన చేతనయింది చేస్తే, అది అపకారమా? మన గ్రహచారమను, ఒప్పుకుంటాను" అని వెంకటసుబ్బయ్యగారు రవణయ్యవైపు తిరిగి "ఇప్పుడేంపనిమీద వచ్చినట్టు?" అన్నారు.

"చెబుతానుబాబూ, మా అబ్బాయి ఒకడున్నాడు. వాడు మొన్ననే..."

"ఉండుండు"—వెంకటసుబ్బయ్యగారిసన్నిధిలో ఎదుటివాడి వాక్యాలు కోల్ గాను బస్సులు. అవి విధి నిర్ణయాన్ననుసరించి గమ్యస్థానం చేరనూవచ్చు, చేరకనూపోవచ్చు. రవణయ్యకక్కుతగిలి ఆయన "అన్నట్టు రామాపురం స్కూలుకు క్రొత్తహెడ్మాష్టరు వచ్చేవాడుగదూ?" అన్నారు.

"రానూవచ్చాడు, పోనూపోయాడు బాబూ! రెండు నెలల మెడికల్ లీవులో" అని, కాసేపు గుటకలు మ్రింగి అవకాశం దాటిపోతుందేమోనన్న కంగారులో రవణయ్య "మావాడి సంగతి బాబూ! వాడు మొన్ననే యల్. టి. పాసయ్యాడు. దరఖాస్తు వ్రాసుకుని నెలరోజులయింది. మిమ్మల్నొకసారి చూచిపోదామని వచ్చాను" అన్నాడు.

వెంకటసుబ్బయ్యగారు తృప్తిపడి రామనాథం ముఖంలోకి చూచారు.

రామనాథం ముఖంలో ఆశ్చర్యం సుళ్లు తిరుగుతోంది.

"మాచావటోయ్ రామనాథం! ఇతడి కొడుకు యల్. టి. ప్యాసయ్యాట్ట! తండ్రి డిస్ట్రిక్టుబోర్డు సర్వీసులో ప్యూను. కొడుకు యల్. టి. టీచరు. చూచావా తరతరానికీ తేడా!"

"నిజమే, నిజమే" అంటూ ముక్తాయించి రామనాథం రవణయ్యకేసి తిరిగి "ఇక నువ్వు వెళ్ళవయ్యా! ఉదయం నక్క మొగంచూచి లేచినట్టున్నావు. ఒక తిక్క మళ్లితే ఆయన మీఅబ్బాయిని అదే రామాపురం స్కూల్లోనే హెడ్మాష్టరుగా వేసేయగలరు" అన్నాడు.

"లేకపోతే ఏమిటోయ్! ఈ పందికొక్కులేమైనా పాతకొణాచిని వదిలిపెట్టే రకమా! నలుగుర్ని వేశాము. నలుగురూ లీవు దాఖలుచేసి యింట్లో కూచున్నారు. ఈసారి ఏరికోరి ఓ కుర్రాడినే వేసేద్దామనుకుంటున్నాను" అన్నారు వెంకటసుబ్బయ్యగారు.

"తమదయ, తమదయ" అన్నాడు రవణయ్య.

తన శిల్పపారశ్యం ఘోరమైన అపజయానికి గురైనందువల్ల కాబోలు, రవణయ్యను కొరకొర చూస్తూ కోపాన్నంతా కారుపైకి మళ్ళించాడు సారథి, సింహాద్రి!

* * *

సుష్టుగా అన్నం తిన్నతర్వాత, పచ్చివక్క, లేత తమలపాకు, రవ్వసున్నం, పాలఘాటుపొగాకు వీటి కలయికతో సిద్ధించిన మత్తులో రవణయ్య ఊహలు రామాపురంబస్సు పరుగెత్తుతున్న ఉరవడితో ప్రతికలిపాయో. లేక పందెం వేశాయో చెప్పడంకష్టం. ఏది తలముందు కోరికగా కనిపిస్తూ పాతికేళ్లుగా తనను ఊరించిందో, అది సఫలమయ్యే సూచనలు గోచరమైనప్పుడు మానవుడికి అంత ఉద్వేగం అంత సంభ్రమం కలగడంలో ఆశ్చర్యం లేదు. సూరిగాడి చదువు యింద్రజాలంలా జరిగిందికాదు. స్కాలర్ షిప్పులూ, అవీ దొరికినమాట నిజమే. కాని తనూ భార్యాబిడ్డలు యిక్కడ పచ్చి మంచినీళ్లు త్రాగి పస్తులు పడుకుంటేనే, అక్కడ సూరిగాడు 'టీ'లు త్రాగి పరీక్షలకు చదువగలిగాడు. నలుగురు బిడ్డలతల్లి మంగమ్మ కట్టుకున్న చీరలో మాసికలు పెరిగినకొద్దీ, అజాకు టికాణాలేక తనకు జీబుగడ్డం పెరిగినకొద్దీ అక్కడ మంగమ్మ తాళిమాలు బిస్క, తన కళ్ళల్లో వెలుగు, చదువులో ఒక్కొక్క మెట్టే పైకి రాగలిగాడు. వాడు, తన సూరిగాడు! కండల్ని పీల్చి పిప్పిచేసి, ఎముకల్ని నుగ్గునూచచేసి ఈ లోకం తన వయసును దోపిడీచేస్తే చేసింది. ఇది తన సూరిగాణ్ణి ఏం చేయగలుగుతుంది? బెల్ నొక్కగానే ప్రత్యక్షమై, కన్ను విసరగానే పరుగెత్తి, పొరబాటు చేయకపోయినా తిట్లుతిని, హెడ్మాష్టరుదగ్గరనుంచీ ఆడపిల్లలకు అల్లికపని నేర్పించే పంతులమ్మదాకా అందరికీ లోకువై హీనుడుగా, దీనుడుగా బ్రతకడానికి తన సూరిగాడు ప్యూనుకాడు. కాబోడు. ఇంతకన్నా తనకు కావలిసిందేముంది?

"లేకేం? ఉంది!" రవణయ్య ఆలోచనా ప్రవంతిలో యిదొక సుడిగుండం. తన శ్రమ ఒక మంచి మాటకు నోచుకోలేదు. తన సేవ యింత కృతజ్ఞతకు నోచుకోలేదు. ఎన్ని వార్షికోత్సవాలు, ఎన్ని మీటింగులు, ఎన్ని నాటకాలు! తను గోరీవగ్గర గుంటనక్కలా ఆ ఆఫీసు రూము దగ్గర పడిగాపులుపడుతుండగా

ప్రేయర్ హాలు కవతల వీళ్ళకు ఉపన్యాసాలా? వీళ్లకు నాటకాలా? వీళ్ళకు పూలదండలా? తను అడగదలచుకున్నాడు. ఏ ఖైయేళ్ళ పాతకట్టడంపైన జండా కొయ్యదగ్గర నిలబడి ఊరుపూరంతా వినపడేట్టు ఈ రోజు కాకపోతే నేం, రేపయినా అడిగితీరుతాడు. పురజనులారా! మీరు కూచోడానికి తెల్లవారింది మొదలు ప్రొద్దు వాటారేదాకా బెంచీలుమోసి తల బట్టగట్టిపోయిం దెవరికి? ఓయీ ప్రెసిడెంట్! నీ మెడలో పూలదండలకు బండలుపగిలే ఎండలో రెండుమైళ్లు పరుగెత్తి కాళ్ళు మాడ్చుకున్న దెవరు? అయ్యా,ఆచారీ! వాడది చేశాడు. వీడిది చేశాడు. అందరికీ వందనాలు అంటూ ప్రతి మీటింగుచివరా వల్లించావే! నిజంగా చెమటోడ్చి చచ్చిసున్నమైన వాడెవడో కనిపించలేదా నీకు? ఓయీ శంకర్రావ్! నాకూ తల్లిదండ్రులు పెట్టిన పేరొకటుందని నీకు తెలియదూ? నువ్వు నన్ను 'ఒరేయ్, ఒరేయ్' అనా పిలవడం?

రమణయ్య తలపులు గనుక ఆచారి పైన, శంకర్రావు పైన కేంద్రీకృతమైతే మళ్ళీ ఒకమానాన అక్కడినుంచీ కదలవు.

అన్నట్టు ఆరోజు తెల్లవారుజామున రమణయ్య కలల్లో విహరించిన నలుగురైదుగురిలో ఈ ఆచారి, శంకర్రావులుగూడా వున్నారు!

ఆచారి సన్నగా పసిరికపాములా వుంటాడు. కానీ పసిరికపాము కరవదంటారు. ఆచారి పరుషవాక్కులతో కరవగలడు. చూపుబాణాలతో పొడవగలడు. హుంకారాలతో అంపపుకోత కోయగలడు.

ఆచారి ఎనిమిదిన్నరకల్లా పాఠశాలకు విజయం చేస్తాడు. ఎందరు టీచర్లు స్కూలుకు రావడంలేదు? కానీ ఆచారిరావడం అదొక రాజఠీవి! తన తిట్లు, హుంకారాలే తనకు బరాబరులు పలుకుతుండగా, నాకు నాకే బహుపరాక్ అన్నట్టు తల పైనక్కి, కాళ్ళు ముందుకు వేస్తూ అతడు స్కూల్లో ప్రవేశిస్తుంటే టీచర్లు అత్తచాటు కోడళ్ళు, కుర్రాళ్ళు కుక్కిన పేనులు!

టీచర్స్‌రూములో ఆచారిది అప్రతిహతమైన నిలుబడి! అతడు కుర్చీలో వుండగా సహోపాధ్యాయులు కిముక్కుమని నోరుతెరువరు. తప్పిదారి ఆ కవి బాగా వ్రాశాడనీ, ఒకానొక బొమ్మ బాగుందనీ, ఫలానా సినిమాపాటలో మలుపు మధురంగా వుందనీ, నువ్వన్నావంటే అంతటితో నీకు కీడు మూడినట్టే! ఆమాట నువ్వన్నావుగనుక, ఆచారి దృష్టిలో ఆ కవి వ్రాసింది చెత్త. ఆ బొమ్మఅసహ్యం. ఆ పాట అధ్వాన్నం. అదృష్టవశాత్తు ఆయా కళాకారుల పూర్వజన్మ సుకృతంకొద్దీ ఆచారి దృష్టిలో ఎవరి కృషిఅయినా గుర్తింపుకు రావచ్చు. కానీ అలా ఒకవిషయాన్ని ప్రశంసించే అధికారం, విమర్శించే పరిజ్ఞానం మాత్రం నీకు లేనే లేవు. లాభంలేదు. ఆచారితో వాదించి లాభంలేదు! ఆచారి ఎదుటివాడి అభిప్రాయాల పాలిటికి అలీఘుర్ తాళం. దాన్ని తెరిచే తాళంచెవి భువిలో లేదు!

ఆశ్చర్య మేమిటంటే, యింతటివాడు ఆచారి హెడ్మాస్టరని పేరుబెట్టి ఒక కట్టుకంబాన్ని చూపిస్తే దానిఎదుట అవనత శిరస్కుడై, అంజలిబద్ధుడై నిలచిపోతాడు. ఆచారి నిర్ణయరీత్యా, అసంఖ్యాక మానవ జాతిలో ప్రప్రథముడు ప్రధానోపాధ్యాయుడు. చిట్టచివరివాడు పాఠశాల బంట్రోతు!

స్కూలు స్టాఫులో ఆచారిని మంచిచేసుకోవడానికి ప్రయత్నించి విఫలులైపోయిన దైవోపహతుల్లో రమణయ్య ఒకడు. రమణయ్యకు దీపావళి దీపావళి కాదు. సంక్రాంతి సంక్రాంతి కాదు. ఆచారి కోపానలం తనపైకి ప్రసరించనిరోజు రమణయ్యకు దీపావళి. ఆచారి హెడ్‌మాస్టరు దగ్గర తన అప్రయోజకత్వాన్ని వివరించనిరోజు రమణయ్యకు సంక్రాంతి. ఆచారి తనను కూచోనివ్వడు. నిలుచోనివ్వడు. నిశ్చింతగా నిద్రపోనివ్వడు. తనెప్పుడో ఈ స్కూలుకు ఋణపడ్డాడు. ఆ ఋణాన్ని చక్రవడ్డీతో వసూలుచేస్తున్న నక్షత్రకుడు ఆచారి!

'మనుషులు రావచ్చు. పోవచ్చు. కానీ నేను నిరంతరం ప్రవహిస్తూవుంటాను' అన్నదట ఒక సెలయేరు! ఆ విధంగా పాఠశాలను అంటిపెట్టుకున్న వారిలో ఆచారితర్వాత చెప్పుకోదగ్గవ్యక్తి శంకర్రావు. శంకర్రావు ఆచారికి ఛాయామాత్రుడుగా నటిస్తాడు. కానీ నిజానికి శంకర్రావుకో ప్రత్యేక వ్యక్తిత్వముంది. డబ్బు ఆదాచేయడం అతని జీవితలక్ష్యం. ఏ అదనులో ఎక్కడెక్కడ ఏఏ వస్తువులు దొరుకుతాయో శంకర్రావుకు తెలిసినట్టు మరొకరికి తెలియదు. శంకర్రావు కళ్ళద్దాలను మరచిపోయి స్కూలుకు రాగలడు!

టైమ్‌టేబిల్ మరిచిపోయి క్లాసుకుపోకుండా టీచర్స్ రూములో కూచోగలడు! కాని ప్రతి ఆదివారం రోజూనా రవణయ్యకొక పారుపూరి ప్రయాణాన్ని నిర్ధరించడంలో మాత్రం అతడు అప్రమత్తుడు!

శంకర్రావు భార్య జిహ్వాచాపల్యం రవణయ్యను రామాపురంనుంచి అయిదు మైళ్లలోవున్న రెడ్డిగారి నిమ్మతోటకు ఎన్నిసార్లు నడిపించిందో ఎవరికెరుక? రవణయ్య అనే భారవహన యంత్రంవిూదుగా ఎన్ని టన్నుల వంటచెఱకు, ఎన్ని బారువుల చింతపండు శంకర్రావుయిల్లు చేరుకున్నాయో ఎవరికి తెలుసు?

ప్రొద్దు గ్రుంకేసరికి రామాపురంలో మిడిల్ స్కూలు కెదురుగా బస్సుఆగింది. రవణయ్య బస్సు దిగి మెల్లగా యింటిదారి పట్టాడు. బుడ్డీదీపం దగ్గర కూచుని ఏదోపుస్తకం చదువుకుంటున్న సూర్య నారాయణ రవణయ్య లోపలికిరాగానే "కామాక్షీ! నాన్నొచ్చాడు. నీళ్ళివ్వు" అని చెల్లెల్ని కేక వేశాడు.

కామాక్షి చేతిలోనుంచి నీళ్ళగ్లాసును తీసుకుంటూ రవణయ్య బియ్యంగాలిస్తున్న భార్యవైపు తిరిగి "మనం వెళ్ళినపని కాయో, పండో చెప్పకో" అన్నాడు.

"కాయెందుకౌతుంది? పండేఔతుంది" అంది మంగమ్మ.

"నువ్వేమంటావురా సూరీ!" అన్నాడు రవణయ్య.

సూర్యనారాయణ నవ్వుతూ అన్నాడు. "అమ్మ మాట ఎప్పుడు పొల్లుపోయిందినాన్నా? నేను ప్రతిసారి కాలేజికి వెళ్ళినప్పుడూ పరీక్షవుతావులే, వెళ్ళిరా నాయనా అనేది. ఆ మాట అక్షరాలా జరిగింది. ఇప్పుడూ అంతే!"

* * *

అయిదోరోజు ఉదయం పదిగంటలకు మామూలు ప్రకారం రామాపురం మిడిల్ స్కూల్లో ఫస్టుబెల్ మ్రోగింది. 'హెడ్మాస్టరు ఇన్‌చార్జ్'గా వున్న ఆచారి ప్రార్థనానంతరం విద్యార్థులకు సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని గురించి నాలుగు మంచిమాటలు ఉపదేశించి ఆఫీసురూముకు తిరిగివస్తూ, వరండాలో నిల్చున్న రవణయ్యను చూచి "టపా వచ్చిందా?" అని ప్రశ్నించాడు.

"ఇప్పుడే వచ్చింది బాబూ! టేబిలు పైన వుంచాను" అన్నాడు రవణయ్య.

ఆ తరువాత ఏం జరిగిందో రవణయ్యకు తెలియదు. ఆఫీసు రూములో ప్రవేశించిన అయిదు నిమిషాలకు ఆచారి "శంకర్రావ్, శంకర్రావ్" అంటూ ఓ గావుకేక పెట్టేశాడు.

ఇటు టీచర్స్ రూములోనుంచి శంకర్రావు, యిటు వరండాలోనుంచి రవణయ్య ఆఫీసు రూములో అడుగుపెట్టేసరికి పరిస్థితి ప్రమాదకరంగావుంది. ఆచారి ముఖంలో నెత్తురుచుక్క లేదు. అది భయమో, విస్మయమో, మరొకటో గానీ అతడు నిలువునా కంపించి పోతున్నాడు.

"ఏమిటీ? ఏం జరిగింది" అంటూ శంకర్రావు టేబిలుపైన పడివున్న కాగితాన్ని పైకితీసి ఒకసారి చివరిదాకా చదివేశాడు. క్షణంలో అతడి ముఖకవళికలు సైతం మారిపోయాయి. నిటారుగా నిలుచోలేక అతడు మొదట టేబిలుపైకివంగి, ఆ తరువాత దబాలున కుర్చీలో కూలబడిపోయాడు.

అంతే! ఆ రోజు మధ్యాహ్నంవరకూ ఆచారి, శంకర్రావు లిద్దరూ చేతలుడిగిన విగ్రహాలు! కత్తులూ కటార్లు చేతబట్టుకుని డాక్టరు మంచంప్రక్కన నిలబడి వుండగా, అపాయకరమైన ఆపరేషనుకోసం మత్తులో పడివున్న రోగులు!

రవణయ్య యథాప్రకారం ప్రతి పీరియడ్ చివరా గంటకొట్టాడు. తోటలో చెట్లకన్నింటికీ నీళ్లు చేదిపోశాడు. మధ్యాహ్నం కుర్రాళ్లతోబాటు ఆదరాబాదరా తనూ యింటికి బయల్దేరాడు.

కానీ రవణయ్యకు యింటిలో తనాశించినంత ఆనందకరమైన వాతావరణం ద్యోతకం కాలేదు. అతడి కోసం వాకిటిదగ్గరే కాచుకునివున్న సూర్యనారాయణ జేబులోనుంచి ఓ కవరు పైకితీసి "ఇదంతా ఏమిటి నాన్నా! ఎక్కడో సూచింతా లేకుండా అసిస్టెంటుగా పనిచేయడంపోయి ఈ బాదరబందీ అంతా దేనికి చెప్పు" అన్నాడు.

ఏం చెప్పాలో తోచక రవణయ్య కుమారుడి మోల తెలపటాయిస్తుండగానే లోపలినుంచి మంగమ్మ అందుకుంది.

"తల్లి కడుపులోనుంచే ఎవరూ నేర్చుక రాలేదులే నాయనా! పాడంగా పాడంగా పాట అదే

వస్తుంది. పోనీ నీకు తెలిసినంతవరకూ చెయ్యి. కొట్టి కొఱతేస్తారేమిటి? తెలీందానికి మీ నాన్న అక్కడే వున్నాడుగా!"

"నీకు తెలియదే అమ్మా! నువ్వూరుకో" అన్నాడు. చిరాగ్గా సూర్యనారాయణ.

తండ్రీ కొడుకూ భోజనాలకు కూచున్నారు. మంగమ్మ కంచాలుపెట్టి అన్నం వడ్డిస్తోంది.

అన్నం తినబోతూ సూర్యనారాయణ తల పైకెత్తి "నాకు తెలుసు నాన్నా! ఇదంతా నువ్వు చేసిన పనే" అన్నాడు.

రవణయ్య నేరస్థుడికిమల్లే తలవంచుకుని కంచం ఖాళీచేయడానికి ఉపక్రమించాడు.

ఉట్టిలోనుంచి మజ్జిగ తీసుకుని మంగమ్మ రవణయ్యకు కాస్త దగ్గరగా కూచుంటూ "ఐతే ఏమయ్యా! ఇన్నిరోజులూ మధ్యాన్నాల్లో నువ్వొక్కడివే వచ్చి కాలేదా, యింకా అన్నం కాలేదా అంటూ ఎగిరెగిరి పడేవాడివి. ఇక రేపటినుంచీ అబ్బా, కొడుకూ యిద్దరూ కలిసి వచ్చి నన్ను రాపుకతింటారన్నమాట?" అంది.

"ఒసే వెర్రిమొహమా!" అని రవణయ్య ఓ గ్లాసుడు నీళ్లు గుక్కపట్టి తాగేశాడు. "నీకు నేనూ, అబ్బాయి ఒకటిగానే కనిపిస్తున్నామేమిటి? వాడికేం! వాడు కావలిస్తే ఓ సైకిలు కొనుక్కోగలడు. లేదా వేళకింత అన్నం ఎవరిచేతనైనా..."

"నాన్నా!" ఉక్కిరిబిక్కిరైపోతూ బిగ్గరగా అరిచేశాడు సూర్యనారాయణ.

"ఎందుకురా బాబు అంతకోపం! హెడ్మాస్టరింటికీ, స్కూలుకీ అన్నం మోసి మీనాన్న కాళ్ళు వాచిపోయాయి. చేతి కెదిగిన పిల్ల యింట్లో వంట చేసుకుంటుంది. నా కంతకంటే పనేముంది గనుక! నీకు నే నన్నం తెస్తాన్లే. కొడుక్కి తల్లి అన్నం తెచ్చిపెట్టడం తప్పేమీ కాదు."

"ఐతే నీకొడుకు హెడ్మాస్టరీ చేస్తున్నాడని నువ్వు యింటికీ స్కూలుకూ అన్నంమోస్తావా అమ్మా?" అన్నాడు దీనంగా సూర్యనారాయణ.

మంగమ్మ చేతుల్ని ముందుకుసాచి "ఈ చేతులు ఏ హెడ్మాస్టరింట్లో చాకిరీ చేయలేదురా నాయనా? చూడు బొబ్బ లెక్కవిచ్చోటుందేమో! ఇక నీకుచేస్తేనా చేవరిగిపోయేది!" అంది.

సూర్యనారాయణ కంచం అవతలకి తోసి, పెరట్లోకివెళ్లి చేయికడుక్కున్నాడు.

* * *

మరునాడు ఉదయంనుంచీ సాయంత్రం వరకూ రవణయ్యకు తీరిగ్గానే గడచిపోయింది. సూర్యనారాయణ ఉదయం పదిగంటలకు ఛార్జి పుచ్చుకున్నాడు. పదకొండుగంటలప్పుడు ఓ మెమో వ్రాసి జీతం చెల్లించడానికని ఆఫీసురూము దగ్గరికివచ్చిన కుర్రాడిచేతి కిచ్చి టీచర్లకు చూపి సంతకాలు తీసుకరమ్మన్నాడు. ఇంతకాలంగా తను చేస్తున్న పనిని, ఈరోజు మరొకడెందుకు చేయాలో రవణయ్య కర్థం కాలేదు. కుర్రాడి కడ్డుతగిలి, మెమోను తీసుకుని రవణయ్య తనే క్లాసుల పైకి బయల్దేరాడు. భగీరథుణ్ణి వెన్నంటిన గంగాప్రవాహంలా ఆరోజు రవణయ్య నడిచినంత మేరకూ నిశ్శబ్దమే తాండవించింది. మెమోను టేబిల్ పైకి విసరి అతడు క్లాసురూములో నిల్చున్న ఒకటి, ఒకటిన్నర నిమిషంపాటూ విద్యార్థులు విద్యార్థులు కారు, ఉపాధ్యాయుడు ఉపాధ్యాయుడు కాడు, ప్రేక్షకులకు చిరపరిచితమైన నాటకంలో అలవాటుగా సేవకుడి పాత్రధరించే నటుడు, ఉన్నట్టుండి రంగంపైన రాజుగా ప్రత్యక్షమైతే ఆ పరిస్థితి కొంత ఎబ్బెట్టుగా వుండక తప్పదు. నిన్నటివరకూ వీడు సేవక వేషధారే కదా అన్న చులకనభావమూ, ఆ క్షణంలో అతడు ప్రదర్శిస్తున్న రాజఠీవి పట్ల అసహనమూ ప్రేక్షకులకు కలిగి తీరుతుంది. కానీ అది నాటకం కావడంవల్ల బూటకమనీ, నిజానికి ఆ నటుడు సేవకుడికంటే రాజుకంటే భిన్నుడయిన వేరొకవ్యక్తి అన్న స్పృహ ప్రేక్షకులకు అప్పటికో, మరికొంత సేపటికో కలుగకపోదు. కానీ రవణయ్య విషయం అలాటిది కాదు. జగన్నాటక రంగంలో అతడిది బంట్రోతుపాత్ర. జన్మతహా రవణయ్య అమాయకుడు, నిర్ధనుడు. అందువల్ల పరాభవాలకు సన్నిహితుడు. పరాభవాలకు ప్రతీకారం సెరపదలచుకుంటే రవణయ్య మున్ముందుగా లాటరీలో ఓ లక్షరూపాయలు గెలవగలగాలి. కానీ రవణయ్యకు లాటరీపైన నమ్మకంలేదు. ఐనా అతడు ఒక విచిత్రమైన లాటరీలో పాల్గొన్నాడు. సంపాదనలో తినీ తినకా సగానికి పైగా మిగిల్చి, ఆ డబ్బును కుర్రాడి చదువుపైన వెచ్చించడం లాటరీగాక మరేమిటి? వాడు చదువుతాడని ఏం నమ్మకం? తీరా పరీక్షలో పల్టీకొట్టి దేశంపైన వెళ్ళిపోతే? అదృష్టవశాత్తు రవణయ్య ఈ

లాటరీలో గెలిచాడు.! అందువల్ల అతడి స్థానంలో మార్పుకలగనిమాట నిజమే! కానీ ఆ స్థానానికి బలం చేకూరిందనిమాత్రం ఒప్పుకోక తప్పదు.

రమణయ్య ఆఫీసురూముదగ్గరికి వచ్చేసరికి సూర్య నారాయణ కుర్చీలో లేడు. మెమోను టేబిలుపైన వుంచి రమణయ్య గడియారంవైపు చూచాడు. రెండు ముళ్లూ పన్నెండుదగ్గర కలుసుకుంటున్నాయి. అంటే మూడో పీరియడు ఆఖరుకావడానికింకా పదిహేను నిమిషాలున్నాయన్నమాట! రమణయ్య బుర్రలో ఓ ఆలోచన మెరపులా మెరిసింది. ఇంతకాలం తను పీరియడ్లననుసరించి బెల్ కొట్టాడు. ఇకమీదట అలా కాదు! ఇంక తననుసరించే పీరియడ్లు జరుగుతాయి!.. అతను చరచరా బయటికి వచ్చి మూడుసార్లు బెల్ మ్రోగించేశాడు!

నాలుగోపీరియడ్ ప్రారంభం కాగానే రమణయ్య తోటలోపలికి వెళ్ళి ఓమూలగా చెట్టుక్రింద పైపంచ పరుచుకున్నాడు. ముఖాలు వెలవెలబోతుండగా గదుల్లోనుంచి బయటికి వస్తున్న టీచర్లను చూస్తుంటే అతడికి నవ్వాగిందికాదు. అప్పుడే ఏము౦ది వీళ్ళపని? ముందుంది ముసళ్లపండుగ! ముప్పతిప్పలుబెట్టి వీళ్లని మూడు చెరువుల నీళ్లు త్రాగించకపోతే తనపేరు రమణయ్య కాదు!

విరియబూసిన దేవగన్నేరు పువ్వులపైనుంచి తోటలో గాలి చల్లగా, మత్తుగా వీస్తోంది. రమణయ్య చిటికె వేస్తూ ఆవులించి కళ్ళుమూసుకున్నాడు. మరి కొంతసేపటికి అతడికి నిద్ర గూడా పట్టివుండేదే! కానీ యింతలో వెదురుతడిక తెరచుకున్నట్టు అలికిడి వినరావడంతో రమణయ్య కళ్లు తెరిచాడు. వచ్చేడివాడు ఆచారి!

ఆచారి క్లాసురూమును, టీచర్సురూమును వదలిపెట్టి అప్పుడప్పుడూ తోటలో ఎందుకు ప్రవేశిస్తాడో రమణయ్యకు బాగా తెలుసు. ఆచారి నాలుగైదు రోజులపాటు తిండీతీర్థం లేకపోయినా వుండిపోగలడు గాని గంటకొక్కసారి చుక్కాడుపొగను సేవించకపోతే మాత్రం బ్రతుకలేడు. అవిధంగా ధూమేశ్వరీ ఉపాసకుల్లో ఆచారి పరమనైష్ఠికుడు.

ఆచారిని చూడగానే రమణయ్యబుర్రలో రెండోసారిగా మళ్ళీ ఓ మెరుపు మెరిసింది. ఆ మెరుపుకు వెనుక మేఘానికి మూలం ఏడెనిమిదేళ్లక్రితం జరిగిన సంఘటన: ఓరోజు సాయంత్రం తను బజారుకు వెళ్ళి ఆచారికి అకౌంటువున్న అంగట్లోనుంచి ఓ బీడీకట్ట తీసుకొచ్చాడు. అప్పటికి తనకు రోమ్ముపడిశం పట్టి నాలుగురోజులయింది. తను చేసిన నేరమల్లా ఒక్క బీడీ యిస్తారా బాబూ అని అడగటమే! ఆచారి అగ్గి పోయాడు. తనకు అంతరాలు తెలియవని ఆడిపోశాడు. అంతటితో వూరుకున్నా వయమే! ఫిర్యాదు హెడ్మాస్టరుదాకా తీసుకెళ్లాడు. ఆ హెడ్మాస్టరుకు ఆచారి మాట వేదవాక్యం! ఆచారి తనపట్ల కినుక ప్రదర్శించడ మేతరువాయి, ఆ హెడ్మాస్టరు తన నీ పాయిలో పెట్టి, ఆ పాయిలో తీయడమే తన దినకృత్యంగా పెట్టుకున్నాడు.

దేవగన్నేరు చెట్టుక్రింద పడుకున్న రమణయ్య చివాలున లేచి కూచున్నాడు. ఆచారికి వినపడేటట్టు గొంతు సవరించుకుని 'మేష్టారూ' అన్నాడు.

పిలుపు వినిపించగానే ఆచారి త్రుళ్లిపడ్డాడు. అతడి కెందుకో భయంకలిగింది. అతను అక్కడినుంచి చల్లగా జారుకుందామనిగూడా తలపోశాడు.

"మిమ్మల్నే మేష్టారూ! ఇలా రండి వెళ్లి పోదురుగాని"

ఆచారి అప్రయత్నంగా రమణయ్యను సమీపించాడు.

రమణయ్య జేబులోనుంచి ఓ బీడీకట్ట పైకి తీసి, అందులోనుంచి ఓ బీడీ మాత్రం తీసుకుని "తీసుకోండి మేష్టారూ" అంటూ చేయి చాచాడు.

ఆచారి ఆశ్చర్యంతో నోరు తెరిచేశాడు.

"బీడీ మేష్టారూ! గడియారం మార్కు ది" రమణయ్య వర్ణింపసాగాడు "గుంటూరు పొగాకుగదా, ఒంటికి చాలా మంచిది. మొన్నమొన్ననే బజారుకు వచ్చింది. మీరూ వినేవుంటారు. జండాలు చేతబట్టుకుని కుర్రాళ్ళిద్దరు వీధులవెంబడి అరుస్తుంటారు: గోపాలం! - ఏంసార్ - ఎక్కడికోయ్ - బజారుకండీ- ఎందుకోసం-బీడీకోసం-ఏంబీడీ-గడియారంమార్కు ..."

ఆచారి శరీరంపైన తేమ్నాళ్ళ, జెర్రులూ ప్రాకుతున్నాయి. మరొకరికయితే రమణయ్య ప్రవర్తనకు అప్పటికప్పుడుఅర్థంగోచరించివుండేదో కాదో చెప్పడం కష్టం! ఆచారి సూక్ష్మగ్రాహి. అసలు కారణమేదో,

అతి డిప్టీ పసిగట్టేశాడు. ఐనా యిదేం ప్రతీకారం! కాకమరేమిటి? ఇతను రవణయ్యేనా? కాదు. సూది గుచ్చినందుకు కోప్పడి దర్జీవాడిపైన బురదనీళ్లు క్రుమ్మరించిన ఏనుగ వీడు! ఈ ఏనుగ తొండం పైకెత్తి, మీదికి దూకితే తనేం చేయగలడు? ఆచారి అడుగు వెనక్కి తీశాడు. నిమిషంలో తడిక దాటుకుని దూరంగా వెళ్ళిపోయాడు.

నాలుగో పీరియడు పూర్తికావస్తోంది. వ్యాయాధిపత్రిమాల తన నిర్లక్ష్యాన్ని సహేతుకంగా సమర్థించుకోలేని నేరస్థుడికి మల్లే, సెకండుఫారం 'సి' సెక్షనులో నలభైమంది కుర్రాళ్లు ఎదుట శంకర్రావు వ్యాసానికీ వలయపరిధికీ గల నిష్పత్తిని విశదీకరించలేక సతమతమై పోతున్నాడు. వివిధ పాఠ్యభాగాలతో బుర్ర వేడెక్కిపోయిన తర్వాత, ఎప్పుడెప్పుడు యింటికిపోయి కంచాలపైన కలియబడుదామా అని కాచుకుని కూర్చున్న విద్యార్థులకు లెక్కలు బోధించవలసి రావడం ఉపాధ్యాయుడికి శిక్షలాంటిది. ఈ శిక్ష టైమ్‌టేబిల్ తయారవుతున్న రోజుల్లో శంకర్రావు ఆచారికి పదిరూపాయలు అప్పివ్వడంలో తామసించినందుకు సద్యఃఫలితం! శంకర్రావు లోలోపల ఆచారిని తిట్టుకుంటూ, బెల్ కోసం చెవులు రిక్కించుకుని కుర్చీలో స్తబ్దుడై కూచున్నాడు.

కానీ ఒంటిగంటకు సరిగ్గా గంట మ్రోగలేదు. శంకర్రావు ఓర్పును పరీక్షించడానికి నిశ్చయించుకున్నటువంటిదై అతడి చేతిగడియారంలో పెద్దముల్లు పన్నెండుదగ్గర బయలుదేరి ఒకటి రెండు మూడు నాలుగు మజిలీలను దాటుకుంటూ ముందుకు వెళ్ళిపోతోంది.

దిక్కులు తోచక శంకర్రావు ఏడుపు మొహం పెట్టి కుర్చీలో అలాగే కూలబడివుండగా, ప్రక్క గదిలోనుంచి ఓ సహోపాధ్యాయుడు బయటికి వచ్చి "శంకర్రావుగారూ! ఓమాట" అన్నాడు.

"ఏమిటీ-ఏమిటీ" అంటూ శంకర్రావు వరండాలోకి పరుగుదీశాడు.

"ఈ రోజు గంట మ్రోగదు" సహోపాధ్యాయుడు శంకర్రావు చెవులోరహస్యం ప్రకటించేశాడు.

"ఏం! ఎందుకని?"

"రవణయ్య తోటలో చెట్టుక్రింద గాఢనిద్రా పరవశుడైవున్నాడు."

"హతోస్మి, హతోస్మి" అనుకున్నాడు శంకర్రావు. అనుకున్న అయిదు నిమిషాలకు స్కూలు ప్యూపిల్స్ లీడరు ధర్మమా అని గంట మ్రోగింది.

కుర్రాళ్లు విహంగాల్లా తుర్రుమని పారిపోయారు. టీచర్స్ రూముకు వెళ్లి, అక్కడ హెడ్మాస్టరు కళ్లపడడానికి మనస్కరించక శంకర్రావు తన చేతిసంచిని కూర్చున్న గదిలోకే తెప్పించుకున్నాడు. ఇంటికీ స్కూలుకూ ఒక మైలుదూరం వుండడంచేత మధ్యాహ్నానికి అవసరమైన ఉపాహారం సంచిలో వుంచి తెచ్చుకోడం శంకర్రావు వాడుక. ఆ చేతి సంచీ శంకర్రావు పాలిటికి గారడివాడిబుట్ట! అందులో మంచిఖాద్య పదార్థం లాంటి దేదయినా బయటపడవచ్చు. శంకర్రావు ఆత్రంగా సంచిలో చేయి పెట్టి చూచాడు. అతడి నాలుక పెదవులు మధురరసాస్వాదనకు తొట్రుబాటు పడ్డాయి. అవి మల్‌గూబా మామిడిపళ్ళు!

శంకర్రావు జేబులోనుంచి పేనాకత్తి పైకి తీశాడు. ఆప్యాయంగా పళ్లను స్పృశిస్తూ ముందట జీడిమాత్రం కోసిపారవేశాడు. ఆ తర్వాత చాకచక్యంగా పైపొట్టు తీసివేయడానికి ఉపక్రమించాడు. మెల్లగా గదితలుపులు తెరుచుకున్నాయి.

రవణయ్య గదిలో ప్రవేశించాడు.

రవణయ్యను చూస్తూ శంకర్రావు తెల్లబోయాడు.

రవణయ్య సరాసరి టేబిల్‌దగ్గరికి వచ్చి రెండు చేతుల్తోనూ రెండు మామిడిపళ్ళు తీసుకుని శంకర్రావుకు ఎట్టఎదుట డస్కులో కూచున్నాడు.

కదిలితే పైనపడుతుందేమో నన్న భయంతో ఆకలిగొన్న వ్యాఘ్రముముందు చేతలుడిగి నిల్చున్న నిరాయుధుడైపోయాడు శంకర్రావు! అతనలా మిడిగ్రుడ్లతో బిక్కరించి చూస్తుండగానే రవణయ్య చేతుల్లో టెంకలు మినహాగా పళ్ళు మటుమాయమైపోయాయి.

ద్వారంగుండా టెంకల్ని బయటికి విసరి రవణయ్య పైకిలేస్తూ "తిండిపోతు రెండు మామిడి పళ్లతో సరిపెట్టుకోగలడా మేష్టారూ! వాడి కాకలి ఎక్కువగదూ!" అన్నాడు.

కశాఘాతం తిన్నట్టు శంకర్రావు ముఖం పాలిపోయింది.

పార్టీలు : సత్యసాధన

ఆల్బర్ట్ కామూ

★

హంగరీ విప్లవాన్ని సోవియెట్ ఎర్రసైన్యం అణచివేసిన అనంతరం, ఇటాలియన్ పత్రిక, 'టెంపో ప్రెసెంట్' (**Tempo Presente**), సంపాదకీయ వర్గానికి చెందిన యిద్దరు ప్రతినిధులు, ప్రసిద్ధ ఫ్రెంచి రచయిత అల్‌బర్ట్ కామూను (**Albert Camus**) కలుసుకుని కొన్ని ప్రశ్నలడిగారు. ఆ ప్రశ్నలనూ, జవాబులను ఇక్కడ పొందుపరుస్తున్నాము.

★

ప్రశ్న :

పార్టీలు గాని, ప్రభుత్వాలు గాని, ఇతర యే వ్యవస్థలుగాని, సత్యసాధన పరమ లక్ష్యంగా వ్యవహరించుతాయని విశ్వసించటానికి యింకా ఆస్కారం వున్నదా? గుండెలమీద చెయ్యి వేసుకుని "శాంతి మండలి" అని చెప్పుకోవటానికి ఆస్కారమున్నదని మీరు విశ్వసించుతారా? లేక, అల్లాంటి ధోరణి కేవలం "ఆత్మద్రోహం" చేసుకోవటమే నని విశ్వసించుతారా?

ఈ నాడు ప్రపంచంలో సత్యసంరక్షకుడ నేవాడు ఎవడేవా వుంటే, ఆ సంరక్షకుడు, అలా అని చెప్పుకునేవాడూ, అలా అని చెప్పుకునే పార్టీ మాత్రం కాదు. ఎవడు అలా ఎంతగా డబ్బా వేసుకుంటూ వుంటాడో, అంత అబద్ధాలకోరనేది చారిత్రకమైన పరమ సత్యం. ఇలా చెప్పేవాడే, చివరికి ఆ సత్యాన్ని హత్యచేసే కసాయివాడుగా తయారవుతాడు. హంగరీలో ఒక 'పెద్ద అబద్ధం' సాగిపోతోంది. ఆ అబద్ధాన్ని ప్రతిఘటించుతూ పెద్ద విప్లవం బయలుదేరింది. అందుచేత ఆ 'అబద్ధాన్ని' ప్రతిఘటించిన విప్లవకారుల సందర్శి చిత్రవధ చేయవలసివచ్చింది. అనంతరం 'వాళ్ళందరూ ఫాసిస్టులు'ని, అంతకంటే మరో పెద్ద అబద్ధం చెప్పి వాళ్ళని అపనిందపాలుజేయుటానికి ప్రయత్నించవలసివచ్చింది.

'శాంతిమండలి'కి సంబంధించినంతవరకూ — అణ్వస్త్రాలను బహిష్కరించాలంటూ, హడావిడిచేసి, స్టాక్ హోమ్ ప్రకటనకు దస్కతులు పోసజేసిన 'శాంతి కాముకుల'ను ఒక్క ప్రశ్న అడగవలసివుంది.

స్వయంచోదక అణ్వస్త్రాలు ప్రయోగించుతానని, ఇంగ్లండ్, ఫ్రాన్స్, ఇజ్రయల్ దేశాలను బుల్గానిన్ దబాయించాడు. దీనికి వీరేమంటారు? ఈ శాంతికాముకులు ఈ ప్రశ్నను తమకు తాముగా వేసుకోలేక పోతున్నారు. అందుచేత మనం వారిని అడుగవలసివస్తోంది.

సత్యసంధులమని చెప్పుకోవటానికి, నిజానికి, ఈ నాడు, ఏ దేశానికీ ఎట్టి హక్కు లేదు. ప్రాచ్య ఖండంలోని 'తటస్థ' దేశాల సంగతి కూడా అంతేనని మనకు ఇప్పుడు తేలిపోయింది. అరబ్ దేశాలూ (ట్యునీషియా మినహా), ముఖ్యంగా భారతదేశం—గాంధీగారి భారతదేశం— హంగరీతోపాటు తమ స్వంత ధర్మసూత్రాలపట్ల నెరపుకున్న విశ్వాసఘాతుకంతో, ఆ దేశాలుకూడా మిగతా దేశాల స్థాయికే దిగజారిపోయినై. 'బాండుంగ్ మండలి' దేశాలు, యూరప్ జాతులలో అత్యంత ప్రధానమైన హంగేరియన్ జాతిని బానిసత్వం నుంచీ మృత్యువునుంచీ రక్షించటానికి ప్రయత్నించి

వుంటే మహా తీరంగా వుండేది. వలసవిధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న స్వతంత్రులైన యూరపియనుల కృషికి కృతజ్ఞత చూపినట్లయేది. కాని యీ బాండుంగ్ దేశాలు అత్యంత బాల్యదశలోనే లౌక్యం నేర్చుకుని వాస్తవిక దృక్పథాన్ని అవలంబించాయి. నిజానికి రాజకీయాలలో చాలా త్వరగా వయసు మీరిపోతారు. అందుచేత ఈ కొత్తరాజ్యాలవారిని యికనుంచీ, వయోజనులుగానే పరిగణించి కేవలం వారి చర్యలనుబట్టే వారి గుణగణాలను పరిగణించుతూ వుండాలిగాని, ఎట్టి సౌమనస్యంతోనూ, ఎట్టి పక్షపాతదృష్టితోనూ వ్యవహరించవలసిన పనేమీ లేదు. నిజానికి 'హంగరీ హత్యాకాండ'పట్ల ఆ దేశాలు ప్రదర్శించిన దృక్పథం క్షంతవ్యం కాదు. స్వార్థంతో కూడిన యిట్టి విరీహ ప్రయోజనశూన్యమైనదని భవిష్యత్తు తేల్చివేస్తుంది. గతంలో పరపీడనవల్ల బాధపడిన కారణంగా వీరికి సంక్రమించిన నైతికబలాన్ని వీరు, ఇట్టే, కొద్దిరోజుల అవధిలో దుర్వ్యయం చేసేసుకున్నారు.

ఇక ఇప్పుడు ప్రపంచజాతులలో వున్నదల్లా రెండే రకాలు—యుద్ధోన్మాదులూ, అత్యంత యుద్ధోన్మాదులు. ఇటీవలి పరిస్థితినిబట్టి చూస్తే, అమెరికా కంటె రష్యాయే యెక్కువ యుద్ధోన్మాదాన్ని ప్రదర్శించుతోంది. ఏది ఏమైనా, సామ్యవాదం గాని, పెట్టుబడిదారీవిధానం గాని యేదైనా యుద్ధాన్ని సృష్టించగలదనే సత్యాన్ని, ఈనాడు ఒకరు చెప్పకుండానే, మనకు బోధపడుతోంది. యుద్ధానికి కావలసిందల్లా అధికారదాహం—ఈనాడు ఆ దాహం లేని దేశాలు ఏవీ లేవు—ఆయుధబలం లేని కారణంగా గతిలేక పడివున్న దేశాలసంగతి అది వేరు మాట. పాశ్చాత్యఖండంవైపు కేవలం పావురాయిలూ, ప్రాచ్యఖండంవేపు రాబందులూ ఎగురుతున్నట్టు కలలుగంటూ కూర్చునేవారి దృక్పథాన్ని వ్యక్తంచేయటానికి "ధర్మబాహ్యులు" అనేమాట చాలదు. ఇది గ్రుడ్డితనం—బానిస స్వభావం — పశుబలాన్ని అభినందించుతూ కూర్చునే నీతిబాహ్యత.

ప్రశ్న:

అయినప్పటికీ, వాస్తవిక సత్యానికంటే, రాజకీయమైన 'అవసరపరిస్థితికి' ఎక్కువ ప్రాధాన్యత నివ్వాలని మీ అభిప్రాయమా? అలాగయితే, అలాటి అవసరపరిస్థితి యేర్పడినట్లు, నిర్ధారణ చెయ్యటానికి గల ధర్మసూత్ర మేమిటి?

ఈ 'అవసరపరిస్థితు'ల విషయం ఆలోచించేటప్పుడు, దాల్లో, అసలు సత్యమనేది ఏ నిష్పత్తిలో వున్నదో పరిశీలించాలి. అలాటి పరిస్థితి ఏర్పడినప్పుడు దానివల్ల మనం నేర్చుకోవలసిన గుణపాఠాలేమిటి? ఇంతవరకూ అలాంటి పరిస్థితి ఏర్పడుతుందని మనం ఊహించలేకపోవటం ఎందుచేత? ఇంతవరకూ మనం పరమసత్యాలుగా విశ్వసించుతూ వచ్చినవాటిలో ఇప్పుడు తప్పు దిద్దుకోవలసినవేవి. ఈవిధంగా ఆలోచించాలి. అంతేగాని, వాస్తవిక సత్యాన్ని త్రోసిరాజని 'అవసరపరిస్థితి' సింహాసనమెక్కి కూర్చునే పరిస్థితికి మాత్రం అంగీకరించకూడదు. కమ్యూనిస్టులూ వారి అనుయాయులైన బుద్ధిజీవులూ చేస్తున్న పని యిదే. ఈ సాపేక్షావిధానం ఇలాగే సాగుతూపోతే ఇది విజ్ఞానాన్ని హత్యచేసి కార్మికపీడనకు దారితీస్తుంది. ఒక పత్రికగాని, ఒక గ్రంథంగాని, విప్లవధోరణిలో వున్నంతమాత్రాన అది సత్యసాధన చేస్తున్నట్టు లెక్క కాదు. సత్యాన్ని చెప్పటానికి ప్రయత్నించితే విప్లవవంచన కావటానికి దానికి ఆస్కారముంటుంది. సత్యం సాపేక్షమని వాదించటానికి ప్రతి ఒక్కడికీ హక్కు వుంది; కాని అంతమాత్రంచేత 'సత్యం' 'సత్యం' కాకపోదు. ఆకాశం గోధుమవర్ణంలో వున్నప్పుడు, అది నీలవర్ణంగా వున్నదనేవాడు, మాటలకు వ్యభిచారదోషం పట్టించి నిరంకుశత్వానికి రోడ్డు వేస్తున్నాడన్నమాట.

కాదారూ, అతని పోలీసువాళ్లూ, అతని చేతికింది హంతకుల ముఠా—వీళ్లు మినహా—మిగతా హంగరీప్రజలందరూ 'ఫాసిస్టులు' అని ప్రకటించటం, కమ్యూనిస్టు పత్రికకు అత్యవసరపరిస్థితి కావచ్చు. కాని అసలు సత్యం ఏమిటంటే; — జాతీయస్వాతంత్ర్యమూ, వ్యక్తిస్వాతంత్ర్యమూ అభిలషించిన, కార్మిక కర్షకులూ, విజ్ఞానవేత్తలూ కలసి మహత్తరమైన విప్లవం లేవదీసిన సంగతి మనం కళ్లారా చూచాం. నిజం చెప్పాలంటే, ఫాసిస్టులు ఎవరు? ప్రజావిప్లవాన్ని నాశనంచేసిన క్రుశ్చేవ్ ఫాసిస్టు, కాదార్ ఫాసిస్టు. వాళ్ల సోవియట్ అనుయాయులు ఫాసిస్టులు.

హంగరీలో సోవియెట్ జోక్యాన్ని, ఖండించి వస్తే ఖండించి, మళ్లీ మరుక్షణంలోనే, మన (ఫ్రెంచి) 'ప్రోగ్రెసిస్టు యుద్ధవాదులు', కమ్యూనిస్టు సోదరులతో చేతులు కలిపి పనిచేయాలని తమ సమావేశాలలో తీర్మానాలు చేయవలసిన 'అవసరపరిస్థితి' వారికి యేమి కలిగిందో, నేను అవగతం చేసుకోలేక పోతున్నాను. అప్పటికి మన కమ్యూనిస్టు సోదరులు ఇంకా హంగరీ విప్లవకారులను తిట్టిపోస్తూ నేవున్నారు. హంగరీలో ఇంకా మనుషులను ఉరితీస్తూ నేవున్నారు. (నిన్నగాక మొన్న ఒక 20 ఏళ్ల పడుచును ఉరి తీశారు.) అదేసమయంలో ఒక ఫ్రెంచి కమ్యూనిస్టు— 'అలాటిపరిస్థితే ఫ్రాన్సులోకూడా యేర్పడితే, హంగేరీలో మాస్తరుగానే ఫ్రాన్సులోకూడా రష్యా జోరబడి, అలాంటి హత్యాకాండకు దిగే పక్షంలో, నేను అందుకు నిరభ్యంతరంగా అంగీకరించుతాను' అని బహిరంగంగా ప్రకటనచేశాడు. ఈ ప్రకటనతో దాపరికం లేకుండా సర్వం బట్టబయలయిపోయింది. దీనికంతకూ అర్థమేమిటి? ఈ యుద్ధవాదులకూ, ఈ 'ప్రోగ్రెసిస్టులకూ' తాము ఎన్నడూ చూడని రష్యనులంటే అంత పిచ్చి ప్రేమ వుందా? కాదు కాదు! ఫ్రెంచివారిలోనే ఒకవర్గమంటే వారికి ఆరని పగ. అది ఈ రూపంగా పరిణమించుతోంది—జనాన్ని మోసంచేసి హిట్లరుకు ఫ్రాన్సును అప్పగించింది ఆ రెండోవర్గమే. ఫ్రాన్సు అదృశ్యమైపోతే, అది మృత్యువాతబడేస్థితివస్తే—ఈ ఉభయ వర్గాల విద్వేష విషజ్వాలలతోనే నశించి పోతుంది

ప్రశ్న :

సరే! అలాంటి విషమస్థితి యేర్పడినప్పుడు, విజ్ఞానవేత్త అయినవాడు చేయవలసిన పనేమిటి? ఎలాంటి పరిస్థితిలోనైనా తన అభిప్రాయాలేమిటో తనకు తారసిల్లిన ప్రతివాడితో బహిరంగంగా వెల్లడించుతూ వుండటమే అతని కర్తవ్యమా? లేక, పరిస్థితులయొక్క తీవ్రస్వభావాన్ని గమనించి, ఈ దురాగాతాన్ని ప్రతిఘటించగల బలమైన రాజకీయ పక్షం ఏమీ లేకపోవటం గురించి, తను చేయకలిగిందేదో చేయటానికి పూనుకోవలసి వుంటుందా?

విజ్ఞానవేత్తఅయినవాడు అతిగా మాట్లాడికాలాన్ని ధ్వంసంచెయ్యటం ముందు మానివెయ్యాలి; ఒకటి, అలా మాట్లాడి మాట్లాడి అలసట పుట్టి ఆరోగ్యం చెడుతుంది. రెండు—అలా మాట్లాడుతూ వుంటే ఆలోచనా శక్తి నశించుతుంది. చేతనైతే సృజనాత్మకమైన నిర్మాణం ఏదేనా చేయాలి—ఆస్పృష్టి, వర్తమానకాలంలో చెలరేగిన సమస్యలముందు చుట్టలుచుట్టుకుపోకుండా నిలబడగలిగినదైతే. కాని కొన్ని కొన్ని ప్రత్యేక పరిస్థితులు యేర్పడినప్పుడు, (స్పైన్ యుద్ధం, హిట్లరు హత్యలు, స్టాలిన్ హత్యలు, హంగరీ తిరుగుబాటు—ఇలాంటివి). తను ఏ పక్షానికి చెందివున్నాడో బహిరంగంగా, నిర్మొగమాటంగా, ప్రకటించవలసి వుంటుంది. తెలివితేట లుపయోగించి గోడమీది పిల్లివాటంగా మాట్లాడి తప్పుకు తిరగటానికి ప్రయత్నించి లాభంలేదు. స్వాతంత్ర్య పరిరక్షణకోసం త్రికరణశుద్ధిగా పోరాడ సిద్ధంగావున్నాననే విషయం విస్పష్టం చెయ్యాలి. వైజ్ఞానికవర్గాలు, కొన్ని కొన్ని సందర్భాలలో—ముఖ్యంగా, ప్రజాస్వాతంత్ర్యమూ, భావస్వాతంత్ర్యమూ సర్వనాశనమైపోతున్నప్పుడు, ఒక సంఘటిత శక్తిగా యేర్పడి కార్యరంగంలోకి దిగవచ్చు. హంగరీ విజ్ఞానవేత్తలు అలాచేసి చూపించారు. ఏది యేమైనా పశ్చిమదేశాలలోని మనవాళ్లకు మార్గదర్శకంగా వుండటానికి, ఒక్క మాట మాత్రం చెబుతాను. మానిఫెస్టో తరవాత, మానిఫెస్టో మీద, అసమ్మతి ప్రకటన తరువాత అసమ్మతి ప్రకటన మీదా, అర్థంపర్థంలేకుండా చేవ్రాళ్లు చేస్తూవుండటం చాలా అసహ్యకరమైన పని. దీనివల్ల మన పలుకుబడి నాశనమౌతుంది, మన అభిప్రాయాలకుండే విలువ మృగ్యమైపోతుంది. మనం అగౌరవంపాలు గావటానికి ఇదే ప్రధానకారణం. ఇలా మనచేత చేయించుతూ వుండటానికి నిరంతరమైన ఒత్తిడి వుంటూనే వుంటుంది. ఇది మనఅందరి అనుభవంలో వున్న సంగతే. దీనికి ఎదురుతిరగటానికి మనకు సాహసం వుండాలి. తరచు ఏకాకిగా కూడా ఇలా ప్రతిఘటించవలసి వస్తుంది.

ఈ అభిప్రాయాలను ముందుంచుకుని, సమైక్య కార్యక్రమానికి దోహదం చేయవచ్చు. కాని మన

వామపక్ష విజ్ఞానవేత్తలు, మనకు అందించబడుతున్న అదర్శాలను వాటివెనక చూపబడే హేతువాదాన్ని అత్యంత నిశితంగా పరిశీలన చేయాలి. ఇలా పరిశీలన చెయ్యక ఇప్పటికే అనేకమార్లు తప్పటడుగులు వేశాం. ముందు కూడా అలా జరగవచ్చు. నేటిదాకా మనం మద్దతు చేస్తూ వచ్చిన ఆదర్శాలూ, వాటివెనకవుండే హేతువాదం ఎలాంటివి? వీటిని శల్యపరీక్షగా పునర్విమర్శ చేసుకోవలసి వుంది. వాటి దారుణఫలితాలెలాంటివో, ఇటీవలి చారిత్రిక పరిణామాలలో మనకు స్పష్టంగా కనుపించుతున్నాయ్. ఇలా ఆత్మశోధన చేసుకోగలగటం అసిధారావ్రతంలాంటిది. ఏది యేమైనా, ఈనాడు మితివాద పక్షాలకంటే, వామపక్షాల పలుకుబడి పెరిగిందన్న మాట ఒప్పుకోవాలి. కాని వామపక్షం, వినాశబీజాలతో లుకలుకలాడిపోతోంది. మాటల ఖైదులో తన్ను తాను బంధించుకుంటున్నది. పదజాలపు కోటలో కూరుకుపోయింది. బూజుపట్టిన పాత సిద్ధాంతాలు వల్లె వేస్తూ వుండటంతప్ప, లవలేశమేమీ సాధించలేక పోతున్నది. వాస్తవిక పరిస్థితులకు అనుగుణంగా శాసనాదికాలను నిర్మించుకున్నానని చెబుతూవుంటుంది, కాని వాస్తవిక పరిస్థితులను అందుకునే కార్యక్రమంలో నిరంతర పరాజయం పొందుతూవుంటుంది. వామపక్షం ఇప్పుడు శ్లేషబుద్ధి (Schizophrenia) అనే మానసిక వ్యాధితో తీసుకుంటోంది. సునిశితమైన ఆత్మవిమర్శతో చికిత్స చేసుకోవాలి. హృదయాన్ని, బలవత్తరమైన హేతువాదాన్ని ప్రయోగించాలి— ఆత్మాభినివేశం వీలైనంత తగ్గించుకోవాలి. ఇలాటి ఆత్మవిమర్శన కార్యక్రమంలో చెప్పుకోదగిన అవధికి ముందుకు సాగలేకపోతే, సమైక్య కార్యాచరణ అనేది ఎట్టిదైనా ప్రయోజనరహితం కావటమేగాక, ప్రమాదకరంగా పరిణమించుతుంది. ఈలోగా విజ్ఞానవేత్త బాధ్యత ఏమిటంటే— రాజు దిగంబరిగా వున్నప్పుడు, దిగంబరిగా వున్నాడని చెప్పటం. అంతేకాని, భావావేశంతో అతను ఏవో మహత్తర దివ్యవస్త్రాలు ధరించి వున్నట్టు ఊహాగానం చెయ్యకూడదు.

ఏది యేమైనా, సాధనయోగ్యంగా ఉండగల ఒక వాక్యాన్ని చెప్పదలచాను: భవిష్యత్తులో ఎట్టి సమైక్య కార్యక్రమంలో పాల్గొనటానికైనా, ఈ దిశగ సూత్రాన్ని అంగీకరించి నడుచుకోవటం ప్రాథమిక ధర్మంగా వుండాలి.

ప్రతిపక్ష నిర్ధూమధామమై. ఏకపక్ష నిరంకుశత్వమై రూపొందే. నియంతృత్వం ఏదైనా తాను నిర్మూలించుతానని చెప్పే అనర్థాలన్నిటికంటే అనర్థకరమైనది.

సృష్టికర్తయైన పరమాత్మను విశ్వసించుతున్నామంటారు. అలాగే నేనూ ఒక విషయాన్ని పరమ సత్యంగా విశ్వసించుతున్నాను. ఎట్టి వైజ్ఞానిక సృజన రూపొందాలన్నా ఎట్టి సాంఘికవ్యూహం రూపొందాలన్నా పరస్పర మతభేదాలను బహిరంగంగా వెల్లడించుకోవటానికి సమగ్రమైన స్వాతంత్ర్యం వుండాలి. సమగ్రమైన స్వాతంత్ర్యంలేనిది ఏ 'కళా' లేదు. ఏ కళైనా తన సంప్రదాయాన్ని తను స్వతంత్రంగా ఏర్పాటు చేసుకుని రూపొందుతుంది. బాహిరమైన జోక్యం ఎప్పుడువస్తే అప్పుడు చస్తుంది. సామ్యవాదమంటే, ఉరికంబాలని అర్థం చెబితే తప్ప, స్వాతంత్ర్యం లేకపోతే సామ్యవాదం కూడా వుండదు.

రెండు రెళ్లు

‘అసూ నా’

పాత్రలు: రాజారావు, రామమూర్తి, కృష్ణశర్మ, డాక్టర్ సత్యమూర్తి, శశికళ, రిజిష్ట్రారు, ఒక జవాను.

రంగము: 1

* * హాస్టలులో రాజారావు గది. ద్వారాని కెదురుగా గోడమీద రెండు సినీతారల క్యాలెండర్లుంటాయి. ఎడమవైపున క్యాంప్ కాట్ మీద, ఒక బెడ్ షీటు, రెండు దిండ్లు, చిల్లాకొల్లాగా పడిఉంటాయి. గదికి మధ్యగా ఒక టేబిలు, రెండు వైపుల రెండు కుర్చీలు, కొంచెం దూరంలో ఒక వాలుకుర్చీ ఉంటాయి. టేబిలుమీద, చదువుతూ మూసిఉంచిన పుస్తకం, రెండు వారపత్రికలు, సిగరెట్టు డబ్బీ, అగ్గిపెట్టె, ఆష్ ట్రే ఉంటాయి. కుడివైపునున్న షెల్ఫులో పుస్తకాల వరుసలు, నోట్సులు, పై అరలో ఓ బిగ్ బెన్ గడియారం ఉంటాయి. గడియారంలో ఎనిమిదవుతూంటుంది...

రాజారావు: (వాలుకుర్చీలోనుంచి లేస్తూ, నిద్రమత్తు ఒదిలిపోయేలా గట్టిగా సిగరెట్టు పొగ ఓమారు లాగి, పారేసి, టూత్ బ్రష్ చేతిలోకి తీసుకుంటుంటాడు.)

రామమూర్తి: (సన్నగా ఈలవేసుకుంటూ ప్రవేశిస్తూ) హల్లో! గుడ్ మార్నింగ్...రాజా గారిప్పుడే లేచారల్లేవుంది!

రాజా : గుడ్ మార్నింగ్...రాత్రి ఎందుకనో చాలా ప్రొద్దుపోయేవరకు నిద్రపట్టలేదురా ... బ్రదర్!...కూర్చో...

రామ : అవునులే, నిద్రపట్టేదెలా ఇది! (కుర్చీలో కూర్చుంటూ) నీవేమో ఆరాధ్య సుందరి నూహించుకుంటూ అర్ధరాత్రిదాకా జాగారాలు చేస్తూ, అపరాహ్ణందాకా కలలు కంటూంటావు...గట్టిగా మూడురోజులన్నా లేవు ఎలక్షన్లు ... అవతల సత్యంగాడు, అన్నం నీళ్ళు మాని అహర్నిశలు ప్రచారం చేసుకుంటూ, ఆ కాస్తా కొట్టేసి కూచుంటాడు ... ఎందుకొచ్చిన పోంచేరీ తనంరా ఇది!

రాజా : పోనిస్తూ......వెధవ డైరెక్టరు గిరి...ఒచ్చేదుండా...చచ్చేదుండా...నా గొడవలతో నే నేడుస్తుంటే!

రామ : అంతమాత్రానికి నామినేషను దాఖలు చేసి మమ్మల్ని రంగంలోకి దింపిం దెందుకురా! నీవే నీళ్ళుగారి కూర్చుంటే, మాకెందుకోయి ఈ వృథాశ్రమ...

రాజా : అది కాదురా...బ్రదర్! నిన్న మా నాన్నగారి దగ్గర్నించి పిడుగులాంటి వార్త వచ్చిందోయ్...మతి తిరిగిపోతోంది...ఈ మధ్య ఆయనకి నా పెళ్లి గొడవొక్కటే పట్టుకున్నట్టుంది...ఎవళ్ళో అయిదు వేలు కట్నంలో పిల్లనిస్తా మన్నారట. పిల్ల ఆయనకు నచ్చిందట...ఇక నా అంగీకారం కోసం కాచుకూచున్నాట్ట!

రామ : అన్నీ కలిసొస్తున్నా యన్నమాట...గుడ్... ఇటు డైరెక్టరు గిరీ...అటు గృహస్థాశ్రమం ...ఇందులో మతి చెడటానికేం ఉందోయ్!

రాజా : మతి...మన్ను...నీ వొకడివి...రామాయణ మంతా విని సీతేం గావాలనే ప్రబుద్ధుడివి!

రామ : ఓహో...సారీ! శ్రీవారి ప్రణయకలాపం మాట మరిచాను. మరి చెప్పవేం! (ఆలోచన నభినయించి) ఏం నాన్నగారికి రాసెయ్యి... "ఇట నొక యువతీ లలామంబుతో జరుగు తున్న లావాదేవిలో హృదయంబు ఇచ్చి పుచ్చుకొన నిర్ణయించితిని...యిక వేరు సంబంధంబు వలద"ని...గొడవే ఉండదుగా.

రాజా : ఏడిసినట్టే ఉంది! నీ సలహా... ఆ కాస్త పని శేశావంటే కానీ రాదోయ్ నాన్నా... ఇంటివద్దనుంచి... ఆ తర్వాత అవసరానికు తిలాంజలి...అబ్బాయిగారికి అక్షయపాత్ర తోడవుతుందని గదుటోయ్!

రామ : ఓహో... అదా సంగతి... అలా అయితే సెకండియర్ ఎలాగూ అయిపోయింది గదా! ఇంకొక్క సంవత్సరమే గదుటోయ్!... ఎండాకాలపు సెలవుల్లో వచ్చి పిల్లను చూసు కుని, అవన్నీ పూర్తయ్యాక ఆ కాస్త అభ్యం తరం తీర్చుకోవచ్చని వ్రాసెయ్యి...ఓ ఇంటెరిమ్ రిప్లయి అన్నా పడేఉంటుంది... ఈలోగా మనవ్యవహారం మనం చూసుకో వచ్చు...వీలునుబట్టి ఆలోచించుకోవచ్చు. ఆదరించవచ్చు (రాజారావు చెవులో ఏదో చెపుతాడు) ఏమంటావు?

రాజా : అరి పిడుగా! అసాధ్యుడివిరా...పర్మినెంట్ బ్యాక్ బెంచరువైనా భలే వ్యూహాలు పన్ను తావురా...

రామ : మరేమనుకున్నావోయ్ మాంధాతా! బ్రతుకు బాటలలో బహుముఖ ప్రజ్ఞావంతులంతా బ్యాక్ బెంచర్సుగా ఉన్నవారేనోయ్! సెట్టినా—పోషించేనా—ఈ బ్రతుకలేని అభాగ్యుల డిగ్రీలన్నీ...కీట్సు థియరీలు కంఠస్థం చేసినా, ఐన్‌స్టీన్ సిద్ధాంతాలు ఆక లించి నెమరేసినా ఆ పర్సనల్ రిజస్టరు పుటల్లో అన్నిటికీ తిలాంజలి ఇచ్చుకో వాల్సిందేగా...అందుకే అన్నారు...... తిరక్క చెడేవాడని మగవాడు...అనుభవం... బ్రదర్...అనుభవం...రెండేళ్ల జీవితాను భవానికి, రెండొందల పుస్తకాల విజ్ఞానం కూడా బలాదూర్...

రాజా : ఐనవ్యాసుడూ, నువ్వూను...కాని...నాకో అనుమానం వేస్తోందిరా......ఒకవేళ నీ వ్యూహమే సరైందనుకో...

రామ : నాన్సెన్సు...నూటికి నూరుపాళ్లను...

రాజా : అలానే బాబు...మరి ముందీ ఎలక్షన్ గండం దాటి బయటపడాలి...అనుకున్న కార్య క్రమమంతా సవ్యంగా సాగాలి...అటుపై సైనా అసలు వ్యక్తి ఒప్పుకుంటారనే నమ్మకం ఎలారా?

రామ : అక్కడే నాకు విసుగు పుట్టిస్తావు...శకున పక్షీ...ఒక అడుగు తర్వాత మరోటి వేస్తావా? అంతిమ ఫలితాన్నిగురించి అప్పుడే అంత ఆవేదన పడితే ఎలా మరి? పురుష ప్రయత్నం ఉండాలిగదా...అటు పైని జయాపజయాలు దైవాధీనం అన్నారు...అయితే నా షరతులు కొన్ని ఉన్నాయి...అంగీకరిస్తావా...మరి!

రాజా : అసలేమిటో బయటపెట్టు......అంగీకారం తర్వాత...

రామ : ఆ పప్పులేం ఉడకవోయ్...భాయీ! ఈ ఘటందగ్గర...అంతగా నన్ను నమ్మలేక పోతే...పోనీ...మధ్య నాకేం...

రాజా : అది కాదురా...నమ్మకాలు...చింతకాయ లూను...శక్తికి మించిన వాగ్దానాలు... తర్వాత ప్రతిజ్ఞాభంగాలు...ఎందుకా అని?

రామ : అదేం లేదు బ్రదర్...నన్ను నమ్ము...ఎవ రికీ ఎలాంటి ద్రోహం జరుగదు...సరా?... కాకుంటే కొంచెం శ్రమపడాలి...అది నా కొదిలెయ్యరాదూ...

రాజా : కానివ్వగా బాబు...కానివ్వు...కడుపులో కాపని కాఫీనీళ్లన్నా పడలేదు...నీ షర తులు మంజూర్...

రామ : అలా అయితే...విను...ఒకటి......ఎలక్ష నులో మనం నెగ్గేవరకు, మరేం చీకు

చింతలు లేకుండా మాతో బాటు ఘట్టిగా పని చెయ్యాలి...ఇది మన ప్లాన్‌లో ప్రథమాధ్యాయం...నిశ్చింతగా విజయం మన కవుతుంది...అయినా ముందుజాగ్రత మంచిది గదా...రెండు...విజయం మనది అన్న ప్రెమిసెస్ మీద ఆధారపడ్డ రెండో ఘట్టంలో, ఎప్పుడైనా, ఎలాంటిదైనా నీ ప్రేయసి సహాయం కావలిసివస్తే తప్పకుండా సాధించే భారం నీవు వహించాలి...అఫ్ కోర్సు...అమ్మాయితో నేనూ చెబుతాననుకో ... మూడు, ... సందర్భోచితంగా నానుండి నీవు వినెడి పలుకులను,మరో చెవికి...ఆఖరికి...అయిన వాళ్లకు గూడ...అందించకుండా ఉంటానన్న హామీ...

రాజా : ఇంతకీ...అసలీ సహాయం ఎందులో? ఎలా? ఎప్పుడు? అన్న సంగతులోయ్...

రామ : బ్రదర్ ! అంత ఆత్రమైతే ఎలారా...అవకాశంవచ్చినప్పుడల్లా అవన్నీ చెబుతానుగా.. ముందు మొదటిమెట్టు దాటనీవోయ్...

రాజా : ఓరి... నీ అసాధ్యం గూల...మళ్లీ ఎంతలో ప్లేటు ఫిరాయింపోయ్...

రామ : నాకు తెలుసుబాబు...ప్లేటు ఫిరాయింపే లేకపోతే, ఈ ఫీటులో ఎక్కడో చల్లగా జారిపోతావ్...చివరికి తిరిగి మమ్మల్ని వేధించుకు తింటావు...మనకు తెలీని సరుకయితేగదూ...మూడో రకం మనుష్యులూ, మనస్థైర్యాలూ...!

రాజా : మొదలెట్టావూ...ఉపన్యాసం...ఇక చాలుగాని...రెండు నిమిషాల్లో వచ్చేస్తా...అలా కాఫీనీళ్లుపోసుకుని శర్మగాడింటి కెళదాం పద...రెండు రోజులనించీ వాడి దర్శనమే లేదు ... ఏ దేవగాంధారిలోబడి దివ్యలోకాల్లో విహరిస్తున్నాడో?...

రామ : నిన్న సాయంత్రం గణపతి విలాస్‌లో కనపడి, ఉదయం హాస్టలు కొస్తానన్నాడురా... కానివ్వు మరి...ఈలోగా నీ ముస్తాబు (రాజారావు, టవల్ భుజాన వేసుకుని నిష్క్రమిస్తాడు) (రామమూర్తి టేబిలుమీది తెలుగు వారపత్రిక పుటలు తిప్పుతుంటాడు)

[కృష్ణశర్మ ప్రవేశం]

కృష్ణ : (షుమారు 26 వయస్సు ఎర్రగా, బక్కపల్చగా, లాల్చీ, గ్లాస్కోపంచె ధరించి, నోట్లో వయ్యారంగా సిగరెట్టుతో, ఒక చేతిలో వారపత్రికతో ప్రవేశిస్తాడు) హల్లో...మూర్తీ...కొంచెం లేటయింది... సారీ...(వాలు కుర్చీలో జేరగిలబడుతూ) గుడ్ న్యూస్...వీక్లీలో మన గేయం ఒకటి పడిందోయ్! (పేపరు తీస్తూ, రాగయుక్తంగా చదువుకుంటాడు)

"నీలాల నింగిలో
నీరాగరంజనీ
తూగు టుయ్యాలదేవి..."

రామ : (విసుగ్గా) ఆ!... తేలినట్టే ఉంది మనపని... మునగబోతూ మేం ఏడుస్తుంటే...

కృష్ణ ; హాస్నెన్ను ... ఇంతవీక్లింగ్స్నా ఏం రా... ఇలాతలంలో ఈ శర్మచేతిలో కలంచిందులు త్రొక్కుతుండగనే ... అంతటి ఉపద్రవమేమిటిరా!

రామ : కాక మరేమిటోయ్...ఒక్కడికీ చీమకుట్టినంతమాత్రం లేదు...అవతల సత్యంగాడి ప్రాపగాండా విన్నావుగాదూ ... ప్రతి రూముకు ఓ అరడజను మార్లన్నా వెళ్లి కాళ్ళావేళ్ళాపడి ప్రార్థిస్తున్నాట్ట... చతుర్విధోపాయాలతో...ఇక్కడె ఒక దొర, తీవిగా శారకు ప్రొద్దెక్కినా ప్రక్క వదలకపోతే, మరోదొర మన్నుతిన్న పాములా.. ఓ వేళ ఎంతఅభిమానం, స్నేహం ఉన్న వాళ్లయినా, మర్యాదకైనా వెళ్లి ఓమారు 'మీ ఓటు, దయతో మాకివ్వాల'ని అనకపోతే ఎవడిస్తాడురా...ఇది ఎవరింట్లో సంబరమని?

శర్మ : ప్చ్...ఇంతేగదా! బ్రదర్...వాల్యూ తెలియని వెర్రబ్బాయిలనుకోకు మనవాళ్లంతా ...అయిన వేళా కాని వేళా పోయి వాళ్లని హంగామాచేసేకంటే, మంచిసమయంలో ఒక్క హెచ్చరిక చాలోయ్...మనల్ని ఉద్ధరించడానికటోయ్...వాళ్లు చూపే గౌరవం, అభిమానం, కామయ్య, పుల్లయ్య పుత్రుల

మనీగాక, కళాకారులమని...గుర్తుంచుకో! ...లభిస్తోందోయ్...మనవాడి కళాభిరుచి, అనుభవం, ఆదర్శం అన్నీ పొందుపరచి రెండు గీతాలు కూడా రాశానోయ్... అన్నట్లు...మనవాడు పాంప్లెట్స్ ప్రింటు చేయిస్తాడుగాఇవ్వాళ...పనిలోపని రెండో వైపున ఆరెండుగీతాలు తగిలించేస్తేసరి... సమ్మోహనాస్త్రంలా పనిచేయవూ...లేదంటావు...సాయంత్రానికో చిన్న ప్రోగ్రాం ఏర్పాటుచేయి...అవి అలా ఊదరకొడితే, అందరికీ కొంచెం హుషారొస్తుంది!... ఏమంటావు!

రామ : ఇప్పుడు కావల్సింది పని. ఊకదంపుకాదు ...అవతల వాళ్లు చూడు...వాళ్లు జిల్లాల వాళ్లని, పల్లెలున్నీ హితుల్ని వెంటేసుకొని, ఆయా జిల్లాలనుంచి వచ్చిన విద్యార్థుల్ని కలుసుకుని, ఒప్పందాలు చేయిస్తూన్నాట్ట ...ఊహించుకుంటూ వాడు...వాయించుకుంటూ నువ్వు తయారయితే ఇక, ఓట్లు వచ్చినట్టే...డెమోక్రసీ బ్రదర్ ...ఇది మరిచిపోకు ... సంవత్సరానికోసారన్నా, బ్రతిమలాడించుకోకుండా నే పట్టుమనిఇస్తారనుకోకోయ్...అందులోను అన్నీ తెలిసిన విద్యార్థి సోదరులు...వాదొక్కటే గొడవ ...పని ప్రారంభించామంటే, పొల్లుపోకుండా, సర్వశక్తులు ధారపోసిఅయినా 'భలే' అనిపించుకోవాలి...

శర్మ : మూర్తీ! మనకు, అంటే, నాకనుకో, అదృష్టం వక్రించి,ఆఎలక్షన్‌పదవు లేటి లభ్యమవవుగాని, ఆ పరమాత్ముడిచ్చిన 'సిల్వర్ టంగ్'వల్ల, అంతో ఇంతో సోదరుల ఆదరణ ఉందోయ్! అందుకనేగదుటోయ్ అంతిధైర్యం...ఈ కళాత్మక జగత్తులో రాజాగాడికున్న అనుభవానికి, ఆదర్శాలకు, నా గాంధర్వసుందరిని తోడుచేసి, కళా సరస్వతికి,ఈదఫా కనకాభిషేకాలుజరుపగల మనే మొండిధైర్యం ఉందోయ్...!అయితే మహాపకడ్బందీగా సాగుతోందంటావు అవతలి ప్రాపగాండా...అయినా...ఒట్టిట్రాష్ (ఫిలాసఫర్ మూడ్‌లో) కళా పిపాసువులకు, కట్టుకు లేవిటి? జిల్లా లేవిటి? పొలిటికల్ ఫీల్డులో ఎలాగూ వీరవిహారం చేస్తున్నాయి సరే...మన శాఖవాడు, మన కులంవాడు, మన తాలూకావాడు, మన జిల్లావాడు ... ఈమన, మన ... అభిమానాలన్నీ... సాహిత్య, సాంస్కృతిక రంగాల కింకా ఈ చెదపురుగులు ప్రాకలేదనే విశ్వాసం నాలో సడల లేదోయ్! ఒక వేళ చేరినా అవి ఎక్కువకాలం బ్రతుకవులే!

రామ : ఆ ... అలాగే అనుకుంటూంను ... విశ్వాసాలు, విశ్వాసాల తీరుగానే ఉంటాయి... విషయాలు, విషమిస్తూనే ఉంటాయి!... నోట మాట్లాడుతూ, నోసట వెక్కిరించే రోజులోయ్ ... అయినా నాతో కూడిన వ్యవహారం...మనకృషి మనం చేస్తే, ఫలితం సంగతి తర్వాత...

శర్మ : తథాస్తు ... బ్రదర్ ... తథాస్తు...(లోపలికి వస్తున్న రాజారావును చూసి) పదవోయ్ మరి ...గణప దర్శనాలకు... గజాననుణ్ణి తల్చుకుంటూ! (రాగయుక్తంగా) శుక్లాంబరధరం విష్ణుం శశి ... (అంటూ లేవబోతుంటాడు).

రాజా : (నవ్వుతూ, అదిరిపడేలా శర్మ వీపున చరుస్తూ) ఏడిశావు ... పద...ఆ సంగీతదర్శకత్వ మేదో సంపాదించాక సప్తమంలో మొద లెడుదువుగాని!

[తెర]

రంగము: 2

* * పార్కులో ఒక వేపున...రకరకాల జంతురూపాల్లో చక్కగా కత్తిరించబడిన పచ్చతీగెల బొమ్మలు అక్కడక్కడ సోడాగాటి బెంచీలు, వాటిమీద ఒకరిద్దరు జంటలు దూరంగా కన్పిస్తుంటారు. పచ్చటి గడ్డిమీద

పసిపాపలు ఆడుకుంటుంటారు. ఫౌంటెన్‌నుంచి ఉవ్వెత్తుగా పైకి లేచి ఒంపుగా, ఒయ్యారంగా వాలిపోయే తెల్లటి నీటిధారలు అందంగా ఉంటాయి. అస్తమయ సూర్యకాంతుల్లో అత్యంత సుందరంగా ఉంటాయి రంగు రంగుల పూలతో పూల మొక్కలు... ఒక బెంచీమీద శశికళ ఏదో పత్రిక పుటలు తిప్పుతూ కూర్చుని ఉంటుంది...)

రాజా : (ప్రవేశిస్తూ) హల్లో...గుడ్ ఈవెనింగ్ శశీ!

శశి : (చిరునవ్వుతో) గుడ్ ఈవెనింగ్...అండ్ కంగ్రాచ్యులేషన్స్...మిస్టర్ డైరెక్టర్...

రాజా : థాంక్స్...హార్టీ థాంక్స్...(బెంచీ మీద కూర్చుంటాడు.)

శశి : చాలు...చాలు ...ఒట్టివి శేషణాలేనా ... గట్టి పార్టీ ఏదైనా...

రాజా : ఎన్ని పార్టీ లిచ్చినా...నీవు పెట్టి శ్రమకు ఋణం తీరదు...శశీ...

శశి : బాగుంది...ఈ స్తోత్రపాఠాలెప్పట్నుంచి?

రాజా : స్తోత్రం కాదు శశీ...సత్యం...నిజంగా, దాదాపు మొత్తంగా మీ మహిళా లోకపు ముఖ్యసై అయిదు ఓట్లు పడకపోతే, కంగ్రాచ్యులేషన్స్‌కు బదులు, కన్‌సొలేషన్స్ చెప్పాల్సొచ్చేది...ఎలాంటి పోటీ!...పదిహేను ఓట్ల మెజారిటీతో బయట బడేసరికి బ్రహ్మప్రళయం అయిందనుకో...ఏం ఉత్సాహంగా పని చెయ్యండే!...మా నాన్నొకడు —ఉన్నన్నాళ్లూ ఊరుకుని, సరీగా సమయానికి నా బుర్ర చెడగొట్టేశాడు...

శశి : (పత్రిక పుటలు తిప్పుతూనే) మధ్యలో మీ నాన్న గొడవ లేమిటి?

రాజా : సారీ...మర్చిపోయాను శశీ...నా పెళ్ళి విషయంగురించి మానాన్న గారొక ఉత్తరం వ్రాశారు...అయిదు వేల కట్నంట...పిల్ల, సన్నగా, ఎర్రగా, అందంగా ఉందట, ఆయనకు నచ్చిందట...నచ్చిమాచి వెంటనే నా అంగీకారం తెలియజెయ్యమంటూ వ్రాశాడు...

శశి : గుడ్...చెప్పావు కాదేం మరి...అయిదు వేల కట్నంతో అపరంజి బొమ్మలాంటి అతివ లభించడం...ఇక్కడ ఈ ఛాన్సు... అక్కడ ఆ ఛాన్సు...డబుల్ లక్ తగిలిందన్నమాట...మరి ప్రయాణం ఎప్పుడు?

రాజా : బాగుంది...నీ వేళా కోళం...ఆయన కెలా జవా బివ్వాలీ అని నేను సతమతమవుతుంటే.

శశి : ఉన్నాడుగా మీ విదూషకుడు...అతడేం సలహా ఇవ్వలా...

రాజా : అదీ అయింది...వాడి కంతా తమాషా... వ్యవహారం కొన్నాళ్లదాకా వాయిదా వేసి మార్గం చూడమంటాడు...ఈ లోగా ఏదో వెలగ బెడ్తాడట...నన్ను ఉద్ధరించడానికి... ఏవిట్రా అంటే...ఏవేవో కప్ప దాటు సమాధానాలు...ఈలోగా మా నాన్న గారి దగ్గర్నించి రిమైండరు...ఇరుకున పడిపోయింది శశీ మన పరిస్థితి...

శశి : మన అంటే ..ఓహో గౌరవవాచకమా?

రాజా : గౌరవ వాచక మేమిటి...గోడగడ్డలు. ఉభయ జీవుల సంగతీనూ...సరే గాని శశీ...ఈ సమస్యాపరిష్కారం ఏదన్నా తలపోస్తున్నావా...నిజం చెప్పు...

శశి : ఏ సమస్య...ఏం పరిష్కారం...

రాజా : (నవ్వుతూ, శశి బుగ్గవైపు చేయిపోనిస్తూ) రాజా రాణీలపెళ్లి సమస్యని తెలవనట్టు— గడుగ్గాయివై పోతున్నావు...

శశి : ఓహో...అలా చెప్పరేం సూటిగా... ఆళ్లెల్లి చాలంటారు వీరి గుణాలు, వారి కబ్బటానికి...మూడార్లు దాటవస్తున్నాయిగా...మరి...

రాజా : సరేగాని...సీరియస్ గా అడుగుతున్నాను... చెప్పు శశీ...

శశి : అవునుగాని... 'క్యూరియస్'గా చెబుతున్నాను...అదే అంతుచిక్కడం లేదని...

(కొన్ని క్షణాలాగి) నిజం రాజా...నాకేం పాలుపోవటం లేదు...మా నాన్న పరిస్థితి...తల్లి తండ్రి తానేయై పెంచి పెద్దచేశాడు...విద్యాబుద్ధులు నేర్పించాడు...నా కోసం సర్వస్వం అర్పించడానికైనా వెనుదీయడు..కాని మనవిషయంలో మాత్రం ఆయన కంత పట్టుదల ఏమిటో నా కర్థంగావటం లేదు...ఏం చెయ్యమంటావు చెప్పు...నా రక్తంలోని ప్రతి అణువున ప్రతిబింబిస్తున్న పితృవాత్సల్యం ఓ వైపు...ప్రతి కణంలో ప్రతిధ్వనిస్తున్న జీవిత కాంక్ష మరోవైపు...త్రిశంకు స్వర్గంలాఉంది నా పరిస్థితి...ఈ బాధ లిలా ఎన్నాళ్లనుభవించాలో, ఎలా ఏదరికి చేరాలో తెలియక కొట్టుకుంటున్నాను...

రాజా : (అనురాగంతో ఆమెకు దగ్గరగా వచ్చి కూర్చుని) తెలుసు శశీ...నాకూ తెలుసు...ఈ అడకత్తెర బాధలు...అప్పటనుమాత్రం...ఆత్మాభిమానంకూడా లేక, చిన్న పిల్లాడిలా మా నాన్న కాళ్ళమీదబడి, పాతపట్టింపులు మాని వెళ్ళి మాట్లాడి వస్తాననేదాకా లేవ లేదు...పాపం, ఆయన నామాట కాదన లేక...లోకానికి విరుద్ధంగానే అయినా...పిల్లగలవాళ్ళ యింటికి తానుగావెళ్ళి, బ్రతిమాలి, బామాలి; భంగపడివచ్చాడు...ఆ పాతక్రోధాల మాత్సర్యం ఎంతకూ వదిలితే గదూ మీ నాన్నని...నీవూ వినివుండవూ...అవమానభారంతో తిరిగివచ్చి, నన్ను నాలుగు చివాట్లూ పెట్టాడు, ఇంటికి రాగానే ...అహ...పోనీ ఏదైనా గొప్ప కారణం ఉంటే అదో మాదిరి...ఆస్తులు దోచుకున్నారా!...హత్యలు చేసుకున్నారా! అంటే అదీలేదు...వెధవ ఇళ్ళసరిహద్దు తగాదాలు, మధ్యని, ఇంతగా మనసులు విరిచేయాలా అని...మన దురదృష్టం గాక పోతే!...ఎందుకు వీళ్ళ జీవితానుభవం, చదువు, సంస్కారం ... తగలెట్టనా ... "కోర్టు కీడ్చింది చాలక, కన్నకడుపుకు కోత పెట్టాలని చూస్తున్నావా, పో,పో," అంటూ విదిలించి పారెయ్యాల్సి నంతటి అన్యాయం ఏం జరిగిందని ? పదిమందికి చెప్పగల వాడు...చదువుకున్నవాడు...ఆయన నోటంట ఆమాట అంత తేలిగ్గా వస్తాయని ఎవరైనా అనుకోగలరా ?

శశి : (ఆవేదన వ్యక్తపరుస్తూ) ఎందుకు...రాజా, తల్చుకున్న కొద్దీ హృదయం తరుక్కుపో తుంది...తీరిపోయేమార్గం దొరక్క తికమ కలపాలవటం మినహా...అంతేకాదు, ఆయన ధోరణిచూస్తే, నా చదువు పూర్తయేదాకా, నా పెళ్లి విషయం తలపెట్టేలా లేదు......మరో ఆడదిక్కులేని అభాగ్యజీవితం......నాకు నేనై పెళ్లివిషయం ఆయన్ని ఎలా అడ గాలి ? ఏమని అడగాలి ?...ఈ బాధలన్నీ వినవవసరం లేకుండానే తొలగిపోయింది చల్లనితల్లి...అవధిలేని ఆశలతో, అంతులేని ఆత్మవ్యధతో, అమ్మపాదాలదగ్గర విలపించని రోజు లేదు...అన్నీ నిశ్చలంగా వింటుంది...ఏదారి జూపించదు ... ఏంచెయ్యను...ఈ దిక్కుమాలిన బ్రతుకు బ్రతికేకంటే......(కళ్లనీళ్లు గిర్రునతిరుగుతాయి—తలప్రక్కకు తిప్పుకుంటుంది.)

రాజా : ఛీ......అలా దిగాలుపడితే ఎలా (ఆప్యా యంగా,) చూద్దాం...ఏనాటికైనా మంచి రోజులు రాకపోతాయా...ఈ ఆవేశంలో ఏ అన్యాయానికీ ఒడిగట్టనని ప్రమాణం చెయ్యి......అనుభవించేది రెండు ప్రాణా లన్న సంగతి మరువకు ... ఇలా చూడు (ఆమె తలను తనవైపుకు త్రిప్పుకుంటూ)...వెన్నెలలూరే నీ వదనంలో విషాదరేఖలు చూడలేను శశీ...ఏదీఏమైనా. సంతోషం గాని, దుఃఖంగాని, ఈ రెండు ప్రాణాలు సమానంగా పంచుకోగలవు శశీ...ప్రమాణ పూర్వకంగా...ఈ పచ్చని ప్రకృతి సాక్షి తోడు...సరేనా...ఊ...ఏదీ, ఒక్క చిరు నవ్వు...చల్లని వెన్నెల్లా, మెల్లని మలయ పవనంలా...ఏదీ...ఒక్కసారి......(కపో లము స్పృశించబోతాడు.)

శశి : ఇక్నే...మరీ చిలిపి వాళ్ళౌతున్నారు... జరిమానాలు చెల్లించుకోవాల్సిఉంటుంది... ఇక్కడ...జాగ్రత!

రాజా : ఓస్...ఇంతేనా ... జన్మకైదీనైనాసరే... నీతోపాటు...

శశి : అన్నట్టు, ఈ సంవత్సరం, మన కాలేజీ వార్షికోత్సవాలు లేవేవిటి? అంతా కొత్త దొరతనం గాబోలు!

రాజా : లేకేం ... ఆ భారం నా నెత్తినబడ్డదిగా... కమిటీ మీటింగ్‌లో కార్యక్రమం వెయ్యడం ... ఉపక్రమించడం ... అధికారికంగా మీ నాన్నగారి దర్శనంచేసుకోవాలి, త్వరలోనే...ఫంక్సు ఏకన్నాఉన్నారో. లేదో ... రామమూర్తి నిన్నసాయంత్రం నుంచే మొదలెట్టాడు ...... ఏవో వెరైటీ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఏకాంకికలు, లైట్ మ్యూజిక్‌లు, ... స్ప్రింగ్ డ్యాన్సులు అంటూ...ఓ లిస్టు తయారుచేశాడు...... అన్నట్టు శ్రీ...వారి సహాయ సంపత్తులు కావాలట...ఎంతవరకు లభిస్తాయో! వాడి కెక్కడలేని ఉత్సాహంగాఉంది ... మణిపూసల్లాంటి, ఐటమ్స్ పెట్టాలని...... వెర్రెక్కిందంటే ఒక పట్టాన వదిలే ఘటం గాదు......వాళ్ల శ్రీమతిచేత భరతనాట్యం కూడా ఒకటిపెట్టిస్తాడట...మరి మా శ్రీ... వారి పాత్రేవిటో! నిజంగా శశీ...ఈదఫా స్టేజీఎక్కాల్సి ఉంటుందేమో!తప్పదుసుమీ!

శశి : నీకూ, నీ స్టేజీకి ఓనమస్కారం... నేనేం తెర వెనక్కెళ్లేదు గాని...ఇలా ఉండి పోనిద్దురూ!

రాజా : అబ్బే! లాభంలేదు... రామం అప్పుడే పాత్రల్ని ఎన్నుకుని, పోర్షన్లు వ్రాయడం మొదలెట్టే ఉంటాడు, వాడి లక్షణం చూస్తుంటే...నిజంగా శశీ ...ఈ ఎలక్షన్లలో వాడు పట్టుశ్రమ, ఓపిక ... నాకు లేవంటే నమ్ము ... ఏ విషయంలోనైనా తల దూర్చాలేగాని, తీరెళ్లా చూచేంత వరకు నిద్రపోని ఘటం ... ఈదఫా సాంస్కృతిక కార్యక్రమాల్లో మణిపూసల్లాంటి ప్రదర్శన లివ్వాలని మహా తాపత్రయ పడుతున్నాడు ... పేరుకు డైరక్టరు నయినా, ఆ ఓపిక నాకు లేదుగనా అని విచారించాల్సి ఒస్తోంది... నా ప్రత్యర్థి సత్యనారాయణచేత ఓ వేషం వేయించే దాకా వదలడట ... నన్ను వెళ్లి అతని నాహ్వానించమన్నాడు ... అతడు అంగీకరిస్తాడా అని నాఅనుమానం నేను వెళ్లి బుచ్చేసిరికి, ఇంకేం కసున్నమని నామీదికి లేచాడు ... 'ఇవేంకత్తులు కట్టిన కోడి పందాలా' అంటూ...సరేరా బాబూ విడతా నన్ను దాకా వదలండే ... త్వరలోనే రిహార్సలు మొదలెట్టాలట ... పిక్నిక్కులు విందుల తర్వాత రెండుమూడు రోజుల కార్యక్రమం తయారు చేశాడు...ఇంకోటి ఈ కార్యక్రమాలన్నీ మీ నాన్నగారి అధ్యక్షత క్రింద జరిపించాలని వాడి పట్టుదల... అప్పుడే, షష్టిపూర్తికోసం పద్మవ్యూహం పన్నుతున్నట్లుంది ఇప్పటినుంచే మీ సోదరుడు...

శశి : మరే....పాపం...వస్తే వద్దంటారు గాబోలు తమరు మాత్రం ... ఎవరి దగ్గరా... ఈ కోతలు!

రాజ : అదుగో...అప్పుడే వెనకేసుకొస్తున్నావన్న మాట ... అయినా ... మీ నాన్నగారు! నాకు! షష్టిపూర్తు ... ఇవ్వడం ...: అంటూ...సంభవిస్తే!...హాతోస్మి...రవి, చంద్రులు గతులుదప్పి, సాగరా లుప్పొంగి, సకల ధారుణి తమస్సు...

శశి : చాలు... చాలు... ఇదేం స్టేజిగాదు...తమ తమస్సులు ఉషస్సులు...ఉట్టినే వృథా చేయకండి ఇప్పుడే ... (చేతిగడియారంవైపు చూసుకుని) ... అరె ... ఏడుదాటి పోయింది... ఇవ్వాళ చివాట్లు తప్పవు, నాన్నగారు క్లబ్బునుంచి వచ్చేసి ఉంటే... విషశామరి... గుడ్‌నైట్ ... (తెర)

రంగము: 3

* * మామూలు నాటకానికి సరిపడేలా ఒక స్టేజి అమర్చబడిఉంటుంది... నల్లటి తెరమీద, తెల్లటి అక్షరాలతో 'ఎస్. వి. కళాశాల-వార్షికోత్సవములు' అని వ్రాయబడి ఉంటుంది.

ఒక కంఠం: (తెరలోనుంచి) సోదర విద్యార్థి ప్రేక్షక మహాశయులారా! నిశ్శబ్దంగా ఉండమని ప్రార్థన. అనివార్య కారణాలవల్ల అనుకున్న వేళకు కార్యక్రమం ప్రారంభించటం పడలేదు—క్షమించ ప్రార్థన...మరో రెండు నిమిషాల్లో ప్రారంభమవుతుంది—దిన దిన ప్రవర్ధమానమౌతున్న మన కాలేజీ పదిహేనవ వార్షికోత్సవం జరుపుకుంటున్నామని తమకందరికీ తెలుసు... (ప్రేక్షకులవైపు నుంచి...ఒక కంఠం) తెలిసిన విషయం తమరు తెలవియ్యడం దేనికండీ! (నవ్వులు) (తెరలోనుంచి తిరిగి) ఈ నవ కార్యక్రమాలకు అధ్యక్షత వహించడానికి, దయతో అంగీకరించిన మన ప్రిన్సిపాల్ డా॥ సత్యమూర్తిగారికి, కమిటీ తరఫున, విద్యార్థుల తరఫున కృతజ్ఞత అర్పిస్తున్నాం. (ప్రేక్షకుల వైపునుంచి కరతాళధ్వనులు) ... రెండురోజులనుంచీ ఎంతో ఉత్సాహంగా మీ రందరూ పాల్గొని, మా కార్యక్రమం జయప్రదం చేస్తున్నందుకు ఎంతో కృతజ్ఞులం. ఈనాటి కార్యక్రమ సూచిక అందరికీ పంచి పెట్టబడిం దనుకుంటాను...అయినా మరో మారు మనవి చేస్తాను...ఈరోజు "అపోహ" అన్న ఏకాంకిక ప్రదర్శించబడుతుంది... రచన,—శ్రీ రామమూర్తి; నేపథ్య సంగీతం-శ్రీ కృష్ణశర్మ; నిర్వహణ-శ్రీ రాజారావు... ఇందు పాల్గొనువారు:—రఘుపతి-శ్రీ రాజారావు; వెంకటేశం - శ్రీ సత్యనారాయణ; జానకి—కుమారి శశికళ; రిజిస్ట్రారు—శ్రీ నరసింహారావు; జవాను—శ్రీ సుబ్బారావు.. (గంట మ్రోగడంతోటే తెర తొలుగుతుంది)

రఘుపతి: (వాలుకుర్చీలో కూర్చుని, పేపరు చదువుతుంటాడు.)

వెంకటేశం: (విసుగ్గా స్టేజిమీద అటునుంచి యిటు పచార్లుచేస్తూ)...వెర్రి ఆదర్శాలు వల్లిస్తూ అందివచ్చిన సంబంధం కాలదన్నుకోవడం మూర్ఖంకాక మరేమిట్రా?...లోక సంస్కారం అంతా మన ఒక్కళ్ళనెత్తినే పడ్డట్టు మహా... ఇకోకపాకు దొరికింది, ఈ కాలపు అప్రాచ్యులకు...చదువు పూర్తయిందాకా వివాహం ఒద్దనిభీష్మించుకోవటం!...పూర్తట..పూర్తి ...ఎప్పటికి పూర్తి. ఎంతటికని ఆ మహాసాగరంలో... అనిగ్రహం ఆ సాంతం ఉండేదు స్తుందా అంటే అదీలేదు. మధ్యలోనే ఏ మిస్సులగాలి సోకడంతోటే, బూడిదలో పోసిన పన్నీరులా మస్సున, వంశగౌరవం, పేరు ప్రతిష్ఠలు, పెద్దల సలహాలు మంట గల్పడం...ఏవీ అక్కర్లేదు...ఒక్క ప్రేమ గానం తప్ప...ప్రేమట...ప్రేమ... మా కంతా పెళ్ళిళ్లు కాలేదా... పెళ్ళాన్ని, పిల్లల్ని ప్రేమించుకోవడం లేదా...వీరి నాసటనే ఈ ప్రేమ పొర్లుపొడిచింది గాబోలు...(రఘువైపు చూస్తూ) నిన్నే రా! వెంకివేషాలు మాని, సాయంత్రం బండికన్నా బయలుదేరు. అయ్యబాబోయ్! ఏం అనుర్యద...ఇది మూడోసారి... పాపం ప్రతి దఫా ఏవో కారణాలు చెప్పడం...పిల్లను చూచి వచ్చేందుకే ఇంత రభసయితే ఎలా రా!...

రఘు : (పరధ్యానంగా ఉన్నట్లు నటిస్తూ) ఆ...... ఏమంటున్నారు?...సాయంత్రం ప్రయాణమా... ఎక్కడికి, ఎందుకు? ఎన్నిమార్లు చెప్పాలండీ నాన్నగారు...నాకు సంబంధించినంతవరకు ఇదివరలోనే చెప్పాను గదా...వాళ్ళిస్తామన్న ఆరువేల కట్నము, నావద్ద ఆరుగంటల్లో హారతి కర్పూరంలా ఆరిపోతుంది... ఇక నాకిష్టంలేని పిల్లను మెడకు తగిలించుకొని ఊరేగుతూ, నే నవస్థ పడటం, ఆ అమ్మాయిని అన్యాయముగా బాధపెట్టడం నాకేం ఇష్టంలేదండి...ఇక

జానకి విషయం... ఆమె కెన్నడో మాట ఇచ్చాను...నా కన్నివిధాలా తగిన సహచారిణి అని నిర్ణయం జేసుకున్నాను. ఇది నా జీవితానికి సంబంధించిన సమస్య గాబట్టి, నాపాటికి నేను నిర్ణయాలు చేసుకున్నాను. ఇందులో మిమ్మల్ని కించపరచే ఉద్దేశ్యం లేదు సరికదా, ఉదార హృదయంతో మమ్మల్ని ఆశీర్వదించమని వేడుకుంటున్నాను...

వెంక : వినుంటున్నావ్! ఆశీర్వదించాలీ...పోరతు లెత్తొద్దూ..అప్రాచ్యుడా..వంశ మెట్లాటిదో వంగడమెట్లాటిదో, ఏమీ అక్కర్లే...మాట యిచ్చాట్ట...మాట... మా పెళ్ళిళ్లకంతా మేమేం మాట లిచ్చుకోలేదే... ఇదొకటి నేర్చారూ...ఎర్రగా, బుర్రగా రొకతో కంటబడంగానే, ఆత్మనిగ్రహం లేక, పది రూపాయలు సంపాదిస్తోందంటూ ... పెద్దవాళ్ల మాట, కన్న తల్లిదండ్రుల మాటలను కాదనడమే... ఎంత అన్యాయపు కాలము వచ్చిందిరా భగవాన్...ఇక్...(అంటూ, ఓ కుర్చీలో చేరగిలబడి తల పట్టుకుంటాడు)

రఘు : ఎందుకండీ నాన్నగారు అలా ఆవేశపడతారు...(జాలిగా) అసలే ఆరోగ్యం బాగు లేకపోయె...అయినా ఎంతమాత్రం ఆలోచించినా, మీ అర్థంలేని ఆవేశానికి, ఆవేదనకు నాకేం ఆధారం కన్పించదు... భగవంతు డిచ్చాకు...ఇంత తినడానికీ, ఉండటానికి లోటులేదు...ఆ కట్నాల రూపంలో, ఆడపిల్లలుగలవాళ్ల దగ్గిర్నుంచి, వాళ్ల కలిమి లేములపట్ల, ఏమాత్రం కనికరం లేకుండా, ముక్కుపిండి వసూలుచేయాల్సిన అవసరం ఏముందని?...

వెంక : అవునోయ్...నీకేం తెలుస్తుంది ఇప్పుడు... నీ చదువుకు పెట్టినదానిలో ఎన్నోవంతోయ్ వారిచ్చేదుసి. అప్పటికే ఏదో పోనిద్దురూ ముఖమెరిక గలవాళ్లే అని ఊరుకున్నాను... లేకుంటే మన తాహతుకు, సరితూగ్గానికి అదే మూలకోయ్!...అయితే మాత్రం వాళ్ళు కట్నమిచ్చి పిల్లనిస్తామంటుంటే నీ రభసేమిటి మధ్య...

రఘు : ఆ...ఇస్తారు ... ఇవ్వక తప్పతుందా మరి తల తాకట్టు పెట్టిఅయినా ... తమ లాటి ఉదారహృదయులు లాగిస్తున్నప్పుడు...కాని కొంచెమో గొప్పో వాళ్ల కుటుంబ విషయాలు నాకూ తెలుసు గనుకనే అంటున్నా ... తరతరాలుగా అనుభవిస్తున్న ఆ రెండెకరాలు, రాముశెట్టికి దఖలు పరిస్తేనే గదా, పెద్దపిల్ల రాజ్యం మెళ్లో మూడుముళ్లు పడింది...పోనీ మళ్లీ ఆయనజీవితంలో తిరిగి సంపాదిస్తావని కలనైనా అనుకోగలరూ... మళ్లీ ఏ తల్లోనో. మెళ్ళోదో నోదిస్తేనేగా, ఈ ఆరువేలు సమకూడేది...అవున్లెండి... ఇవన్నీ మీకు చెప్ప లేదంటూరు...ఆడపిల్లత గన్నతండ్రి, అభిమానం ఉన్నవా డెవడూ చెయ్యడాపని... ఆ ఆసరా దొరకబట్టేగదూ మన ప్రయోజకత్వమంతా!

వెంక : అయితే ఇంతకూ నీవ చేదెవిట్రా...నీకిష్టం లేకపోతే కట్నం తీసుకోవడం మానుకో... ఉట్టిలాంఛనాలు, వివాహఖర్చులు భరించితే సరి...అయినా కందకు లేని దురద... నా కెందుకు...పిల్లదాన్ని చూచి రావడానికేం?

రఘు : (నిట్టూరుస్తూ) అమ్మయ్య! ఒక్క కన్సెషన్ ఇచ్చారన్నమాట... ధన్యోస్మి...ఇక రెండో విషయం పిల్లసంగతి...ముఖ్యంగా నాకు సంబంధించింది. అవునా. నాన్నగారు ఏం?...నా అభిప్రాయ మేమిటో ఇదివరలో ఎన్నోసార్లు చెప్పానుగదండీ! మళ్లీ ఏం చెప్పాలి?"

వెంక : ఆ...నువ్వు చెప్పడం, నేను వినడం... ఏమిటోయ్ నీముఖం...వెర్రి కూతలూ, నీవూ...

రఘు : (విసుగ్గా) వెర్రివో...మొర్రివో... నేను చెప్పవలసిందేదో ఇదివరకే చెప్పాను... జానకిని తప్ప మరొకరిని వివాహంచేసుకో నే ఉద్దేశ్యం లేదని...

వెంక : నీ మంకుపట్టు ఒదలవన్నమాట... ఆ శక్తి నీకెక్కడ దాపురించిందీ అని (ఒక చిటికెకు పొడుం తీసుకుని పీలుస్తూ)...ఉద్యోగం వెలగబెడుతున్నదట...ఉద్యోగం, ఊళ్లు మీదబడి, మగరాయుడిలా! ఆడది ఉద్యోగంచేసిన అప్రతిష్ఠ మన వంశం చరిత్రలో ఏనాడైనా ఉందీ......తెసుకునంటూ చేటికి కొక బొంభస్యడివి బయలుదేరావన్నమాట......నీకేవన్నా మతి పోయిందా ఏవిట్రా...

రఘు : ఇక్కడ దెవళ్ళకీ మతులూ పోలేదు...మర్యాదలు పోనవసరం లేదు... రూపం, గుణం, వంశం...అన్నిటినీ మించి నా అభిమతాని కనువుగా ఉన్నది గాబట్టే జానకిని వివాహమాడేందుకు నిర్ణయించుకున్నాను...ఎన్నడైనా ఉన్నాయా? ఇప్పుడెందుకూ? అని ప్రతిదానికీలో పాకైపోయింది......ఒక్కటడుగుతా గాని, మీ తాత ముత్తాతలనాడు, ఆకాశయానాలు, ఆటం బాంబులు ఉన్నాయా! భోజనం పెట్టి డబ్బు లిచ్చుకునేవాళ్ళెవా...జీతాలు గట్టింది చదువులు చెప్పక తగిలేశేవాళ్లా గురుకులాల్లో...ఇన్నీ మారలా...అలానే అన్నీ మారుతాయి...ఇందులో వింతేముందండీ......పెళ్లికోసం చదువుకున్నారు...ఆ మూడుముళ్లు పడ్డంతోటే, ఆడవాళ్లయితేమాత్రం, అస్త్ర సన్యాసం చేయకుండా, ఆ సంపాదించుకున్న విజ్ఞానాన్ని సార్థకపరుచుకోవడంలో తప్పేవిటని...అదేమంటే ఉన్నాయిగా, ఊసుపోకకు...ఆర్యోక్తులు...ఆడది తిరిగి చెడుతుందని? బంగారాన్ని పట్టని తుప్పు, ఇనుముకే ఎందుకు పట్టాలిఅని...అయినా నా నిర్ణయాలవల్ల వచ్చే కష్టనష్టాలు భరించుకోవలసింది నేను...

వెంక : ఆ... నేను!...ఎలాగైతేం చేటికి బయలుదేరావు......ఆ మాత్రం నీ మేలు గోరకుండానే, నేనంతా బావుకుపోదామనే నా ఈ తాపత్రయం...పెంచి పెద్దజేసినందుకు ఆమాత్రం తల్లిదండ్రుల అభిప్రాయాల్ని మన్నించలేనివాడికి...

రఘు : అదుగో...అక్కడే ఉంది చిక్కంతా... ఆఖరికి నాకు, నా జీవితానికి నూటికి నూరుపాళ్లు సంబంధించిన విషయాల్లోగూడా మీ నిర్ణయాలు నా నెత్తిన రుద్దాలనే పట్టుదల మాత్రం మీ కెందుకు? ముప్పైఏళ్లు నిండవస్తున్నాయి...ఇంకా నా విషయాల్లో నాకు స్వాతంత్ర్యం లేకపోతే...అదేమంటే...పెద్దలమాటలు ధిక్కరిస్తున్నాడు... తిరుగుబాటు చేస్తున్నాడు... అంటారు...ఇవేం కొత్తగాదు నాన్నా... పదిమంది పాడే పాతపాటకో కొత్తస్వరం ఇచ్చినవాడు ఎదురుతిరిగినట్టే...పది మంది గుడ్డిగా గానుగెద్దుల్లా పరిభ్రమిస్తున్న బాటలోంచి ఒక్కడుగు ముందుకు వేశాడంటే తిరుగుబాటుదారుడు...జాలువపడి, చల్లగా సాగిపోయే ప్రవాహంలో లేని సొగసు, గుట్టమిట్టల్లో గలగలా పారేటి సెలయేటిలో ఎందుకున్నదో ఎవరూ అర్థం చేసుకోరు... ఆనందాలు, అనుభూతులు, అవస్థలు మిళితమైయున్న అనంత జీవనస్రవంతిలో, ఒకరికీ, మరొకరికీ పొత్తేవిటి...పోలి కెక్కడ? ఏమో ఎవరి అనుభూతు లెలా ఉంటాయో?

వెంక : ఓహో...ఎలాగైతే నేం ఇంతలేసి ఉపన్యాసాలిచ్చేందుకు ఉపయోగిస్తున్నాయన్నమాట సంపాదించిన తెలివితేటలన్నీ ... మంచిది ... నీ అభిప్రాయం మార్చుకో లేవు... నా ఉద్దేశ్యాలు నన్నొదలవు ... ఊ ... కానివ్వు నీ యిష్టం వచ్చినట్లు ... (గద్గద కంఠంతో) లేక లేక కలిగిన సంతానమని, కళ్లల్లో ఒత్తులెట్టుకొని కాపాడుకున్నందుకు చివరకు నాకు చేయవలసిన మర్యాదలు చేస్తున్నావన్న మాట...అలానే కానియ్యి.. నాయినా... అలాగే...నీలాంటి ఉద్ధారకులను గన్న తల్లిదండ్రులకు కొదువేమిటి?... ఒక్క సంగతి మాత్రం మరిచిపోకు...ఈ ముసలి బొందిలో ప్రాణం ఉన్నంతవరకు, ఆ అప్రాచ్యురాలి కీపంచలో ఆశ్రయం లభించడం కల్ల అని మాత్రం గుర్తుంచుకో! (చెమ్మగిల్లిన కళ్లను పైపంచెతో తుడుచు

కుంటాడు)...ఇదంతా నా ఖర్మ...ఇలా రాశి ఉంటే (గోడనున్న భార్య ఫోటో వైపు చూస్తున్నట్లుగా) అదృష్టవంతు రాలివి ... అనుభవించ వక్కర్లేకుండా నే దాటుకు పోయావు...

రఘు : (మెల్లిగా, స్వగతంలో) అవును మరి...ఎవరి ఖర్మ కెవరు బాధ్యులు? అర్థం లేని ఆరాటాలు, ఆక్రోశాలు...అనుభవం ఎవరి వంతు!

వెంక : (కుర్చీలోనుంచి లేస్తూ) ఇక్నె ... రామ చంద్రా!... ఇంకా ఏం అనుభవించాలని చిన్న చూపు చూస్తున్నావోయ్!

జానకి : (ప్రవేశం— సన్నగా, ఎర్రగా, తెల్లటి, జార్జెట్ చీర, గులాబీ రంగు జాకెట్ ఒత్తుగా మోచేతుల దాకా ధరించి ఉంటుంది) హల్లో...గుడ్ మార్నింగ్...మిస్టర్ రఘు. (వెంకటేశం గార్ని చూచి) చప్పున ఒక డుగు వెనక్కు వేసి, పమిటె చెరగు రెండో భుజం మీదకి పూర్తిగా కప్పుకుని తలవంచు కుంటుంది, సిగ్గు నభినయిస్తూ)

రఘు : ఫరవా లేదు, రా జానకీ! మా నాన్న గారే లే...

జానకి : (వినయంగా) నమస్కారమండీ! ...(వంగి నమస్కరిస్తుంది)

రఘు : అలా నా రూమ్‌లో కూర్చుందామా... (అంటూ జానకితో ఒక వైపుకు వెళ్లి తుంటాడు)

వెంక : (వెనుతిరగాన్న, జానకిని తదేక దీక్షగా పరిశీ లిస్తూ. స్వగతం) నా కళ్లు నన్నే మోసం చేస్తున్నాయా! ఏం వినయం! ఏం రూపం! సాక్షాత్తు లక్ష్మీకళ...(అంటుంటాడు.)

[తెర జారుతుంది]

[నేపథ్యంలో, ఒకపాట]

వెనుక ముందు లేలరా!
విజయ శంఖ మూదరా!
వాదు—నేడు—వాద మేల
జాడ జూపు హృదయమే!
సాగిపోవ ప్రగతి రా!
సాధించుట బ్రతుకు రా!

* * *

[కొన్ని క్షణాల తర్వాత తెర తొలుగుతుంది. ఆఫీసుగది... మైనపుగుడ్డపరచిన టేబిలు మీద నాలుగయిదు ఫైళ్లు, ఇంక్ స్టాండ్, పిన్ హోల్డరు, రెండుమూడు పేపరువెయిట్లు, కాలింగ్ బెల్ ఉంటాయి. టేబిలుకెదురుగా కొద్దిదూరంలో ఓ పొడుగాటి విజిటర్సు బెంచి ఉంటుంది. సుమారు 45 సం. వయస్సుగలవ్యక్తి కళ్లజోడు మాటిమాటికి సవరించుకుంటూ వ్రాస్తుంటాడు. టేబిలుకు ఎడమవైపున ఎత్తుగా ఉన్న ఓ స్టాండ్ మీద టేబిలుఫోన్ తిరుగుతుంటుంది. కుడివైపున నున్న రివాల్వింగ్ షెల్ఫుమీద గడియారం 8 గంటలు చూపుతుంటుంది......]

రఘుపతి : జానకి: (ఒకవైపునుంచి ప్రవేశిస్తూ) నమ స్కారం సార్!

వ్యక్తి : (కళ్లజోడు కొంచెం క్రిందికిలాగి—అభి వందనాన్ని స్వీకరించినట్లుగా తలూపి, కూర్చోండని బెంచీవైపు చూపిస్తాడు.)

రఘు : (సవినయంగా) ఇవ్వాళ కొత్త మంచి రోజన్నారు...మేం వివాహం చేసుకోవా లని...తరువు...శ్రమఅనుకోకుండా, ఇవ్వా ళనే అది కాస్తా పూర్తిచేయాలని మా మనవి...

వ్యక్తి : (వ్రాయడంఆపి, ఫైలునోపక్కకు నెడుతూ) ఆ...మీరు వివాహం చేసుకోవా లనుకుంటే ...మధ్య నాకు శ్రమ ఎందుకయ్యా... (జానకివైపు...ఏమమ్మా! అన్నట్లు చూస్తూ) ఈ రిజిస్ట్రారు ఉద్యోగం అందుకేగదా... అయితే...తక్షణం కావాలంటారు...శుభం ...తిథి వార నక్షత్రాలు గుణించుకునే బయలుదేరారన్నమాట...గుడ్...ఒడిలించు కుందామనుకున్నా వదలవండీ, తరతరాల నమ్మకాలు...మరేం అనుకోకండి...సర్వ సాధారణంగా రిజిస్ట్రేషన్ కొచ్చేవాళ్ళం దరూ అలానే అంటుంటారు...అందు కన్నాను...అంతేగాని ... (కాలింగ్ బెల్లు నొక్కడంతోటే జవాను ప్రవేశిస్తాడు) ... ఆ కరెంటు రిజిష్టరిలాతే ... (పుస్తకం తీసుకుని పుటలు తీస్తూ) కావా ల్సిన వివరా లడుగుతాను ... మెల్లిగా

చెప్పండి, ... మీ పేరు, వయస్సు, తండ్రి పేరు, వృత్తి...

రఘు : నా పేరు ఎస్. రఘుపతి, వయస్సు 27, సన్ ఆఫ్ వెంకటేశం, ఫస్టు అసిస్టెంట్, బోర్డు హైస్కూలు...

రిజ : (రఘుపతి సెగాదిగా చూసి) వెంకటేశంగా రబ్బాయివిటయ్యా ... మరి మీ నాన్నగారెక్కడ, క్షేమంగా ఉన్నారా ... చూచి ఎన్నాళ్ళయిందో ... ఎక్కడా తటస్థపడటమే లేదు...

రఘు : (చిరునవ్వుతో) ఆయనగారు మాతోటుంటే, మేం ఇక్కడికి రావలసిన అవసరమేముందండీ...

రిజ : (కళ్ళజోడు సవరించుకుంటూ) ఏమిటో... మీ వ్యవహారం ఆయన కంగీకారం కాదన్నమాట... ఛీఛీ... తండ్రిని మించావన్నమాట ... ఊ ... అంతేలే ... టైం మంచిదంటున్నారుగదూ ...తర్వాత మాట్లాడుకుందాం గాని ... అమ్మాయి పేరు, వృత్తి మొదలయినవి...

రఘు : కుమారి జానకి...

రిజ : (విసుగ్గా) ఇక్ ... నీవుండవయ్యా... అమ్మాయీ...మీరు.

జాన : (సిగ్గు పడుతున్నట్లుగా) కుమారి వి. జానకి, వయస్సు 22, అసిస్టెంటు, అదే హైస్కూలు, తండ్రి ధర్మారావు...

రిజ : అమ్మాయీ ... రఘుపతిగార్ని వివాహమాడటం నీకిష్టమేగదూ ... అనుమానాలు లేకుండా చెప్పమ్మా...

జాన : (మెల్లిగా) ఇ...ష్ట...మే...నం...డీ...

రిజ : రఘుపతిగారూ,...ఇలా రండి...ఈ ప్రమాణపత్రంలో (జానకి నుద్దేశించి) ఊ...మీరు గూడ...సంతకాలు చేయండి...

రఘు, జానకి : (టేబిలు దగ్గరపా వచ్చి సంతకాలు జేస్తారు).

రిజ : ఎవరినన్నా సాక్షులను తీసుకొచ్చారా...

రఘు : (లేదన్నట్లు తల అడ్డంగా ఊపుతాడు).

రిజ : లేకపోతే ఎలాగండీ...ఆ బాధ్యతా నాదే... అలా వెళ్ళి ఎవరి నన్నా...

రఘు : (తటపటాయిస్తూ) క్షమించాలి ...తొందరలో...ఇప్పుడిక్కడెవరు దొరుకుతారు ...పోనీ లేకుండానే...

రిజ : అదేలా వీలయ్యా ... చట్టం, రూల్సు ... ఉన్నారుగదుటయ్యా (ప్రేక్షకులవైపు చూపిస్తూ) ఇంతమందిలో ఎవరూ దొరకరటయ్యా నీకు (ప్రేక్షకులవైపునుంచి గలగలా నవ్వులు).

రఘు : (నీళ్లు నములుతూ) ఆకేదో ... దయవుంచి... తమరే...

రిజ : ఇంకా బాగుంది... ఈ పౌరోహిత్యంకూడా నా... ఊ...నా టైం వేస్టవుతోంది. తప్పదుగదామరి (ముందుకువచ్చి ప్రేక్షకులలో ముందువరుసన ప్రముఖంగా కూర్చున్న ప్రిన్సిపాలుగారి నుద్దేశించి) క్షమించాలి...పెద్దల్ని శ్రమపెటవలసి వచ్చింది...ఒక్క మారిలా దయచేయండి (ప్రేక్షకులలోంచి కరతాళధ్వనులు — ప్రిన్సిపాలుగారు, స్టేజివైపుకు వెడతారు) ఇలారండి ... కూర్చోండి ... ఈమూడు కాగితాలచివర సాక్షి సంతకాలు చేయండి ... ఏదో పసివాళ్లు... రూల్సు తెలుసుకోరు ... తొందరలో పాత్యం తెచ్చుకోలేదంటున్నారు (అంటూ జాగ్రత్తగా ఒక్కో కాగితంమీద సంతకం పూర్తవగానే, బ్లాటింగ్ తో అద్దుతూ, మరో దానిమీద సంతకం చేయిస్తుంటాడు. (ప్రిన్సిపాల్ గారిచేత)

[తెర జారుతుంది]

ఒక కంఠధ్వని : (నేపథ్యంలో ...) మహాశయులారా! నాటకం అయిపోయింది ... ఒక్క అయిదునిముషాలు ఓపిక పట్టండి ... అధ్యక్షులవారి అంత్యోపన్యాసం అయిన తర్వాత, వందన సమర్పణతో మన వార్షికోత్సవాలు సమాప్తమవుతాయి ... (తెర తొలగుతుంది) (ఒక విద్యార్థి అధ్యక్ష పీఠంలో కూర్చున్న ప్రిన్సిపాల్ గారికి,

(ప్రక్క నేనున్న రిజిష్ట్రారు గారికి మెళ్లో పూలమాలలు వేస్తుండగా కరతాళ ధ్వనులు)

: (లేచి) మిత్రులారా! అధ్యక్షుల అనుమతితో, ఒక్క అయిదునిముషాలు మీకు కొన్ని విషయాలు మనవిచేయదల్చుకున్నాను...అందులో స్వవిషయం కొంత, స్వయంకృతం కొంత ... మన కాలేజీలో బి. ఏ. పెట్టిన సంవత్సరం నాటి హాజరు పట్టికలలో కె. నరసింహారావు పేరుంటుంది...బహుశా మీకు చూచే అవకాశం ఉండదు ... ఇప్పుడు మీ ఎదుట నిలబడి మాట్లాడే భాగ్యం కల్గినవ్యక్తే నన్నమాట... ఒక పాతవిద్యార్థిగా మళ్లీ ఈ నాడు మీ మధ్యని, మీ సంతోషంలో పాలు పంచుకొనే భాగ్యం లభించినందు కెంతో గర్వపడుతున్నాను. (కరతాళధ్వనులు)...ఉదర పోషణార్థం ఉద్యోగరీత్యా నానా ప్రదేశాలు తిరిగి ఓ నెలరోజుల క్రిందటే బ్రతుకుభిక్ష పెట్టిన ఈ పట్టణం చేరుకున్నాను ... ఉద్యోగ రీత్యా అర్హత లేకున్నా, పాత విద్యార్థిగా మీ వార్షికోత్సవాల్లో పాల్గొనే అవకాశం లభించింది. ఈ 'ఆహోహ' నింత చక్కగా తీర్చిన నా మిత్రుడు శ్రీరామమూర్తి ఆహ్వానంవల్ల — ఆహ్వానా న్నందజేస్తూ అనేకవిషయాలు వివరించాడు ... నా సాయం — అది ఏపాటిదైనా — అర్థించాడు మిత్రశ్రీ...తీవ్రంగా ఆలోచించుకున్నాను ... తిరస్కరించలేకపోయాను... బహుశా నాలోని నాటకకాలపిచ్చి నన్నిలా ముందుకు తోసింది...అభయం ఇచ్చాను... నా ఉద్యోగధర్మమే అలాంటిది ... ఏమిటంటారేమో ...... సమాజాన్ని, సనాతనత్వాన్ని ఎదిరించిన జీవితాల్నికూడా, చేరదీసి, చిగురింపజేయాల్సిన బాధ్యతలున్నాయి నాకు...

జీవితం కళాత్మకం,రసమయం...ఎప్పుడో ఒకప్పుడు నవరసాలు తొంగిచూస్తుంటాయి...వాటి అనుభూతి ఎవరికైనా తప్పనిసరిగా కలుగుతూవుంటుంది. .ఆనందాలు, ఆక్రోశాలు, అపోహాలు, అన్యాయాలు, సంతోషాలు, దుఃఖాలు ... ఇన్ని ప్రవాహాలను గర్భంలో దాచుకున్న మహాసాగరం లాంటిది జీవితం...ఒక్క సంయమనం ఉన్నవాడు, సర్వము చక్కబడుతుంది... నాలో ఒక అభిప్రాయం కలిగిఉండటానికి నాకెంత హక్కుందో, అలానే ఎదుటివారికి హక్కుంటుందని గ్రహించగల్గినవాడు, జీవితమార్గం సుగమమౌతుంది ... అనంతమైన నిత్య నూతన ప్రవంతిలాంటి జీవితానుభవంలో, పాత కొత్తల మేలుకలయిక ఉన్నప్పుడే రాణిస్తుంది ... అయితే కొంత మెలకువతో వ్యవహరించాల్సి ఉంటుంది...కాదనను ... ఒక కవికుమారుడన్నట్లుగా "గతమే జీవిత మనుకుని, వర్తమానమే వలదని, వెనక్కు నడిచేవారిని, వెక్కిరించు కోర్కె లేదు..." అలానే...

"గతమంతా బూడిదకుప్ప, కావాలి మనోజ్ఞ భావి, తిరుగబడండని అరిచే, బిరుసువారి నిందింపను..." ఒక్కొక్కరి అనుభూతి ఒక్కొక రీతిలో ఉంటుంది ... అందులోనే వాళ్ల ఆనందం ఇమిడిఉంటుంది......ఆ ఆనందరసాస్వాదనకు వరోధంగా అడ్డుగోడలు నిర్మించినా ఎన్నాళ్ళు నిలుస్తాయి...... అలా వాటిని సాగిపోనివ్వడంలోనే జాతికి ప్రగతి, నీతికి సుగతి ఉంటాయన్న నమ్మక ఉంది......

నేటి ప్రదర్శనం, పరిణామం జెందుతున్న సమాజంలోని ఒక సమస్య సాధారంగా చిత్రించబడింది......ఉబుసు పోకకు గాని, ఉదర పోషణకు గాని ఉద్యోగం చేస్తున్న యువతులంటే ఒక విధమైన న్యూనభావం ప్రబలి ఉండటం అనుభవంలో చూస్తున్నాం...నిత్య నూతనమైన నేటి నాగరిక ప్రపంచంలో నల్గురిలో తిరుగడానికి, నైతిక పతనానికి సంబంధం ఉందన్న అపోహ అదట చటా కన్పిస్తుంది ...... విచారకరం...... పురుషుని రెండు చేతుల సంపాదనకు, మరో రెండు చేతుల సంపాదన జోడించవలసిన ఆర్థికావసరం అందరికీ కలుగక పోవచ్చు...అయినా ఆర్జించిన విజ్ఞానాన్ని, ఏదో రూపాన, సమాజసేవలో సద్వినియోగం చెయ్యడంలో సిగ్గిలవలసిన అవసరం ఏముంది?...అందులో స్త్రీ పురుష భేదాలు, కలిమి లేముల కొలబద్దల ప్రసక్తి లేదు సరిగదా, అభ్యుదయకాము లనవరతం గుర్తుంచుకోవలసిన కనీస ధర్మం అది... విద్యార్థి సోదరులలో వున్న కళాభిరుచిని, ఈ కళాత్మక వార్షికోత్సవాల మూలంగా కాంచగలిగి ధన్యుణ్ణయ్యాను... కళామతల్లి కల్పతరుచ్ఛాయల్లో జానకీ, రఘుపతులుగా కాల్పనిక కళ్యాణం జరుపుకున్న నాటక దంపతులకు తగు బహుమతు లివ్వడమేగాక, పిన్నలు, పెద్దలిందరు కూడిన ప్రేక్షకులఎదుట ప్రమాణ పూర్వకంగా ప్రత్యక్ష దంపతులైన, కుమారి శశికళ, చిరంజీవి రాజారావులను చూసి, అధ్యక్షులవారానందంతో ఆశీర్వదిస్తారని ఆశిస్తూ విరమిస్తాను (మళ్ళీ కరతాళధ్వనులు.)

రిజ: (కూర్చుని, వివాహ ప్రమాణ పత్రాలను అధ్యక్షులవారి చేతికిస్తూ) ఒకటి నాటకంలోని వివాహానికి సంబంధించినది, ఇవి రెండూ అసలు వివాహానివి...దంపతులకివ్వండి...దయచేసి...

అధ్య: (మామకుని చకితుడౌతాడు—తిరిగి మెల్లిగా తెప్పరిల్లుకుని) అరె...నీ...ఇల్లు బంగారం గాను...ఎంత నాటక మాడారండీ, నరసింహారావుగారు!

రిజ: క్షమించాలి...నాటకంలో నాకూ ఒకపాత్ర ఉందన్న విషయం మరువకండి!

అధ్య: (లేచి) మిత్రులారా!...పాత, కొత్తవిద్యార్థులు కూడి అద్భుతమైన నాటకమాడారు... చూచాం... ఆనందించాం...మన పాత విద్యార్థి పలుకులు తీవ్రంగా విమర్శించుకుంటూ పరధ్యానంగా ఉన్న నా చేతికి రిజష్ట్రారుగారు, నా కుమార్తె వివాహ ప్రమాణ పత్రా లందించేసరికి, మనస్సులోని మారుమూలల్లో, కొన్ని అంతరంగిక కారణాల వల్ల, నిజంగానే, ఆక్రోశం చెలరేగింది... ఎన్ని లోపాలున్నా మానవమాత్రుణ్ని... మమతదే పైచేయి అయింది...ఆ ఆక్రోశం కాస్తా ఆనందమైంది...అర్థమైంది...ఈ కార్యక్రమాలు జయప్రదంచేసిన పెద్దల్ని అభినందిస్తున్నాను... పిన్నల్ని ఆశీర్వదిస్తున్నాను... విద్యార్థి సాంస్కృతిక సంఘానికో వెయ్యిన్నూటపదార్లు కళాభివృద్ధి నాశిస్తూ ఇస్తున్నాను...చిరంజీవి నూత్న దంపతులకు చెరో వెయ్యిన్నూట పదార్లు, చిరాయు రారోగ్యాభివృద్ధి నాకాంక్షిస్తూ...కట్నంగా కాదు లెండి...బహూకరిస్తున్నాను.

[తెర]

కాళిదాసకవిత: శీలచిత్రణము

పురూరవుడు

శ్రీ అరవిందులు

సునిశిత పరిశీలనముతో కాళిదాసు, వివిధ రాజన్యుల స్వభావ స్వరూపములను తన కావ్యములలోఁ జిత్రించెను. అట్టి పరిశీలనమునందు పురూరవుని శీల చిత్రణము ద్వితీయము.

పురూరవుఁ డగ్నిమిత్రునికన్న నన్నివిధముల విభిన్నుఁడు. అగ్నిమిత్రుఁడు యువరాజు; యోధుఁడు; సౌందర్యోపాసకుఁడు; కామోద్రేకరహితుఁడు; రాజలాంఛనోపేతుఁడు; సాధుపురుషుఁడు. అమాయికతతోఁ గూడిన ముఖద్యుతి; యువరాజోచిత ఠీవి; భ్రుకుటివిస్ఫూర్తి గల యాలోచన; దయార్ద్ర వర్తనము గలవాఁ డతఁడు. సమయానుకూలమగు సామర్థ్యము గలవాఁడు. అపరిమిత భోగానుభవలాలసుఁడు. మాళవికా నాట్యప్రయోగముపట్ల నీతఁడు ప్రదర్శించిన బుద్ధికుశలతను బురస్కరించుకొని, ధారిణి, "ఆర్య! రాజకీయములందును నిట్టి చాకచక్యము, నేర్పరితనము ప్రదర్శించిన మేలు వాటిల్లునుగదా!" యని తొలుతనే హెచ్చరించును. ఇట్టివర్తనమే వక్ష్యమాణకథయందును గాంచనగును. తన ప్రేమకలాపము నితఁడు ప్రదర్శించిన యమాయికత, నేర్పరితనము, సంతోషజనకమైనది. కుటుంబవిషయములం దీత డెంతయో మక్కువ చూపెను. భోగాసక్తియుక్తమగు రసిక ప్రవృత్తిగల్గియు, వీరత్వముతో విలసిల్లు యుగమున కీతఁడు ప్రతినిధి.

కాని పురూరవుఁ డిటువంటివాఁడు కాఁడు. ఈతఁడును వీరుఁడైన చక్రవర్తియే. ఉత్తమవంశ సంజాతుఁడు; ఉత్తమగుణ రత్నాకరుఁడు. అయ్యును నీతని స్వభావము పార్థక్యముకలది. ముఖ్యముగా నీతఁడు కవీశ్వరుఁడు; ప్రేమికుఁడు. ఇట్టి శీలములను 'షేక్స్పియర్' కూడ కొన్ని చిత్రించెను. "రెండవ రిచ్చర్డు" ఇట్టివాఁడే! "రినన్" కవీశ్వరుఁడు తన "యాంటిక్రైస్టు"నందును నిట్టి కల్పనము గావించెను. వీనితో తులనాత్మకముగ విమర్శఁ గావించిన, యూరోపియన్ కావ్యమర్యాద లీవిషయముపట్ల నెట్లు ప్రవర్తిల్లెనో గ్రహింపనగును.

కవియే రాజగుట యూరోపియనులకు కిట్టదు. అట్టి యేర్పాటు వాని బుద్ధి కత్యాశ్చర్యముగ నుండును. కవికి కావలసిన గుణములు, రాజ్యపరిపాలకున కవసరమైన గుణములు, తేజస్తిమిర న్యాయమున నుండునని యాతని భావన. అంతరంగిక భావన కవితాస్వభావమునకుఁ జీవగఱ్ఱ. ఆత్మభావనారతుఁడగు కవి, రాజ్యపాలకుఁడైనచో, అతని హస్తంగతమైన ప్రజా జీవనావసరములు సక్రమముగా నిర్వహింపఁబడవు. అతనిమానసము భావాంబరవీధిలో విహరించును. అతని చింతన మాలంకారిక ప్రపంచమున సంచరించును. అతని యూహాలు నేలను, నింగిని తాళములుగాఁ జేసి వాయించునవి. అట్టి యాతఁడు వాస్తవిక ప్రపంచధోరణికి దిగజార నేరఁడు. అందుచే వాఁడు కార్యశూరుఁడు కానేరఁడు. అట్టి కవిచేతికి రాజ్యాధికార మిచ్చినఁ, తన మనోధర్మము ననుసరించి ప్రవర్తించునేకాని, లోకధర్మ మర్మముల నవగాహన మొనర్చుకొన నేరఁడు. కార్యకారణ సంబంధ సంజనితములగు సంఘటనముల నాతఁ డూహింపఁ జాలఁడు. అతఁడు భీరువు కాకున్నను, ధైర్య సాహసోపేతుఁడైయున్నను, దుర్బలుఁడుగను, నసమర్థుఁ

అనువాదం: శ్రీ బొడ్డుపల్లి పురుషోత్తము

డుగను పరిగణింపఁబడును. అంతేకాదు. అట్టివానిని నిరంకుశుఁడందురు. వీలయిన వాఁడు తన్ననుసరించి ప్రవర్తించువారి నాదరించును. తన్ను వ్యతిరేకించు వారిని దండించును. అందుచే రాజకవి పరిపాలన దుఃఖాంతమే యగుచున్నది. ఆతని యంతఃపురము, హత్యలకు, నల్లకల్లోలములకు నాలవాలమగును. రాజకవులనుగూర్చిన యిట్టి యుదాహరణము లనేకములు చరిత్రనుండి యుద్ధరింపనగును. బ్రిటిషు రాజ్యపాలకులలో మన కిట్టివారు విశేషముగ లభింతురు. 'స్టువార్టు' వంశీయు లందఱు పుట్టుకచేతనే కవీశ్వరులు. వారు తమ దురదృష్టము కొలఁది సింహాసనారూఢులు కావలసివచ్చినది. ఇందులకు "రెండవ ఛార్లెస్" మాత్రమపవాదము. 'ఆఱవ జేమ్సు' పండితుఁడే యని సంకోచింపఁబనిలేదు. ఈతనిని కవితుల్యుఁడుగాఁ బరిగణింపనగును. తక్కినవారందఱు కళాభినివేశము, భావుకత కలవారలు. ఆదరణయోగ్యముగాని యాదర్శములు కలవారు. ఇంకు కొందఱకు, తమ కళాభినివేశ తత్పరతలను బరులపై పుసుపుపట్టి సామర్థ్యముకూడ కలదు. పైన పేర్కొనినట్లు రెండవ చార్లెసునకు మాత్రము వాస్తవికదృక్పథము కలదు. ఈతఁడు వాస్తవిక స్థితిగతుల నవలోకించి, యతిప్రశాంత చిత్తముతో నాదరణమార్గమునం దడుగు వేయఁగలఁడు. "మొదటి జేమ్సు" నకు గూడ నిట్టి దక్షత కొంతవఱకు గలదు. కాని రాజకీయ దురాలోచనలచేతను, సమయోచిత వివేకహీనతచేతను; ప్రతిపక్షులపట్ల ప్రదర్శించిన కాఠిన్యముచేతను; దక్కినవారివలె నీతఁడును బతితుఁడుకాకతప్పలేదు. ఇట్టివారు భారతీయ చరిత్రయందును లేకపోలేదు. కాశ్మీర దేశాధిపతియగు శ్రీహర్షుఁడు, కల్హణుడు నిట్టి రాజకవులని మనకుఁ దెలియుచున్నది. అందుచే నిట్టికోవకుఁ జెందిన పురూరవ పాత్రను కాళిదాసుఁ డేరీతిని తీర్చిదిద్దెనో పరిశీలించుట యాహ్లాదకరము.

భారతీయ కవీశ్వరుఁడు, రాజకవి పాత్ర చిత్రణమునం దసమర్థతను, పరాజయమును, విషాదమును ప్రదర్శింపకుండుట మన కాశ్చర్యము గొల్పును. పురూరవుఁడు మహాచక్రవర్తి. ప్రజానురంజకుఁడు. అప్రతిహత పరాక్రమోపేతుఁడు. గౌరవభాజనుఁడయిన దేవమిత్రుఁడు. యుద్ధరంగమునందు, పరిపాలనా విషయమునందు, ప్రేమకళాకలాపమునందు నీతఁ డఖండ విజయశ్రీ విలసితుఁడు. ఇట్లు చిత్రించుటచే కాళిదాసునకుఁ బ్రాపంచిక పరిజ్ఞానము లేదని కాని, మానవస్వభావము నెఱుఁగఁడని కాని యనవచ్చునా? ఇతర కావ్యములయందు నాట్యలో దర్శనీయముగు కూలంకషకళాప్రతిభ ప్రదర్శించిన కాళిదాసుపై నిట్టి నిందమోపఁగల సాహసమేరికుండును? కవితోపాసకులు, క్రియానిపుణులు, పరిపాలనా దక్షులును నగుట, మానవస్వభావ విరుద్ధమని యెక్కడను శాసనము లేదు. 'మొదటి చార్లెస్' 'నీరో' యను వారలు కళాత్మకశీలురు. కాని వారు రాజరికముచే శాపోపహతులైరి. గ్రీకుసార్వభౌముఁడు "అలెగ్జాండరు"; ఫ్రెంచి సార్వభౌముఁడు "నెపోలియన్ బోనాపార్టు" సమ్రాట్కవీశ్వరులే. వా రెక్కడను నసామర్థ్యమును, దుర్బలత్వమును బ్రకటించినట్లు మనకు చరిత్ర పేర్కొనుటలేదు. అంతేకాదు; కవితాస్వభావ విలసితులకు కాల పరిస్థితుల నవగాహన గావించుకొనుటలో నొక్కొక్కప్పుడు విశేషముగ బుద్ధికుశలతయుండును. కొందరు తమ సృజనాశక్తిని కాగితములపైకాక, విశాల విశ్వమున గల సజీవపత్రములపై నుపయోగింపగల వరప్రసాదు లుందురు. ఇట్టి వీరిని భవిష్యత్కాలము వారు ప్రశంసించిన ప్రశంసింపవచ్చును. నిందించిన నిందింపవచ్చును. కాని వీరి తత్త్వము సమగ్రముగ గుర్తింపరానిది. 'జోనాఫ్ ఆర్క్' 'మేజని' 'గారిబాల్డి' ల వంటివారివలె వీరు పతనోన్ముఖమైన దేశమును సముద్ధరింతురు. లేదా! 'నెపోలియన్' 'అలెగ్జాండరు' లవలె ప్రపంచాధిపత్యము వహింతురు. జాతీయ సమగ్రావగాహనముతో గూడిన వీరోచితస్వభావము; జీవిత కళోపాసనాతత్పరత; ఆదర్శ గంభీరదృక్పథము; సంతత వీరారాధనము, మున్నగు నవేకశక్తుల సరసమేళనముచే నిట్టి వారభ్యుదయమందుదురు. భోగానుభవేచ్ఛ ప్రబలకపూర్వము; బౌద్ధమత ప్రభావముకూడ ప్రబలకపూర్వము భారతీయులు వీరోత్సాహపూరితమైన జాతిగా విఖ్యాతిగాంచిరి. గద్యమును దృణీకరించి, పద్యముపట్లనే భారతీయులు విశేషాదరమును జూపిరి. భావాంబరవీథిలో విహరించుచున్నను, వీరోచితముగనే జీవితయాత్ర గావించిరి. ఇట్టి ప్రాచీన భారతీయస్వభావము కాళిదాసు కాలమునందును గొంత నిల్చినది. అందుచే నీ జాతీయ నాటక కవిచక్రవర్తి, కురువంశ మూలపురుషుని

ని పురూరవచక్రవర్తికవి, శీలమును చిత్రించుటపట్ల దుర్బలత్వమును గాక, సారధీరత్వమునే పరిపోషించు టత్యంత సహజముగనున్నది.

వాస్తవిక శక్తిసామర్థ్యములున్నను, కళాస్వభావ మెంతటి ప్రబలహృదయమునైన నొకింత దుర్బల పఱుపక మానదు. అలెగ్జాండరు, నెపోలియనులు స్వార్థ దురహంకార పరాయణులు. విపరీత భావుకులు. అసాధారణాదర్శనులు కలవారు. కావలయునని వీరు దుష్టత్వము ప్రదర్శింపకున్నను, అప్పుడప్పుడు నైతిక నియమోల్లంఘనముచే, యమానుషకృత్యములఁ గావించిరి. అలెగ్జాండరు తన జీవితము నొక పాశ్చాత్యేతిహాసము గావింపవలయునని యాశించెను. నెపోలియన్ తన జీవితము నమానుషేతిహాసము గావించెను. నాటకకర్త లౌచిత్యపోషణమునకు సమయోచితముగా ప్రాచీనకథావిషయములందు మార్పులు చేకూర్చురీతిగా వీరును తమ జీవితరూపకములందు స్వేచ్ఛగా మార్పులు గావించిరి. 'జోన్ ఆఫ్ ఆర్క్' కలలు గని యేమేమో భావించినది. 'మజిని' 'గారిబాల్డీలు' కూడ విపరీతాదర్శనాయకులు. అలెగ్జాండరు వీరికన్న నదృష్టవంతుఁడు. అల్పవయస్సునందే యాతఁడు పరలోకగతుఁడౌటయే యాతని యదృష్టము. మఱియొక యదృష్టము—అతని పరిజనులు మిక్కిలి వివేకులు. వారీతనిని సంగావదిని దాటనీయలేదు. ఇట్లే నెపోలియనునకుఁగూడ తన పరిమితిని గుర్తింపజేసెడి పరివారమున్నచో, వాని యంతిమదశ, అంత విషాదభరితమయ్యెడిది కాదు. వాని జననమువలె, మరణముకూడ కీర్తనీయమయ్యెడిది.

విక్రమోర్వశీయ రూపకమునందు పురూరవుఁడు కూడ నదృష్టశాలియే. దేవతాసాహాయ్య మాతని వెన్నంటియే యుండెను. దేవత లీతనిని దురదృష్టము నుండి కాపాడుదురు. అలెగ్జాండరువలె కడకాల మరణము అదృష్టావాప్తికి తోడ్పడినట్లు యీ రూపకము నందలి పరిమితియే పురూరవుని, భాగ్యశాలిగా గావించును.

ఆత్మవినాశకారకుఁడగు నసత్య కవితా స్వభావుఁడుగాకాక, పురూరవుఁడు, సత్యపరాక్రముఁడుగను; లలిత కవితా కళాప్రియుఁడుగను; నిరూపితుఁడాయెను. ధీరోదాత్తుఁడైన రాజునందు కవి ధీర లలితత్వమునుగూడ లలితముగ సమ్మిళిత మొనర్చుటచే పురూరవుని శీలమేర్పడినది. "కళ-కళకొఱకే" యను సిద్ధాంత ప్రతిపాదనకుఁ బ్రాతిపదికయైన తరువాతి కవిత్వచ్ఛాయ లీశీలమునందు పొందుపఱుపఁబడినవి. మానవజీవిత సౌందర్యసమీక్షయందు, చరాచర చేతన ప్రకృతిసంపత్పరిశీలనమునందు, నిర్హేతుకానందమును జూరగొనుటే యిట్టి యద్భుత శీలచిత్రణములోని పరమరహస్యము.

పురూరవుఁడు నృపాల శిరోమణిగను; వీరాగ్రేసరుఁడుగను; సమయోచిత ధైర్యసాహసక్రియా దక్షుఁడుగను; తొలుదొల్తనే మనకు సాక్షాత్కరించును. అంతేకాని కాళిదాసీతని నిత్యనైమిత్తికశీల ప్రదర్శనముతో నంతగా ప్రమేయము కల్పించుకొనలేదు. అందాతని కాసక్తి తక్కువ. ఒకవేళ నిత్యనైమిత్తికములే ప్రదర్శింపవలసివచ్చినచో, కాళిదాసు లక్షించునది యాంతరంగిక సత్యసమున్మీలనమే. లలిత కళోద్రిక్తమానసుఁడైన పురూరవుని, అనర్థకరములగు దుర్బలత్వమునకు, ననర్హతకు గురికానీకుండ కాళిదాసు కాపాడును. పచేళిమ కళాప్రతిభతోడనే యీ కవిసార్వభౌము డీ శీలము నిట్లు చిత్రించెను. ప్రారంభమునందే పురూరవుఁడు అసాధారణ సంచలనత్వముతోడను క్షణకాల జనితమనోనిశ్చయముతోడను, అథోగతాహార సంపాదనా లంపటమగు గృధ్రరాజు నందలి మేఘతిరస్కృతోద్వేగమువంటి యుద్వేగముతోడను మనకు ప్రత్యక్షమగును. వెంటనే సుకుమార భావనా విలసితుఁడగు ప్రేమికుఁడుగా నీతఁడు గోచరించి, మన కాశ్చర్యము కల్గించును. నాటకాంతమున పురూరవుఁ డింద్ర సాహాయ్యమునకై యాహ్వానింపఁబడును. ఆద్యంతములయం దిట్లు వీరోచితముగా తీర్చిదిద్దఁబడిన పురూరవున కూర్వశితోడి సంబంధ మొక యితిహాసము మధ్య ప్రాసంగికముగావచ్చిన ప్రేమకథవలె మనోజ్ఞముగా నొప్పును. ఇంతేకాదు; భావకవితోదాహరణము లనఁదగిన వర్ణనలు; పరిపాలనా దక్షత్వ సూచనలు; వీరరసోత్ప్రేరకములగు సైన్యములు; ప్రత్యంకమునను, నప్రయత్నముగ సిద్ధింపఁజేసిన కాళిదాసు కళావైదగ్ధ్యము ప్రశంసాతీతమైనది. ఇందును నాతఁ డతివృష్టి యనావృష్టి దోషములకు గురికాలేదు. అతని కవితా శిల్ప స్వభావమే యట్టిది. మానవ సహజములగు సరసమనోజ్ఞస్వభావము మూర్తీభవించిన

పురూరవునిలో, నృపత్వము తన ప్రాభవమును వెలిపఱచ జాలకపోయినది.

కావ్యారంభమునందే పురూరవునిలోగల ఈ స్వభావ వైరుధ్యము సూచింపఁబడినది. స్వీయనామ ప్రకటనమునందే యాతని రాజనీతి, ప్రత్యయప్రదానము, నాకౌకసులతోడి సంబంధము, ఏకకాలమున మనోవీథిని మెఱయును. ఇది యితిహాసోచిత గాంభీర్య చిహ్నము. ఇంతటి రాజనీతియందును ప్రస్ఫుటమగు నా వినయ కౌశల్య మాభిజాత్య సంప్రాపితము. అతని శీలసంపద కీవినయము మకుటాయమానమైనది. చిత్రరథుఁ డన్నట్లు, "వినయము విక్రమాలంకారముకదా!" సాంప్రదాయికమగు రాజనీతి వైదొలఁగగనే పురూరవుఁడు తన సహజ మృదులస్వభావముతోఁ గానుపించును. దశదిశాపరివ్యాప్తమగు కీర్తిచంద్రికలచే నుప్పొంగు మానసముతో, "చంద్రపౌత్రుఁడు, సూర్యదౌహిత్రుఁడు, మహారథుఁడు నగు పురూరవుఁ డెఱుఁగుటంత దుర్ఘటము కాద"ని యాతఁడు సగర్వముగ నుద్ఘాటించును. మఱియొక సందర్భమున, తాను, "నానావనీ రాజచూడా కల్లోజ్జ్వల రత్నభాసిపదపీఠాప్తాధిరాజ్యాధి నేత"నని నిస్సంకోచముగ పల్కెను. ఈతఁడు మితభాషి. ఉజ్జ్వల సంభాషణాచతురుఁడు. ఇతని సంభాషణలలో సుకుమారభావన తామరతూఁడునందు బిసతంతువువలె నిమిడియుండును. నెపోలియన్ చక్రవర్తియు నిట్లే, తీవి తళుకొత్తునట్లు భావపూరితముగ రాజకీయ ప్రకటనలు చేసెడివాఁడని మనము విందుము. అలెగ్జాండరు, "బాటిస్" అనువానిని తన రథ చక్రములకు బంధించి, గ్రీకు వీరుఁడగు "అచిలిస్"వలె ప్రవర్తించినాఁడు. ఇట్టి వీరిని యసత్యభాషకులని, యాత్మశ్లాఘాప్రియులని, వాచాలురని విమర్శనవిషమును వెలిగ్రక్కిన ప్రయోజనము శూన్యము. వీరిస్థాయి యందఱు నందుకొనఁజాలనిది. అది యట్లుంచుదము.

జాల్మఁడగు నహుషుని దర్పము నడఁగించుటకై ఈశానదిశకు శత్రువులను వశిగొల్పించిన యీ సూర్యదౌహిత్రుని హృదయ మాతఃక్షణముననే తద్దృశ్య రామణీయకమున కాకృష్టమైనది. అతని కవితాత్మ యావిష్కృతమైనది. రథచక్ర సంచాలిత వాయుతరంగములు వినీలపయోధర పంక్తులను విచ్ఛేద మొనర్చుచుండుట— భూసంచారమగు రథము, గాలి దుమారముల చెలరేపుచున్నట్లున్నదఁట. అపుడు రథచక్రములలో చేవిమో క్రొత్తయాకులు చేరినట్లున్నదఁట. హయ మాళిచామరములు వినిశ్చలములై చిత్రములందువలె నిడివిగానున్నవఁట. ధ్వజాంతమునందలి పతాకము గాలితీవ్రతకు చక్కఁగా విచ్చినట్లున్నదఁట. ఏమి యీ సంభావనాచాతుర్యము! చరిత్రలో నేరాజేంద్రునకుఁగూడ నింతటిసరస సంభావనమున్నట్లు తోఁచదు. రెండవ రిచర్డునందుగూడ నీచంద్రుని పౌత్రునకుఁగల భావవిశిష్టత మృగ్యము. ఈ నాటకమునగల సర్వోత్కృష్ట విశిష్టతలలో నిది యొకటి. ఇట్టి సరససమ్రాట్టు సాహచర్యప్రభావమున— విదూషకుఁడగు మాణవకుఁడు, వేటగాఁడగు వేగకుఁడు, కంచుకియగు లాతవ్యుఁడు, సందర్భోచితముగ రమ్య కవితోత్సాహపరులై భాషింతురు. కాని వారి భావములు సామాన్యములు. అందలి కవితాశైలియు సర్వసాధారణము. రాజేంద్రుని శైలీగాంభీర్యము వీరియందుండుటయు ననౌచిత్యమే యగునుగదా!! సంగమనీయమను చూడారత్నము నెరచి భ్రమచేత గ్రద్ద తన్నుకొనిపోవునపుడు, కిరాతి, "ఇదుగో! ఇదుగో! నోటికొనను తగుల్కొనియున్న బంగారపు దారములోని మణితో ఆకాశాన్ని చిత్రిస్తూఉన్నదనేలాగ సుడుస్తున్నది" యని భావనను ప్రేరేపుచు మాటలాడును. అప్పుడే పురూరవుని కవితాత్మ యుప్పొంగినది.

"నాకును గనఁబడుచున్నది."

తే॥ స్ఫోర మణిప్రభేలు లాఘవాదార మెప్ప,
మింట వడి మండలముల భ్రమించు కతనఁ
గొఱవి గిఱగిఱఁ దిరిగెడి తెఱఁగుదోఁప
రాగరేఖావలయము లేర్పఱచుఁ బులుఁగు.

ఈ పులుఁగే దక్షిణపుదిశవీదుగా పోవుట గాంచిన రాజహృదయము మఱియొక రమణీయ భంగిమలో భావించినది :

తే॥ నిగ్గు లీవురులఁబోలు మానికము చేత
వంజుళపు విరిగుత్తి చేబలె ఖగంబు
దిగ్వధూవక్త్రమునకు సాధించెఁజూనెఁ
జారుతరము వశింప ప్రసాధనంబు.

* ఇందలి పద్యములు మహామహోపాధ్యాయ వేదం వేంకటరాయశాస్త్రిగారి యనువాదము నుండి గ్రహింపఁబడినవి.

మణిలోఁగూడిన పక్షి యదృశ్యమగునంతవఱకు తన సరసపాహిత్య సౌహిత్యము నీతఁడు ప్రదర్శించును. ఈతని భావన రాగరంజితమైనది. ఆ భావనయు స్వతస్సిద్ధము. ఆతని యాలోచనా సంభాషలు దార్శనికత్వము ప్రేమప్రఫుల్లములు. మధురభావ చిత్రితమగు నాతని మనఃఫలకమును, మనోజ్ఞపదవిన్యాసమునం దాలంకారికముగాఁ బ్రదర్శింపఁగల కవిత్వ పటుత్వ మాతనికి సమృద్ధము. ప్రకృతిసిద్ధమగు నొక రమ్యవస్తు సందర్శనము, ఒక సామాన్య భావోద్రేకము నాతని కవితాత్మ నుప్పొంగింపఁజేయఁగలవు. ఆతని గంభీర భావముద్రణావిలసితమైన ప్రతి సామాన్యవిషయము, నుదాత్త కవిత్వముగా రూపొందును. కవి కత్యంతావసరమగు నిశితభావోద్రిక్తత, పరిశీలనాదక్షతయు; దార్శనికశక్తియు నీతనికి వరప్రసాదితములు. అరుణోదయకాంతుల యరుణిమలు, మృణాళికా సూత్రధారియై, వినీలాకాశ వాహిని సెగురీగు నపరంజి రాగరంజిత శ్వేతగరుద్గమనము; దరీవిభాగవిచ్ఛేద సామర్థ్యమగు ప్రవాహవేగము; నిశీథినీసమయమున హఠాత్తుగా నుదయించిన నిశాకరుని యాకాజవక సందర్శనము; సంకుల ధూమవినిర్భిన్న ప్రచండ దావానల కాంతిరేఖలు—ఇవియు నవియు ననవేల? ఇట్టి వనేకములు పురూరవచక్రవర్తి కవితామానసాంబుజమును ప్రఫుల్లమొనర్పఁగల పునీత కవితాంశములే. ఈతని కవితాప్రతిభ నిసర్గమనోహరము. అందుచేతనే తన పట్టమహిషిని ప్రశంసించునపుడుగూడ నీ రసజ్ఞరాజశేఖరుఁ డుద్రిక్తానుభూతియుక్తమగు మంజులాలాపములే గావించును. ఆ యాలాపములట్టి నీరసస్థితినైన నొక్కక్షణములో రసభరితము గావింపఁ గలవి.

ఇట్టి గంభీర హృదయసంపన్నుఁడు, కవితాకళా ప్రపూర్ణుఁడు; రమణీయ భావుకశిరోమణి; ధీరోదాత్తుఁడునగు పురూరవచక్రవర్తి కొక యమూల్య పరుసవేది లభించును. అట్టి దివ్యమణి నాశించి సంపాదింపగల యర్హత యీతనికిదక్క నన్యులకు లేదు. ఆదివ్యమణియే యూర్వశి. సౌందర్యరసాధిదేవత. 'వరసఖుమునీంద్రు నూరువున జన్మించినది. 'తపోవిశేష పరిశంకితుఁడైన మహేంద్రుని కోమలాయుధము!' 'రూపగర్వితయైన లక్ష్మీదేవికి గుండెతల్లడము!' 'స్వర్గాలంకారము' ఇట్టి నాక రమణిని విశ్వభావనా సౌందర్య పరాకాష్ఠ స్వరూపగను; మానవాత్మ యనంతముగా పరితపించి, పరితపించి యందుకొనఁజాలని యాదర్శనారీరత్నముగను; అన్ని దేశములను, అన్ని కాలములను సౌందర్యాదర్శ పరితప్తులగువారి పాలిటి యిష్టదేవతామూర్తినిగను, నత్యంతమనోహరముగా సందర్శించి, యక్షరరమ్యముగా వంగకవికుమారుఁడు రవీంద్రుఁడు గానమొనర్చెను. కావున వ్యక్తిమాత్రుని కీమె వశముకానేరదు. ఏవ్యక్తి ధీరోదాత్తగుణసంపత్తి కల్గియు, కవితాకళా ప్రఫుల్లహృదయుఁడో; ఏవ్యక్తి సర్వదేవతాకోటి గౌరవార్హతలను సంపాదించెనో; ఏవ్యక్తి జీవితజ్యోతి యొక మహేతిహాససదృశమైనదో; ఏవ్యక్తి చంద్రాంశునిభాస్పంద యశస్తుందిల దిక్కుండలుఁడో! యట్టి కమనీయ మహనీయమూర్తిచే నీ త్రిభువనాతీత సౌందర్యతిలక వరింపఁగలదు. అట్టి మహావ్యక్తి పురూరవుఁడు. ఈతఁడు మనుపుత్రికయగు ఇలాదేవి పుత్రుఁడు. వేదవేదాంగ శాస్త్రార్థ విశద వాసనాత్త ధిషణాధురంధరుఁడైన బుధుఁడీతని జనకుఁడు. సూర్యదౌహిత్రుఁడు. ఊర్వశీ సౌందర్య పాశబద్ధుఁడై, యీతఁడు తన ధర్మపత్నిని, ప్రాపంచిక కీర్తిప్రతిష్ఠలను ననాదరించెను. కాని తన సహధర్మచారిణిపట్ల నాతని కార్ద్రభావముకలదు. అది కేవలము ధార్మికము; నిస్సంగమునైనది. ఆతని యాత్మీయతా సర్వస్వము దేవతాసంబంధమైనది. ఎంత హృదయపూర్వకముగ నాకాంక్షించినను నీతనికి నూర్వశీ దివ్య సౌందర్యానుభవ మవిచ్ఛిన్నముగ లభింపలేదు. ఊర్వశీపురూరవులు గంధమాదనవనవిహారమున కేగుదురు. ఆ మిన్నేటి యిసుక తిన్నెలయందు రాజర్షి హృదయము ఉదయవతీ విద్యాధర కన్యయందొకింత చలించును. స్త్రీసహజమగు మాత్సర్య మూర్వశి యందును బొడగట్టును. కలతజెందిన యెడందతో నీమె పరులప్రవేశమును సహింపని కుమారస్వామి తపోద్యానమున నడుగు వెట్టును. అంతే. ప్రేమ మహార్ణవ విలీనులైన దంపతులకు వియోగము ప్రాప్తించినది. ఆత్మీయ సౌందర్యాధిష్ఠాన దేవతా వియోగ శోకదూయమాన మానసుఁడగు నా చక్రవర్తి విశాల ప్రకృతిలో పాదపాదమున, తరులతా గుల్మములలో ప్రియాసౌందర్య చ్ఛాయలు పొడగాంచుచు; వీతరాగులను గూడ నుత్కంఠితులను గావించుచుండెను. దేవతాత్మయగు హిమవంతుని దుహిత; సకల ప్రకృతిస్వరూపిణియు నగు గౌరీచరణ సంజాతమగు మణిప్రభావముచే నీ వియోగులకు పునస్సమాగమము సమకూడినది. ప్రేమఫలించినది. ఆయువను బుత్రుడు

కూడ నుదయించెను. మానవదేవతాసమాగమోత్కృష్ట జనితుఁడీ యాయువు కుమారుఁడు. భారతీయ పురాణ గాథలలో నిదియొక విచిత్రమైన సన్నివేశము. కాళిదాసు తన యనన్యసాధారణ కవితా సంపత్తిచే దీని నొక సహజ మనోహర మానవ ప్రేమ గాథగా బరిణమింపఁజేసెను.

ఒక విధముగా బరిశీలించిన, పురూరవుని పూర్వజన్మ మంతియు నూర్వశీ ప్రేమ సమాగమ ప్రయత్నమే యనిపించును. మహేతిహాసమువలె వైభవోపేతము తన జీవితకాంతి ప్రసారముచే నీతఁడు తన భావనావీథిని రసమయ మొనర్చి, భూమ్యాకాశముల వ్యాపింపఁజేసెను. అతఁడు నిజముగా సార్థక నామధేయుఁడు. పురూరవుఁ డనఁగా దిగ్దిగంతముల మాఱుమ్రోగినవాఁడు. కాని యంతమాత్రమున వానిని కాత్మవికాసము కల్గలేదు. సందర్శనమాత్రముననే యాతని ప్రేమవాహిని యూర్వశీసౌందర్యార్ణవ మగ్నమైనది. స్వభావగతి కవితా సౌభాగ్యము, మనోగతి చిత్ర విచిత్ర ప్రేమ భావనాచిత్రములు; స్వకీయ కీర్తి గతాత్మాభిమానము, వీరత్వము, ఘనత; సమస్తము నేకోన్ముఖమై జీవిత దరము భావోద్రేక ద్వారమున పిల్లుబికి, జ్యోత్స్నామయ దివ్యలోకమున స్థిరసౌదామినిగా వెలుఁగొందినది. అతని ప్రతిభావము; ప్రతిభావోద్రేకము నూర్వశీ ప్రణయ మహిమోపేతమై, సంస్కారపూరితము మధుర భావనములుగా వెలువడెను. ఆయువు తనపుత్రుఁడని వినినంతనే పురూరవజనకునిలో వాత్సల్యరస ముప్పొంగినది. ఆయువును గన్నంతనే యాతని నేత్రద్వయమున నానందాశ్రువు లుబికినవి. స్వాంతము ప్రేమమయమైనది. మానసము ప్రసాదభరితమైనది. గాఢాలింగనము గావింపవలయునను వాంఛ ప్రగాఢమైనది. జీవిత మర్యాదలను బురస్కరించుకొని, నాటకౌచితి ననుసరించి, పురూరవ హృదయనిహితమైన పుత్రవాత్సల్యమును బహిర్గతము కానీయక కవీశ్వరుఁడు చాలకాల మణచియుంచెను. అసలీ సంబంధమగు భావమునే యుద్బుద్ధము కానీకుండుటకై కవీశ్వరుఁడు, ఊర్వశీ పురూరవులకు వియోగమును జేకూర్చెను. ఏతద్విధానము చేతనే మూలకథ నాటకీయ నిర్వహణమున కనుకూలమైనది. పురూరవుఁ డున్మాదమునందినంత స్వేచ్ఛాజీవి యైనాఁడు. ఈ రూపకమందలి చతుర్థాంకము కేవలము లాక్షణిక విధేయమైనది కాదు. నాటక నిర్వహణమున కిది యనివార్యమైనది. నాయకుని శీల చిత్రణమున కిది సమగ్రతను సమకూర్చుచున్నది.

పురూరవుఁ డున్మాదుఁడని యంటిని. గాఢముగా నాలోకించిన యాపద నతనిపట్ల సముచితము కాదని యనిపించును. ఈతఁడు 'లియర్' వలె గాని; 'ఒథెల్లో' వలెగాని యున్మాదుఁడు గాఁడు. ఈతఁడు తాత్కాలికముగ మాత్రమే తన సహజస్థితిని కోల్పోయినాఁడు. ఇది మనోవైపరీత్యము కాదు ఈతనిలో వెల్లువయై ప్రవహించిన యసాధారణ భావనా చైతన్యము. అది మహాకవుల యందు గాంచనగు మహోద్రేకము. చేతనాచేతన ప్రకృతి సౌందర్యమునం దాతనికి సానుభూతి హఠాత్తుగా ప్రసారితమైనది. మహాటవిలోని దావానలము, ప్రతి స్వల్పవిషయమును సుస్పష్టముగ గోచరింపఁజేసి, రూపాంతరిత మొనర్చుచు, నుద్ధురతతో మిఱుకులు పెట్టురీతిగా నీపురూరవార్ద్రానుభూతి ప్రజ్వరిల్లినది. సుమధుర శబ్దజాలము; అనిదం పూర్వమగు నాలోచనలు; సుదీర్ఘపుటూహలు; క్షణ క్షణ సంచలిత భావోద్రేకములు; మదులు చుట్టుకొని, ప్రకృతి సౌందర్య ప్రదీప్తములై, రాజర్షి విరహ వేదనామానసమును ప్రతిబింబింపఁ జేసినవి. ఈ దృశ్యము నతిక్రమించిన కవితా వైభవముగాని, కళాసౌకుమార్యము గాని గోచరింపదు. ఇందొక సూక్ష్మ సౌందర్యాంశము కలదు. అది యల్పముగనే బాహ్యదృష్టికి గోచరింపవచ్చును. కాని యందనల్ప కళావైచిత్రి కలదు. పురూరవుని భావోద్వేగమందు క్రమోన్మీలనము కలదు. ఒక విసీల పయోధర మాతని దృష్టికి క్రూర రాక్షసునివలె కాన్పించును. అతఁడు తన ప్రియురాలి నపహరించుచున్న ట్లతఁడు భ్రాంతిఁజెందును. అప్పుడీతఁ డాయుధవిహీనుఁడు. అంతటి మహాచక్రవర్తి కాస్థితిలో నొక శిలాఖండమే యాయుధమైనది. దానినే విసరుట కుద్యమించినాఁడు. ఇది నిజమున కున్మాదస్థితియే. కాని యీ యవస్థ యెంతో కాలము నిలువలేదు. మఱుక్షణముననే యాతఁడు తన విభ్రాంతి గుర్తించెను. భావోద్వేగ మొకింత చల్లారినది. కాని మానస మల్లోలకల్లోలితముగనే యున్నది. ఆ వనమందలి ప్రతి స్వల్పవస్తువు నాతని కూర్వశీరూపముగనే మిఱుమిట్లు గొల్పెను. అతని యంతరంగమును గలవరపఱచును. మఱుక్షణముననే యథార్థ పరిజ్ఞానము కల్గెను. ఇట్లొక్కొక్క వికలభావ ప్రతి

క్రియ, యాతనికిఁ గొంత గొంత మానసిక విశ్రాంతిని సమకూర్చును. కొంత తడవున కాతని మానస మచేతనము నుండి చేతనములకుఁ బరుగు లెత్తును. మకరంద పానమత్తయగు మధుకరి, ప్రఫుల్ల కళాకలాపియగు కేకి సార్వభౌముడు; మధురగాయని యగు కోకిలకోమలి! బాష్పజలార్ద్రితలోచనుఁడగు కరిపతి; మానసోత్సుకమగు కలహంసరాజము; గోరోచనా కుంకుమ వర్ణాంచితయగు జక్కవరాణి; కమలాధ్యాసీనయైన మధుకరము, నాతనికి గనుపించును. వానిని తన ప్రియావృత్తాంతమును యాచించి పురూరవుఁడు విఫలుఁడౌను. పిమ్మట కరిణీసమేతుఁడైన కరిరాజును, 'దూర విజిత కమలారికాంతి' యగు తన 'వేలుపుటింతిని' వీక్షించితివే? యని పురూరవుఁడు పృచ్ఛించును. దానికిని తనకుఁగల సాధర్మ్యమును బురస్కరించి, దాని యందత్యంతానురాగమును బ్రకటించును. దానికి తనకువలె 'ప్రియావిరహ దుఃఖము ప్రాప్తింపకుండ వలయు' ననియే చక్రవర్తి పవిత్రాశయము. అనంతర మచ్చరలకుఁ బ్రియమై విశేషరామణీయక శోభతో నొప్పు 'సురభికందర' మను భూధరస్వామిని తన ప్రియా వృత్తాంతమును బ్రశ్నించును. గుహాముఖమున వెలువడిన ప్రతిధ్వని నే దాని సమాధానమని రాజేంద్రుడు భ్రమించును. తొలుత నాతఁడు మృగపక్షులకు సంభాషణా సామర్థ్యము నాపాదించును. కాని యా పర్యాయ మాతఁ డాలించినది తనమాటల ప్రతిధ్వనియే. ఈ విషయము నాతఁడు గుర్తించెను. క్రమ క్రమముగా నాతని తీవ్ర మానసోద్రిక్తత సన్నగిల్లినది. అతని భావన సత్యమునకు సన్నిహిత మయినది. ఏదో యొక యగోచరము దివ్యశక్తి యూర్వశి నొక సుందరమగు ప్రకృతిలోని వస్తువుగా మార్చియుండునని నృపాలుఁడు తలంచెను. అయిన నేమిగా నామె మార్పుచెందును? 'క్షుభితా కరుణ శకుంతిక'యు, 'కలమధుకర ఝుంకారిత'యు నగు నదిమతల్లి యాతని నయనద్వయము నాకర్షించినది. తన ప్రియురాలికిని, దీనికిని సన్నిహిత సామ్యములు సుస్పష్టము లయినవి.

ఉ॥ వీచులుగాఁగ భ్రూకుటులు, విశ్వగ దండజ
        పంక్తి కాంచిగా
  వేచన జాలు పైఁటవలె, ఫేనచయం బిటునట్టు
        నీడ్చుచున్
  ఏచిన మేటి సంస్ఖలిత మెంచుచు,
        తీవ్రపదప్రపాత యై
  నా చెలి యోర్పులేక పరిణామము నొందె నదీ
        స్వరూపతన్॥

ఇన్ని సామ్యములు పొడగట్టినను నొకింత తీవ్రముగా యోజించిన పిమ్మట చక్రవర్తికే యీ భావనలోని యనౌచిత్యము పొడగట్టినది. "ఊర్వశి పురూరవుని వదలి సముద్రుని అభిసరింపఁగు గదా!" ఈయాలోచన మెంత సముచితము! ఇంతే కాదు. నిర్విణ్ణతచే శ్రేయస్సులు కలుగవను నిర్ణయము కూడ నాతని మనసులో చేర్పడినది. తన పరిశ్రమము నిష్ప్రయోజనమని నిశ్చయించుకొనినాఁడు. "ఎచట సువదన నాకంటి కగపడ కదృశ్యమయినదో యచ్చోటికే యేగెదన"ని పరిక్రమించినాఁడు. ఇంతలో నొక కృష్ణసార మాతని దృష్టి నాకర్షించును.

'కాననేందిర తాఁ దమకమునఁ జూపఁ జూచి నట్టి నిరుపమ కటాక్షము' వలె నొప్పు మృగశాబకమును బలుకరింపక యుండలేక పోయినాఁడు. ప్రియావృత్తాంతమును దెలుపుమని కైమోడ్చినాఁడు. కాని దానికి సంభాషణా చాతుర్యమును గల్పింపలేదు. లతాలతాంతములయం దాతనికి ప్రియావయవ ప్రచ్ఛాయలు స్ఫురించును. కాని పూర్వము కల్గినంత విభ్రాంతి యింతకు పూర్వము పురూరవుని శక్తి సామర్థ్యములు; మహీపాలున కీమారు కలుగ లేదు. అతని భావములు సత్య సామీప్యమును వంకు గొనుచున్నవి. ఇంతలో భగవానుఁడైన మృగచారి ముని సందర్శనభాగ్యము లభించినది. మునీశ్వరుఁడు పలుకరించి 'నగప్రభుపుత్రీ పదరాగ జనిత' 'సంగమనీ' యాఖ్యమగు మాణిక్యము ననుగ్రహించెను. ఏతదనుగ్రహము చేఁ బురూరవునకుఁ బూర్వపుఁ బుద్ధిసంపద లభించినది. పుష్పవిహీనయగు లతాతన్వియందే యాతనికి రతిభావము కలిగినది. ప్రియురాలిగా కాక, "ప్రియానుకారిణి"నిగా దానిని కౌగిలించుకొనవలయునను బుద్ధిపుట్టినది. తదనంతర దృశ్యమునం దంతటను సహజ మనోహర భావుకుఁడగు రాజర్షి యథార్థస్వభావము మన కవగతమౌను. అంకాంతమున నీభావుకచక్రవర్తి యాకాంక్షించి తన కులజీవితము ప్రార్థించిన దివ్యవాహన మెంత మనోజ్ఞమైనదో చూడుఁడు:

క. స్ఫురియించు మించు సీసముగ
  సురచాపము నాత్మ చిత్రశోభగఁ గ్రొమ్మ
  బ్బురహించు విమానముఁ జే
  సి రయంబున నన్ను వసతిఁ జేర్పుము తరణీ॥

ఇట్టి స్వేచ్ఛాప్రాప్త విమానము నాకాంక్షింపఁ గల యున్నత యుదాత్త రసిక రాజపుంగవునకే కలదు. ఇట్టి నిశిత భావనా వైలక్షణ్యముతోఁ గూడిన కథాగోపన విధానమును గూర్చియే నేను విశేషించి వివరింప నెంచుచున్నది. ఇట్టి కళావిన్యాసమును గుర్తించినపుడు

గాని కాళిదాసీయ కవితాకళాప్రతిభాప్రభలనో మన మానసాంబరము శోభిల్లదు. అప్పుడుగాని మన మా కవికుల సార్వభౌముని సర్వతోముఖ కవితా వైభవము ననుభవించినవారము కాఁజాలము.

భావోద్రిక్తతా నిమగ్నుఁడైనపుడే పురూరవుని స్వరూపము మనకు విశేషముగా నభివ్యక్తమగును. అతని కవితా స్వభావ వైశిష్ట్యము; జీవిత లక్ష్యమందలి యాతని యనురక్తి; దుర్బలునుగాని యాతని యాదర్శ వాదము; మనోవాంఛాసాఫల్యమునందు స్వేచ్ఛా సంచారిణియగు విధినిగూడ వశీకృతమొనర్చు నాతని యద్భుతము; మనకీ దృశ్యమున సుస్పష్టముగ కనులకుఁగట్టును. భావనావిశిష్టత; వివరింపఁబడినది. ఎంతటి దక్షులైనను వారి కళా కౌశలము, సక్రమ క్రియా నిర్వహణము నెట్లు నిరోధించునో కూడ కొంత సూచింపఁబడెను. పురూరవునియందును నీ దుర్బల చిహ్నములు పొడకట్టక తప్పలేదు. ఔశీనరి యెదుటఁబడినపుడీ చక్రవర్తి యసహాయునివలె ప్రవర్తించును. అగ్నిమిత్రుఁ డిట్టి సందర్భములలో నింతకంటె సామరస్య పూర్వక సుభాషితములతో నిరావతిని తృప్తిపఱచును. సంగమనీయమణిని కోల్పోయినపుడుకూడ పురూరవుని ప్రవృత్తి విలక్షణముగనే యుండును. పరివ్రాజక, విదిశా నగరమునకుఁ బయనించు సమయమునే, మార్గమధ్యమున నడవిలో చోరులు బాధింతురు. ఆ కథ విన్నపు డగ్నిమిత్రుఁడు వారిని తన నిశిత నారాచము నకు గురిచేయునంతటి యుత్సాహమును జూపును. పురూరవుఁ డిట్లుకాదు. ఆపన్నమయములందును నీతఁడు రహస్యపములతోనే భాషించును. మణితో మింటియందు భ్రమించు గద్ద "కాలివి గిలగిల దిరిగెడు తెలిఁగుదోఁప, రాగ రేఖావలయము లేర్పఱచున"ని వర్ణించును. "ఇప్పుడేమి చేయవలయున"ని యాతఁడు విదూషకుని నిస్సహాయునివలె ప్రశ్నించును. నిరంతర భావనానిమగ్న కవితాత్మగల వ్యక్తి, నూత్న సన్నివేశముల నెదుర్కొనవలసి నపుడెల్ల నిట్లే వాటిల్లును. ఇట్టి నిర్వీర్యత పురూరవునిలో బహుకాల శృంగారరస నిమగ్నతచే నేర్పడినది. ఇట్లశక్తతను ప్రదర్శించిన చక్రవర్తియే సమయము వచ్చిన "సురాసుర సంగ్రామము" ముఖమున నిలువఁబడ గల్గిన మహారథుఁడని మనము గుర్తింపగలము. పురూరవుని శీల మిట్లు సమయోచితముగ సవదరించుట కనుకూలమైన మార్దవము కలది. ఇది యిట్లుండ, నీతనిలోఁ గొన్ని నైతిక దోషములు కూడ స్ఫురించును. పురూరవుఁడాదర్శ చక్రవర్తిగను; సాదర్శ గృహస్థుఁడుగను; నొకవంక దేవతలకు, మరియొకవంక మతమునకు హితము చేకూర్పవలయునని యాశించెను. కాని యూర్వశీ పురూరవుల పునస్సమాగమానంతరము "ప్రతిష్ఠానమునుండి నీవు వచ్చి చిరకాలమైనది. ప్రకృతులు నాపై అసూయ వహింతురు. కావున మరలుదామ"ని యూర్వశియే జ్ఞప్తిసేయునుగాని పురూరవున కీవిషయమే స్మరణ యందున్నట్లు తోఁచదు. 'ఔశీనరిపట్ల నీతఁడు గౌరవ ప్రేమలను ప్రకటించును. అది తన విధ్యుక్త ధర్మమని యాతఁడు భావించును. ఆమెతో నెంత మార్దవముగ మాటాడినను, నెంత మృదులముగ ప్రవర్తించినను; నవి యాతని కాపట్యమునే ప్రకటించును. అగ్నిమిత్రుడు ధారణీరావతులపట్ల ప్రవర్తించిన దయా దాక్షిణ్య సద్భావ సమృద్ధి, యీతనిలో మృగ్యమనిపించును. చరమాంకమున నాతఁడు మతసంబంధము మానసిక విశ్రాంతి ననుభవింపవలయునని యారాటపడును. ఇది 'టెంపర్ సన్' కథలోని రాజులాంఛనమును బోలినది. కాని పురూరవునకు మత నియమాచరణ మనివార్యమని పించును. ఈతఁడు దేవతా సదృశుఁడగు చక్రవర్తి. అందుచే మానవకురదృష్టము లాతని మనసున కెక్కవు. వానియందాతనికి సత్త్వము లేదు. నెపోలియన్ కూడ తాను మానవుఁడుగా నవతరించిన దేవేంద్రుఁడనని యహంకరించెను. విశాలోజ్జ్వల మేధా సంపద్విశిష్టుఁడు; నిరంతర తీవ్ర కార్యోన్ముఖ పీరుఁడునైన నెపోలియన్ చక్రవర్తి యవ్యవస్థిత ప్రవర్తనఁగల్గి, వివేకముతోఁ బ్రశాంతముగాఁ బ్రవర్తింపఁజాలనట్లే, ఇంద్రియలోలుఁడు, భావుకుఁడునైన పురూరవుఁడును గూడ నిష్ఠుర మత నియమాచరణము నందు నిస్సారక్తులను ప్రతిష్ఠింపఁజాలకపోయెను. ఇట్టి యాదేవతారోద్ధ ముఖమునుండి, కాళిదాసు, సనాతన కవిమత నియమానుసారావాదర్శమును, ఇంద్రియలోలుఁడైన సామాన్యమానవునకెట్లందని ప్రమాణపండో! విమర్శించి ప్రతిఘటించు నద్భుత పద్యరాజము నొకదానిని వినిర్గతి మొనర్చెను.

"వేదజడుండు ప్రాఁచపసి, వీతసమస్త
కుతూహలుండెటుల్
శ్రీ దొలఁకన్ మనోహరముఁజేయఁగ నేర్చెడి
నిట్టి రూపమున్"

ఇట్టి యీ నాయక పాత్రమందు, తక్కిన సామాన్య పురుషపాత్రలు విల వెలఁబోవుచున్నను, ప్రధానపాత్రశీలమున కివి యుపపోషకములు. రథచోదకుఁడు; వేటకాడగు వేగకుఁడు; కంచుకి యగు లాతవ్యుఁడు; విదూషకుఁడగు మాణవకుఁడు; నిట్టి వారలే. నూతుఁడును, వేగకుఁడును, నాయకుని యాత్మీయత నుద్దీపింపఁజేయుచు మంజులాలాపములఁ గావింతురు, కథాగాంభీర్యమునకు వీరు యథాశక్తిని తోడ్పడుదురు.

శిలార వంశరాజుల పాలనము

శ్రీ కొత్త భావయ్యచౌదరి

బీజపూరుజిల్లాలో 11, 12 శతాబ్దములందు తర్దవాడియను వెయ్యి గ్రామముల ఖండ మొకటి శిలార వంశ రాజుల పాలనలోనుండి ప్రసిద్ధి కెక్కెను. ఆ మారుమూల ప్రదేశములో గూడ హిందూమతమును జైనమతమును పోషింపబడుచుండెను. మన మెఱిగి నంతలో హనుమంత దేవాలయ మచటనే క్రమముగా స్థాపింపబడినట్లు కనబడుచున్నది. కాకతీయరాజుల దేవళములందువలెనే స్వయంభూ సోమనాథ, స్వయంభూ రామేశ్వర దేవాలయములు గూడ ఆ ప్రాంతములందు కనబడుచున్నవి. దేవగిరి, తడవల్లి, రూగి మున్నగు ప్రదేశములలో వీరి దానశాసనములు కనబడుచున్నవి. ఎలమేలవాడు గూడ వీరి పాలనలో నుండెను. కదిలెవాడలోని స్వయంభూ దేవళము దక్షిణకాశిగా నపుడు పేరొందెను. శకవర్షములు 941 సం॥లో రూగిలో శిలారవంశజుడగు మహాసామంత ధనసంగ్రహరస యను నతడు హనుమద్దేవళము వద్దగల నగరేశ్వరునకు దానమిచ్చి శాసనము వ్రాయించెను. తడవల్లి గ్రామములో గూడ నతని దానశాసన మొకటి కలదు. ఇతడు కైలాసనృపుడనువాని కుమారుడు.

తర్దవాడి 1000 గ్రామములను పాలించుచు దర్వాత చౌండరసయను రాజు సర్వేశ్వరమునికి గొంత భూమి నిచ్చెను. సోవియరసయను రాజు నగరేశ్వర స్వామి కొక దానమిచ్చి శాసనము వ్రాయించెను.

చౌండరస కుమారుడు బండరసయను రాజు అమరేశ్వరమునికి నూరు గ్రామములను దానమిచ్చెను. ఆ ముని యచటి దేవాలయము లన్నిటికిని ఆచార్యుడుగా నుండెను. అందుచే వాని పోషణకై యాతని పేరిట నా గ్రామముల నిచ్చి పేరొందెను.

చా. వి. 2, 7 సం॥లందు (1077, 82 సం॥లో) యీ శిలారవంశములోని ఉదయాదిత్యరస, సింగరస యనువారు మహాసామంతులుగా నుండి యచటి చౌండీశ్వర దేవునకు గొన్ని దానముల నొసంగిరి. ఈ చౌండీశ్వర దేవళము వారి పూర్వులలోని చౌండరస పేర గట్టించి యుందురు.

క్రీ. శ. 1109 సం॥ (చా. వి. 34) మహామండలేశ్వర గావరస యను శిలారవంశరాజు అగర్తిలోని భైరప్ప గుడికి దానములిచ్చి శాసనము వ్రాయించినాడు. బీజపూరునందు చా. వి. 48 సం॥లో యీ శిలారవంశములోని సింగరస సామంతుడు ఒకడు ఒక దానశాసనము లిఖించెను. అందుచే నచ్చట సింగరస పాలన యున్నట్లు స్పష్టపడుచున్నది. వీరు పశ్చిమ చాళుక్య త్రిభువనమల్ల (II) సామంతులుగా కనబడుచున్నారు.

క్రీ. శ. 1168 లో రాయమురారి సోవిదేవుని సామంతుడుగా మహామండలేశ్వర సింగదేవరస యను శిలారవంశజుడుండి అచటి స్వయంభూ దేవళ ఆచార్యుడగు సోమరాశిదేవ పండితునకు దానమొసంగి శాసనము లిఖించెను. మహాప్రధానియగు కుమార బొమ్మదేవరస గూడ నొక దానమిచ్చెను. ఇది రాయమురారి సోవిదేవుని 8 వ పాలన సం॥లో నీబడినది. ఆ సం॥రమే (శక 1090) భైరవదేవర జైనాలయమునకు, స్వయంభూ దేవరకు శిలారవంశమండలేశ్వరుడు దానము లిచ్చెను. అప్పటికింకను రాజులు జైనమత దేవళములను పోషించుచున్నట్లు దీనివల్ల స్పష్టపడుచున్నది. ఈ కాలము జగదేకమల్ల III కాలముగా గనబడుచున్నది. భూలోకమల్ల 8 వ రాజ్యపాలన సం॥ (బహుళః 1076 సం॥) లో సింగరస కొడుకు సోవి

రస యనువాడు స్వయంభూ దేవరకు కొంత బంగారును దాన మొసగెను. జగదేకమల్లుని పాలనసం॥లు, 29 సం॥లందు మహామండలేశ్వరుడును శిలారవంశజుడును నగు సోవిదేరసన పాలనలో అప్పరసయనువాడు ఎరంగులు నందు కెరెయ్యకు భూదానమిచ్చి పేరొందెను. సోవిదేవునకు కూడ కొంత దానమిచ్చెను. చా. వి. 49 సం॥లో నగా క్రీ. శ. 1124 సం॥లో మహామండలేశ్వర పెరియగావనరస, దాకరసయనువారు భోగేశ్వరదేవునకు కొన్ని దానములిచ్చి శాసనము లిఖించిరి. వీరు జీమూతవాహన వంశమువారమని చెప్పుకొనిరి. పైన నుడివిన గావనరసయు, వీరును ఒకే వంశము వారుగా గనబడుచున్నందున వీరు కూడ శిలారవంశజులే యనవచ్చును. వీరు త్రిభువనమల్ల II సామంతులు. శక 1108 (క్రీ. శ. 1186 సం॥)లో గోవగేయు నేల వీడునందు త్రిభువనమల్ల పాలించుచుండగా శిలారవంశజుడగు అన్నెమరసపాలన కనబడుచున్నది. రొలమిల ప్రాంతమున కితను పాలకుడుగా నుండి, మహామండలేశ్వర బిరుదమును వహించి, యచటిదేవుని కొరకు ఆచార్య సోమరాశి పండితునకు భూదానమిచ్చి పేరొందెను.

శక 1048 సం॥ ప్రాంతమున కరద్ శాఖ శిలారవంశరాజులు పాలించిన నిదర్శనములు చిక్కుచున్నవి. వల్లవాడ గ్రామము వీరికి రాజధానిగా నుండెను. వీరి తామ్రశాసనము తిటేకల యూరు నొసంగినవి. గండరాదిత్యుడనువాడా కాలమున రాజ్యపాలన మొనర్చెను. ఈ వంశములో మొదటి పాలకులు జతిగ I, తర్వాత గూహల, భోజదేవ, బళ్లాల మున్నగువా రుండిరి. గూహల, భోజదేవులు గండరాదిత్యునికి అగ్రసోదరులై యుండిరి. ఖేదాదిత్య దేవాలయమునకు, అచట బ్రాహ్మణ భోజనములకు గండరాదిత్యుడు భూదానమొనరించి ప్రసిద్ధి కెందెను.

ఈ శిలారవంశ రాజు లెట్లింకెన్ని చోట్ల సామంత రాజులుగా నుండిరో తెలియుటలేదు.

శక 1115 (క్రీ. శ. 1193 సం॥) సం॥ నాటికి ప్రాంతము యాదవరాజుల పాలనలోకి వచ్చినను, శిలారవంశజుల సామంతత్వమునకట్టి యాటంకము రాలేదు. ఆ సం॥రమే శిలారవంశ మహామండలేశ్వర గావనరసయనువాని శాసనములు భూదానములు కనబడుచున్నవి. యాదవరాజుల సింగన కాలములో దేవగిరి యందు మహామండలేశ్వర బొమ్మిదేవరసయను శిలారవంశజుడు హేమేశ్వర దేవాలయమును కట్టించి దానికి కొంత భూదానమిచ్చి శాసనము లిఖించెను. ఇది ఎరంగల్లులో కట్టింపబడెను. దేవగిరికి చేరువలో ఎరంగల్లను పేరుండుట గమనింపదగినది. లేదా యచటి కొంత ప్రాంతమునకా పేరు పెట్టియుందురు. ఇది ఓరంగల్లునకు నకలు కావచ్చును. శిలారవంశజులు శైవభక్తులైనను, జైన, వైదికమతములు రెంటిని పోషించి, రెండు శతాబ్దులు చక్కగా పాలించిరి. వీరిపాలన ప్రదేశమంతయు కన్నడ ప్రాంతముగా నున్నది. కన్నడదేశ (కర్నాటక) చరిత్రలో వీరికి సముచిత స్థానము కలిగింపదగియున్నది. వేంగిదేశమున రాజరాజ నరేంద్రుని కాలమున మేఘగిరివాఘ బిరుదుగల నాగవంశ భీమరాజు విజయాదిత్యునికి బాసటగా నుండెను. అతడీ కులజుడే కావచ్చునేమో!

సం. రా. ఈ వ్యాసమునకు మద్రాసు 'ఎపిగ్రాఫికల్ రికార్డులు' ఆధారము.

గ్రంథ విమర్శనము

రామాయణ విశేషములు

పరిశోధక వ్యాససంపుటి. రచయిత: శ్రీ. శే. సురవరం ప్రతాపరెడ్డిగారు. ప్రచురణ: ఆంధ్రరచయితల సంఘం, హైదరాబాదు. వెల: సాదాప్రతి రు. 8-0-0. గ్రంథాలయ ప్రతి: రు 8-8-0.

ఈ వ్యాసమాలను స్వర్గీయ శ్రీ ప్రతాపరెడ్డి గారు 1941 ప్రాంతంలో రచించి, మొదట 'విభూతి' పత్రికలో వరుసగా ప్రకటించారు. పిదప కొంతకాలానికి వాటికి గ్రంథరూపం కల్పించారు. వాటిపై వచ్చిన ఖండనమండనవాదులను, అనంతరం తాము చేసిన పరిశోధనల సారమును సమన్వయించి శ్రీ రెడ్డిగారు ఆ గ్రంథములో ఎప్పటికప్పుడు కూర్పులు మార్పులు చేసి పునర్ముద్రణ కుపక్రమించారు. ఈ ఉద్యమం కొంత సాగి ఆగిపోయింది. పిమ్మట రెడ్డిగారు కాలంచేశారు. వారి శిష్యులు, ఆంధ్ర రచయితల సంఘ కార్యదర్శి అయిన శ్రీ బి. రామరాజుగారు, రెడ్డిగారి యందు గౌరవ ప్రతిపత్తులు గల కొందరు మిత్రుల సహాయంతో ఈ గ్రంథపునర్ముద్రణకు పూనుకొన్నారు. కాని, రెడ్డిగారు రెండవపర్యాయము ముద్రింపించిన దానిలో కొంత భాగము, మిగిలిన వ్రాతప్రతి మాత్రమే వారికి లభించినవి. అందువలన నష్టమయిన భాగములను ప్రథమ ముద్రణ ప్రతిలో ఉన్నప్రకారం పూరించారు.

ఈ గ్రంథంలో రెడ్డిగారు ముందుగా ప్రాచ్య పాశ్చాత్య పురాణములలో రామాయణ ప్రాశస్త్యమును వివరించారు. రామాయణ కాలమును గురించి ప్రాచ్య ప్రాచ్య విమర్శకుల లేఖకుల అభిప్రాయాలను క్రోడీకరించి, చివరికి వాల్మీకి రామాయణ రచన మొదట క్రీ. పూ. 2500 ప్రాంతములో జరిగి ఉండాలని సోపపత్తికంగా సిద్ధాంతీకరించారు. రామాయణ కాలములోని వారగు "సుగ్రీవ, హనుమంత, పరశురామ విభీషణాదుల చిరంజీవిత్వము, భారత కాలములో గూడ వీరు ఉండిరను కథలు" విశ్వసనీయములు కావని, "రామునికిని, కృష్ణునికిని మధ్య ఇంచుమించు 800 సంవత్సరములు గతించి యుండును" అని నిర్ణయించారు.

రామాయణమున అయోధ్యకాండ మొదలు కొని, యుద్ధకాండ అంతమువరకు మాత్రమే వాల్మీకి రచన అయి ఉండవచ్చుననీ, అటుపిమ్మట యెవరో బాల, ఉత్తర కాండలను చేర్చి రామునికి విష్ణ్వవతారత్వమును గట్టిపెట్టిరనీ జాకోబీగారు చేసిన నిర్ణయమును రెడ్డిగారు ఆమోదించారు.

రాముని విష్ణ్వంశావతారముగా అభివర్ణించే భాగాలన్నీ ప్రక్షిప్తాలవడానికి రెడ్డిగారెత్తి చూపిన వాదములు సమంజసములుగ కనిపించడము లేదు. "క్రీ.శ. 800 ప్రాంతములో నుండిన ట్లూహింపబడుచున్న" అమరసింహుడు అమరకోశములో విష్ణువు పర్యాయ పదాలలో 'దేవకీ నందనుడు', 'బలిధ్వంసి' అనే కృష్ణుని పేర్లను కూడా పేర్కొని రాముని పేరును వదిలివేశాడనీ, అందువలన అమరసింహుని నాటికి దశావతార తత్త్వమే ఏర్పడలేదనీ ఆయన తరువాత కాలములో ఎవరో రాముని అవతారమూర్తిగా కల్పింపదలచి, ఆయా భాగాలను రామాయణములో చేర్చారనీ వారు పేర్కొన్న ప్రధానమైనవాదం. అమరసింహుడు బౌద్ధుడు గదా! దేవవర్గములో అతడు ముందుగా బుద్ధుని పేర్లు చెప్పిన మీదట గాని బ్రహ్మ విష్ణు మహేశ్వరుల ప్రసక్తి ఎత్తుకొనలేదు గదా! పైగా, కృష్ణ, వాసుదేవ, కంసారాతి, బలిధ్వంసి — ఇత్యాది అన్యావతార నామములను విష్ణు పర్యాయపదములుగా పేర్కొనిన అమర సింహుడు రాముని పేరును వాటిలో చేర్చక పోయినంత మాత్రాన ఆ నాటికి దశావతార భావనయే రూపొందలేదని సిద్ధాంతీకరించడం సబబు కాదు. కృష్ణ, వామనావతారములను అమర కారుడు విష్ణు పర్యాయ పదములుగ నుదహరించినప్పుడు దశావతార తత్త్వమప్పటికి లేదనుట పొసగదు.

ఇదే విధముగ, అమరసింహుడు 'ధీవర్గమందు గాని, వాగ్వర్గమందుగాని వాల్మీకిని పేర్కొనలేదు.' గనుక అలవి కాలమువరకును రామాయణమునకు మహాకావ్య ప్రశస్తిగాని, వాల్మీకికి ఆదికవి బిరుదముగాని లేవనికూడా చెప్పవలసి వస్తుంది. ఇదేసిద్ధాంతమయితే అటు పిమ్మట ఎప్పుడో, ఎవరో ఆనాటికి 2800 సంవత్సరములకు పూర్వము రచింపబడిన ఈపాత పురాణమును దుమ్ముదులిపి బయటకుదీసి, రాముని విష్ణ్వవతారముగాను, వాల్మీకిని ఆదికవిగాను, రామాయణమును ఆది మహాకావ్యముగాను చేసినట్లు నిరూపించవలసివస్తుంది. అట్టి ప్రయత్నమును రెడ్డిగారుగాని వారి ఈ వాదమునకు ప్రోత్సాహకులయిన ఇతర విమర్శకులుగాని చేసినట్టు కనబడదు.

రామాయణమునందలి వివిధ పాత్రలను పోషించిన తీరును గురించి, వాల్మీకి భావములను వ్యాస కాళిదాస ప్రభృతి కవులెల్లనుకరించినది రెడ్డిగారు సోదాహరణముగా వివరించారు. రామాయణకాలము నాటి సాంఘికాచార వ్యవహారాదులను, భూగోళమును అభివర్ణించి చాలాచోట్ల పరస్పరభిన్నంగా ఉన్న వర్ణనలనుగురించి లోగడ ఇతర విమర్శకులుచేసిన చర్చలను ఉటంకించి వాటిపైన తమ అభిప్రాయాలను సూచించారు. మన పురాణంలోని సప్తద్వీపములు, సప్త సముద్రములు నేడు ప్రపంచంలో ఎక్కడెక్కడ ఏయేపేరులతో వ్యవహరింపబడుచున్నదీ వీరు (నందాలాల్ గ్రంథంలోనుంచి) ఉదహరించారు. క్షీరసముద్రము నేటి కాస్పియన్ సముద్రమనీ, పరైన్, దహీ అనుపేర్లతో నేడు వ్యవహరింపబడుచున్న నదులే నాటి సుర, దధి సముద్రాలనీ వారు ముడిపెట్టిన తీరు మనోరంజకంగా ఉంది.

కిష్కింధ మన హంపీ ప్రాంతంలోని పంపా పరిసర ప్రదేశమే అని వీరు నిర్ణయించారు. నర్మదానది జన్మస్థాన ప్రాంతములో కిష్కింధ ఉన్నదనీ, అక్కడ మరొక పంపా సరస్సు కూడా ఉన్నదనీ యం. వీ. కిబేగారు చేసిన ప్రతిపాదనను నిరాకరించుటకు చాలా హేతువులున్నను రెడ్డిగారెందువలననో వాటిని వివరించలేదు.

లంక యెచ్చట? — అనే శీర్షిక క్రింద ఇతర విమర్శకుల అభిప్రాయములను కొన్నింటిని తెలిపి, స్వయంగా వీరొక విలక్షణమైన నూతన ప్రతిపాదన చేశారు. ఇది రామాయణ విమర్శకులందరు అవశ్యము విచారింపదగినది. "లంక అను పదము గీర్వాణపదము కాదు. అది తెలుగుదేశపు ఆదిమ నివాసుల పదమే యై ఉండును. గోదావరి డెల్టాభూములను లంకలు అని నేటికిని అందురు. అట్టి లంకయే, ఏదో యొక గోదావరి లంకయే రావణుని లంకయై యుండును. గోదావరి నదినిదాటి రాముడు లంకను ముట్టడించి యుండును. ముండాలు అను జాతివారు చాలా ప్రాచీనులు...అటి ముండాజాతిలోని ఒక శాఖకు ఉరోవన్ అను పేరు కలదు. నేటికిని తమిళభాషలో రేఫకుముందు ఇకారము నుచ్చరింతురు. వ్రాయుదురు. ఉరోవన్ అనునది రోవన్ అగును. అనగా రావణ అను శబ్దమునకు సమీపమన్నమాట. ఉరోవన్ జాతివారు నేటికిని ఆటవిక స్థితిలోనున్నారు. విశేషమేమనగా తాము రావణ సంతతివారమని వీరు చెప్పుకొనుచున్నారు. అనగా రావణ శబ్దము జాతి బిరుదమేకాని, ఒక వ్యక్తి నామము కాదు. రావణుడు ఉరోవన్ జాతిలోని వాడనియు, వారి రాజనియు ఊహించిన రావణుని లంకయు ముండాజాతివారుండు ప్రదేశమందే ఉండియుండును. రావణుని సేనానులగు ఖరాదులు జనస్థానములోని పరిపాలకులు, "జనస్థానము" అను పదము సవరల 'జైతాన్' పదమే యై ఉండును. కావున, ముండాలు, సవరలు ఉండు ప్రదేశములోనే లంకను వెదుకవలె"నని రెడ్డిగారి సూచన.

ఈ విధంగా శ్రీ రెడ్డిగారు రామాయణమును గురించి చేసిన పరిశ్రమ అనల్పమైనది. ఇంతచేసిన ఆయన అహంకారలేశమైనా లేకుండా, "నేను చేసిన చర్చలలో, ఇచ్చిన అభిప్రాయములలో విశేషభాగము తప్పులుండవచ్చును. తప్పులుచేయని వారెవరు? వాటిని పండితులు విమర్శకులు, పరిశోధకులు సహేతుకముగా ఖండింపవచ్చును. తప్పులుండిన సవరించుకొందును. క్రొత్తసంగతులు తెలిపిన నేర్చుకొందును" అని సవినయముగ చెప్పుకొనడం వారి ఉదాత్త తత్త్వాన్వేషణ దీక్షకు నిదర్శనం.

శ్రీ రెడ్డిగారి ముద్రితా ముద్రిత గ్రంథాలన్నింటిని ప్రకటించి, వాటిపైన వచ్చే రాబడి నొక నిధిగా ఏర్పరిచి, దాని వడ్డీతో హైద్రాబాదులో వాఙ్మయ పరిశోధన చేసేవారికొక ఉపకారవేతనం నెలకొల్పడానికి సాగుతూన్న ఉద్యమం సఫలమయితే, అది స్వర్గీయ శ్రీ ప్రతాపరెడ్డిగారికి సముచిత సత్కారం అవుతుంది.

సిం.గు.

సిపాయి పితూరీ

ఖండ కావ్యం. రచయిత: శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు, ప్రతులకు: ఆదర్శ సాహిత్య మాల, డబీర్ పురం వెలుపల, హైదరాబాదు-2. వెల: 62 న. పై.

నూరేండ్ల క్రిందట భారతజాతికి దాస్యశృంఖలపు టుచ్చులను బిగించుచుండిన ఆంగ్లేయ సామ్రాజ్యవాదుల ఆట కట్టింపదలచి దేశమందంతట ఒక్కుమ్మడిగా ప్రజ్వరిల్లిన ప్రథమ భారత స్వాతంత్ర్య సమరాన్ని సంస్మరిస్తూ శతవార్షికోత్సవాలు జరుపుకుంటూన్న ఈ సమయంలో ఆ చారిత్రాత్మక గాథకు కవితా మృతాకృతి సంతరింప బూనిన ఈ కావ్య ప్రచురణ కర్తల ఆశయ మభినందింప దగినది.

సుమారు 150 పద్యాలతో కూడిన ఈ ఖండ కావ్యవస్తువు సంగ్రహంగా ఇది. ఒక రోజున "విహారటువందు శితిల సమేధితమౌ ఒక చెట్టు నీడలో" "విప్లవ ప్రజ్వలితచిత్తు" లయిన సిపాయిలు కత్తులు నూరుతూ కూచుని, భారతీయ సైనికులపట్ల ఆంగ్లాధికారుల సవతి తల్లి ప్రేమనుగురించి వారి అత్యాచారాలను గురించి చర్చికుంటారు.

"నేల బరచిన జిగి తివాసీల శోలు
పచ్చ బయళులందు వయస్సు పసిమిగ్రమ్మ
నిలిచి బసవేశ్వరుండు ఖణిల్లు మనుచు
అంకె వేయుట లేదు నిశ్శంక రీతి"

అంటూ ఆంగ్లేయుల పాలనలో దేశ దౌర్భాగ్య స్థితిని దలచుకొని ఉత్తేజితు లవుతారు.

"హైందవు లందురా! మనకు నన్నలు
దమ్ములు స్వర్గసౌఖ్య ని
ష్యందినియైన భారత మహాస్థలి
యిర్వుర కన్నతల్లి!"

అంటూ ముసల్మాను సైనికులు కూడా హిందువులతో చేతులు కలుపుతారు. ఈ సౌదర్యానికి ప్రతిఫలంగా

"దొరల కత్తుల నీడ నాదగువు లేక
నిలచియున్నాడు వేదనా విభృతమూర్తి
పాదుషా! దచ్ఛిరాన దీవ్యచ్ఛి రత్న
రత్న జటల కిరీటంబు గ్రాలుగాత!"

అని హిందూ సైనికులే ప్రతిపాదిస్తారు. దానితో—

"ప్రతి వీరుని మనసు సము
త్థిత మధురోత్సాహశత దరలుగ బారెన్
ప్రతి ఖడ్గము దాహో వే
శత నొరలోనుండి వెలికిజ్రున"—లేచింది.

"మెలికలు వేసి వేసి నునుమీసము నిద్దుర లేపె
వానికి స్థైలియుక నే కరంబు."

మరునాడు తెల్లవారుతూనే సిపాయిలంతా ఆంగ్లేయ సైన్యం పైబడి మగ్గనాచం చేశారు. ఇచటి యుద్ధవర్ణన కవిబ్రహ్మ తిక్కన దివ్యశిల్పాన్ని స్మరణకు తెస్తోంది.

"ఒక సైనికుని కత్తి తెక తెక చిరుమంట
లార్పు బంటను ద్రిప్పనట్టి కొరివి,
ఒక బల్లె మూగిన గుర్రాలవలె గ్రక్కు-
కొని రక్త గరళంబు కోడె నాగు,
ఒక తుపాకీ జైత్రి మురిపి దూచినది ద
ప్పరము దాహము గ్రమ్మ భద్రకాళి."

"కడుపులనుండి ప్రేవుల నికాయము బాముల
వోలె వ్రేల నె
క్కడు రథసంబువన్ దురిమికొంచునులోనికి,
ముంగు దూకి వ
చ్చుకు నొక రాతు గాంచి యరచెన్ దొరభీతిలి."

దొర గుంపులు నేల కూలినవి. సిపాయి తండను "పడిన పరంగి మొండెముల పైనబె దూసుచు" బోయి పాదుషా బహదూరుషాకు విజయవార్త తెలిపింది. "ఆత్మవంశమువలె నే మణుల్చిటిలి సందులు దేలిన గద్దె నెక్కె కొల్వమురి" చిన "సులతాను తల వెలిగె సుచ్ఛుల తలపాగ హిరణ్యరత్న శోభితమయి."

కాని దైవవిధి! "వచ్చిన దంతలోనె ననివారణ సైన్యము."

"తనవలెనె గతిబూని యుద్ధమున నిలిచి
కొన్న తిమ్మని కంత మాకొన్న యన్న
వరకె నప్పడు శోక బంధురిత ప్రకృతి
హృదయమున కోటి ఖడ్గము లదలి పొదల."

"ప్రబల తరమైన జన్మ ప్రవాసదీక్ష
బడిరె సులతాను తలపైని విరుసువలెనె
భారత చరిత్రయను చిత్ర వనమునందు
దసులబడిపోయె నపుడు స్వాతంత్ర్య శవము."

ఈ రచయిత ఆంధ్ర రసిక లోకానికి చిర పరిచితులు. ఈయన ఇటీవలి రచనల రుచి రొంరింగినవారికి ఇది కొంత లేతపాకముగా గనిపించవచ్చు. ఈ కావ్యము ఇరువది యేండ్ల క్రిందట రచింపబడినదని ప్రచురణ కర్తలు ఈ గ్రంథావతారికలో చేసిన సూచన ఈ విషయాన్ని వ్యంగ్యం చేస్తోంది.

కాని, పూవు పాలుపు పూవుది. మొగ్గ మురుపు మొగ్గది. రచయితలో కాలక్రమేణ మూడు పూవులారు కాయలై వెలసిన కవితా శోలానికి బీజాలు ఈ ఖండ కావ్యం అంతటా పుష్కలంగా దొరుకుతున్నవి.

సిం.గు.

శబరి

పద్యకావ్యం: రచన: శ్రీమతి భోగరాజు చిట్టెమ్మ. ప్రాప్తిస్థానం: పూళ్ళవల్లభరాయుడు, పూళ్ళ (పోస్టు), పశ్చిమ గోదావరిజిల్లా: వెల రు 1.

వాల్మీకి రామాయణంలో శబరిచరిత్ర మధురాతి మధురమైనఘట్టం. ఇది అనేకమంది భక్తులనూ రసికులనూ కూడా ఆకర్షించింది. అధునాతనులలో అనేకమంది శబరిచరిత్రను కథావస్తువుగా సేకరించి, ఎవరికి తోచిన మార్పు కల్పనలతో వారు, కావ్యాలుగానూ, నాటికలుగానూ, కథలుగానూ నానావిధాలుగా సంఘటించి కృతకృత్యులైనారు.

శ్రీ చిట్టెమ్మగారు అలాగే అనేక మార్పు కల్పనలతో, అయిదు ఆశ్వాసముల ప్రబంధంగా ఈ చరిత్రను సంఘటించారు. శబరీ బాల్యవృత్తాంతాన్ని ఒకదాన్ని కల్పనచేశారు. కావ్యకళకు సంబంధించిన తళుకులు మెఱుగులు విశేషం లేకపోయినా, ధారాశుద్ధిగల పద్యరచనలో కథను భక్తిరసప్రధానంగా ముచ్చటగా ఆసాంతం నిర్వహించారు. ముముక్షుజనులకు పఠనయోగ్యంగా వుంది.

నా సత్యాన్వేషణము

[స్వీయచరిత్ర]

డాక్టర్ రాధాకృష్ణన్ స్వీయచరిత్రగా రచించిన 'My Search for Truth' అనే గ్రంథానికిది అనువాదం. అనువాదకులు శ్రీ బులుసు వెంకటేశ్వరులు: ప్రకాశకులు: బి. వి. అండ్ సన్సు, రామారావుపేట, కాకినాడ. మూల్యం రు 2/-

సత్యమనగా నిర్గుణబ్రహ్మ స్వరూపమనీ, సత్యసాక్షాత్కారమనగా ఈశ్వర సాక్షాత్కారమనీ అనువాదకులు వ్యాఖ్యానించినారు. ఈ వ్యాఖ్యానానికీ గ్రంథస్థ విషయానికి ఎంతవరకు సంబంధం వున్నదంటే చెప్పలేము గాని తీవ్రమైన ఆవేశంతో తాత్త్వికరంగంలో ప్రవేశించి నిరంతరాన్వేషణతో విజయపరంపరను సాధించటానికి, డాక్టరుగారిని ప్రోత్సహించిన వాతావరణం ఎట్టిదో ఈ గ్రంథం సువ్యక్తం చేస్తున్నది.

పదియవ అంతర్జాతీయ మత మహాసభల ప్రారంభ తరుణంగా, డాక్టర్ రాధాకృష్ణన్ టోకియోలో చేసిన మహోపన్యాసాన్ని కూడా, అనుబంధంగా గ్రంథాంతమందు ప్రకటించారు. తె. సూ.

స్వీకారము

శకుంతల: మహాకవి కాళిదాసు రూపకమునకు వచనారూపమగు ఆంధ్రానువాదము: అనువాదకులు "సూర్యకీర్తి" [టి. భాస్కరరావు, బి. ఏ. (ఆనర్సు)] ప్రాప్తిస్థానం: రచయిత, ఆంధ్రక్రైస్తవ కళాశాల, గుంటూరు, మూల్యము రు 1-25

హిందీ మనకు ఎందుకు అవసరం రచన: 'హితవాది'; ప్రకాశకులు: ఆంధ్ర బుక్ హౌస్, సుల్తాను బజారు, హైదరాబాదు 1; మూల్యం రు 0-50

క్రీనీడలు: నాటిక; రచన: శ్రీ కె. యల్. నరసింహారావు: ప్రచురణ: ఆంధ్ర బుక్ హౌస్, సుల్తాన్ బజార్, హైదరాబాదు—1. వెల రు 1/

భాగవతకథ (భాగవత దర్శనము): (చతుర్థ ఖండము) శ్రీ ప్రభుదత్త బ్రహ్మచారిగారి హిందీ రచనకు అనువాదం; అనువాదకులు శ్రీ కంచుర్తి వెంకట నరసయ్య. సాధన గ్రంథమండలి, తెనాలి; వెల రు. 2

శ్రీరాముని చరిత్రము: (శ్రీ పోతనామాత్య ప్రణీతము). భాగవతములోని శ్రీ రామచరిత్రకు శ్రీ కొలకుల నారాయణరావు విపులమైన టీకాతాత్పర్యముల సంఘటించారు; ప్రాప్తిస్థానము: శ్రీ కొలకుల నారాయణరావు నెల్లూరు. వెల రు 1/

అంజలి: ఖండకావ్య సంపుటి; గోదా గ్రంథమాల: శ్రీమన్నారాయణపురం, ఉల్లిపాలెం పోస్టు, కృష్ణాజిల్లా, వెల రు 1-50

సోమేశ్వర శతకము: రచన: శ్రీ రామవరపు నరసింగరావు; ప్రాప్తిస్థానం: రచయిత, ఛత్రపూర్, గంజాంజిల్లా, ఒరిస్సా. వెల రు 0-50.

ఆంధ్ర ముకుందమాల: శ్రీ కులశేఖర మహారాజు గీర్వాణభాషలో రచించిన 'ముకుందమాల' శ్లోకములకు ఆంధ్ర పద్యానువాదం; అనువాదకులు: శ్రీయుతులు మూలా పేరన్నశాస్త్రి, అనిపిండి వరాహ నరసింహమూర్తి; ప్రాప్తిస్థానం: ఎ. వి. నరసింహమూర్తి, పి. డబ్ల్యు. ఐ. ఆఫీసు, బిలాస్ పూర్, మధ్యప్రదేశ్, వెల రు 0-75.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor: S. Sambhu Prasad.